వాడ్రేవు చినవీరభద్రుడు

# పాటలు పుట్టిన తావులు

అక్కడ దేవుడు ఆగి వింటున్నాడు

ఎమెస్కో

## వరసగా

~

ముందుమాట

**పాటలు పుట్టిన తావులు**


| | |
|---|---|
| 2,00,00,000 సంవత్సరాల తర్వాత కూడా | 9 |
| తమిళ జీవనసూత్రం | 12 |
| నాయనార్ల పరంపరలో | 17 |
| దేహానికీ, దైవానికీ మధ్య | 21 |
| అతడిది జీవితకాల సమర్పణ | 26 |
| అతడు నరకాన్ని జయించాడు | 31 |
| దీన్నే మనం కవిత్వమంటాం | 35 |
| శివపాదముద్రలు వెతుక్కున్నాను | 42 |
| పుహారఖండం | 46 |
| ప్రజల నాలుకమీద నిలిచిన పద్యం | 53 |
| పాటలు పుట్టిన తావులు | 56 |
| మరికొన్ని దివ్యానుభూతులు | 65 |
| సిరి గంటి చెన్ను మించిన మేను కంటి | 69 |
| స్వర్గానికి వెళ్లాలని తొందరపడ్డ కవయిత్రి | 74 |
| ఆయనది మానసిక యాత్ర | 79 |
| ఒక కాలం వీరుడు | 85 |
| సఖీ, ప్రపంచమంతా పుకారు చెలరేగనీ | 90 |
| కైలాసం నేలకి దిగిన చోటు | 94 |
| జ్ఞానముతో, రామధ్యానముతో, మంచిగానముతో | 98 |

మనుష్య ఉత్సాహానికి సజీవ,శాశ్వత ప్రతీక 104
సముద్రమంత భావాన్ని పలికించే కవిత 109
అదొక ప్రక్షాళనానుభవం 117
కాంతిపుష్పంలో ఒక భ్రమరం 120
ఆయన ఒక సిద్ధుడు, ఒక సాధ్యుడు 127
ఆమె నగ, తానందులో పొదిగిన వజ్రం 133
ఆ పొయ్యి ఇప్పటిదాకా ఆరలేదు 138
నిజమైన సత్యాగ్రహికి నిలువెత్తు ఉదాహరణ 144
కందార్ అనుభూతి 147
వానలు కూడా ఉన్నాయి 151
అది మరెక్కడా దొరికేది కాదు 159
ఎట్లాంటి పాఠశాల! ఎట్లాంటి శిష్యుడు! 163
మరొక అనుభవామృతం 170
తమిళ భక్తి కవిత్వానికి తల్లి 176
బీభత్స సౌందర్యంలోని అద్భుతరసం 181
నీళ్ళల్లో మంచు కరిగిపోయినట్టు 191
సముజ్జ్వలమైన ఆధ్యాత్మిక జీవితం 199
సెందమిళంలో పాడిన శివానందలహరి 215

**పటాలు** 223

# 2,00,00,000 సంవత్సరాల తర్వాత కూడా

**వి**లుప్పురం జిల్లాలో విక్రవండి అసెంబ్లీ నియోజకవర్గానికి జరుగుతున్న ఉప ఎన్నికకి పరిశీలకుడిగా వచ్చి వారం రోజులయ్యింది. కొత్త ప్రాంతం, కొత్త బాధ్యత. కాని, నేనొక అత్యంత ప్రాచీనమైన భూమిమీద తిరుగాడుతున్నానని నాకు తెలియడానికి ఆట్టే సేపు పట్టలేదు.

సాంప్రదాయికంగా తమిళ భూగోళాన్ని ఏడు నాడులుగా విభజించారు. ఉత్తర తమిళదేశం తొండనాడు. దక్షిణ తమిళదేశం పాండ్యనాడు, ఉత్తరచోళనాడు, కావేరికి దక్షిణంగా దక్షిణచోళనాడు, పశ్చిమంగానూ, నైరుతిదిశగానూ ఉండేది కొంగునాడు, కేరళప్రాంతం చేరనాడు, శ్రీలంక ప్రాంతం ఈలనాడు, పడమటి సముద్రతీరం తుళు వనాడు. ఇందులో తొండనాడుకీ, పాండ్యనాడుకీ మధ్యగా ఉండేది నడునాడు. విలుప్పురం నడునాడుకి చెందిన ప్రాంతం. ఒకప్పుడు దక్షిణ ఆర్కాటుగా పిలవబడే పూర్వపు కడలూరుజిల్లానుండి 1993లో కొత్త జిల్లాగా విడివడ్డాక కూడా తమిళనాడులోని అతి పెద్దజిల్లాగా కొనసాగుతోంది. ఇప్పుడు ఈ జిల్లాని కూడా రెండుగా విభజించబోతున్నారు.

తమిళ శైవాన్ని మేల్కొల్పిన ముగ్గురు నాయన్మారుల్లోనూ ఇద్దరు, అప్పర్, సుందరర్ విలుప్పురానికి దగ్గరలోనే పుట్టి పెరిగారు. మూడవవారైన తిరుజ్ఞాన సంబంధర్ కడలూరుకి దక్షిణంగా, చిదంబరానికి సమీపంలో నాగపట్టణం జిల్లాలోని శీర్ కాళిలో జన్మించారు. విలుప్పురానికి ఉత్తరంగా ఉన్న తిరువణ్ణామలైలో అరుణగిరినాథులు, మాణిక్యవాచకర్ సంచరించి కవిత్వం చెప్పారు. కాబట్టి ఈ ప్రాంతమంతా శివవిభూతి మయంగా గోచరిస్తోంది.

ఇక్కడ ఎక్కడ అడుగుపెట్టినా ఒక శివాలయమో, పెరుమాళ్ కోవెలనో కనిపిస్తుంది. అక్కడ ఒకరో, ఇద్దరో, ముగ్గురో నాయన్మారులో, ఆళ్వారులో సంచరించి, ఆ దేవుణ్ణి స్తుతిస్తూ ఒకటో, రెండో, మూడో పదికాలో, పాశురాలో చెప్పి ఉంటారు. ఆ గోడల మీద ఏదో ఒక పదికాన్ని రాతిలోనో, పాలరాతిలోనో చెక్కి ఉంటారు. శిలాక్షరాలుగా

కవిత్వం నిలిచిపోయిన నేలమీద తిరుగాడుతున్న నాకు మరొక శిలాక్షరసముదాయం కనిపించింది.

ఒకరోజు సమస్యాత్మకంగా గుర్తించిన పోలింగ్ స్టేషన్లు తనిఖీ చేస్తూ దాదాపుగా పాండిచ్చేరి సరిహద్దుల్లో ఉన్న 'తిరువక్కరై' అనే ఊరు చేరాను. అక్కడ కూడా ఒక ప్రాచీన శివాలయం, ఒక దుర్గాలయం ఉన్నాయి.

ఆ ఊరు పొలిమేరల్లో ఒక అద్భుతం చూసాను.

అక్కడ ఇప్పటికి రెండుకోట్ల సంవత్సరాల కిందట (అవును, మీరు సరిగానే చదువుతున్నారు, రెండుకోట్ల సంవత్సరాలే) నదీ ప్రవాహాల్లో, వరదల్లో పైనుంచి ఎక్కడినుంచో కొట్టుకొచ్చిన వృక్షాలు శిలలుగా మారిపోయిన దృశ్యం కనిపించింది. పెద్ద పెద్ద చెట్ల కాండాలు, ఒక్కొక్కటీ దాదాపు తొమ్మిదడుగుల నుంచి నలభై అయిదు అడుగుల కైవారం కలిగినవి, ఏళ్ళ తరబడి ఆ మట్టిలో కప్పడిపోయి, శైలీకరణ చెంది, గండశిలలుగా మారిపోయాయి. భూగర్భ శాస్త్రంలో petrification అని పిలిచే ఒక ప్రక్రియలో, ఆ చెట్లలోని, జీవపదార్థం నెమ్మదిగా ఖనిజపదార్థంగా మారిపోయింది. కాని, వాటి ఆకృతి చెక్కు చెదరలేదు. చూడటానికి, అవి అప్పుడే నరికి, అడితీలో పోగేసిన పెద్ద పెద్ద కొయ్య దుంగల్లాగా ఉన్నాయి.

1781 లో యూరోప్ కి చెందిన ఒక ప్రకృతి శాస్త్రజ్ఞుడు మొదటిసారి వాటిని చూసి తక్కిన ప్రపంచానికి పరిచయం చేసాడట. ఇప్పుడు ఆ ప్రాంతమంతా, దాదాపు వంద హెక్టార్ల మేరకు ఆ శిలాజాలు విస్తరించి ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఒకచోట చేర్చి నేషనల్ ఫాసిల్‌వుడ్ పార్క్‌గా భద్రపరిచారు. తిరువక్కరైలో ఉన్న ఆ శిలోద్యానవనంలో అటువంటి శిలావృక్షాలు దాదాపుగా రెండువందలదాకా ఉన్నాయి. పెద్ద పెద్ద రంపాలతో కోసినట్టు కనిపిస్తున్న ఆ శైల వృక్షాకృతుల్లో దశాబ్దాలూ, శతాబ్దాలూ కాదు, సహస్రాబ్దాలు వలయాలు వలయాలుగా కనిపిస్తున్నాయి,

ఆ పార్కు కి కొంత దూరంలో దిగువగా ఒక నది ఉందంటే అక్కడికి కూడా వెళ్ళాను. శంకరాభరణిగా పిలిచే ఆ నదిలో నీళ్ళు లేవుగాని, శిలలుగా మారుతున్న దారుశకలాలు పడి ఉన్నాయి. ఒక శకలాన్ని నా చేతుల్లోకి తీసుకున్నాను. ఒక కపాలాన్ని తన చేతుల్లోకి తీసుకున్న హేమ్లెట్‌కి కూడా ఆ క్షణం నాకు కలిగిన స్పందనలాంటిది కలిగి ఉండదు. ఆ శకలంలో రెండువందల లక్షల ఏళ్ళ కిందటి ఆ తరుకాండం దాదాపుగా శిలగా మారిపోయి కనిపిస్తున్నది. దాదాపుగా మట్టిగా మారిపోయిన ఆ చెట్టు బెరడులో సిలికాన్ శిలగా పొరలు పొరలుగా గడ్డకట్టిపోయి కనిపిస్తున్నది. భూమికి మాత్రమే అనుభవం కాగల అద్భుతం అది. కాని, ఒక మానవుడిగా, నాకు మరింత

అద్భుతంగా గోచరించిన విషయం, ఆ శిలాశకలంలో, ఇంకా పూర్తి శిలగా మారిపోకుండా, మట్టిపెళ్ళలుగా కనిపిస్తున్న ఒకప్పటి చెట్టు ఆనవాళ్ళు.

జీవపదార్థం ఎంత బలమైనదో నాకు ఆ క్షణాన మెరుపులాగా సాక్షాత్కరించింది.

2,00,00,000 సంవత్సరాల తర్వాత కూడా, ఆ చెట్టులో ఒక భాగం ఇంకా రాయిగా మారడానికి పూర్తిగా సిద్ధపడటం లేదు. రాయిగా గడ్డకట్టిపోవడానికి ముందు మరి కొన్ని శతాబ్దాల పాటు మట్టిగానే మనుగడ సాగించాలనుకుంటున్నది.

కానీ, ఆదిమానవులకి తెలుసు, శిలలు కూడా సజీవాలేనని. కాలక్రమంలో ఘనీభవించిన ప్రాణపదార్థాలేనని. అవి కూడా ఎన్నో కోట్ల ఏళ్ళముందటి చెట్లే. ఇంతకీ చెట్టంటే ఏమిటి? మట్టికీ, సూర్యుడికీ మధ్య నడిచిన సంభాషణనే కదా. వర్షమూ, వరదా అంటే ఏమిటి? సముద్రానికీ, సూర్యుడికీ మధ్య సాగిన సంభాషణనే కదా. అక్కడ చెట్లు శిలలుగా మారిపోయాయంటే ఏమిటి? సూర్యుడనే నాయనారు నేరుగా చెట్లకాండాల మీద రాసిన కవిత్వం శిలాక్షరంగా మిగిలిపోయిందనే కదా.

నాకు అప్రయత్నంగా రూమీ గుర్తొచ్చాడు. ఆయన కవిత్వంలో జగత్ప్రసిద్ధాలైన ఈ పంక్తులు గుర్తొచ్చాయి:

**నేనొక ఖనిజంగా మరణించి ఒక వృక్షంగా మొలకెత్తాను**
**ఒక వృక్షంగా మరణించి ఒక జంతువుగా ప్రభవించాను**
**ఒక జంతువుగా మరణించి, ఒక మనిషిగా తలెత్తాను**
**ఇంక నేనెందుకు భయపడాలి? మృత్యువు నన్నేమి చేస్తుంది?**
**నేడో రేపో మనిషిగా కూడా మరణిస్తాను**
**అప్పుడు దేవదూతలతో కలిసి పయనిస్తాను**
**ఇక ఆ దివ్యలోకం కూడా దాటి పోగలిగానా**
**నేనొక అవాఙ్మానసలోకం చేరుకుంటాను.**

# తమిళ జీవనసూత్రం

**నా** పసితనంలో, మా ఊళ్ళో, రాధామనోహరాలు పూసిన పందిరి కింద, ఆ తాటాకు ఇంట్లో, ఆ మట్టి అరుగుమీద కూచుని చదువుకున్న 'శ్రీమహాభక్తవిజయం' మహిమ ఏమోగాని, ఆ తర్వాత నా జీవితమంతా, ఆ భక్తికవుల అడుగుజాడల్ని వెతుక్కుంటూ సాగిస్తున్న యాత్రగానే అనుభవానికొస్తూ ఉంది.

భక్తి కవుల్ని అధ్యయనం చేయడమంటే భారతదేశాన్ని అధ్యయనం చేయడం. సత్యం ఒక్కటే, ఎవరి సాక్షాత్కారం వారిది అని అర్థమయ్యాక, సత్యం వాళ్ళకెట్లా అనుభవంలోకి వచ్చిందో, ఆ అనుభవాన్ని వాళ్ళెట్లా తక్కిన ప్రపంచంతో పంచుకుంటూ వచ్చారో తెలుసుకోవడంలో గొప్ప సంతోషం ఉంది. మనిషి జన్మ ఎత్తినందుకు, చదువుకున్నందుకు, మరింత చదువుకోగలిగే అవకాశం లభిస్తున్నందుకు ఇంతకు మించిన సార్థక్యం మరొకటి లేదనిపిస్తూంటుంది.

అట్లాంటి పఠనక్రమంలోనే దాదాపు ఇరవయ్యేళ్ళ కిందట 'పెరియపురాణం' చదివాను. 'శేక్కిలార్' అనే ఒక తమిళ కవి, అరవై ముగ్గురు నాయనార్ల గురించి రాసిన కథనం అది. అందులో ముఖ్యంగా, 'అప్పర్', 'సంబంధర్', 'సుందరమూర్తి' అనే నాయనార్ల జీవితగాథలు నన్ను గాఢంగా ఆకట్టుకున్నాయి. తమిళంలో 'మూవుర్' అంటే ఆ ముగ్గురే. ఆ ముగ్గురూ క్రీ.శ ఏడు నుంచి తొమ్మిది శతాబ్దాల్లో తమిళగ్రామాల్లో దేవాలయం వెనక దేవాలయాన్ని సందర్శిస్తూ, ప్రతి చోటా ఆ స్థలంలో వెలిసిన శివుణ్ణి కీర్తిస్తూ ప్రజల్లో ఒక శివచైతన్యాన్ని మేల్కొల్పారు. వారట్లా గానం చేసిన కవితల్ని తర్వాత రోజుల్లో 'తేవారం' పేరిట సంకలనం చేసారు.

ప్రాచీన కాలంలోనూ, మధ్యయుగాల్లోనూ భారతదేశంలో మతం పోషించిన పాత్ర కేవలం మతానికే పరిమితమైంది కాదని గుర్తుపెట్టుకోవాలి. ఇప్పటి కాలంలో రాజకీయ పక్షాలు నిర్వహిస్తున్న పాత్రలాంటిదే అప్పుడు మతాలు కూడా పోషించాయి. ఆ రోజుల్లో ప్రజలు తమ సాంఘిక ఆర్థిక స్థితిగతుల్ని బట్టి తమ రాజకీయ ఆకాంక్షల్ని వ్యక్తం చేయడానికి మతాలవైపే చూసేవారు. అందుకనే, ప్రాచీన, మధ్యయుగాల్లో

భారతదేశంలో ప్రతి మతానికీ, ఒక పీడక పార్శ్వమూ, ఒక విప్లవ పార్శ్వమూ కూడా కనిపిస్తాయి. రాజూ, రాజకీయ నిర్మాణాలూ ప్రజలకి దూరంగా జరుగుతున్నాయని గ్రహించినప్పుడు, ఏదో ఒక మతం ప్రజలకి సమీపంగా జరిగి, వాళ్ళ కష్టనష్టాల్లో వాళ్ళకి తోడుగా ఉండి, వాళ్ళ ఆదరణ చూరగొనేది. అంటే, ఇప్పుడు ప్రతిపక్షాలు నిర్వహించే పాత్రలాంటిదన్నమాట. అలా ప్రజలకి ఆ మతం ఒక నూతన చైతన్యాన్ని అందించిన తరువాత, ప్రజలు, ఆ రాజకీయ నిర్మాణాన్ని కూలదోసి, కొత్త రాజకీయ వ్యవస్థని నిర్మించుకున్నప్పుడు, అంతదాకా వాళ్ళకు చేరువగా ఉన్న మతానికి రాజాదరణ లభించేది. ఆ రాజాదరణ వల్ల ఆ మతానికి లేదా ఆ మతశాఖకి భూములు, దేవాలయాలు, ధనధాన్యాలూ లభించేవి. తనకి లభించిన రాజాదరణవల్ల, ఆ మతాలు, ఇప్పటి పాలకపక్షాల్లాగా నెమ్మదిగా ప్రజలకి దూరంగా జరిగిపోయేవి. అప్పుడు మరో మతం ప్రజలకి దగ్గరగా జరిగేది. (డా. బి.ఎస్.ఎల్. హనుమంతరావు రచనలు చదివేదాకా భారతదేశంలో మతాలు నిర్వహించిన పాత్రలోని ఈ గతితార్కిక లక్షణాన్ని నేను గుర్తించలేకపోయాను. ఆయన విశ్లేషణలు చదివినతరువాతనే నాకు భారతదేశ చరిత్రలో ఎందుకు ప్రతి ఒక్క మతమూ ఉచ్చస్థితినీ, ఆ వెంటనే పతన స్థితినీ చవి చూసిందో తేటతెల్లమయింది.)

ఒకప్పుడు ప్రాచీన తమిళదేశంలో బౌద్ధ జైనాలు అటువంటి ఉత్థానపతనాల్ని చవిచూసాయి. ముఖ్యంగా, క్రీ.శ. ఆరేడు శతాబ్దాల నాటికి జైనం, తమిళదేశంలో, పాలకపక్షాల మతంగా మారి తన విప్లవాత్మకను పోగొట్టుకుని, పూర్తి పీడక స్వభావాన్ని సంతరించుకుంది. దాని మీద తిరుగుబాటుగా తమిళదేశాన్ని శైవంలోకి మేల్కొల్పినవాళ్ళ నాయనార్లు. వాళ్ళు తమిళదేశమంతటా, ముఖ్యంగా, గ్రామం వెనక గ్రామం తిరుగుతూ ప్రజల్ని ఒక కొత్త చైతన్యంలోకి మేల్కొల్పారు. ప్రజలముందు వారొక నవీన సత్యాన్నీ, సౌందర్యాన్నీ ఆవిష్కరిస్తున్నప్పుడు, కావటానికి, వాళ్ళు శివస్తోత్రాలే చేసినప్పటికీ, ఆ కవిత్వం వెనక, తమిళదేశానికే చెందిన ప్రత్యేకమైన ఒక సౌందర్యదృక్పథం ఉంది, ఒక సాహిత్య అలంకారశాస్త్రం ఉంది.

అదేమిటో తెలుసుకోవాలంటే, మనం తొలి సంగం సాహిత్యం వైపు చూడాలి. ప్రాచీన తమిళదేశంలో మదురై కేంద్రంగా విలసిల్లిన ఒక సాహిత్యసంఘం సేకరించి, సంకలనం చేసిన సాహిత్యాన్ని సంగం సాహిత్యంగా పిలుస్తున్నారు. ఆ సాహిత్యంలో ఇప్పుడు మనకి, ఎనిమిది కవిత్వసంకలనాలూ (ఎట్టుతొగై), పది దీర్ఘగీతాలూ (పత్తుప్పాట్టు) తో పాటు మరొక పద్ధెనిమిది చిన్నపాటి సంకలనాలూ, 'తొల్కాప్పియం' అనే ఒక లక్షణ గ్రంథం కూడా లభిస్తున్నాయి. 'మణిమేఖలై', 'జీవకచింతామణి'లాంటి అయిదు మహాకావ్యాలూ, తిరువళ్ళువర్ రచించిన 'తిరుక్కురళ్' ఆ తర్వాత కాలానికి చెందినవి.

సంగం సాహిత్యంలో మొదటి సంగం సంకలనం చేసిన ఎనిమిది కవిత్వ సంపుటాలూ ప్రపంచ సాహిత్యంలోనే అత్యున్నతస్థాయి కవిత్వాన్నీ, జీవనదృక్పథాన్నీ కలిగి ఉన్నాయి. ముఖ్యంగా, మనిషి అనుభవాలకీ, అతడు జీవిస్తున్న భౌగోళిక స్థితిగతులకీ మధ్య ఒక అవినాభావసంబంధం ఉంటుందని సంగం కవులు గుర్తించారు. తమ కాలంలో తమ తమిళదేశంలో అటువంటి భౌగోళిక పరిస్థితుల్ని వాళ్ళు అయిదు లాండ్‌స్కేప్‌లుగా పోల్చుకున్నారు.

అవి, అడవుల్తో కూడిన కొండలు (కురింజి), పంటపొలాల్తో కూడిన ఊళ్ళు (మరుదం), సముద్రతీరం (నెయిదల్), పచ్చికబయళ్ళు (ముల్లై), ఊషరక్షేత్రాలూను (పాలై). ఆ అయిదు భౌగోళిక విభాగాల్నీ వాళ్ళు ఒకే ప్రజాదేహానికీ, సామాజిక చైతన్యానికీ చెందిన అయిదు పార్శ్వాలుగా భావిస్తూ, వాటి చుట్టూ వారొక అద్భుతమైన సాహిత్యశాస్త్రాన్ని నిర్మించుకున్నారు. అదంతా వివరించాలంటే, ఇక్కడ చోటు చాలదు. కాని, మనం గమనించవలసిందేమంటే, నాయనార్లు తమిళదేశంలో శివభక్తిని మేల్కొల్పడానికి సంగం కవులు చూపించిన దారిలోనే పయనించారనీ, ఆ మెలకువలతోటే తమ కవిత్వాన్నీ నిర్మించుకుంటూ వచ్చారనీ.

సంగం కవుల దృష్టిలో ప్రణయానికి ఏడు అవస్థలు ఉన్నాయి. అందులో రెండు, 'కైక్కిలై', 'పెరుంతిణై', అంటే, ఒకేవైపు ప్రేమ, పొసగని ప్రేమ, ఆ రెండూ సాహిత్య వస్తువులు కావని వాళ్ళు పక్కన పెట్టేసారు. మిగిలిన అయిదూ, ఎదురుచూపు, ప్రణయకలహం, ఎడబాటు, విరహం, సమాగమం. వాటి చుట్టూ వాళ్ళు సృష్టించుకున్న అద్భుతమైన కవిత్వాన్ని 'అగం' కవిత్వం అన్నారు. దాన్ని రామానుజన్ interior landscape అన్నాడు. అక్కడ నాయికానాయకులకు పేర్లు ఉండవు. కాని, వాళ్ళ ప్రణయావస్థలు మాత్రం అత్యంత స్థానికాలు. దృశ్యం అత్యంత స్థానికం, కాని అనుభూతి సార్వత్రికం. ఈ అత్యంత తమిళశైలి చిత్రణనే తర్వాత రోజుల్లో ఒక రసజ్ఞుడు 'తమిళ్ నెరి' అంటే 'తమిళ జీవనసూత్రం' అన్నాడు.

అలాగని సంగం కవులు తమ చుట్టూ ఉన్న సమాజాన్ని పట్టించుకోలేదనుకోకూడదు. తమ చుట్టూ సంభవిస్తున్న ఆకలి, క్షామం, యుద్ధం, విజయం, అపజయం, ప్రతి ఒక్కదాన్నీ కూడా వాళ్ళు చిత్రించారు. కాని, దానికి మరొక తరహా పద్ధతి పాటించారు. అక్కడ మనుషులకీ, స్థలాలకీ, సంఘటనలకీ పేర్లుంటాయి. దాన్ని వాళ్ళు 'పురం' కవిత్వం అన్నారు. అక్కడ ఒక రాజునో, స్థానిక దైవాన్నో స్తుతించడం కూడా ఉంటుంది. రామానుజన్ దాన్ని exterior landscape అన్నాడు.

తర్వాతి రోజుల్లో నాయనార్లు, ఆ తర్వాత ఆళ్వార్లు తమ కవిత్వం ద్వారా ప్రజల్ని ప్రభావితం చేయగలగటానికి ప్రధాన కారణం వాళ్ళు సంగం సాహిత్యనిర్మాణాల్ని

అనుసరించడమే అంటాడు రామానుజన్. ఆయన చెప్పిందేమంటే, సంగం సాహిత్యం, అకం కవిత్వంలోని ప్రణయావస్థల్ని (సంగం కవులు వదిలిపెట్టిన రెండు అవస్థలూ- ఒకవైపు ప్రేమ, పొసగని ప్రేమతో సహా), పట్టుకుని, పురం పద్ధతిలో, ఎవరో ఒక రాజుని కాక, దేవుణ్ణి స్తుతిస్తూ కవిత్వం చెప్పినందువల్ల, నాయనార్లూ, ఆళ్వార్లూ కూడా ప్రజల హృదయాల్ని గెల్చుకోగలిగారని.

ఒక ఉదాహరణ చూడండి. తేవకులత్తార్ అనే కవి చెప్పిన కవితలో (కురుంతొగై:3) నాయిక తన ప్రియుడు పక్కనే పొంచి వింటున్నాడని చెప్పిన మాటలు:

**నల్ల కాడల నీలికురింజిపూలలో**
**తేనెటీగలు మత్తిల్లే**
**ఆ కొండపల్లె మొనగాడి పట్ల**
**నా ప్రేమ-**

**నేలకన్నా పెద్దది, నింగికన్నా ఎత్తైనది,**
**కడలికన్నా లోతైనది.**

ఈ ప్రణయకవితలోని సౌందర్యమంతా ఆ కురింజిపూలు పూసిన కొండపల్లెలో ఉంది. సంగం సంప్రదాయం ప్రకారం కురింజి ప్రణయావస్థ సమాగమాన్ని, శరత్కాలాన్ని, రాత్రివేళని సూచించే సంకేతసముదాయం. ఈ కవిత కావడానికి నాలుగైదు పంక్తుల చిన్న కవితనే అయినప్పటికీ, ఈ పదాలు, వాటి చుట్టూ అల్లుకున్న ప్రగాఢభావచ్ఛాయలూ, మనల్నొక మోహసీమలోకి తీసుకుపోతాయి.

ప్రకృతినీ, మానవ భావావేశాల్నీ అనుసంధానించి కవిత్వం చెప్పడం ప్రపంచ సాహిత్యమంతా ఉన్నదే అయినప్పటికీ, ఆ అనుసంధానాన్ని సంగం కవులు ఒక విస్పష్ట అలంకార శాస్త్రంగా మార్చేసారు. బయటి ప్రకృతికీ, లోపలి ప్రకృతికీ వారధికట్టినవాళ్ళల్లో అందరికన్నా ముందుండే ప్రాచీన చైనా కవులు కూడా ఈ విషయంలో సంగం సాహిత్యస్థాయిని అందుకోలేకపోయారు.

సంగం కవులకి ప్రకృతి కేవలం సుందరదృశ్యసీమ కాదు. ప్రాచీన తెగల మౌఖిక కవిత్వంలో లాగా, అది వాళ్ళకి జీవితంలో విడదీయలేని భాగం. ప్రతి చెట్టూ, ప్రతి పువ్వూ, ప్రతి ఋతువూ, ప్రతి వేళా, ప్రతి ఏరూ, ప్రతి కొండా వాళ్ళకి ఆత్మ బంధువులూ, ఆరాధనీయాలూను. అందుకే, ఒక రసజ్ఞుడు ప్రాచీన తమిళ పొయెటిక్స్‌ని ecopoetics అనకుండా ఉండలేకపోయాడు.

తర్వాత రోజుల్లో నాయనార్లూ, ఆళ్వార్లూ సరిగ్గా ఈ రహస్యాన్నే పట్టుకున్నారు. ఉదాహరణకి జ్ఞానసంబంధ నాయనార్ తిరువయ్యారు కోవెల గురించి చెప్పిన పదికంలో ఒక చరణం (1:130:7) చూడండి:

**నిం(డ్రులా నెడువిసుంబు నెరుక్కివరు పురమూం(డ్రు నీళ్వాయంబు**
**సెం(డ్రులాం పడిదొట్ట సిలైయాళి మలై యాళి సేరుంగోయిల్**
**కుం(డ్రెలాజ్ కుయిలుగ్వాక్ కొళుంబిరస మలర్బాయందు వాస మల్గు**
**తెం(డ్రలా రడివరుడచ్ చెళుంగరుంబు కణ్వలురున్ దిరువైయారే.**

**(దేవతలు నిర్మించుకున్న స్వర్గాన్ని**
**ధ్వంసం చేస్తున్న మూడుపురాల్నీ**
**ఒక్క విల్లు ఎక్కుపెట్టి దగ్ధం చేసినవాడు**
**కొలువుండే కోవెల, తిరువయ్యారు.**

**కొండలమీంచి కోయిల కూత వినబడుతూ**
**తేటతేనెలూరే పూలమీంచి ప్రవహించే తీపిగాలికి**
**చెరుకుగడలు మరొక్క జానెడు పొడవుపెరిగే**
**ఊరే తిరువయ్యారు.)**

ఈ చరణంలో సంగీతం సరే, అంతకన్నా కూడా గమనించవలసింది, ఆ దేవుడు త్రిపురాంతకుడు కావడం కాదు, అతడు తిరువయ్యారులో ఉండేవాడు కావడం. ఆ తిరువయ్యారు కూడా ఎట్లాంటిదంటే, మామూలుగా పెరిగే చెరకుగడలు కూడా ఆ సునాదానికీ, ఆ సుగంధానికీ మరో జానెడు ఎక్కువ పెరిగే ఊరు కావడం. ఎన్నాళ్ళుగానో నా కల, ఆ తమిళదేశాన్ని చూడాలనీ, ఆ చెట్లు, ఆ కొండలు, ఆ కోవెలలు సాక్షిగా, ఆ కవులు పయనించిన దారుల్లో పయనించాలని.

# నాయనార్ల పరంపరలో

ఎన్నికల పరిశీలకుడిగా విల్లుపురంలో అడుగుపెట్టకముందే జిల్లా కలెక్టరు తెలుగు మాట్లాడటం తెలిసిన ఒక డిప్యూటీ తహాశీల్దారుని నాకు లైజన్ ఆఫీసరుగా నియమించాడు. ఆ అధికారి పేరు నారాయణ మూర్తి. తెలుగు అతడి మాతృభాష. కాని నా భాగ్యవశాత్తూ, అతడు తమిళ సాహిత్యంలో ఎమ్మే చేయడమే కాకుండా తొలి తమిళ లక్షణ గ్రంథం తొల్కాప్పియం మీద ఎం.ఫిల్ కూడా చేసాడు.

నేను వచ్చిన రోజు సాయంకాలమే అతడితో తమిళ భక్తికవుల గురించి ప్రస్తావిస్తే, విల్లుపురం చుట్టుపక్కలనే పది పదిహేనుమంది నాయనార్లు వర్ధిల్లారని చెప్పాడు. ఆ మర్నాడు మధ్యాహ్నం నామినేషన్ల సమర్పణ ఘట్టం ముగిసిపోగానే, దగ్గరలో ఏ నాయనారు పుట్టినచోటు ఉంటే అక్కడికి తీసుకువెళ్ళమని అడిగాను అతణ్ణి. ఆశ్చర్యం, తమిళ నాయనార్లలో అత్యంత 'రొమాంటిక్' అని చెప్పదగ్గ సుందరమూర్తి పుట్టిన ఊరు దగ్గరలోనే ఉందని చెప్పాడు. చెప్పడమే ఆలస్యం, ఇరవైనిమిషాలు తిరక్కుండా మేము తిరునావలూరు కోవెలముంగిట నిల్చొన్నాం.

భారతీయ భక్తిశాస్త్రం భక్తి వ్యక్తీకరణకి తొమ్మిది మార్గాలని చెప్తూ, భక్తుల్ని అయిదు రకాలుగా వర్గీకరించింది. మొదటి తరహా భక్తులు దేవుణ్ణి తమ తండ్రిగానో, తల్లిగానో లేదా తమ బిడ్డగానో భావించేవాళ్ళు. యశోద, సూర్ దాస్, పెరియాళ్వార్ అటువంటి వాత్సల్య భక్తులు. రెండవ తరహా భక్తులు దేవుడికి తమని తాము దాసులుగా పరిగణించుకుంటారు. దేవుడి పాదకమలసేవ, దేవార్చకులతోటి నెయ్యం కోరుకునే ఆ భక్తి దాస్యభక్తి. అక్రూరుడు, మధురానగరిలో కుబ్జ అటువంటి భక్తులు. మూడవ తరహా భక్తి దేవుణ్ణి నిశ్శబ్దంగా, శాంతంగా హృదయంలో నిలుపుకునే తరహా భావోద్వేగం. శాంతభక్తిగా పిలవబడే ఆ భక్తికి పురాణాల్లో భీష్ముణ్ణి ఉదాహరణకి చెప్తారు. కన్నడ వచనకవుల్లో అల్లమప్రభువుది అటువంటి భక్తి. నాలుగవది, దేవుణ్ణి తన మిత్రుడిగా, సఖుడిగా, సహచరుడిగా భావించే మనఃస్థితి. భాగవతం దృష్టిలో అర్జునుడిది అటువంటి

భక్తి. నమ్మాళ్వారు, తుకారాం, బసవన్న మొదలైన వాళ్ళది కూడా సఖ్యభక్తినే. ఇక భక్తిలో అత్యున్నత స్థాయి మనోభూమిక మధురభక్తి. అక్కడ దేవుణ్ణి తన ప్రియుడిగానో, ప్రేయసిగానో భావించి తనను సంపూర్ణంగా సమర్పించుకునే మన్మోహన స్థితి అది. రాధని ఉదాహరణగా తీసుకుని మీరా, అక్కమహాదేవి, ఆండాళ్ అటువంటి స్థితికి చేరాలని తపిస్తూ అద్భుతమైన కవిత్వం చెప్పారు.

అటువంటి భక్తి మార్గాల్లో సుందరమూర్తిది సఖ్యభక్తి. శివుణ్ణి అతడు తన స్నేహితుడిగా, సహచరుడిగా, చివరికి, తన ప్రేయసికీ, తనకీ మధ్య ప్రేమవార్తలు మోసుకొచ్చే రాయబారిగా కూడా భావించాడు.

అతడి జీవితకథ చాలా చిత్రంగా ఉంటుంది. అతడు ఎనిమిదవ శతాబ్దంలో తిరునావలూర్ గ్రామంలో ఒక ఆదిశైవ కుటుంబంలో పుట్టాడు. తల్లిదండ్రులిద్దరూ కూడా నాయనార్లే. అతణ్ణి చిన్నప్పుడే స్థానికంగా ఉండే ఒక రాజు చూసి అభిమానంతో తనదగ్గరే పెట్టుకుని పెంచి పెద్దచేసాడు. సుందరర్‌కి యుక్తవయస్సు రాగానే పెళ్ళి చేయడానికి తల్లిదండ్రులు ఏర్పాట్లు చేసుకున్నారు.

తీరాచేసి పెళ్ళిమంటపానికొక వృద్ధుడు వచ్చి, సుందరమూర్తిని అతడు పుట్టకముందే అతడి తాత తనకి అమ్మేసాడనీ కాబట్టి అతడు పెళ్ళి చేసుకోడానికి వీల్లేదనీ, తన కూడా రావలసి ఉంటుందనీ వాదించాడు. అందుకు సాక్ష్యంగా ఒక పత్రం కూడా చూపించాడు. అతణ్ణి చూస్తూనే సుందరమూర్తి 'నువ్వేమన్నా పిచ్చివాడివా? నేను నీకు అమ్ముడు కావడమేమిటి? ఏదీ ఆ పత్రం ఇలా ఇవ్వు' అని తీసుకుని ఆ పత్రం చింపేసాడు.

కానీ ఆ వృద్ధుడు శాంతంగా 'అది కేవలం నకలు మాత్రమే, అసలు పత్రం నా దగ్గరే ఉంది. కావాలనుకుంటే, మా ఊరు తిరువెణ్ణైనల్లూరు, అక్కడికొచ్చి చూసుకోవచ్చు' అన్నాడు. సుందరమూర్తి కుటుంబం ఆ పెళ్ళి మానుకుని తిరువెణ్ణైనల్లూరు వెళ్ళారు. అక్కడ ఒక పండిత పరిషత్తు ఏర్పాటు చేసారు. పెద్దలంతా కూచుని ఆ పత్రాన్ని పరిశీలించారు. అది నకిలీ కాదని, అసలైన పత్రమేననీ తేల్చారు. 'అయితే నా వెనక రా' అని ఆ వృద్ధుడు సుందరమూర్తిని వెంటపెట్టుకుని తిరువెణ్ణైనల్లూరు కోవెలలో ప్రవేశించి అదృశ్యమైపోయాడు. సుందరమూర్తికి వళ్ళు గగుర్పొడిచింది. తనని సాక్షాత్తూ శివుడే దాసుడిగా చేసుకున్నాడని గ్రహించాడు. అప్రయత్నంగా అతడి నోటినుండి ఒక కీర్తన వెలువడింది. 'పిత్తా బెరు సూడీబెరుమానే యరుళాళా..'

ఆ క్షణమే నాయనార్ల పరంపరలో మరొక మహాకవి ప్రభవించాడు.

అతడు గ్రామం నుంచి గ్రామానికి, కోవెల నుంచి కోవెలకి తిరుగుతూ శివసంకీర్తనం మొదలుపెట్టాడు. ఒకరోజు అట్లా తన సంచారంలో తిరువారూరు వెళ్ళినప్పుడు, అక్కడ పరవై అనే ఒక యువతిని చూసి మనసు పారేసుకున్నాడు. అప్పుడు శివుడు అతడితో 'నీ పెళ్ళి ఆపేసాను. ఇప్పుడు నీకు నచ్చిన యువతితో పెళ్ళి చేయిస్తాను' అన్నాడు. అనడమే కాక, అతడి తరపున ఆమెదగ్గరకి రాయబారిగా వెళ్ళాడు. ఆమెతో మాట్లాడి వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసాడు. ఆ రాయబారం కోసం నడిచిన శివపాదముద్రలు పడ్డ ఆ కోవెల సాక్షాత్తూ కైలాససమానమైపోయింది.

సుందరమూర్తి శివసంకీర్తన కొనసాగుతూ ఉంది. కొన్నాళ్ళకు అతడు తిరువొత్రియూర్ వెళ్ళాడు. అక్కడ దేవాలయంలో పూలు కోస్తున్న సంకిలి అనే పిల్లని చూసాడు. ఆమెపట్ల గాఢమైన మోహం అతణ్ణి కమ్మేసింది. ఆమెకి తన ప్రణయసందేశం చెప్పడానికి మళ్ళా అతడు శివుణ్ణే ప్రార్థించాడు.

శివుడు తనకి వివరించిన ప్రణయవార్త విని సంకిలి సంతోషం పొందుతూనే సందేహం కూడా వెలిబుచ్చింది. 'అతడికి ఇప్పటికే పెళ్ళయ్యింది కదా, రేపు నన్ను వదిలిపోడని ఏమిటి నమ్మకం? నన్ను వదిలిపోనని వాగ్దానం చెయ్యమను, అతణ్ణి స్వీకరిస్తాను' అని చెప్పింది. శివుడు సుందరమూర్తితో ఆ మాటే చెప్పాడు.

మోహసముద్రంలో మునిగి ఉన్న సుందరమూర్తి 'సరే, రేపామెని గుడి దగ్గరకి రమ్మను, గర్భగుడిలో శివలింగం సమక్షంలో ఆమెకి వాగ్దానం చేస్తాను, కానీ, ఒక్క మాట, ఆ కొద్ది క్షణాలూ నువ్వా లింగంలో ఉండకుండా, గుడి వాకిట పొన్నపూల మొక్కలో గడుపు' అన్నాడు. శివుడు మళ్ళా సంకిలి దగ్గరకి వెళ్ళి సుందరమూర్తి ఆమె కోరినట్టే వాగ్దానం చేస్తానన్నాడని చెప్తూ, కాని, 'నువ్వు గుళ్ళో కాకుండా, గుడి వాకిట ఉండే పొన్నపూల మొక్క దగ్గర వాగ్దానం చెయ్యమని అడుగు' అని కూడా చెప్పేసాడు. ఆ మర్నాడు ఆమె అట్లానే కోరింది. ఆమెకి శివుడు రహస్యం చెప్పేసాడని సుందరమూర్తి గ్రహించాడు. కాని ఆమె కోరినట్టే, ఆ పున్నాగవృక్షం కిందనే ఆమెకు వాగ్దానం చేసాడు. ఆమెని పరిణయమాడాడు.

కొన్నాళ్ళు గడిచాయి. తిరువారూరులో వసంతోత్సవం మొదలయ్యింది. సుందరమూర్తికి పరవై గుర్తొచ్చింది. అతడు ఉండలేకపోయాడు. కాని మనసులో సంఘర్షణ మొదలయ్యింది. సంకిలిని వదిలిపెట్టలేడు. తిరువారూరు పోకుండా ఉండనూలేడు. చివరికి ఉండలేక ఒకరోజు తిరువొత్రియూర్ పొలిమేరలు దాటాడు. అట్లా దాటాడో లేదో, అతడి కళ్ళు కనిపించడం మానేసాయి. అతడు గుడ్డివాడై కుప్పకూలిపోయాడు.

అంధుడిగా అతడు మళ్ళా శివక్షేత్ర సంచారం మొదలుపెట్టాడు. కోవెల నుంచి కోవెలకు దారి వెతుక్కుంటూ శివసంకీర్తనం కొనసాగించాడు. 'నువ్వు నన్ను శిక్షిస్తున్నావని అర్థమయింది. కాని నేను నీనుంచి ఏదీ దాచలేదు కదా. అయినా నన్నెందుకిట్లా శిక్షిస్తున్నావు' అని శివుణ్ణి నిలదీసాడు. శివుడన్నాడు కదా: 'నువ్వు మాట తప్పినందుకు సంకిలి బాధపడటం సహజమే, కాని, నేను గుళ్ళో లింగంలో మటుకే ఉంటాననీ, గుడివాకిట పున్నాగ వృక్షంలో ఉండననీ అనుకున్నావు చూడు, దానికి నేను మరింత బాధపడుతున్నాను' అన్నాడు.

సుందరమూర్తికి అర్థమయింది. Sacred landscape అంటే ఒక్క గుడి మాత్రమే కాదు, గుడీ, గుడి ముంగిలీ, ఊరూ, వాడా, మనిషీ, అతడి మనస్సూ కూడా అని. అతడు కరిగినీరై పాటలై ప్రవహించాడు. ఎట్టకేలకు కంచిలో అమ్మవారిముందు పాటలు పాడినప్పుడు ఆమె హృదయం ద్రవించింది. వామాక్షి కదా, అతడి ఎడమకంటికి చూపు వచ్చింది. మరికొంత కాలం హృదయాక్రోశం పూర్తిగా వెలువడ్డాక పూర్తి చూపు వచ్చింది. అతడు తిరువారూరు పొలిమేరలకు చేరి పరవైకి కబురుపెట్టాడు. కాని అప్పటికే అతడికీ, సంకిలికీ మధ్యనడిచిన ప్రణయమంతా ఆమె చెవిన పడింది. ఆమె అతణ్ణి చూడటానికి కూడా ఇష్టపడలేదు. ఆమె మనసు మార్చడానికి సుందరమూర్తి మళ్ళా శివుణ్ణే ఆశ్రయించాడు.

సుందరమూర్తి కవిత్వమంతా ఈ ప్రణయబాధలూ, ఈతి బాధలూ, దాంపత్య బాధలే. కాని, తన ప్రణయాన్నీ, పారవశ్యాన్నీ, గుణదోషాల్నీ వేటినీ అతడు దాచుకోకుండా స్నేహితుడికి చెప్పుకున్నట్టుగా శివుడికి చెప్పుకున్నాడు. ఆ నెపాన, చలంగారిలాగా, తక్కిన ప్రపంచమంతటితోనూ పంచుకున్నాడు. అందుకే శివుడన్నాడట: 'మా అప్పర్ నా గురించి పాటలు పాడాడు, సంబంధర్ మనుషుల గురించి పాటలు పాడాడు, సుందరమూర్తి తన గురించే తాను పాడుకున్నాడు' అని.

# దేహానికీ, దైవానికీ మధ్య

**తి**రునావలూరులో సుందరర్‌కి ఒక గుడి కట్టారు. ఆ గుడి చుట్టూ సుందరర్ జీవితగాథలు రాళ్ళమీద చెక్కి ఒక ప్రాకారాన్ని రూపొందిస్తూ ఉన్నారు. గుడిలో గర్భగుడికి బయట సుందరర్ తల్లిదండ్రుల ప్రతిమలున్నాయి.లోపల సుందరర్ మూర్తి, అర్చామూర్తిగా పూజలందుకుంటూ ఉన్నది. ఆ అర్చకుడు మధురంగానూ, శ్రావ్యంగానూ తేవారంగానం చేసి ఆ మూర్తికి హారతి ఇచ్చి మాకు చూపించాడు. సుందరర్ కవిత్వమేదైనా అక్కడ ఉందా అని చూస్తే, కొన్ని తేవారం గీతాల చిన్నపుస్తకాలు తమిళంలో ఉన్నాయి. కాని నా ఆసక్తి చూసి, ఆ అర్చకుడు చిన్న ఇంగ్లీషు పుస్తకమొకటి నా చేతుల్లో పెట్టాడు. చూద్దును కదా, ఆ పుస్తకం పేరు Lord Shiva Loved Tamil Language అని ఉంది!

మేం అక్కణ్ణుంచి తిరునావలూర్ ప్రధానదేవాలయంలో అడుగుపెట్టాం. నాయనార్లు అడుగుపెట్టి సంకీర్తన చేసిన దేవాలయాన్ని 'పాడల్ పెట్ర తలం 'అని పిలుస్తారు. అటువంటివి తమిళదేశంలోనూ, చుట్టు పక్కలా, 274 ఉన్నాయని లెక్కగట్టేరు. (ఈ మధ్య మరొక రెండు చేర్చి 276 గా చెప్తున్నారు.) తిరునావలూర్ దేవాలయం మీద కూడా సుందరర్ ఒక కీర్తన (7:17) ఆలపించాడు కాబట్టి అది కూడ ఒక పాట పుట్టిన స్థలంగానే లెక్కకొస్తున్నది. దేవుడు తనని 'వన్తొండన్' (పొగరుమోతు భక్తుడు) అన్నాడని సుందరమూర్తి చెప్పుకున్నది ఆ గీతంలోనే.

తిరునావలూరులో ఉన్న శివుడు 'భక్తజనేశ్వరుడు'. నావల్ అంటే తమిళంలో నేరేడు చెట్టు. ఆ దేవాలయ ప్రాంగణంలో నేరేడు చెట్లు బాగానే ఉన్నాయి. వాటిలో ఒక చెట్టుని స్థలవృక్షంగా గుర్తించి గౌరవిస్తున్నారు కూడా. అందుకని సుందరమూర్తి ఆ దేవుణ్ణి తిరునావలీశ్వరుడు అని పిలిచాడు. తాను పుట్టిన ఊళ్ళో వెలసిన దేవుణ్ణి ఒక నేరేడు చెట్టుతో గుర్తుపెట్టుకోవడం బహుశా ఒక కవికి మాత్రమే సాధ్యమయ్యే సంస్కృతి కదా!

నాయనార్ల కవిత్వానికి ముందు ప్రజాదరణా, తర్వాత రాజాదరణా లభించిన తర్వాత, చోళ రాజుల ఆ క్షేత్రాల్లో పెద్ద పెద్ద ఆలయాలు నిర్మించారు. వాటిల్లో తిరునావలూరు కూడ ఉంది. ఆ గుళ్ళో సుందరమూర్తి ఇద్దరు భార్యలతోటీ కూడిన ఒక విగ్రహం కూడా ప్రతిష్ఠించి ఉంది.

## 2

పెరియపురాణం బొమ్మల పుస్తకానికి ఒకదానికి ముందుమాట రాస్తూ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ ప్రతి కావ్యానికీ ఒక కథానాయకుడు ఉండాలని అనుకుంటే, పెరియ పురాణానికి సుందరమూర్తి కథానాయకుడని అన్నారు. ఆ మాట నిర్వివాదాంశమే. కాని, అప్పర్, సంబంధర్ ల జీవితాలు మరింత అద్భుతావహంగా, మరింత నాటకీయంగా ఉండగా, శేక్కిలార్ తన కథనాన్ని సుందరమూర్తి చుట్టూతానే ఎందుకు అల్లాడు?

ఈ ప్రశ్నకి సమాధానం పెరియపురాణంలో కాకుండా, ఉమాపతి శివన్ అనే ఆయన రాసిన 'శేక్కిలార్ పురాణం' లో దొరుకుతుంది. శేక్కిలార్ రెండవ కుళోత్తుంగుడికి ప్రధానమంత్రిగా ఉండేవాడు. ఆ రాజు ఎప్పుడూ ప్రసిద్ధ తమిళ జైన ఇతిహాసం 'జీవకచింతామణి' ని చదువుతూ మైమరిచిపోతూ ఉండేవాడట. అది కూడా ముక్తి ప్రబోధకమైన రచననే అయినప్పటికీ, అందులో జీవకుడి శృంగార జీవిత వర్ణనలు విస్తారంగా ఉన్నాయనీ, రాజు వాటి మోహంలో పడుతున్నాడనీ ఆవేదనతో శేక్కిలార్ ఆయన్ని ఆ గ్రంథాన్ని మరీ అంతగా చదవద్దని అన్నాడట.

'నువ్వు చెప్పేది నిజమే కావచ్చు, కానీ ఆ కవిత్వం మాటేమిటి? అటువంటి కవిత్వం తమిళంలో ఎక్కడుందో చూపించు' అన్నాడట కుళోత్తుంగుడు. జీవక చింతామణిని మరిపించే విధంగా శివభక్తుల కథలు వినిపించాలనుకున్న శేక్కిలార్‌కి, దేహానికీ, దైవానికీ మధ్య ఒక వంతెనలాగా సుందరమూర్తి జీవితం కనిపించింది. అందుకని, అతడి జీవితం చుట్టూ తన కావ్యాన్ని అల్లుకుంటూపోయేడు. ఒక్క కథలోనే కాదు, కావ్యనిర్మాణంలో కూడా పెరియపురాణం, (తర్వాత రోజుల్లో కంబరామాయణం కూడా) 'జీవకచింతామణి'కి ఋణపడి ఉంటాయని ఇప్పుడు పరిశోధకులు సవివరంగా చెప్తున్నారు.

## 3

సుందరమూర్తి జీవితాన్ని మలుపు తిప్పిన తిరువెణ్ణైనల్లూరు అక్కడికి దగ్గర్లోనే ఉందని తెలిసింది. మేమక్కణ్ణుంచి తిరువెణ్ణైనల్లూరు బయల్దేరాం. దారిపొడవునా నీళ్ళు పట్టిన

వరిపొలాలూ, కొబ్బరి చెట్లూ, చెరకు తోటలూ కనిపిస్తున్నాయి. బంగారం లాంటి ఆ పొలాల మీద సాయం సంధ్యారశ్మి మరింత బంగారం కురిపిస్తూ ఉంది.

తిరువెణ్ణైనల్లూరు అంటే వెన్నలాంటి అందమైన ఊరు అని చెప్పవచ్చు లేదా వెన్నతో కూడిన అందమైన ఊరని కూడా అనుకోవచ్చు. కానీ ఇప్పుడు ఆ ఊళ్ళల్లో ఏ ప్రత్యేకతా లేదు. మట్టికొట్టుకుపోయిన ఇళ్ళతోటీ, కిరాణాషాపులతోటీ, రకరకాల వస్తువుల ప్రకటనలతోటీ కనిపించే మన ఊళ్ళలాగే ఉన్నాయవి. అక్కడనే కాదు, ఇప్పుడు ఏ యాత్రీకుడైనా భారతదేశపు ఆత్మనీ, సంస్కృతినీ పట్టుకోవాలంటే అడవులవైపూ, పొలాలవైపూ, నదులవైపూ, నాట్యాలవైపూ మాత్రమే చూడవలసి ఉంటుంది.

తిరువెణ్ణైనల్లూరు దేవాలయం పెద్దదే. రాజగోపురమూ పెద్దదే, పెద్ద ప్రాకారం కూడా ఉన్నాయి. లోపల శివుడు కృపాపురీశ్వరుడిగా పూజలందుకుంటున్నాడు. దేవాలయం ముంగిట ఒక పెద్ద మంటపం ఉంది. ఆ మంటపం ఉన్నచోటనే సుందరమూర్తి క్రయపత్రిక మీద పండితపరిషత్తు కూచుని సభ చేసారని అక్కడి వాళ్ళు చెప్పారు. దేవాలయ నిర్మాణాలు పదవ శతాబ్దం నాటివి. చోళ రాజులు, ముఖ్యంగా రాణులు, ఈ దేవాలయాన్ని బృహదీశ్వరాలయంతో సమానంగా గౌరవించేవారని చరిత్రకారులు చెప్తున్నారు.

ఆ శివాలయంలో అర్చకుడు హారతి ఇస్తూండగా నా వెనక ఎవరో సన్నని గొంతుతో శ్రావ్యంగా ఒక కీర్తన ఆలపించడం వినిపించింది. హారతి పూర్తయ్యాక నేను వెనక్కి తిరిగి అక్కడ ఉన్న సిబ్బందిని 'మీలో పాట పాడిందెవరు?' అనడిగాను. వాళ్ళు ఒకరినొకరు చూసుకున్నారు. మేమేమీ పాడలేదే అన్నారు. అక్కణ్ణుంచి దేవాలయ ప్రాంగణంలో ప్రదక్షిణం చేస్తూ ఉండగా, సాంధ్యగగనం మీద ఆశ్వయుజమాసపు నెలవంక సాక్షాత్కరించింది. పైన నీలిగగనమూ, కింద అప్పుడే పూతపూసిన తొలిచీకటీ, ఆ పైన నెలవంక (పిరై సూడి)- నేనా దృశ్యాన్ని చూస్తూ ఉండగా, నాతో పాటు నడుస్తున్న వాళ్ళు 'మీరడిగారే, పాట ఎవరు పాడారని, అదుగో, ఆమెనే' అని ఒక యాత్రికురాలిని చూపించారు. నేనామె దగ్గరకి వెళ్ళి 'మీరిందాక పాడిన పాట మరొకసారి పాడరా, వినాలనుకుంటున్నాను' అన్నాను. ఆమె ముందు కంగారు పడిపోయింది. ఆ తర్వాత నాతో వచ్చిన సిబ్బంది ఆమెకి నచ్చచెప్పారుగాని, 'నేను విల్లుపురం వెళ్ళిపోవాలి. బస్సు దాటిపోతుంది' అంది. 'మిమ్మల్ని విల్లుపురంలో మీ ఇంటిదగ్గర దిగబెట్టే బాధ్యత మాది. మీరు పాడిన ఆ కీర్తన మరొకసారి మా కోసం పాడండి' అన్నారు నాతో ఉన్నవాళ్ళు.

అప్పుడు, అక్కడ ఆ ప్రాంగణంలో దక్షిణామూర్తి సన్నిధిన, ఆమె తన బాగులోంచి తేవారం పాటల పుస్తకం తీసి 'పిత్తా పిరై సూడి పెరుమానే అరుళాళా..'అనే కీర్తన ఎత్తుకుంది. నా సంభ్రమానికి అంతులేదు. సుందరమూర్తినే నా వెనక అడుగులో అడుగువేసుకుంటూ నాకోసం వచ్చి ఆ గీతం వినిపించాడా! మరవలేని ఆ క్షణాన్ని మరొకసారి నెమరువేసుకుంటూ నాలుగైదు చరణాలు తెలుగులో:

## ఎప్పుడో నీకు దాసుణ్ణయ్యాను

**పిచ్చివాడా! నెలవంక అలంకారమైనవాడా!**
**అపార కరుణామూర్తీ! శివనామధేయుడా!**
**దక్షిణపినాకినీ తీరంలో**
**వెణ్ణైనల్లూరు అరుళ్తురైకోవెలలో**
**నివసిస్తున్న తండ్రీ!**
**నిన్ను మరిస్తే కదా తలచుకోవలసింది!**
**ముందే ఎప్పుడో నీకు దాసుణ్ణయ్యాను, ఇప్పుడు**
**నీ దాసుణ్ణి కాదని వాదించడం నాకు సరికాదు కదా!**

2

**వేణువనరాశులు పొదువుకుంటూ ప్రవహించే**
**దక్షిణపెన్నా తీరంలో వెణ్ణైనల్లూరు అరుళ్తురైకోవెలలో**
**నివసిస్తున్నవాడా!**
**కుక్కకన్నా హీనుడిగా బతికానొకప్పుడు**
**నిన్ను చింతించకుండా గడిపినరోజులు!**
**అయినా నన్నునుగ్రహించావు, ఇప్పుడు**
**నీ దాసుణ్ణి కానని వాదించడం నాకు సరికాదు కదా!**

3

**ఇరుతీరాల్నీ తాకి ప్రవహిస్తూ**
**బంగారం, వజ్రాలు, రత్నాలు పొంగిపొర్లుతూ**
**కాంతులు చిమ్మే దక్షిణపినాకినీ తీరంలో**
**వెణ్ణైనల్లూరు అరుళ్తురై కోవెలలో నివసిస్తున్నవాడా!**
**మా అమ్మలాంటివాడా!దయామూర్తీ!**

నిన్ను మరిచిందెప్పుడు? ఇప్పుడు
నీ దాసుణ్ణి కాదని వాదించడం నాకు సరికాదు కదా!

4

శోభాయమానమైన పెణ్ణానది దక్షిణాన
వెణ్ణైనల్లూరు అరుళ్తురై కోవెలలో ఉన్న
నందివాహనుడా! దేవా! నీకు ముందే దాసుణ్ణి,
ఇప్పుడు నీ దాసుణ్ణి కానని వాదించలేను కదా
నాకు మరణంలేదు, కనక, పునర్జన్మ కూడా లేదు.
అయినా మళ్ళా పుట్టమంటావా
వృద్ధాప్యాన్ని తట్టుకోవడం నా వల్ల కాదు.
ఇన్నాళ్ళూ దారితప్పాను, కల్లలాడేను
నన్నొక్కింత దయగా చూసుకోవయ్యా!

5

మేఘాలు వర్షించే జలాలు స్వీకరిస్తూ
రెండు చేతులా రెండు తీరాల్నీ కెరటాలతో తాడిస్తూ
మణిమాణిక్యాలు విరజిమ్ముతూ
యశోమంతంగా ప్రవహించే దక్షిణపినాకినీ తీరంలో
వెణ్ణైనల్లూరు అరుళ్తురై కోవెలలో నివసిస్తున్నవాడా!
ముందే ఎప్పుడో నీకు దాసుణ్ణయ్యాను, ఇప్పుడు
నీ దాసుణ్ణి కాదని వాదించడం నాకు సరికాదు కదా!

# అతడిది జీవితకాల సమర్పణ

**ఆ** మర్నాడు నామినేషన్ల స్క్రుటినీ మధ్యాహ్నం కావడం మూలాన పొద్దున్న కొంత సమయం చిక్కడంతో తిరువామూరు వెళ్ళాం. తమిళశైవపు తొలిప్రవక్తల్లో ఒకడు, తిరునవక్కరసుగానూ, వాగీశనాయనారుగానూ ప్రసిద్ధి చెందిన అప్పర్ పుట్టిన ఊరది.

అక్కడ వెయ్యేళ్ళ ముందటినుంచీ పూజలందుకుంటున్న శివాలయం ఒకటి ఉంది. ఆ గుడిప్రాంగణంలో అడుగుపెట్టగానే నిండుగా పూసిన రేలచెట్టు కనిపించింది. ఇది కొంద్రై పూల చెట్టు, ఇక్కడి స్థల వృక్షం అన్నారు అక్కడి వాళ్ళు.

సంగం సాహిత్యం 'శివ' అనే పదాన్ని వాడకపోయినప్పటికీ, తర్వాతి రోజుల్లో శైవవాఙ్మయంలో శివుడిగుణగణాలుగా ప్రసిద్ధికెక్కిన విశేషణాలన్నిటినీ దాదాపుగా వాడింది. అందులో, 'కొంద్రై పూలు ధరించేవాడు' అనేది కూడా ఒక విశేషణం. ఆ గుడి ప్రాంగణంలో మురుగన్ కోవెల కూడా చిన్నది ఉంది. ఈ మురుగన్ మీద కూడా అరుణగిరినాథులు కవిత్వం చెప్పారు అన్నారు అక్కడి అర్చకులు. (అరుణగిరినాథుల గురించి ముందు ముందు వివరంగా).

ఆ దేవాలయం గోడల మీద అప్పర్ కవిత్వం చెక్కి ఉంది. లోపల దేవుడికి హారతి ఇచ్చాక ఒక శివనడియార్ తేవారం గానం చేసాడు. శివాలయాల్లో తేవారం గానం చేసే ఆ గాయకులు తమని తాము 'శివన్ అడియార్లు'గా అంటే శివదాసులుగా పిలుచుకుంటారు.

తిరువామూరులోనే కొందరు దాతలు అప్పర్‌కి ఒక గుడి కట్టారు. అక్కడికి కూడా వెళ్ళాం. అక్కడ అర్చకులు అప్పర్ సంపూర్ణాశీర్వాదాన్ని నాకు అందచేసారు. ఆ మందిరంలో కొంతసేపు కూచున్నాం. అక్కడ స్థానికుడొకాయన నా చేతుల్లో మాణిక్యవాచకరుల 'తిరువాచకం' కానుకగా నా చేతుల్లో పెట్టాడు. ఆ తిరువాచకం చదవడానికేనా నేను తమిళం నేర్చుకోవాలి అనుకున్నాను. అక్కడ కూడా గోడల మీద అప్పర్ పదికాలు శిలాక్షరాలుగా రాసిపెట్టారు.

అప్పర్‌ది అత్యంత సంఘర్షణామయమైన జీవితం. అతడు ఏడవ శతాబ్దానికి చెందిన కవి. పుట్టడం ఒక శైవ కుటుంబంలో పుట్టాడు. అతడి పేరు మరుల్నీకియారు. అతడికి తిలకవతి అని ఒక అక్క కూడా ఉంది. ఆమెకి తల్లిదండ్రులు ఒక చక్కటి సంబంధం చూసారు. వివాహం నిశ్చయించారు. కాని, ఆ సమయంలోనే యుద్ధం తలెత్తింది. ఆ యువకుడు రాజు కోసం పోరాటానికి వెళ్ళి, అక్కడే మరణించాడు. ఆ మరణవార్త వినగానే కుమార్తె జీవితం ఏమైపోతుందోన్న చింతతో తల్లిదండ్రులిద్దరూ హఠాన్మరణం చెందారు. తనకి వివాహం నిశ్చయమయిందికాబట్టి, వివాహమయినట్టే భావించి తిలకవతి కూడా మరణించడానికి సిద్ధపడింది. కాని తమ్ముడు ఆమెని ప్రాధేయపడ్డాడు. 'నువ్వు కూడా వెళ్ళిపోతే నాకింక బతకడానికి దిక్కెవరు?' అని బతిమాలుకున్నాడు. ఆమె మరణప్రయత్నం పక్కన పెట్టేసింది. తమ్ముణ్ణి చూసుకుంటూ, దగ్గరలోనే ఉన్న తిరువాదికై వీరట్ఠానంలో వెలిసిన శివుణ్ణి కొలుచుకుంటూ బతకడం మొదలుపెట్టింది.

ఆ రోజుల్లో అప్పర్‌ని జైనం ఆకర్షించింది. అతడు కడలూరు దాకా వెళ్ళి శ్రమణసంఘాలతో కలిసి తిరిగాడు. జైన గ్రంథాలు అధ్యయనం చేసాడు. గొప్ప పాండిత్యం సంపాదించాడు. అతణ్ణి 'ధర్మసేనుడు' అని పిలవడం మొదలుపెట్టారు. కాని, అతడి సోదరికి తన తమ్ముడు శైవాన్ని వదిలి జైనంలోకి మరలడం ఇష్టంగా ఉండేది కాదు.

ఈ లోగా మరుల్నీకియార్‌కి చెప్పలేని ఒక శూల పుట్టింది. కడుపులో విపరీతమైన నొప్పి. భరించలేనంతగా అల్లల్లాడిపోవడం మొదలుపెట్టాడు. ఆ నొప్పికి తాళలేక చచ్చిపోదామనుకున్నాడు. ఒకరోజు అతడి సోదరి అతణ్ణి తిరువాదికై వీరట్ఠానం వచ్చి శివుణ్ణి ప్రార్థించమంది. అతడు ఆ నొప్పి తట్టుకోలేక శివుణ్ణి దర్శించగానే ఒక్కసారిగా ఆ శూలనుంచి బయటపడ్డాడు. కళ్ళనీళ్ళతో అతడు శివుణ్ణి ప్రస్తుతిస్తూ ఒక కవిత చెప్పాడు. ఆ క్షణమే తమిళ శైవభక్తి కవిత్వోద్యమంగా మారిపోయింది.

ధర్మసేనుడు శైవాన్ని స్వీకరించడం జైనులకి నచ్చలేదు. వారు పల్లవరాజు మహేంద్రవర్మన్‌కి పోయి ఫిర్యాదు చేసారు. అతడి మీద దాడి మొదలయ్యింది. హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుణ్ణి ఎన్ని బాధలు పెట్టాడో అన్ని బాధలూ అప్పర్ కూడా అనుభవించాడు. అతణ్ణి ఏనుగులతో తొక్కించారు. కాల్చిన సున్నపుబట్టీలో పడేసారు. మెడకి బండరాయి కట్టి సముద్రంలో విసిరేసారు. కాని, అతడు బతికాడు. శివానుగ్రహం వల్ల మాత్రమే బతికాననుకున్నాడు.

జైనం తనను పండితుణ్ణి మాత్రమే చేసిందనీ, తనను తనకి సన్నిహితుణ్ణి చేసే భావావేశం మాత్రం శివుడి సన్నిధిలోనే లభిస్తోందనీ అతడు భావించాడు. Intellec-

tualism కన్నా భిన్నమైన మానసిక అనుభూతి అతడికి కొత్త తలుపులు తెరిచింది. భావోద్వేగపూరితమైన ఈ కొత్త భక్తి అతణ్ణి వివశుణ్ణి చేసేసింది. అతడు దేవాలయం నుంచి దేవాలయానికి తిరుగుతూ శివస్తోత్ర సంకీర్తనం మొదలుపెట్టాడు.

కాని, తాను చూస్తున్నదాన్ని ప్రజలందరూ చూసేలా చెయ్యడానికి అతడు ఎంత తపిస్తున్నప్పటికీ, అతడి జైనసహవాసం వల్ల ప్రజలు అతణ్ణి నమ్మడానికి సిద్ధపడలేదు. అతడు శైవంలోకి మారినందువల్ల జైనులు కూడా అతణ్ణి అంగీకరించలేదు.

అసలు అప్పటి తమిళదేశమే అలా ఉండింది అని చెప్పాలి. అయిదారు శతాబ్దాలకు పూర్వం తమిళదేశాన్ని కలభ్రులనేవాళ్ళు పరిపాలించేవారు. సంగం సాహిత్యం మలిదశలోని నీతిగ్రంథాలు పుట్టిన కాలం అది. ఆ కాలం నుంచి తిరిగి మళ్ళా తొమ్మిదో శతాబ్దం తర్వాత చోళమహాసామ్రాజ్యం వర్ధిల్లేదాకా, ఆ మధ్యకాలమంతా దాదాపు మూడునాలుగు వందల ఏళ్ళపాటు తమిళ మానసిక స్థితి ద్రవరూపంలో ఉండింది. ఉత్తరతమిళనాడులో పల్లవులు దేవాలయాలు నిర్మిస్తూ, యుద్ధాలు చేస్తూ, జైనానికీ, శైవానికీ మధ్య ఊగిసలాడుతూ ఉండేవారు. వాళ్ళేమతాన్ని అనుసరించినా, దాన్నొక రాజమతంగా ప్రచారం చేసేవారు. ఆ రాజ్యానికి అంచుల్లో ఉన్న 'నడునాడు'లో రాజమతంతో సంబంధంలేని ఒక ప్రజామతం కూడా నడిచేది. రాజమతం (జైనంగానీ, శైవంగానీ) నిచ్చెనమెట్ల వ్యవస్థమీద ఆధారపడ్డది. వర్ణభేదాల్నీ, నిమ్నోన్నతాల్నీ ధిక్కరించే ధోరణి ప్రజామతంలో కనిపించేది.

తెలంగాణా జైనంలాగా, తొలిరోజుల్లో తమిళ జైనం కూడా ప్రజల పక్షం వహించింది. ఇప్పటి వామపక్షాల్లాగా ప్రజల్ని అక్షరాస్యుల్నీ, చైతన్యవంతుల్నీ చెయ్యాలని తపించింది. ఆ ప్రయత్నాల్లో చాలావరకూ సఫలమయ్యింది కూడా. కానీ, రాజమతం కావడం మొదలుపెట్టగానే ప్రజలకు దూరం కావడం మొదలయ్యింది. అప్పుడు ఆ స్థానంలో శైవం చేరి కొత్త భక్తి ఉద్యమానికి అంకురార్పణ చేస్తున్న సమయంలో అప్పర్ తలెత్తాడు.

పాండిత్యప్రకర్షలోని బోలుతనం బోధపడింది కాబట్టి, అతడు శైవాన్ని స్వీకరించగానే చేసిన పని శివదాసుడిగా మారడం. ఎక్కడ పాడుపడ్డ శివాలయాలు కనబడ్డా అక్కడికి పోయి, ఆ బూజు దులిపి, ముంగిలి శుభ్రం చేసి, పడిపోతున్న గోడలు నిలబెట్టి, ఏదో ఒక విధంగా సేవచేయడం మొదలుపెట్టాడు. అందుకనే తమిళనాడులో అప్పర్ విగ్రహాల్లోగాని, బొమ్మల్లోగాని, అతడి చేతిలో బొరిగె లాంటి ఒక పనిముట్టు కనిపిస్తుంది. దాస్యభక్తికి పరిపూర్ణమైన ఉదాహరణగా మారాడతడు.

తన జీవితంలో గడిచిన అనుభవాల వల్ల, కొత్తగా తలెత్తుతున్న ఒక ప్రజాచైతన్యానికి తాను వార్తాహరుడు కాగలడే తప్ప, నాయకుడు కాలేడని అతడు గ్రహించాడు. 'కొత్త

నిబంధన'లో బాప్తిస్మమిచ్చే యోహానులాగా, అతడు, రాబోతున్న ప్రవక్త గురించి ప్రజలకు చెప్పేవాడిగా మిగిలిపోడానికే ఇష్టపడ్డాడు. తమిళ శైవభక్తి ఉద్యమానికి అటువంటి ప్రవక్తగా అతడికి జ్ఞానసంబంధ నాయనారు కనబడ్డాడు. అందుకనే తన కన్నా దాదాపు అరవయ్యేళ్ళు చిన్నవాడయినప్పటికీ, ఒక పండితవివాదంలో జ్ఞానసంబంధనాయనార్ జైనుల మీద విజయం సాధించినప్పుడు, ప్రజలు అతడికి ఊరేగింపు చేసినప్పుడు, అప్పర్ తాను కూడా ఆ పల్లకీ మోసేడు. ఎనభయ్యేళ్ళ ఆ వృద్ధుడు తన పల్లకీ కోడు భుజాన మోపుకోగానే అత్యంత ఆదరంతో. పదహారేళ్ళ యువకుడు, సంబంధర్, అతణ్ణి 'అప్పరే' (నాన్నగారూ!) అని పిలిచాడు. అంతదాకా మరుల్నీకియార్‌గానో, ధర్మసేనుడిగానో తన identity ఏమిటో తనకే తెలియకుండా సంఘర్షణ పడుతున్న ఆ శివదాసుడు ఒక్కసారిగా తమిళ శైవభక్తిఉద్యమానికి పితామహుడిగా ప్రతిష్ఠితుడైపోయాడు.

అప్పర్ జీవితకాలంలో గానం చేసిన గీతాలు ఇప్పుడు 312 లభ్యమవుతున్నాయి. 3058 చరణాలు కలిగిన ఆ గీతాల్ని అతడు తమిళదేశమంతటా సంచరించి గానం చేసాడు. తేవారంలో 4, 5, 6 సంపుటాల్లో సంకలితమయిన ఆ గీతాలతో తమిళదేశంలో మొదలయిన భక్తి ఉద్యమం ఆ తర్వాత వెయ్యేళ్ళ పాటు మొత్తం భారతదేశాన్నంతటినీ ఒక వరదలాగా ముంచెత్తింది.

జ్ఞానసంబంధకి పరిచయమయ్యాక అప్పర్ ఆయనతో కలిసి చాలా దేవాలయాలు సందర్శించి కవిత్వం చెప్పాడు. కాని, అతడు సంధియుగానికి చెందిన కవి. పూర్తి పాండిత్యానికీ, పూర్తి భావావేశానికీ మధ్య పరివర్తన దశలో ఉన్నాడు. ఆ విషయం అతడికి తిరుమరైకాడు దేవాలయంలో అర్థమయింది. ఇప్పుడు వేదారణ్యంగా ప్రసిద్ధికెక్కిన, తిరుమరైకాడుకి, అప్పర్, సంబంధర్ ఇద్దరూ వెళ్ళినప్పుడు, అక్కడి దేవాలయ ప్రధానద్వారం మూసి ఉంది. 'మీరు స్తోత్రం చెయ్యండి, తలుపులు తెరుచుకుంటాయి' అన్నాడు సంబంధర్ అప్పర్‌తో. అప్పర్ ఒక పదికం గానం చేసాడు. తలుపులు కిర్రుమన్నాయిగాని, తెరుచుకోలేదు. అప్పుడు మరొక పాటకట్టి పాడేడు. తలుపులు పూర్తిగా తెరుచుకున్నాయి. అక్కడ చేరిన వాళ్ళ ఆశ్చర్యానికి అంతం లేదు. వాళ్ళు లోపల అడుగుపెట్టగానే తలుపులు మళ్ళా మూసుకుపోయేయి. లోపల దేవుణ్ణి కొలిచి మళ్ళా బయటకి వచ్చినప్పుడు, అప్పర్ సంబంధర్‌తో 'ఇప్పుడు గానం చెయ్యడం నీ వంతు' అన్నాడు. సంబంధర్ గొంతు సవరించుకుని మొదటి వాక్యం పలికాడో లేదో తలుపులు బార్లా తెరుచుకున్నాయి.

అలాగని, అప్పర్‌ని ద్వితీయశ్రేణి కవి అని భావించకూడదు. మహిమలుగా ప్రసిద్ధికెక్కిన ఈ గాథలు అత్యున్నత రూపకాలంకారాలు మాత్రమే. తిరుమరైకాడు దేవాలయ ద్వారాలు ప్రజాహృదయద్వారాలకి సంకేతం. శివుడి వైపు ప్రజల

హృదయాలు తెరుచుకోడానికి అప్పర్ పాట వెనక పాట పాడుతూనే ఉండవలసి వచ్చింది. కాని సంబంధర్‌కి ఆ అవసరం లేకపోయింది. ఆయన పెదవి విప్పగానే ప్రజాసమూహాలు మంత్రముగ్ధులైపోయారు.

అయితే, ప్రజాప్రతిస్పందనని బట్టి కవుల హెచ్చుతగ్గులు నిర్ణయించకూడదని అందరికన్నా ముందు శివుడికే బాగా తెలుసు. తమిళ శివుడు అద్భుతమైన శ్రోతమాత్రమే కాదు, తులనాత్మక సాహిత్యపరీక్షకుడు కూడా.

ఒకప్పుడు అప్పర్, సంబంధర్ ఇద్దరూ కూడా తిరువీలిమలలై అనే చోట బసచేసారు. అప్పట్లో అక్కడ గొప్ప కాటకం సంభవించింది. ప్రజల ఆకలి బాధ చూడలేక వాళ్ళకేదైనా సాయం చెయ్యమని అప్పర్ శివుణ్ణి ప్రార్థించాడు. శివుడు అతడికి కలలో కనబడి, దేవాలయ తూర్పు ద్వారం దగ్గర తవ్విచూడమన్నాడు, మర్నాడు అక్కడ తవ్విచూస్తే బంగారు కాసులు బయటపడ్డాయి. అప్పర్ వాటిని ప్రజలకు పంచిపెట్టి ఆహారధాన్యాలు కొనుక్కోమని చెప్పాడు. అది చూసి సంబంధర్ తాను కూడా పడమటి ద్వారం దగ్గరకి వెళ్ళి శివుణ్ణి ప్రార్థించాడు. అక్కడ ఆయనకి కూడా బంగారు కాసులు కనిపించాయి. వాటిని కూడా ఆయనకు ప్రజలకు పంచిపెట్టాడు. కాని, ఆ మర్నాడే వాళ్ళంతా ఆయన దగ్గరకి తిరిగి వచ్చి ఆ కాసులు చెల్లటం లేదని చెప్పి వెనక్కి ఇచ్చేసారు. సంబంధర్ శివుణ్ణి నిలదీసాడు: 'ఇద్దరం పాటలు పాడాం. కాని ఒకరికి బంగారు కాసులిచ్చావు, మరొకరికి చెల్లని కాసులిచ్చావు, ఇది అన్యాయం' అన్నాడు.

శివుడు సంబంధర్‌తో 'నువ్వు స్వయానా నా బిడ్డవి, సందేహం లేదు. కాని అప్పర్‌ది జీవితకాల సమర్పణ. అతడికి దొరికిన బంగారానికి లభించిన మారక విలువ అతడు తన చెమటోడ్చి సంపాదించుకున్నది. నువ్వింకా పసివాడివేనని మర్చిపోకు' అన్నాడు శాంతంగా.

# అతడు నరకాన్ని జయించాడు

**తి**రువామూరు దగ్గర అప్పర్ గుడిలో ఆశీర్వాదం లభించాక అక్కడివాళ్ళు మమ్మల్ని తిరువాదిగ్గై వీరట్టానం వెళ్ళమన్నారు . అక్కడి శివుణ్ణే అప్పర్ సోదరి తిలకవతి కొలుస్తూ ఉండేది, ఆమె వేడికోలు మీదనే అప్పర్ ఆ దేవాలయంలో అడుగుపెట్టి అక్కడి శివుణ్ణి నోరారా స్తుతించగానే అతణ్ణి పీడిస్తున్న కడుపునొప్పి ఒక్కసారిగా తొలగిపోయింది.

వీరట్టానం అంటే ఎనిమిది వీరస్థానాలు. శివపురాణం ప్రకారం శివుడు ఎనిమిదిమందితో యుద్ధం చేసి గెలిచినట్టు ఐతిహ్యాలున్నాయి. అంధకాసురుడు, త్రిపురాసురుడు, జలంధరుడు, గజాసురుడు వంటి రాక్షసులూ, దక్షుడూ, బ్రహ్మలతో పాటు ఆ ఎనిమిదిమందిలో అర్జునుడూ, మన్మథుడూ కూడా ఉన్నారు. అలా వీరావతారమెత్తిన శివుడికి ప్రాచీన తమిళదేశంలో ఎనిమిది శివాలయాలు నిర్మించారు. వాటిలో తిరువాదిగ్గై కూడా ఒకటి. దాదాపు రెండువేల ఏళ్ళుగా ఇక్కడ కొలువైన శివుడు త్రిపురాంతకమూర్తి. వీరట్టాన దేవాలయాల్లో ఉండేట్టుగానే తిరువాదిగ్గై దేవాలయంలో కూడా శివుడి చేతిలో విల్లంబులున్నాయి. ఆ దేవుడు వీరట్టానేశ్వరుడు. అతడి సహచరి త్రిపురసుందరి.

కెడిలం నది దాటి మేం తిరువాదిగ్గై చేరుకునేటప్పటికి ఆకాశమంతా మేఘాలు కాంతులీనుతూ ఉన్నాయి. ప్రకాశవంతమైన ఆ గగనం కింద ఆ పురాతన దేవాలయం కొత్త గాంభీర్యంతో మరింతగా ప్రకాశిస్తూ ఉంది. పల్లవకాలం నాటి ఆ శిల్పాన్ని అధ్యయనం చేయడానికి రాజరాజ చోళుడు అక్కడ కొన్నాళ్ళు బసచేసాడని కూడా చరిత్ర చెప్తోంది. ఆ నమూనానే అతడు బృహదీశ్వరాలయానికి వాడుకున్నాడట. అక్కడ లోపల గోడలమీద అప్పర్ కవిత్వం చెక్కి ఉంది.

మరీ ముఖ్యంగా, అతడి మొదటి కవిత, తనని బాధిస్తున్న దీర్ఘవ్యాధినుంచి బయటపడగానే అప్రయత్నంగా పలికిన కవిత, పాలరాతిమీద చెక్కి ఉంది. ఆ కవితలో (4:1) అతడు శివుణ్ణి 'తమిళ భాషలో పాటలు పాడుతూ నిన్ను స్తుతిస్తూ గానం చేయడం

ఎన్నటికీ మరవను' (తమిలోడిసై పాడల్ మరందరియేన్) అన్నాడు. ఆ గీతం విన్నప్పుడే శివుడు అతణ్ణి 'తిరునావుక్కరసు' (వాగీశుడు) అని ప్రశంసించాడు.

దాదాపు పద్నాలుగు శతాబ్దాల కింద, అక్కడ ఇప్పుడు నా ఎదట ఉన్న మహా దేవాలయం ఉండి ఉండదు. కాని ఆ తావుల్లో రేలపూల మాల ధరించి సంచరించే ఒక దైవాన్ని ఒక కవి చూసాడు. నోరారా కొలిచాడు. ఆ కవిత మటుకు మిగిలిపోయింది. ఆ దేవాలయం గోడలమీదా, ప్రజల నాలుకల మీదా కూడా.

నాయనారు కవిత్రయంలో అప్పర్ ది ప్రత్యేకమైన ధోరణి. ఒక పరిశోధకురాలు ఇట్లా రాస్తున్నది (The Sacred Landscape of Tamil Saivism: Plotting in the Realm of Devotion, Leslie C .Orr, Mapping the Chronology of Bhakti, 2014):

> 'శివుడు సంచరించే ప్రాకృతిక ప్రదేశాలమీద కన్నా అప్పర్ రాసిన 312 గీతాల్లోనూ దేవుడి గుణగణాల వర్ణన మీద ఎక్కువ దృష్టిపెట్టినట్టు కనిపిస్తుంది. విశ్వానికంతటికీ ప్రభువైనవాడు, అనాదిదేవుడు, సర్వాంతర్యామి, పరమశివుడు, సృష్టి, సంహారకారకుడు, సమస్త సృష్టి సత్యం, సారాంశం అయినవాడొకణ్ణి ధ్యానించడం కనిపిస్తుంది..ఎక్కడెక్కడ అప్పర్ ప్రాక ృతిక ద ృశ్యాల్నీ, స్థలాల్నీ వర్ణిస్తాడో, అక్కడ మనుషులూ, మానవకార్యకలాపమూ పెద్దగా కనిపించవు... (వివిధ దేవాలయక్షేత్రాల వర్ణన చేసే కవితల్లో) శివుడు నివసించే తావుల్నీ, సంచారస్థలాల్నీ ఉద్దేశించి కవిత్వం చెప్పినప్పటికీ, అక్కడ నిజంగా ప్రయాణిస్తున్నది ఆయన మనసు తప్ప శరీరం కాదని మనకి తెలియవస్తున్నది. ఇంకా చెప్పాలంటే, ఆ క్షేత్రాలనుంచి దేవుడే కవి దగ్గరకి ప్రయాణించి అతడి హృదయంలో కొలువుండటానికి సిద్ధపడుతున్నట్టు కనిపిస్తుంది. నిజానికి దేవుడు కొలువున్నది తన మనోమందిరంలోనే (అకంపతి) అని తేవారం లో (5:91:1) లో అప్పర్ స్పష్టంగా చెప్పేసాడు కూడా.'

ఒక్క జీవితకాలంలోనే శ్రమణుడిగానూ, శైవుడిగానూ జీవించిన అనుభవాల వల్ల, ఆ ఊగిసలాటలో అనుభవించిన సంఘర్షణవల్లా, ఎన్నోసార్లు మరణం అంచులదాకా పోయివచ్చిన శారీరిక యాతనలవల్లా అప్పర్ బతికుండగానే నరకాన్ని చూసేడు, ఆ నరకాన్ని దాటేడు కూడా. దీర్ఘకాలం పాటు ప్రజామోదం కోసం పరితపించి, చివరికి, ఆ పరిమితుల్ని దాటి ఒక అసీమిత నీలగగనం ముందు నిలబడ్డవాడి మానసికస్వాతంత్ర్యం అప్పర్ కవిత్వంలో అడుగడుగునా కనిపిస్తుంది. అందుకని ఆయన కవిత్వం నుంచి ఏదైనా ఒక కవిత మీతో పంచుకుందామనుకున్నప్పుడు, అన్నిటికన్నా ముందు, ఈ సుప్రసిద్ధ గీతం (6:98) గుర్తొచ్చింది నాకు.

ఈ గీతంలోని మొదటి వాక్యం 'నామార్కుజ్ కుడియల్లోం, నమనై యంజోం' (ఎవరికీ దాసులం కాము, మరణానికి వెరవం) ఎన్నో శతాబ్దాల తర్వాత దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయపోరాటకారుల నినాదంగా మారిపోయిందంటే ఆశ్చర్యమేముంది?

## చావుకి వెరవం, నరకంలో మగ్గం

### 1

ఎవరికీ బానిసలం కాము, చావుకి వెరవం, నరకంలో
మగ్గం, అబద్ధం తెలియదు మాకు, నిత్యసంతోషులం.
వ్యాధిరహితులం, ఎవరికీ తలవంచం, సదానందులం.
దుఃఖం లేదు మాకు, శంకరుడు మా ఆత్మబంధువని
తెలుసుకున్నాం, ఒక చెంప ముత్యాల చెవికమ్మ తొడిగినవాడు
చక్రవర్తి, రాజాధిరాజు, అతడిచరణాల నీడచేరుకున్నాం.

### 2

సమస్తభూమండలం మా సొంత ఇల్లు, ఎక్కడ చూడు, తమకోసం
ఇంత వండుకుని పదిమందికీ ఇంత భిక్షపెట్టేవాళ్ళున్నంతకాలం
మాకుతిండికి లోటులేదు, పదిమందీ ఎక్కడ కూడుకుంటే అదే మా చోటు.
మేమీ కటిక నేలమీద కాళ్ళు చాపి పడుకుంటే, నేలతల్లి
మమ్మల్నేమీ పక్కకు నెట్టెయ్యదు, కల్లలాడటం తెలియనివాళ్ళం.
నిజంచెప్పడమొక్కటే తెలిసినవాళ్ళం కాబట్టే
వృషభవాహనుడు మమ్మల్ని చేరదీసాడు, మాకింక కొరతలేదు.
కలతలేదు, రాజవస్త్రాలూ, స్వర్ణాభరణాలూ ధరించినవాళ్ళ మాటలు
మేమెందుకు వింటాం? ఎంచి చూపడానికి మాకు మచ్చ లేదు.

### 3

రుద్రుడి దాసానుదాసులే మా బంధువులు, మాకున్నదల్లా కౌపీనం
అంగవస్త్రం, నిత్యకోపిష్ఠులకి కూడా మాపట్ల కోపం పుట్టదు, శత్రులు
కూడా మమ్మల్ని చూస్తే మిత్రులవుతారు, మాకు పునర్జన్మలేదు.
బంగారానికి తావి అబ్బినట్టు పరిమళించే రేలపూలమాల ధరించినవాడు,

మకరధ్వజుణ్ణి కూడా తనమూడోకంటితో బూడిదచేసినవాడెవడో
అతడిస్వజనం మేం, అతడి పరిచారకులం, దాసానుదాసులం.

4

మమ్మల్నెవరూ ప్రలోభపరచలేరు, ఈ విశాలధరణిమీద మాకు
సమానులు లేరు, ప్రాప్తశివచరణులం, చిల్లరదేవుళ్ళకు మొక్కం.
దారితప్పినవాళ్ళ దారి వదిలిపెట్టినప్పుడే మాకు దారిదొరికింది.
ఇప్పుడు మాకేమీ తక్కువలేదు, తన గళసీమన కపాలమాల
ధరించినవాడెవడో అతడి సహవాసపుణ్యం ముంచెత్తింది మమ్మల్ని.

7

ఎవరు స్థావరరూపుడో, ఎవరు జంగమరూపుడో, ఎవరు భూమినో
జలం, అగ్ని, వాయువు, అనంతాకాశమో, ఎవరు కనిష్ఠుడో
ఎవరు జ్యేష్ఠుడో, ఎవరు అద్వితీయుడో అతణ్ణి ప్రేమించేవాళ్ళందరికీ
తన ప్రేమ పంచుతాడు. అతడే తత్పరుడు, సదాశివుడు.
తనకు తానుగా ఉన్న అతడే నేనై కూడా ఉన్నాడు.
అతడి గురించే మేం నోరారా స్తుతించేది, మాట్లాడేవాళ్ళు
ఏమైనా మాట్లాడనీ, ఎంచిచూపడానికి మాకు మచ్చ లేదు.

# దీన్నే మనం కవిత్వమంటాం

**సుం**దరర్, అప్పర్‌లు పుట్టిన ఊళ్ళు చూసే అవకాశం కలిగేటప్పటికి, సంబంధర్ జన్మస్థలం కూడా చూడాలనిపించడం సహజమే కదా. ఆ మర్నాడు సెలవురోజు కావడంతో సంబంధనాయనార్ పుట్టిన శీర్‌గాళి వెళ్ళాలని అనుకున్నాను.

అక్కడికి వెళ్ళాలంటే చిదంబరం మీంచి వెళ్ళాలనీ, ఆ వంకన చిదంబరం చూసే అవకాశం కూడా ఉందనీ తెలియడంతో నా సంతోషానికి హద్దులేదు. చిదంబరం అనే మాట వింటేనే చాలు, మనసులో ఏవో స్పందనలు ఊటలూరడంతో పాటు, చాలా ఏళ్ళకిందట, ఆత్మీయమిత్రుడు, శిల్పి, రవీంద్రకుమార శర్మ నటరాజ మూర్తి గురించి చెప్పిన మాటలు కూడా గుర్తురావడం మొదలుపెట్టాయి.

ఎన్నో ఏళ్ళ కిందట, ఒక విద్యాసదస్సులో డా.సుజాత నాకొక నటరాజమూర్తి కాంస్యవిగ్రహాన్ని కానుక చేసారు. నేను రోజూ నా రాతలు టైపు చేసుకునే కంప్యూటరు బల్ల మీద అ నటరాజమూర్తిని పెట్టుకున్నాను. నా సృజనాత్మక భావోద్వేగాలన్నిటికీ ఆ నటమూర్తి సాక్షి. ఇప్పుడు ఆయన్ని చిదంబరం దేవాలయంలో ప్రత్యక్షంగా చూడబోతున్నానన్న ఊహ నన్ను ఉద్విగ్నుణ్ణి చేసింది.

విల్లుపురంలో ప్రస్తుతం ఒక అసిస్టెంటు కలెక్టరు శిక్షణ పొందుతున్నాడు. అతడి పేరు శివకృష్ణమూర్తి. తమిళనాడుకి చెందిన యువకుడు. అతడు తనకి చిదంబరంలో తెలిసినవాళ్ళు ఉన్నారనీ, నాతో పాటు వచ్చి దర్శనం దగ్గరుండి చేయిస్తాననీ నా కూడా వచ్చాడు. మేము పొద్దున్నే ఎనిమిదింటికి బయల్దేరి చిదంబరం వెళ్ళేటప్పటికి పదిన్నర కావొస్తూంది. దేవాలయ ప్రాంగణంలో అడుగుపెట్టగానే నేనొక అసాధారణమైన స్థలంలో ప్రవేశించానని అర్థమయింది.

లోపల శ్రీకాళహస్తిని తలపించే శిలామంటపాల గుండా, స్తంభాల పక్కన, భక్తసందోహం మధ్యగా గర్భాలయం చేరుకున్నాం. మాకోసం అక్కడ వేచి ఉన్నవారు మమ్మల్ని ముందుగా గోవిందరాజ స్వామి కోవెలలోకి తీసుకువెళ్ళి, దర్శనం చేయించారు.

అక్కడ, ఆ మంటపం కేంద్రంలో నిల్చుని, అక్కడి స్థానిక అర్చకుడు, 'చూడండి, శివకేశవులిద్దరినీ ఒక్కచోటనుంచే దర్శించుకోదగ్గ స్థలం ఈ ప్రపంచంలో ఇదొక్కటే' అన్నాడు. అక్కణ్ణుంచి శయనగోవిందరాజస్వామి ఎదురుగా, లంబకోణంలో, నటరాజ మూర్తి. కాని, నన్ను మరింత సంభ్రాంతపరిచిన క్షణాలు ముందున్నాయి.

మేమక్కణ్ణుంచి కిందకు దిగి, కనకసభామంటపం ముందు నిలుచున్నాం. అప్పుడక్కడ శివుడికి అభిషేకం జరుగుతుందనీ, అభిషేకం తర్వాత దర్శనమనీ అక్కడి అర్చకుడు చెప్పాడు. ముందు స్ఫటికలింగానికీ, తర్వాత నటరాజమూర్తికీ అభిషేకం జరుగుతుందనీ, ఆ తర్వాత దర్శనముంటుందనీ అంటో, 'ఇక్కడ మీకు రూపం, అరూపం రెండూ దర్శనమవుతాయి' అన్నాడు.

ఆ అభిషేకమంటపం ముందు అప్పటికే భక్తులు చేరుకుంటూ ఉన్నారు. మేము కూడా అక్కడ నిల్చున్నాం. సుమధురం, నిర్మలం అయిన సుగంధమేదో గాల్లో తేలివస్తోంది. బహుశా కర్పూరం, చందనాల కలయిక వల్ల కావచ్చు, ఆ సురభిళం చల్లగానూ, మృదువుగానూ నేరుగా నా మనసుని తాకుతోంది. ఆ మంటపంలో అర్చకుడు ఒక స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తూ ఉన్నాడు. ముందు నమకం పారాయణ చేసాడు. ఆ తర్వాత చమకం. ఇత్తడికళశాలతో నీళ్ళు, పాలు, పెరుగు, తేనె, చక్కెరలతో ఆ లింగాన్ని రసప్లావితం చేసాడు. మరీ ముఖ్యంగా తేనెతో అభిషేకం చేస్తున్నప్పుడు నా కళ్ళముందు కోటిపూలమకరందాన్ని కుమ్మరిస్తున్నట్టనిపించింది. అప్పుడు ఒక క్షణం పాటు తెరవేసారు. మళ్ళా తెరతీసేటప్పటికి అక్కడ ఆ లింగం పైన అన్నం కుమ్మరించి ఉంది. అంటే అన్నాభిషేకం జరిగిందన్నమాట.

అట్లా లింగాభిషేకం పూర్తయ్యాక, మళ్ళా నిర్మలోదకాలతో మరొక్కసారి స్నానం చేయించాడు. శుభ్రమైన వస్త్రాలతో ఆ రసార్ద్రమూర్తిని మృదువుగా తుడిచాడు. అప్పుడు దాన్ని ఒక పేటికలో భద్రపరిచాడు. ఇప్పుడు ఆ స్థానంలో ఒక నటరాజమూర్తిని ప్రతిష్ఠించాడు. మళ్ళా పంచామృతాలతోనూ ఆ నటరాజమూర్తిని అభిషేకించాడు. ఎన్ని శతాబ్దాలుగా ఆ అభిషేకప్రియుడట్లా ఆ ప్రేమామృతస్నానంలో తడిసిపోతూ ఉన్నాడో కదా అనిపించింది. అప్పుడు ఆ మూర్తికి హారతి చూపించాడు. మొదట ఆ హారతి ఆ మూర్తికి ముందువైపు చూపించాడు. అప్పుడు ఆ హారతినే ఆ మూర్తికి వెనకవైపు తీసుకువెళ్ళి హారతిచ్చాడు. అసాధారణ హారతి. వెనకనుంచి వెలుగుతున్న కర్పూరజ్వాల కాంతిలో ఆ నటరాజమూర్తి జాజ్వల్యమానమైన దీపకళికలాగా గోచరించాడు. వెనక వైపు సంచలిస్తున్న ఆ దీపస్ఫూర్తినేపథ్యంగా ఆ నటమూర్తి నాట్యం కూడా కలిసి అది రెండు జ్యోతులు పెనవేసుకుని నాట్యం చేస్తున్నట్టుగా అనిపించింది. అటువంటి హారతి

దృశ్యం చిదంబరం ప్రత్యేకత అనీ, అది కూడా ప్రతి రోజూ ఆ వేళకి మాత్రమే జరుగుతుందనీ ఆ తర్వాత తెలిసింది.

పూజ పూర్తయింది. అప్పుడు మంటపం ముందుకి వచ్చి నిల్చున్నాం. అక్కడ ఆ గర్భాలయంలో ప్రధానమూర్తికి, ఆ నటరాజమూర్తికి, మహా హారతి మొదలయ్యింది. ఒక్కసారిగా తాళాలు, శంఖాలు, మద్దెలలు, వెయ్యి సంగీత వాద్యాలు మోగుతున్నంత మంగళధ్వని వినిపించింది. ఆ తుములధ్వనిమధ్యనే దేవుడికి హారతిచ్చారు. ఇంతలో ఒక్కసారిగా అక్కడున్నవాళ్ళందరిలోనూ ఏదో కోలాహలం. అంతా ముందుకీ, వెనక్కీ తోసుకోవడం మొదలుపెట్టారు. నా పక్కనున్న శివకృష్ణమూర్తి నా చేయిపట్టుకుని పక్కకు లాగి, 'అదిగో చూడండి' అంటున్నాడు. కాని అతడేమి చూపిస్తున్నాడో నాకు అర్థం కాలేదు. ఈలోగా భక్తజనం మరొక్కసారి తుళ్ళిపడ్డారు. శివకృష్ణమూర్తి నన్ను మరొక్కసారి పక్కకు లాగి, 'అదిగో ఆ తెర వెనక చూడండి' అంటున్నాడు. నేను అతడివైపు కాకుండా ఎడమపక్కకి జరిగి, ఆ తెరవైపు చూస్తూండగా, మరొక్కసారి అర్చకులు ఆ తెర పక్కకి లాగారు. అక్కడ నాకేమీ కనిపించలేదు. కాని మరుక్షణంలో వెనక ఏదో కిటికీ ఉన్నట్టూ, ఆ కిటికీ కంతల్లోంచి బంగారు కాంతి ముందుకు పడుతున్నట్టూ అనిపించింది. అప్పుడు గుర్తొచ్చాయి నాకు, మేమక్కడికి వచ్చినప్పుడు, ఆ అర్చకుడు చెప్పిన మాటలు. నా కళ్ళముందు పరిమళాలతో, మంగళవాద్యాలతో, సంగీతంతో, రంగుల్తో కూడిన ఒక రూపసౌందర్యం, ఆ వెనువెంటనే నా మనసుని క్షణం పాటు మటుమాయం చేసిన అరూపసౌందర్యం కూడా సాక్షాత్కరించిందని అర్థమయింది. నేనేమి చూసానో, నాలో ఏ స్పందన కలిగిందో పోల్చుకునేలోపలనే నా పక్కన నిల్చొన్న ఓదువార్లు, శివనడియార్లు గొంతెత్తి తేవారం గానం చేయడం మొదలుపెట్టారు. శ్రీశైలంలో మల్లికార్జునస్వామి ముందు సంధ్యాహారతి, భ్రమరాంబా దేవి చరణాల దగ్గర సంధ్యాహారతీ తరువాత జరిగే కొలువూ, రెండూ నేనొక్కచోటనే వెనువెంటనే చూసినట్టుగా అనిపించింది.

హారతి ముగియగానే మమ్మల్ని పైకి పిలిచారు. లోపల దగ్గరనుంచి స్వామి దర్శనం చేయించారు. నిండుగా నవ్యకౌశేయవస్త్రధారుడిగా ఉన్న ఆ మూర్తిలో నాకు పరిచయమైన నాట్యభంగిమలు వెతుక్కోడం మొదలుపెట్టాను. అక్కడున్న ఆ రెండు క్షణాలూ ఆ పాదాలమీద కదా దృష్టి పెట్టవలసింది. కాని, ఆ నాదాంత నర్తన చరణాలెట్లా ఉంటాయో అని ఊహిస్తూండిపోయాను. ఆ పక్కన అమ్మవారు. ఆయన నటరాజు, ఆమె శివకామసుందరి. అర్చకులు ఆశీఃమంత్రాలు పలుకుతూ స్వామివారి శేషవస్త్రాన్ని నా భుజాలచుట్టూ కప్పారు. భువనైకమోహన నర్తనమూర్తి వంటిని చుట్టుకున్న ఆ వస్త్రం నా భుజాలమీద కప్పారని తెలియగానే నాలో ఏదో చిరకాలంలో చిక్కుపడ్డ ముడి ఒకటి దానికదే ఊడిపోయిందనిపించింది.

## 2

చిదంబరం ప్రపంచ హృదయస్థానంలో ఉందని స్థలపురాణం. ఆ కోవెల అక్కడ ఎప్పుడు వెలిసిందో ఎవరూ ఇతమిత్థంగా చెప్పలేరు. ప్రాచీన తమిళదేశంలో ఆ ఊరుని 'తిల్లై' అని పిలిచేవారు. తిల్లై అంటే మడ అడవి. కడలూరు జిల్లాలో ఉన్న చిదంబరమంతా ఒకప్పుడు మడ అడవి. ఆ అడవిలో ఆ దేవుడక్కడ ఎందుకు వెలిసాడో, కాలక్రమంలో ఆయన తమిళశైవానికి కేంద్రంగా ఎట్లామారిపోయాడో ఊహించడం కష్టం.

నాయనార్లు తాము ఏ దేవాలయానికి వెళ్ళి పాటలు పాడినా ఆ దేవుణ్ణీ, ఆ కోవెలనీ పేరుపెట్టి వివరంగా ప్రస్తావిస్తారు గాని, చిదంబరం దగ్గరికి వచ్చేటప్పటికి మాత్రం వినమిత గళాలతో 'కోయిల్' అని మాత్రమే అంటారు. మరెన్ని దేవాలయాలైనా ఉండవచ్చుగాక, మరెన్ని శివాలయాలైనా ఉండవచ్చుగాక, 'కోయిల్' అంటే చిదంబరం ఒక్కటే.

ఆ విషయం నాకు అంతకు రెండురోజులముందే అర్థమయింది. తిరువెణ్ణైనల్లూరు కోవెలలో సుందరమూర్తి గీతాన్ని గానం చేసేముందు ఆ భక్తురాలు ఒక క్షణం తన కళ్ళు మూసుకుని 'తిరుచిట్రంబలం' అని అంది. అంటే ఏమిటని అడిగాను. తిరుచిట్రంబలం అంటే చిదంబరం అనీ, చిదంబరాన్ని స్మరించకుండా ఎవరూ ఎక్కడా తేవారం నుంచి ఒక్క వాక్యం కూడా పలకరనీ చెప్పారు అక్కడ ఉన్నవాళ్ళు. మహ్మదీయులు ప్రపంచంలో ఎక్కడ ఉన్నా , సర్వేశ్వరుణ్ణి తలుచుకునేటప్పుడు, మక్కా వైపు తిరిగినట్టుగా, తమిళశైవులు చిదంబరం వైపు తిరుగుతారు. ఒక్క మాటలో చెప్పాలంటే, చిదంబరం తమిళ శైవానికి ఆధ్యాత్మిక రాజధాని.

'అదిగో చూడండి ఆ బంగారు గోపురం. ఇప్పుడందరూ దేవాలయ గోపురాలకి బంగారు తాపడం చేయిస్తున్నారు. కాని ఈ దేవాలయానికి వెయ్యేళ్ళ కిందటనే రాజరాజచోళుడు బంగారు తాపడం చేయించాడు. అందుకనే ఈ దేవాలయం పొన్నంబళం' కూడా అన్నారు మాకు ఆ గుడిచూపిస్తున్న స్థానికులు.

ఒకప్పుడు రాజరాజచోళుడి ఆస్థానంలో ఎవరో తేవారం నుంచి ఒకటి రెండు గీతాలు పాడారట. వాటిని మొదటిసారి వినగానే ఆ చక్రవర్తి ముగ్ధుడైపోయాడు. 'ఇవి ఎక్కడ దొరుకుతాయి?' అనడిగాడు. ఆ గీతాల తాళపత్రాలు చిదంబరం దేవాలయంలో ఒక గదిలో ఉన్నాయన్నారు వాళ్ళు. 'అయితే పోయి తెచ్చుకుందాం' అన్నాడాయన ఉత్సాహంగా. 'అదంత సులభం కాదు ప్రభూ, ఆ ముగ్గురు నాయనార్లూ కలిసి వస్తే తప్ప ఆ తాళపత్రాల్ని బయటికి తీయమంటున్నారు ఆ దేవాలయ అర్చకులు' అన్నారు వాళ్ళు. ఆ ముగ్గురు నాయనార్లనీ ఎక్కణ్ణుంచి తీసుకురావడం? వారంతా గతించి

అప్పటికి మూడు శతాబ్దాల పైనే గడిచిపోయింది! కాని రాజరాజ చోళుడు పట్టు విడవలేదు. ఆయన మూడు పల్లకీలు తెప్పించాడు. అందులో ఒక్కొక్కదానిలో ఒక్కొక్క నాయనారులవీ కాంస్యప్రతిమలు కూచోబెట్టాడు. ఆ పల్లకీలతో చిదంబరం వెళ్ళాడు. 'ఇదిగో, ముగ్గురు నాయనార్లూ కలిసి వచ్చారు, తాళపత్రాలు బయటికి తియ్యండి' అన్నాడు. తలుపులు తెరిచి చూస్తే అప్పటికే చాలా తాటాకుల్ని చెదలు తినేసాయి. ఆ మిగిలినవాటినే అతడు నెత్తిన పెట్టుకుని చిదంబరం వీథుల్లో ఊరేగాడు. అక్కడితో ఆగలేదు, తన ఆస్థానంలో ఉన్న నంబియాండర్ నంబి అనే పండితుడితో వాటిని సంకలితం చేయించాడు. ఈ రోజు మనకి దక్కిన తేవారం మొదటి రాజరాజచోళుడి చలవవల్ల దక్కింది మాత్రమే. అందుకనే ఆయన తమిళ స్మృతిలో 'తిరుముఱై కొండాన్ చోళన్' (దివ్యగీతాల్ని తీసుకొచ్చిన చోళుడు) గా మిగిలిపోయాడు.

ముగ్గురు నాయనార్లకీ చిదంబరం దివ్యస్థలమే అయినప్పటికీ, మొత్తం తేవారంలో వారు ముగ్గురూ చిదంబరం మీద చెప్పిన గీతాలు పదకొండు మాత్రమే. బహుశా వినయంవల్ల, నోరుపెగలని దివ్యపారవశ్యం వల్ల మాత్రమే వారు ఆ క్షేత్రం గురించి విస్తారంగా గానం చెయ్యలేదనుకోవాలి.

## 3

**మేం** చిదంబరం నుంచి శీర్‌గాళి వైపు వెళ్తుండగా శివకృష్ణమూర్తి నాతో స్విజర్లాండులోని సెర్న్ ఇన్‌స్టిట్యూట్ ముఖద్వారం దగ్గర నటరాజమూర్తి విగ్రహం ప్రతిష్ఠించి ఉన్నసంగతి ప్రస్తావించాడు. నటరాజమూర్తి నృత్యాన్ని sub atomic పదార్థ చలనంతో పోల్చడం కొంత ఆసక్తి కలిగించే మాట నిజమే గాని, నాకు అంతకన్నా కూడా ఆనంద కుమార స్వామి రాసిన The Dance of Shiva (1918) గుర్తొచ్చింది. నటరాజమూర్తి గురించి ప్రపంచవ్యాప్త జిజ్ఞాస రగిలించిన వ్యాసమది.

అందులో ఆయన ఇలా రాస్తున్నాడు:

> '..(అసలు ఈ శివనటరాజమూర్తిని) సంభావించడంలోనే విజ్ఞానశాస్త్రమూ, కళాసృష్టీ, మతావేశమూ విడదీయలేనంతగా సమ్మిళితమయ్యాయని చెప్పవలసి ఉంటుంది. అసలు ఇటువంటి ఒక మూర్తిని సంభావించి, ఆ భావనకొక రూపాన్నిచ్చి, తద్వారా జీవితకణజాలాన్నీ, ప్రకృతితత్త్వాన్నీ అర్థం చేసుకోవడానికొక తాళం చెవిని మన చేతుల్లో పెట్టిన ఆ ఋషి-కళాస్రష్టల సహృదయ విస్తృతి, భావనాసంపద ఎటువంటిదో తలుచుకుంటే ఆశ్చర్యం కలగకుండా ఉండదు. అది కూడా ఎటువంటి సృష్టి అని! ఏదో ఒక జాతినో లేదా ఏదో ఒక శతాబ్దానికి

చెందిన భావుకుల్నో మాత్రమే తృప్తిపరచడం మీద దృష్టిపెట్టింది కాదు. సమస్త యుగాలకూ, సమస్త దేశాలకూ చెందిన చింతకుల్నీ, ప్రేమికుల్నీ, కళాకారుల్నీ కూడా సమ్మోహపరచగలిగే సృష్టి. జీవితం తమ అగాధమానసాల్లో తమకి అందిస్తూన్న అవ్యక్తస్ఫురణలకి రూపాన్నివ్వాలని తపించే కళాకారులందరికీ ఈ నటరాజమూర్తి ఎంత శక్తిమంతంగా, ఎంత కృపామయంగా దర్శనమిస్తూ ఉంటుందో కదా.

ఏదో ఒక శాఖలోనే ప్రత్యేక నైపుణ్యాన్ని పెంపొందించుకోడం మీదనే దృష్టి పెట్టే ఇప్పటికాలంలో, మనకి ఇటువంటి భావనాసమగ్రత అంత తేలిగ్గా అందేది కాదు. కాని, ఇటువంటి మూర్తిని ఎవరు 'దర్శించారో'వారికి జీవితమూ, ఆలోచనా రెండు విడి విడి అంశాలుకావనీ, వాళ్ళ జీవితానుభవంలో ఆ రెండింటి మధ్యా ఎటువంటి సరిహద్దూ లేదని గుర్తుపెట్టుకోవాలి...

ఈ శిల్పంలోని ప్రతి ఒక్క భాగమూ కూడా ఏదో మూఢవిశ్వాసాన్నో, పిడివాదాన్నో కాక ప్రత్యక్షానుభవాన్నే నేరుగా ప్రకటిస్తున్నది. దృశ్యప్రపంచపు సీమకి ఆవల వెలుగుతున్న శక్తిస్వరూపాన్ని సైన్సు మనకి వివరిస్తున్న ఈ రూపాన్ని, నాకు తెలిసి మన కాలపు ఏ చిత్రకారుడూ కూడా, అతడెంత గొప్ప కళాకారుడుగానీ, ఇంత నిర్దుష్టంగా, ఇంత మెలకువతో చిత్రించలేదని చెప్పగలను. కాలాన్నీ, కాలాతీతమైన అనంతాన్నీ మనం సమన్వయించ దలుచుకుంటే అవిరళాకాశస్థలంలో మహాయుగాల వ్యవధిలో, కాలం, కాలాతీతం ఒకదానివెనక ఒకటి సంచలిస్తుండే దృశ్యాన్ని ఊహించడమొక్కటే మనం చేయగలిగింది. మరీ ముఖ్యంగా ఆ కాలమహాయుగాల పరిభ్రమణాలు ఢమరుక నాదాలుగానూ, అవి ఒకదానివెనక ఒకటి మారుతున్నప్పుడు, ఆ 'అగ్ని' రూపాంతరం చెందిస్తున్నదే తప్ప, విధ్వంసం చేయడం లేదనీ మనం గ్రహించకుండా ఉండలేం. కాలాన్ని మనం బ్రహ్మకి చెందిన దివారాత్రాలుగా చెప్పుకుంటున్న భావానికి ఈ శిల్పం ఒక దృశ్యప్రతీక.

బ్రహ్మ నిదురిస్తున్న ఆ రాత్రి వేళ, శివుడు నర్తనానికి పూనుకోకపోతే ప్రకృతి కేవలం జడప్రాయురాలు మాత్రమే. అప్పుడు శివుడు తన దివ్యపారవశ్యం నుంచి పైకి లేచి చరణాలు కదిలించగానే, ఓహో, అంతదాకా జడప్రాయంగా పడి ఉన్న పాదార్థిక ప్రపంచమంతా ఒక్కసారిగా శబ్దతరంగాల్లోకి మేల్కొంటుంది. అప్పుడు భౌతిక ప్రపంచం కూడా ఆయన వైభవరూపంగా మారి ఆయనచుట్టూ పరిభ్రమిస్తూ నాట్యం చేయడం మొదలుపెడుతుంది. నృత్యం చేస్తూన్నంతసేపూ ఆయన పాదార్థిక, ప్రాకృతిక ప్రపంచపు సహస్రదృశ్యాలకీ ఆలంబనగా నిలబడతాడు. పూర్ణకాల వ్యవధిలో, ఆయన నృత్యం కొనసాగిస్తూనే, అన్ని

నామరూపాల్నీ తన అగ్నితో దహించి పారేస్తూ కొత్త విశ్రాంతిని ప్రసాదిస్తాడు. దీన్నే మనం కవిత్వమంటాం. అదే సమయంలో ఇది సైన్సు కూడా.

అన్ని రకాల సందేహవాదుల్నీ, అనాది కాలం నుంచీ విశ్వాసాల్ని నమ్మే విశ్వాసులందర్నీ, 'క్షుద్రరేణుకణం నుంచి మహామేరునగం వరకూ' అనంత, అవిభాజ్య సత్యాన్ని అన్వేషించేవాళ్ళందర్నీ, ప్రతి ఒక్కర్నీ తరతరాలుగా నటరాజమూర్తి ఆకర్షిస్తూనే ఉన్నది. ఆ నిశ్చల నటరాజమూర్తికి మనమెప్పటికీ ఆరాధకులుగా కొనసాగుతూనే ఉంటాం.'

# శివపాదముద్రలు వెతుక్కున్నాను

ఎలక్ట్రానిక్ వోటింగ్ మెషీన్లని తిరిగి గోడౌన్‌కి చేర్పించి జిల్లా యంత్రాంగం నా ఎదురుగా గోడౌన్‌కి సీలు వేసేటప్పటికి రాత్రి పదకొండయింది. అక్కడితో ఎన్నికల పరిశీలకుడిగా నా బాధ్యత పూర్తయింది. ఇంతదాకా ఎప్పుడూ ఏ స్థాయిలోనూ ఎన్నికల బాధ్యతనిర్వహించి ఉండని నాకు ఎన్నికల ప్రక్రియని చాలా దగ్గరగానూ, ఎన్నికల సంఘం ప్రతినిధిగానూ చూసే అవకాశం లభించడం ఒక లెర్నింగ్ ఎక్స్ పీరియన్స్.

ఈ నాలుగు వారాలూ విల్లుపురం కేంద్రంగా నేను రెండు తమిళనాడుల్లో సంచరించాను. ముఖ్యంగా ప్రాచీన, మధ్యయుగాలనాటి దేవాలయాలు, కవులు, కవిత్వాలు, దేవీదేవతల స్మరణలో, స్ఫురణలోనూ జీవించాను. అత్యంత సూక్ష్మమైన ఆ ప్రపంచం ఇక్కడ నాకు ఇంకా సజీవంగానూ, ఒక అవిచ్ఛిన్న సంస్కృతిగానూ గోచరించింది. అత్యంత ప్రాచీన కాలంలో సంగం కవులు చూసిన, చిత్రించిన, వర్ణించిన ఆ అయిదురకాల ప్రాకృతిక సీమలూ, కొండలూ, అడవులూ, పొలాలూ, ఊషరక్షేత్రాలూ, సముద్రతీరమూ, వాటి మధ్య వికసించిన ఒక మానవజీవితం, ఆ మనిషి అంతరంగంలో సాక్షాత్కరించిన దివ్యజీవనం-రెండింటినీ ఇక్కడ అనుభూతి చెందగలిగాను.

ఆ మధ్య ఒక అమెరికన్ యాత్రికుడు ప్రాచీన కాలపు చీనాకవుల అడుగుజాడల్ని వెతుక్కుంటూ చైనాలో సంచరించి తన అనుభవాల్ని యాత్రాకథనంగా రాసిన ఒక పుస్తకం గురించి నేను గతంలో పరిచయం చేసాను. ఇప్పుడు ఇక్కడ నేను కూడా ప్రాచీన, మధ్యయుగాల, ఆధునిక తమిళ సాహిత్యాన్ని పరిపుష్టం చేసిన కవుల తోనూ, కావ్యాలతోనూ గడిపాను. తమిళాన్ని ఒక భాషగా, ఒక సంస్కృతిగా రూపొందించిన సాహిత్యనిర్మాతలు ఎక్కడెక్కడ సంచరించారో ఆ తావుల్ని ఉత్తర, మధ్య తమిళనాడుల్లో కొంతమేరకు పోల్చుకోగలిగాను.

ముఖ్యంగా శివకవుల అడుగుజాడల్నీ, శివపాదముద్రల్నీ వెతుక్కున్నాను. కారైక్కాల్ అమ్మయ్యార్, తిరుమూలార్ లతో పాటు అప్పర్, సుందరమూర్తి, తిరుజ్ఞాన సంబంధర్, తిరునీలకంఠ నాయనార్, నందనార్లను పదేపదే తలుచుకున్నాను. మాణిక్యవాచకర్,

అరుణగిరినాథులతో పాటు, తొలి ఆళ్వారులు పాశురాలు ప్రకటించిన తావులో కూడా అడుగుపెట్టాను. సంగం కాలం నాటి మహాకవి కపిలార్‌నూ, స్వర్గానికి తొందరగా వెళ్ళడం కోసం దేవుడికి తొందరతొందరగా పూజచేసిన అవ్వయ్యార్‌నూ కూడా తలుచుకున్నాను. త్యాగరాజ స్వామి, యు.వి.స్వామినాథ అయ్యర్, వళ్ళల్లార్ రామలింగ అడిగలార్, అరవిందులు, సుబ్రహ్మణ్యభారతి, రమణమహర్షి, స్వామి జ్ఞానానంద సంచరించిన తావుల్లో అడుగుపెట్టి వారికి నివాళులు అర్పించాను. తిరువళ్ళువర్, కంబర్, మలికాలపు ఆళ్వారులూ, తాయిమానవర్, మాణిక్యవాచకర్‌లు పుట్టిపెరిగిన ప్రాంతమొక్కటే చూడలేకపోయాను. పాండ్యనాడులో సంచరించే అవకాశం మరొకనాటికి వాయిదావేసుకున్నానుగాని, తిరుక్కోయిలూర్‌లోనూ, శ్రీరంగంలోనూ తిరుమంగై ఆళ్వారుతో సహా పదకొండు మంది ఆళ్వారుల మంగళాశాసనాలు చూడగలిగాను. ఆదితిరువరంగం కోవెలలో అమ్మవారి సన్నిధిన అర్చకుడు ఆండాళ్ తిరుప్పావైనుంచి ఒక పాశురం ఆలపించడంతో ఇప్పటికి ఆ లోటు కూడా తీరినట్టనిపించింది.

కాని, ఇది ఒక ప్రపంచం మాత్రమే. కాలం తాకిడికి చెక్కుచెదరని ఒక సూక్ష్మసుగంధలోకం. మరొక వైపు దుమ్ముతోనూ, రణగొణధ్వనితోనూ కూడుకున్న సమకాలిక తమిళనాడుని కూడా దగ్గరగా చూసాను. మన సామాజిక-రాజకీయ ముఖచిత్రాన్ని దగ్గరగా చూడటానికి ఎన్నికల కన్నా సముచితమైన సమయం మరేముంటుంది కనుక? అటువంటి ఎన్నికలకు పరిశీలకుడిగా వచ్చానుకాబట్టి తమిళనాడు ఎటువంటి రాజకీయ-సామాజిక సమీకరణలకు లోనవుతున్నదో కూడా దగ్గరగా చూసాను, అర్థం చేసుకోడానికి ప్రయత్నించాను. జిల్లా యంత్రాంగం ఎన్నికలు నిర్వహించడంలో సమస్యాత్మకంగా గుర్తించిన గ్రామాలన్నీ నూటికి నూరు శాతం తిరిగాను. మొత్తం పోలింగు స్టేషన్లలో మూడవవంతు స్వయంగా చూసాను. ఒక్క పోలింగు రోజే దాదాపు యాభై పోలింగు స్టేషన్లు తనిఖీ చేసాను. ఏమైతేనేం ఎన్నిక ప్రశాంతంగా జరగడమే కాకుండా, రికార్డు స్థాయిలో ఓటర్లు ఓటింగు హక్కు వినియోగించుకోవడం నాకెంతో సంతోషాన్నిచ్చింది. ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం జిల్లా యంత్రాంగం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్ని ఎలా ఉపయోగించాలో చెప్తూ పెద్ద ఎత్తున ప్రచార, శిక్షణా కార్యక్రమాలు చేపట్టింది. అటువంటి ఒకటి రెండు కార్యక్రమాల్లో నేను కూడా పాల్గొన్నాను.

నెమ్మదిగా నాకు అర్థమయిందేమంటే, నేను సంచరించిన రెండు ప్రపంచాలూ విడివిడి ప్రపంచాలు కావనీ, ఒకదానిలో మరొకటి అంతర్భాగమేననీ. ఇప్పుడు ఈ ఎన్నికల్లో సంభవించిన రాజకీయ-సామాజిక సమీకరణలు, నిజానికి అత్యంత ప్రాచీన కాలం నుండీ ఈ ప్రాంతంలో సంభవిస్తూ వస్తున్న సామాజిక-సాంస్కృతిక సమీకరణలకు కొనసాగింపు మాత్రమేనని గ్రహించాను.

భారతదేశ చరిత్రను, సాంప్రదాయిక పరిమితుల్లోగాని లేదా పాశ్చాత్యపద్ధతుల్లోగాని అర్థం చేసుకోడానికి ప్రయత్నించేవారు గ్రహించవలసిన విషయమేమిటంటే, భారతీయ సాహిత్య చరిత్ర అర్థం కాకుండా, సామాజిక-చరిత్ర అర్థం కాదు. సామాజిక-రాజకీయ చలనాల్ని అర్థం చేసుకోకుండా సాహిత్యపరిణామం అర్థం కాదు.

ఉదాహరణకి తమిళదేశాన్నే తీసుకుంటే, ఇక్కడ తొలినుంచీ సామాజిక సమీకరణలు అయిదు ఆవరణల్లో సంభవిస్తూ వచ్చాయి. వాటిని అతివాద స్థానిక, ప్రాంతీయ, ప్రాంతీయ-జాతీయ, జాతీయ, అతివాద జాతీయ ఆవరణలుగా చెప్పవచ్చు. తమిళదేశ రాజకీయ చరిత్ర, ఈ ధోరణుల్ని వ్యక్తం చేయడంలోనూ, ఈ ధోరణుల్లో ఒకదాన్నుంచి మరొకదానికి ప్రయాణిస్తూండటంలోనూ, తిరిగి వెనక్కి రావడంలోనూ, మళ్ళా ముందుకి పోవడంలోనూ కనిపిస్తుంది. అలా సంభవించిన ప్రయాణాల, పరిణామాల అడుగుజాడల్ని సాహిత్యం ఎంతో సుస్పష్టంగా నమోదు చేస్తూ వచ్చింది.

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్రను మనం మార్గ-దేశి సమన్వయంగా ఎలా చెప్పవచ్చునో, తమిళదేశ సామాజిక-సాంస్కృతిక-రాజకీయ చరిత్ర కూడా అటువంటి మార్గ-దేశి సమన్వయంగానే చూడవచ్చు. కానీ, తెలుగులోకన్నా తమిళంలో ఈ సమన్వయం మరింత ప్రాచీనకాలం నుంచీ, మరింత ప్రభావశీలంగానూ సంభవిస్తూ వచ్చింది. సంగం సాహిత్యం, బౌద్ధుల, జైనుల మహాకావ్యాలూ, నీతిగ్రంథాలూ, శైవ భక్తి ఉద్యమం, శైవాన్ని పక్కకునెట్టి ముందుకొచ్చిన వైష్ణవం, శైవవైష్ణవాలు రెండింటినీ బలహీనపర్చిన ఇస్లాం, ఆ తర్వాత వచ్చిన క్రైస్తవ మిషనరీలు, వలసపాలన, ఆధునిక యుగంలోకి మేల్కొల్పిన సంఘసంస్కర్తలు, జాతీయోద్యమనాయకులు, హేతువాదులు, ద్రవిడ ఉద్యమాలు- ఒక సరళరేఖ గీసినట్టుగా ఒకదాని వెనక సంభవించినట్టు కనిపించే ఈ పరిణామాలన్నిటివెనకా, ప్రధానంగా ఉన్న శక్తి ఒకటే: అది, ఒకస్థాయిలో, అయిదురకాల భూభాగాలుగా (అడవులు, కొండలు, పొలాలు, ఊషరక్షేత్రాలు, సముద్రతీరం) ఉన్న తమిళప్రాంతాన్ని ఒక సమగ్ర తమిళసంస్కృతిగా చూడటం ఎలా అన్నది. మరొకస్థాయిలో, ఆ తమిళ స్థానిక సంస్కృతిని విస్తృత భారతీయ సంస్కృతితో ఏ విధంగా సమన్వయించుకోవడమన్నదీనూ.

విస్తృత సంస్కృతితో మేళవించడమంటే, స్థానిక సామూహిక, ప్రాంతీయ అస్తిత్వాలు బలహీనపడకూడదు. అలాగని, స్థానిక అస్తిత్వాల్ని బలపరిచే క్రమంలో pan-Indian fabric తెగిపోకూడదు. ఈ రెండింటి మధ్యా సమతూకం తీసుకురావడం కోసం చేపట్టిన వివిధ ప్రయోగాలవల్ల మాత్రమే సంఘ సాహిత్యం, జైనం, బౌద్ధం, శైవం, వైష్ణవం, ఇస్లాం, క్రైస్తవం, పాశ్చాత్యవిద్య, జాతీయోద్యమం, హేతువాద, ద్రావిడ ఉద్యమాలు తమిళనాట బలపడగలిగాయి. ఆయా కాలాల్లో అద్భుతమైన పాత్ర పోషించిన

ఆయా సాంస్కృతిక శక్తులు ఒకసారి సంకుచితం కావడం మొదలుపెట్టగానే ప్రజల తిరస్కారానికి గురయ్యాయి కూడా.

ఈ క్రమపరిణామంలో రాజీలేని సూత్రం ఒకటుంది. అదేమంటే, ప్రతి ఉద్యమం తర్వాత తలెత్తే ప్రతి కొత్త ఉద్యమం కూడా వీలైనంత inclusive గానూ, egalitarian గానూ ఉండితీరాలనేది. అటువంటి సమ్మిళితసంస్కృతిని చూపించినందువల్లనే జైనం, శైవం, వైష్ణవం ఒకప్పుడు తమిళదేశాన్ని అంతగా ఉర్రూతలూగించాయి. ఒకసారి రాజుకీ, రాజ్యాధికారానికీ చేరువకాగానే అవి ప్రజలకి దూరం కావడం మొదలుపెట్టగానే వాటి ప్రభావం కూడా క్షీణించడం మొదలుపెట్టింది. ఈ సూత్రాన్నే ఆధునిక రాజకీయ, సామాజిక ఉద్యమాలకు కూడా అనువర్తింప చేయవచ్చు. ఒకవైపు pan-Indian cultural fabric ని తెంచుకోకుండానే మరొకవైపు స్థానిక ప్రజాసమూహాల అస్తిత్వ ఆకాంక్షలను తమతో కలుపుకుంటూ పోవడమెట్లానో తెలిసిన శక్తులు మాత్రమే నేడుగాని, రేపుగాని తమిళనాడుని శాసించగలుగుతాయి. (అందుకనే తమిళ ప్రజలు అతివాద ప్రాంతీయ, అతివాద జాతీయ ధోరణులు రెండింటినీ కూడా, ఎప్పటికప్పుడు, తిరస్కరిస్తూనే వచ్చారని చరిత్ర, సాహిత్యం సాక్ష్యమిస్తున్నాయి.)

ఈ ప్రక్రియ ఎంతో గతిశీలంగానూ, ఎంతో సంక్లిష్టంగానూ సంభవిస్తుండే ప్రక్రియ. దీన్ని అర్థం చేసుకోవడానికి మనం సాహిత్యం చదవాలి, చరిత్ర చదవాలి, పల్లెలూ, పట్టణాలూ తిరగాలి, ప్రజలతో కలిసి నడవాలి. ఈ పనులేమీ చేయకుండా స్థూలంగా సూత్రీకరణలు చేసుకుంటూ మనం చరిత్ర సృష్టించలేం సరికదా, అర్థం చేసుకోలేం కూడా. ఈ మెలకువతో నేను సంచరించిన మరికొన్ని తావుల గురించి ముందు ముందు.

# పుహారఖండం

**చి**దంబరం నుంచి మేం వైదీశ్వరన్ కోయిల్ కి వెళ్ళాం. అక్కణ్ణుంచి శీర్‌గాళి వెళ్ళడానికి మధ్యలో మరొక వూరు చూడటానికి సమయం ఉండటంతో శివకృష్ణమూర్తి పూంపుహార్ వెళ్దామన్నాడు.

పూంపుహార్! ఎప్పటి పేరు! ఆ మాటవినగానే హృదయం ఝల్లుమంది. ఆ మిట్టమధ్యాహ్నం ఎండలో పూంపుహార్ లో కారు దిగగానే నన్ను నేను నమ్మలేకపోయాను. మా ఎదట నీలిసముద్రం, స్మేర సముద్రం. ఎన్నడూ కలలో కూడా ఊహించి ఉండలేదు, ఒకనాడు నేను పూంపుహార్ సముద్ర తీరందగ్గర కొంతసేపు సంచరిస్తానని!

పూంపుహార్ ఒకప్పుడు కావేరిపట్టణంగా ప్రసిద్ధి చెందిన రేవుపట్టణం. చోళరాజుల కాలంలో అక్కణ్ణుంచి ఇటు ఆగ్నేయాసియాతోనూ, అటు రోమన్ సామ్రాజ్యంతోనూ సముద్రవాణిజ్యం నడిచేది. ప్లినీ, టాలెమీ కూడా తమ రచనల్లో పూంపుహార్‌ని ప్రస్తావించారు. ఎవరో అజ్ఞాత నావికుడు రాసిన 'ద పెరిప్లస్ ఆఫ్ ఎరిత్రియన్ సీ' లో కూడా పూంపుహార్ ప్రస్తావన ఉంది. కాని అన్నిటికన్నా ముఖ్యంగా, ప్రాచీన తమిళ మహాకావ్యం 'శిలప్పదికారం' కథ పూంపుహార్ లోనే మొదలవుతుంది.

కాని శిలప్పదికారం మొదటి భాగం 'పుహార్ ఖండం'లో వర్ణించిన పూంపుహార్‌కీ, అక్కడ నా కళ్ళ ముందు కనిపించిన ఊరికీ మధ్య పోలికనే లేదు. ఆ ఎర్రని ఎండలో అక్కడ దిగగానే అక్కడ దారికి రెండు వైపులా పరిచిపెట్టిన ఎండుచేపల దుకాణాల ఘాటువాసన నాకు కొంతసేపు ఊపిరాడనివ్వలేదు. ఒకప్పుడు రేవుపట్టణానికి రాజవీథిగా ఉండి ఉండవచ్చుననిపించే ఆ వీథిలో సముద్రం వైపు చూస్తూ ఒక దేవతావిగ్రహం నిలిచి ఉంది. ఆమె కావేరినో, తమిళమాతనో తెలియదుగాని, ఆ విగ్రహానికి ఆలనాపాలనా లేదు. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయి. అక్కడ సముద్రతీరంలో ఒక పాతకాలపు కట్టడం ఏదో ఉంది. కొందరు అక్కడ ఫొటోలు కూడా తీసుకుంటున్నారు గాని, అక్కడికి వెళ్ళడానికి కూడా సరైన దారి లేదు.

కాని నా దృష్టిని వీటిమీద ఆట్టేసేపు పడనివ్వకుండా సముద్రం నా చూపుల్ని తనవైపు లాక్కుని నన్ను సమ్మోహపరుస్తూనే ఉంది. ఆ సముద్రం కనీసం మూడురంగుల్లో కనిపిస్తోంది. దూరంగా ప్రగాఢనీలిమ, మధ్యలో సముద్రపు ఆకుపచ్చ, అంచుల్లో ఊదావన్నె తిరిగిన నీలం. 'కాదు, అయిదు రంగులు చూడండి' అన్నాడు మిత్రుడు. యుగాలుగా తన తీరంలో సంభవించిన చరిత్ర జ్ఞాపకాలను తనలో పొదువుకుని, గంభీరమైన ఒక కావ్యంలాగా ఆ సముద్రం తరంగితమవుతూనే ఉంది.

ఆ సముద్రాన్ని అట్లా ఎంతసేపేనా చూస్తూ ఉండిపోవచ్చునిపించింది. అది కళాకారుల సముద్రం, చిత్రకారులు ఇష్టపడే సముద్రం. మధ్యధరా సముద్రం నుంచి నెలలతరబడి ప్రయాణం చేసి వచ్చిన నావికులకి మళ్ళా తమ స్వదేశాన్ని చేరుకున్నామేమో అనేంతగా ఊరటనిచ్చే సముద్రం.

అక్కణ్ణుంచి మళ్ళా వెనక్కి, ఊరి వైపు అడుగులు వేసాం. అక్కడ 'శిలప్పదికారం కళాకూటం' పేరు మీద తమిళనాడు టూరిజం శాఖ నిర్మించిన ఒక ప్రదర్శన శాల ఉంది. అందులో శిలప్పదికారం కథను గోడల మీద బొమ్మలుగా చెక్కిపెట్టారు. ఆ కావ్యంలో వర్ణించిన సంగీత వాద్య పరికరాల నమూనాలు కూడా ప్రదర్శిస్తున్నారు. ఒకవైపు గోడమీద ఆ కావ్యాన్ని ప్రస్తుతిస్తూ కరుణానిధి రాసిన కవిత ఒకటి తమిళంలో రాసి ఉంది. ఆ కళాకూటం ఆరుబయట ప్రాంగణంలో ఒకవైపు శిలప్పదికారం కావ్యకర్త ఇళంగో అడిగళ్ విగ్రహం ఉంది. ఆ విగ్రహం కూడా నిరాదరణకు గురవుతున్నట్టే అనిపించింది. నేను పొరపడలేదని, ఆ తర్వాత, ఎక్కడో ఒక బ్లాగరు రాసింది చదివితే అర్థమయింది. ఇళంగో అడిగల్ చేతుల్లో ఉండవలసిన శిలప్పదికారం పుస్తకాన్ని ఎవరో విరగ్గొట్టేసారని, తమిళ రాజకీయవిభేదాలవల్ల, ఆ మొత్తం కళాకూటం పూర్తి నిర్లక్ష్యానికి గురవుతున్నదని ఆ బ్లాగరు వాపోయాడు.

కాని, ఆ రోజు పూంపుహార్ నా వంట్లో విద్యుత్తుని ప్రవహింపచేసిందనే చెప్పగలను. ఎందుకంటే, ఆ పట్టణం, ఆ సముద్రం నన్ను మళ్ళా శిలప్పదికారం కావ్యప్రపంచంలోకి తీసుకువెళ్ళాయి. ఎప్పుడో చదివిన అనువాదాల అస్పష్టమైన స్ఫురణల్తో చేపట్టిన ఆ యాత్రను పూర్తిగా వంటబట్టించుకోవడం కోసం మరొకసారి శిలప్పదికారం చదివాను. ఆ కావ్యానికి ఆర్. పార్థసారథి చేసిన ఇంగ్లీషు అనువాదం (పెంగ్విన్, 1992) ప్రపంచ ప్రసిద్ధం. కానీ వి.ఆర్. రామచంద్ర దీక్షితార్ అనే ఆయన చేసిన ఒక అనువాదాన్ని ఆక్స్ ఫర్డ్ సంస్థ 1939 లోనే ప్రచురించింది. ఆ అనువాదాన్ని నాకోసం మెయిల్ చేసినందుకు ఆదిత్యకి ఎన్ని కృతజ్ఞతలు చెప్పుకున్నా సరిపోదు. ఆ అనువాదకుడు ఆ కావ్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించినప్పటికీ, మూలంలోని ప్రాచీన తమిళసౌరభాన్ని ప్రతిపుటలోనూ స్ఫురింపచేస్తూనే ఉన్నాడు. ఆ పుస్తకం చదువుతున్నంతసేపూ 'ఫ్రాగ్రెన్స్'

అనే మాట పదేపదే నాకు స్ఫురిస్తూ ఉన్నది. ముఖ్యంగా కావ్యంలోని మొదటి భాగం 'పుహారఖండం' అయితే నన్ను బహుపుష్పసుగంధంలో ముంచితేల్చింది.

1892 లో యు.వి. స్వామినాథ అయ్యర్ అనే ఒక తమిళ పండితుడు శిలప్పదికారం పూర్తి పాఠాన్ని తాళపత్రాల్లోంచి సేకరించి ప్రచురింపచేయగానే, తమిళ భాష రాత్రికి రాత్రి ప్రాచీన భాషల్లో ఒకటిగా, సంస్కృతం, పారశీకం, చైనీస్, గ్రీకు, లాటిన్ ల తో సమానమైన సర్వశ్రేష్ఠ ప్రాచీన సాహిత్యభాషల్లో ఒకటిగా మారిపోయింది.

సంగం కాలానికి చెందిన అయిదు మహాకావ్యాల్లో శిలప్పదికారం అగ్రగణ్యమైంది. ఇళంగో అడిగళ్ (గౌరవనీయుడైన చిన్నరాకుమారుడు) అనే ఒక జైన కవి రాసిన కావ్యం అది. కావ్యంలో సంస్కృతపదజాలం పదిశాతం కన్నా మించి లేనందునా, కావ్యంలో వర్ణించిన రాజవంశాల్లో పల్లవుల ప్రస్తావన లేనందువల్లనా ఆ రచన క్రీ.శ. రెండవశతాబ్దానికి చెంది ఉండవచ్చునని ఒక ఆలోచన. కొందరు దాన్ని అయిదవశతాబ్దానికి చెందిన కావ్యంగా లెక్కవేస్తున్నారు. కాని, తమిళసాహిత్య చరిత్రలో ఇంతవరకు అటువంటి కావ్యం మరొకటి రాలేదు. అది తమిళుల జాతీయ కావ్యం. అలాగని దాన్ని మనం తమిళభాషకు మాత్రమే పరిమితం చేయలేం. గిల్గమేష్, ఇలియడ్, ఏనియాడ్, రఘువంశం, సౌందరనందం వంటి మహాకావ్యాల సరసన నిలబడగల రచన అది. కావ్యసందేశాన్ని బట్టి, శిల్ప ప్రౌఢత్వాన్ని బట్టీ రామాయణం, మహాభారతాల్ని గుర్తుకు తేగల ఇతిహాసం.

శిలప్పదికారం ముప్పై ఆశ్వాసాల రచన. పుహార ఖండం, మధురై ఖండం, వంజి ఖండం అని మూడు విభాగాలుగా నిర్మాణమైన ఆ రచన మనకి మూడు అంకాలుగా నిర్మితమయ్యే సుప్రసిద్ధ నాటకాల నిర్మాణాన్ని తలపింపచేస్తుంది. అది కొంత పద్యం, కొంత గద్యం, కొంత గీతం కలగలసిన రచన. కొందరు దాన్ని చంపూ కావ్యం అన్నారుగాని, మన చంపూ కావ్యాల్లో పాటలు ఉండవు. ఒక రసజ్ఞుడు వివరించినట్టుగా శిలప్పదికారం 'కావ్యం, నాటకం, సంగీతం' మూడూను.

స్థూలంగా కథ చెప్పాలంటే: కోవలన్ పుహార్ కి చెందిన ఒక వర్తకుడు. జైనుడు. కన్నగి అతడి భార్య. వాళ్ళది అన్యోన్యదాంపత్యమే కాని, అతడి జీవితంలోకి మాధవి అనే నర్తకి ప్రవేశిస్తుంది. ఆమె మోహంలో పడి కోవలన్ తన ఆస్తిపాస్తులు మొత్తం వ్యయం చేసేసుకుంటాడు. ఆమెతో ప్రేమలో పూర్తిగా మునిగిపోయి ఉండగానే హటాత్తుగా ఆమె మనసులో మరొకరున్నారేమో అనే సందేహం కల్గుతుంది అతడికి. ఆమెని వదిలిపెట్టేసి ఇంటికొచ్చేస్తాడు. అన్నాళ్ళూ తన భార్యని తాను నిర్లక్ష్యం చేసాడని గ్రహిస్తాడు. అంతేకాక, తాము నిర్ధనులమయ్యామని కూడా అర్థమవుతుంది. మళ్ళా వ్యాపారం

చేసి ఆ నష్టాన్ని పూడ్చుకోవడానికి, కన్నగి కాలి అందెలు అమ్మి పెట్టుబడి సమకూర్చుకుందామని మధురై నగరానికి వెళ్తారు.

అక్కడ ఒక అందె తీసుకుని నగరంలోకి వెళ్ళి దాన్ని అమ్మచూపినప్పుడు, ఆ నగరంలో రాజుగారి దగ్గర పనిచేసే బంగారంపనివాడు దాన్ని చూస్తాడు. అతడు అప్పటికే రాణిగారి కాలి అందె ఒకటి తస్కరించి ఉంటాడు. ఇప్పుడు ఈ నగని చూపించి, రాణిగారి నగ దొరికిందని చెప్పి, ఆ నేరాన్ని కోవలన్ మీదకి నెట్టవచ్చునని పన్నాగం పన్నుతాడు. ఆ విధంగానే ఆ నగని రాజుగారికి చూపిస్తాడు. రాజు తక్షణమే ఆ దొంగని వధించమని ఆజ్ఞాపిస్తాడు. రాజభటులు కోవలన్‌ని పట్టుకుని అక్కడే వధించివేస్తారు. ఆ సంగతి తెలియగానే కన్నగి నిప్పులు కక్కుతుంది.

ఆమె తన దగ్గర ఉన్న మరొక అందె తీసుకుని నేరుగా రాజు దగ్గరకి వెళ్తుంది. తన భర్త నిర్దోషి అని చెప్తుంది. కావాలంటే తన దగ్గరున్న అందెని పరీక్షించి చూడమనీ, దానిలో వజ్రాలు పొదిగి ఉంటాయనీ చెప్తుంది. రాజు తాము పోగొట్టుకున్న అందెలో ముత్యాలు పొదిగి ఉంటాయని గుర్తు చేసుకుంటూ ఆ అందెని విరిచి చూస్తాడు, అందులోంచి వజ్రాలు రాలిపడతాయి. తాను అన్యాయం చేసానని, తన రాజధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించలేదనీ గ్రహింపుకి రాగానే రాజు ప్రాణత్యాగం చేస్తాడు.అతణ్ణి చూసి రాణి కూడా వెంటనే ప్రాణాలు విడిచిపెడుతుంది. కాని, కన్నగి కోపం చల్లారదు. ఆమె మధురై నగర పురవీథుల్లో ఆక్రోశిస్తూ, తన దుఃఖం పట్టలేక, తన ఎడమ వక్షోజాన్ని ఊడబెరికి, నగరం మీదకు విసిరికొడుతుంది. ఆ ఛిన్నవక్షోజం ఆ భగ్న హృదయజ్వాలతో ఆ నగరాన్ని దగ్ధం చేసేస్తుంది.

అక్కణ్ణుంచి కన్నగి పాండ్యరాజ్యం వదిలిపెట్టి చేరరాజ్యంలో అడుగుపెడుతుంది. అక్కడి ప్రజలు చూస్తూండగా ఆమెని దేవదూతలు స్వర్గానికి తీసుకుపోతారు. ఆమె దేవతగా మారిపోతుంది. ఆ దేవతకొక విగ్రహాన్ని నిర్మించడంకోసం, హిమాలయాలనుండి ఒక శిలను తీసుకురావడానికి, చేరదేశపు రాజు సెంగుట్టవాన్ ఉత్తరాది రాజులమీద యుద్ధం ప్రకటిస్తాడు. ఆ యుద్ధంలో అతడు విజయం పొంది, హిమాలయాలనుంచి తెచ్చిన శిలను గంగలో అభిషేకించి తన రాజ్యంలో పట్టిణీదేవిగా ప్రతిష్ఠించడంతో కావ్యం పూర్తవుతుంది. కావ్యం మొత్తం ఒక కాలి అందె (శిలంబు) చుట్టూ అల్లుకున్న వృత్తాంతం (అధికారం) కాబట్టి, కావ్యానికి 'శిలప్పదికారం' అని పేరువచ్చింది.

రమణీయమైన కల్పనలూ, దారుణమైన సామాజికవాస్తవాలూ, కొంత చరిత్ర, కొంత పురాణం కలగలసిన శిలప్పదికారం విశిష్టత నాకు మూడు అంశాల్లో కనిపించింది. మొదటిది, అందులోని కావ్యసౌందర్యం. సంగం సాహిత్యంలోని 'అకం', 'పురం' రెండు

సంప్రదాయాల్నీ ఒకచోట పెనవేసిన కావ్యమది. టాల్ స్టాయి 'వార్ అండ్ పీస్' రాసాడు. ఈ కావ్యాన్ని మనం 'ప్రణయం-సమరం' అనవచ్చు. రెండవది ఆ కావ్యశిల్పం, నిర్మాణం. అది నిజంగా ప్రకృష్ట బంధం. ఆ కావ్యంలో వర్ణనలు, సంభాషణలు, సంఘటనలు ఎంత బిగువుతో కవి ఒకదానికొకటి పొదిగాడంటే, అత్యంత నిపుణుడైన ఒక ఆధునిక దర్శకుడెవరో తీసిన సినిమా చూస్తున్నట్టుగా ఉంటుంది మనకి ఆద్యంతం. ఇక మూడవది, అందులోని సంగీతం. కావ్యం మధ్యలో కవి 'కడలి పాట', 'వేటపాట', 'గోపపాట', 'ఊయల పాట', 'బంతిపాట' మొదలైన పాటలు పొదిగి ఆ కావ్యాన్ని ఒక సంగీత రూపకంగా కూడా మార్చేసాడు.

కాని, శిలప్పదికారం విశిష్టత వీటన్నిటినీ దాటిన ఒక నైతిక సందేశంలో ఉంది. కన్యాశుల్కం నాటకంలాగా అది కూడా ఒక రాజకీయ రచన. Personal is political అని చెప్తున్న అత్యాధునిక రచన. ఒక్కమాటలో చెప్పాలంటే సుపరిపాలనకు సంబంధించిన రచన. నీ రాజ్యంలో ఏ ఒక్క కుటుంబానికి, ఏ ఒక్క స్త్రీకికి, ఏ ఒక్క బిడ్డకి అన్యాయం జరిగినా కూడా దాని ఫలితాన్ని మొత్తం రాజ్యం అనుభవించవలసి వస్తుందని చెప్పే హెచ్చరిక. శిలప్పదికారంలో అన్నిమతాలవాళ్ళూ జైనులు, ఆజీవకులు, బౌద్ధులు, బ్రాహ్మణులు కనిపిస్తారు. శివుడు, విష్ణువు, కృష్ణుడు, రాముడు, మురుగన్, దుర్గ, కాళి, కొట్రవై కనిపిస్తారు. కానీ ఆయా మతాలన్నిటిలో ఏది గొప్ప మతమనే ప్రశ్నకి శిలప్పదికారం పూనుకోదు. అసలు, పరలోకసంబంధమైన, పారమార్థికమైన సమస్యలేవీ ఆ కావ్యం తలకెత్తుకోదు. ఇక్కడి జీవితం, ఇక్కడి మనుషులు, వాళ్ళ మధ్య తలెత్తే ప్రణయం, నమ్మకం, సందేహం, సంతోషం, పరితాపం- ఇవే ఆ కావ్యానికి చింతిత విషయాలూ, వర్ణనీయాలూను. అన్నిటికన్నా ముఖ్యం, మనుషుల నడవడిక. ఒక తప్పుడు జూదం అన్నదమ్ముల్ని కురుక్షేత్రం వైపు నడిపించినట్టే, ఒక తప్పుడు సాక్ష్యం ఒక నగరాన్ని దగ్ధం చేయగలదని శిలప్పదికారం చెప్తుంది. మనుషుల శీలమే వారి నిజమైన అలంకారం. ఒక మనిషి శీలభద్రతలోనే ఒక రాజ్యభద్రత కూడా ఉందనేది ఇళంగో అడిగళ్ మనకి కలిగించే మెలకువ.

అతడి జీవితమే అందుకు ఉదాహరణ. చేరరాజు, శిలప్పదికారంలో విజేత, సెంగుట్టవాన్‌కి ఇళంగో అడిగళ్ స్వయానా తమ్ముడు. ఆ అన్నదమ్ములిద్దరూ చిన్నప్పుడు ఆడుకుంటూ ఉండగా, ఒక జ్యోతిష్కుడు, వాళ్ళని చూసి, ఆ తమ్ముడు ఎప్పటికైనా రాజు అవుతాడని చెప్పాడట. తాను పెద్దయిన తర్వాత, ఆ చిన్నప్పుడు విన్న భవిష్యవాణి వల్ల తన సోదరుడి మనసులో అభద్రత చేరకూడదని భావించి, ఇళంగో అడిగళ్ చిన్నవయసులోనే సన్యసించి, రాజ్యానికీ, రాజకుటుంబానికీ దూరంగా జీవించాడట.

కాని, నాకైతే ఆ జ్యోతిష్కుడి మాటలు నిజమయ్యాయనే అనిపిస్తుంది. శిలప్పదికారం కావ్యకర్తగా, ఇళంగో అడిగళ్, ప్రపంచవ్యాప్తంగా రసజ్ఞహృదయాలను ఇప్పటికీ పరిపాలిస్తూనేఉన్నాడు.

శిలప్పదికారం నుంచి ఒక సన్నివేశం:

## నా పేరు కన్నగి

'ఆమెను రానివ్వండి, లోపలకు తీసుకురండి' అన్నాడు రాజు.

అప్పుడు ద్వారపాలకుడు ఆమెని లోపలకు వెంట తీసుకువచ్చి రాజుముందు హాజరుపరిచాడు. ఆమె దగ్గరకు రాగానే రాజు ఆమెని 'కన్నీళ్ళతో తడిసిపోయినముఖంతో కనిపిస్తున్న ఓ యువతీ, ఎవరు నువ్వు? ఎందుకిక్కడికి వచ్చావు?' అనడిగాడు.

'విచక్షణారహితుడా' ఆమె నిప్పులు కక్కింది. 'విను, నీకీ సంగతి చెప్పడానికే వచ్చాను. నాది పుహార్ పట్టణం. ఒకప్పుడు ఒక పావురాన్ని కాపాడటంకోసం తన దేహం నుంచి మాంసఖండాన్ని కోసి ఇచ్చిన రాజు పాలించిన నగరం నాది. ఆనాడు అతడి త్యాగాన్ని చూసి దేవతలే నివ్వెర పోయారు. మరొకప్పుడు, తన కుమారుడు నడిపిస్తున్న రథం కింద గాయపడ్డ ఒక గోవు కన్నీళ్ళు చూసి, తన కుమారుణ్ణే తన రథచక్రాలకింద పడదోసి వధించిన మరొక రాజు పాలించిన పట్టణం నాది. ఆ ఊరినుంచి ఒక వర్తకకుమారుడు, చక్కటి వంశానికి చెందినవాడు, నా భర్త కోవలన్ విధి వశాత్తూ ఈ నగరంలో అడుగుపెట్టాడు. ప్రకాశవంతమైన రెండు కాలి అందెలతో పొట్టకూడు వెతుక్కుంటూ ఇక్కడ ప్రవేశించాడు. బతుకుతెరువుకోసం ఒక అందె అమ్మచూపుతుండగా నువ్వతణ్ణి అన్యాయంగా చంపేసావు. నేనతడి భార్యని. నా పేరు కన్నగి' అని చెప్పింది.

'దివ్యరాలా, ఒక దొంగకి మరణశిక్ష విధించడం అన్యాయం కాదే' అన్నాడు రాజు. 'అది రాజధర్మంలో భాగమేనని తెలుసుకో'

ఆమె కళ్ళు నిప్పులు చిమ్మాయి. 'రాజా, ధర్మం నుంచి, నువ్వు చెప్తున్న రాజధర్మం నుంచి నువ్వే పక్కకి తప్పుకున్నావు. ముందు ఆ సంగతి తెలుసుకో. ఇదిగో, నా బంగారు అందె. చూడు దీనిలో వజ్రాలు పొదిగి ఉన్నాయి' అంది.

'బావుంది. నువ్వు చెప్పిన మాట నాకు నచ్చింది. ఎందుకంటే, మేం పోగొట్టుకున్న అందెలో ముత్యాలు పొదిగి ఉంటాయి. ఏదీ ఇలా ఇవ్వు, నన్ను చూడనీ' అన్నాడు రాజు. ఆ అందెని ఆయన ముందుపెట్టారు. కన్నగి ఆ అందెని చేతుల్లోకి తీసుకుని విరిచింది. దాన్నట్లా విరచగానే, ఒక వజ్రం పైకి చింది రాజు ముఖం మీద ఎగిరిపడింది.ఆ వజ్రం కళ్ళముందు కనిపించగానే రాజఖడ్గం వణికింది. రాజఛత్రం పక్కకు ఒరిగిపోయింది. అతడు కంపిస్తున్న పెదాలతో 'నేను రాజునా! ఒక బంగారపు పనివాడి మాటలు నమ్మిమోసపోయానే! అసలైన దొంగని నేనే. నా రాజ్యంలోని పౌరుల జీవితాలకు భద్రత కల్పించవలసిన బాధ్యతలో మొదటిసారిగా విఫలమయ్యాను. నాకింక జీవించడానికి అర్హత లేదు' అంటోనే తన సింహాసనం మీంచి నేలమీదకి ఒరిగిపోయాడు.

అతడట్లా కుప్పకూలిపోవడం చూసి ఆ రాణి కూడా నేలకూలి 'తన భర్తని పోగొట్టుకున్నాక ఏ స్త్రీకైనా ఆ లోటు పూడటం అసాధ్యం' అంటో అతడి పాదాలట్లానే పట్టుకుని తాను కూడా ప్రాణాలు విడిచింది. అభాగిని!

# ప్రజల నాలుకమీద నిలిచిన పద్యం

**శీ**ర్‌గాళి నేనూహించినంత చిన్న ఊరేమీ కాదు. ఇప్పుడది తాలూకా కేంద్రంగా కూడా ఉంది. ఇప్పుడు నాగపట్టణం జిల్లాలో ఉన్న ఈ పట్టణం ఇటీవలికాలందాకా కూడా తంజావూరు జిల్లాలో భాగంగా ఉండేది. కడలూరుకీ, నాగపట్టణానికీ మధ్య సరిహద్దుగా ఉన్న కొల్లిడం నది కావేరికి ఒక పాయ. శీర్‌గాళికి దక్షిణంగా కావేరి ఉన్నందువల్ల, ఈ ప్రాంతం ఉత్తరచోళనాడుకి ముఖ్యమైన కేంద్రం అని చెప్పవచ్చు. కావేరి డెల్టాలో భాగం కాబట్టి, సంగం కాలంనుంచీ కూడా, రాజకీయంగా కూడా ప్రధాన పాత్ర వహించింది.

సుసంపన్నమైన ప్రాంతం కాబట్టి కళలకీ, సంగీతానికీ, సాహిత్యానికీ కూడా కేంద్రంగా వర్ధిల్లింది. తమిళ శైవానికీ. తమిళ వైష్ణవానికీ కూడా శీర్‌గాళి ప్రాణకేంద్రంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు. తిరుజ్ఞాన సంబంధర్, తిరుమంగై ఆళ్వార్ ఇద్దరూ కూడా శీర్‌గాళిలోనే పుట్టడంలో ఆశ్చర్యం లేదు. తన కాలం నాటి రాజమతమైన జైనం మీద తిరుగుబాటు చెయ్యడంలో సంబంధర్ ఎటువంటి తీవ్రత చూపించాడో, తన కాలం నాటి రాజమతమైన శైవం మీద కూడా తిరుమంగై ఆళ్వార్ అంతే తీవ్రత కనపరిచాడు. ఇద్దరూ కూడా కవులే. గీతకర్తలే. పాటలు పాడుకుంటూ తమిళదేశమంతా సంచరించినవాళ్ళే. ప్రజల్ని మేల్కొల్పిన వాళ్ళే.

కాని ఆ రోజు నేను జ్ఞానసంబంధర్ అడుగుజాడల్ని వెతుక్కుంటూ పోయేను కాబట్టి, ఆయన పసిప్రాయంలో ఏ పుష్కరిణి గట్టుమీద శివానుగ్రహానికి నోచుకున్నాడో ఆ పుష్కరిణి చూడటం కోసమే ఉవ్విళ్ళూరాను. శీర్‌గాళిలో ప్రవేశించిన తర్వాత ఆ ఊళ్ళల్లో, ఆ ఇళ్ళల్లో, ఆ వీథుల్లో ఏడవశతాబ్దం నాటి గుర్తులేవైనా కనిపిస్తాయేమో పోల్చుకుందామని చూసేను. కాని ఆ ఊరు మామూలు సముద్రతీరపట్టణంలానే, తూర్పు గోదావరి జిల్లా పట్టణాలు, రామచంద్రపురం, రావులపాలెంల లాగానే ఉంది.

మా కోసం అక్కడ ఎదురుచూస్తున్నవాళ్ళు మమ్మల్ని నేరుగా గుడిదగ్గరకు తీసుకుపోయారు. ఆ శివాలయం తెరవడానికి ఇంకా సమయం ఉందనీ, ఒకసారి గుడి చుట్టూ ప్రదక్షిణం చేద్దామనీ చెప్పారు. మధ్యాహ్నం మూడు గంటలవేళ ఆ

గుడిచుట్టూ నడిచేటప్పటికి పాదాలు ఒకింత చల్లదనం కోరుకున్నాయి. అప్పుడు చూసాం, ఆ పుష్కరిణిని. దేవాలయ ప్రాంగణంలోని ఆ కోనేరు ఎన్నో యుగాలుగా అంత నిర్మలంగానూ, అంత నిశ్చలంగానూ ఉన్నట్టే ఉంది. ఆ కోనేటి గట్టున మెట్ల మీద కూచున్నాం.

ఆకుపచ్చ రంగు తిరిగినప్పటికీ ఆ నీళ్లు పారదర్శకంగానే ఉన్నాయి. ఆ నీళ్ళల్లో కదలాడుతున్న చిరుమీనులు కంటికి కనబడేటంత స్వచ్ఛంగా ఆ నీళ్ళున్నాయి. ఆ మెట్ల మీద కూచుని ఆ నీళ్ళల్లో పాదాలు కొద్దిగా ముంచగానే చేపలు మా పాదాలచుట్టూ చీమల్లాల్గా మూగేయి. ఒకటి రెండు చిరుచేపలు మా పాదాల్ని ముద్దుగా కొరకడం మొదలుపెట్టాయి కూడా. మాతో వచ్చినవాళ్ళు మరమరాల పొట్లాలు తీసుకువచ్చారు. అవి తుంపి చేపలకి ఆహారంగా వెదజల్లాం. ఆ ఎండవేళ, ఆ కోనేటిగట్టున, ఆ చేపలకట్లా ఆహారం పంచడంలో ఏదో సాంత్వన నా మనసుకి తోచింది.

అప్పుడు నా పక్కన ఉన్న స్థానికుడొకాయన, 'అదిగో, చూడండి, జ్ఞాన సంబంధుల విగ్రహం, ఇక్కడే ఆయనకి అమ్మవారు పాలు తాపింది' అన్నాడు. నా వళ్ళు ఝల్లుమంది!

తమిళ నాయన్మారుల్లో అత్యంత ప్రభావశీలుడైన జ్ఞాన సంబంధనాయనారు జీవితం అద్భుతావహం, విస్మయకారకం అయిన విశేషాలతో నిండిపోయింది. వేసిన ప్రతి అడుగు ఒక మహిమగా మారిపోయిన ఆ జీవితకథలో ఏది వాస్తవమో, అది విశ్వాసమో తేల్చి చెప్పడం కష్టం. జ్ఞానసంబంధర్ అమ్మవారి స్తన్యంగ్రోలి కవిత్వం చెప్పిన శిశువు అనే ఒక ఐతిహ్యం ఆయన తర్వాత శతాబ్దానికి చెందినవాడైన శంకరాచార్యుల కాలం నాటికే స్థిరపడిపోయింది. కాబట్టే శంకరులు సౌందర్యలహరి లో 'ద్రవిడశిశువు' అని వర్ణిస్తేనే సరిపోయింది, సంబంధర్ పేరు ప్రస్తావించవలసిన అవసరం లేకపోయింది.

జ్ఞానసంబంధుల జీవితం గురించి పెరియపురాణంలో శేక్కిలార్ గొప్ప పారవశ్యంతోనూ, ఆరాధనతోనూ రాసుకొస్తాడు. ఉజ్జ్వలంగానూ, మహిమోపేతం గానూ ఉండే ఆ జీవితగమనం మనల్ని నివ్వెరపరుస్తుంది. పదహారేళ్ళు నిండకుండానే ఈ లోకాన్ని వదిలిపెట్టిన సంబంధర్ తమిళశైవాన్ని ఏకకాలంలో ప్రజలమతంగానూ, రాజ మతంగానూ కూడా మార్చడంలో అనేక జీవితకాలాలకు సరిపడా కృషి చేసాడంటే ఆశ్చర్యం కలగకమానదు. ఆ కథనాన్ని ఒకపట్టాన అంత తేలిగ్గా నమ్మలేమనిపిస్తుంది కూడా.

శీర్‌గాళికి చెందిన శివహృదయుడు, భగవతీ దేవి అనే దంపతుల ముద్దుబిడ్డడు సంబంధర్. ఆయన మూడేళ్ళ పసిపాపగా ఉండగా, తండ్రి ఆ పిల్లవాణ్ణి తీసుకుని ఆ కోనేటివద్దకు స్నానానికి వెళ్ళాడు. బిడ్డని గట్టుమీద కూచోబెట్టి తాను స్నానానికి కోనేటిలో దిగాడు. పిల్లవాడు ఆకలికో, భయానికో ఏడవడం మొదలుపెట్టాడు. తండ్రికి ఆ ఏడుపు వినిపించలేదు. ఆయన కోనేటిలో మునకలు వేస్తూ ఉన్నాడు. ఇంతలో పిల్లవాడికి

ఆకాశంలో శివపార్వతులు కనిపించారు. గుక్కపట్టి ఏడుస్తున్న ఆ పిల్లవాణ్ణి సముదాయించడంకోసం పార్వతితో ఆ పిల్లవాడికి పాలు తాపించమన్నాడు శివుడు. ఆది దంపతులిద్దరూ కిందకి దిగారు. ఆమె ఆ పిల్లవాడికి కడుపారా స్తన్యమిచ్చింది. ఇంతలో తండ్రి స్నానం పూర్తి చేసుకుని గట్టుమీదకి వచ్చాడు. పిల్లవాణ్ణి చూసాడు. ఆ బిడ్డ పెదాల కొసలనుంచి పాలచుక్కలు చారకట్టి ఉన్నాయి. పిల్లవాడికెవరో స్తన్యమిచ్చారని అతడు గ్రహించాడు. చుట్టూ చూసాడు, ఎవరూ కనబడలేదు. పాలెవరు తాపించారని పిల్లవాణ్ణి గద్దించాడు. అప్పుడు అప్రయత్నంగా, సద్యఃసిద్ధంగా ఆ పసిపాప నోట ఒక పాశురం వెలువడింది.

**తోడుడైయసెవి యన్విడైయేరియోర్ తూవెణ్మదిసూడిక్**
**కాడుడై యసుడ లైప్పొడిబూసియెన్ నుళ్ళంగవర్గళ్వన్**
**ఏడుడై యమల రాన్మునై నాట్పణిన్ దేత్తవరుళ్సెయ్ద**
**పీడుడై యబిరమాబురమేవియ పెమ్మానివనండ్రే.**

**(ఒక చెవిన చెవికమ్మ తొడిగినవాడు, శిరసున నెలవంక అమరినవాడు, వడలంతా వెలిబూది రాసుకున్నవాడు, ఎద్దునెక్కి వచ్చినవాడొకడు, ఒక దొంగ, నా మనసుదోచుకున్నాడు. బ్రహ్మపురంలో కొలువైన అతగాడు ఒకప్పుడెప్పుడో ఇట్లానే బ్రహ్మమీద కూడా కరుణకురిపించాడు. తామరపూలరేకలమీద నెలకొన్న ఆ బ్రహ్మ కూడా అప్పుడిట్లానే తలవంచి ఆయనకు ప్రణతులర్పించాడు)**

అమ్మవారి స్తన్యపానం చేసి పలికిన పద్యం కాబట్టి, తేవారం ఏడు సంపుటాలూ, తిరుమురై పన్నెండు సంపుటాలూ కూడా ఈ పద్యంతోనే మొదలుకావడంలో ఆశ్చర్యమేముంది? అప్పటిదాకా అతడు సంబంధర్ మాత్రమే. కాని, ఆ పాలు తాగటంతో అతడు జ్ఞాన సంబంధర్ గా మారిపోయేడు.

శీర్‌గాళిని బ్రహ్మపురం అని కూడా పిలుస్తారు కాబట్టి, తన పద్యంలో సంబంధర్ పిరమపురం అన్నాడు. అక్కడ ఆ పుష్కరిణి గట్టు మీద ఆ పదికాన్ని పాలరాతిలో చెక్కి ప్రతిష్ఠించారు. ఆ కోనేటి ముఖద్వారం మీదా ఆ కథని విగ్రహాలుగా చెక్కిపెట్టారు. అక్కడ మాకోసం వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ కథ తమసొంత వాక్యాల్లో మరోసారి మాకోసం వినిపించడంతో, ఆ పద్యాన్ని ప్రజల నాలుకల మీద కూడా చెరిగిపోకుండా చెక్కిపెట్టారని అర్థమయింది.

# పాటలు పుట్టిన తావులు

**శీ**ర్‌గాళిలో ఉన్న శివుడికి మూడు పేర్లు. ఆ దేవాలయానికి మూడు అంతస్తులు. కింద ఆలయంలో ఉన్న మూర్తి బ్రహ్మపురీశ్వరుడు. మేము ఆయన్ని దర్శించే సమయానికి పై అంతస్తులో గర్భాలయం ఇంకా తెరవలేదు. మరికొంత సమయం పడుతుందన్నారు. మేము అంతదాకా వేచి ఉండలేక వెళ్ళిపోదామనుకున్నాం గాని, తీరా మేమొక ప్రదక్షిణం పూర్తిచేసేటప్పటికి పైన ఆలయం తలుపులు కూడా తెరిచారు. ఆ గర్భగుడిలో పెరియనాయకుడు, పెరియనాయకిల విగ్రహాలు మహాప్రమాణాల్తో కనిపిస్తున్నాయి. ఆ గది మొత్తం ఒక దొన్నెలాగా ఉంది.

'ఒకప్పుడు ప్రళయం సంభవించినప్పుడు అన్నిటితోపాటు కళలు కూడా మునిగిపోయే ప్రమాదం ఏర్పడింది. అప్పుడు చతుష్షష్టి కళల్నీ ఒక దొన్నెలో ఎక్కించుకుని కాపాడాడు కాబట్టి ఈ శివుణ్ణి ద్రోణీశ్వరుడు అని కూడా అంటారు. చూడండి, శివుడు మరెక్కడేనా ఇట్లా మనుష్యాకృతిలో ఇట్లా మూర్తిమంతంగా కనిపిస్తాడా? ఇక్కడ మాత్రమే కనిపిస్తాడు' అన్నాడు అర్చకుడు.

ప్రళయకాలంలో జీవజాతుల్ని రక్షించడం విన్నాను, విశ్వాసుల్ని కాపాడుకోడం విన్నాను గాని, అరవై నాలుగు కళల్నీ ఉద్ధరించడం గురించి శీర్‌గాళిలోనే మొదటిసారి విన్నాను. ఆ మూర్తుల్నిమరొకసారి శ్రద్ధగా దర్శించుకున్నాను. ఆ చివరి క్షణాల్లో ఇంకా ఆ తలుపులు తెరవలేదని అక్కణ్ణుంచి వెళ్ళిపోయి ఉంటే, ఎటువంటి అత్యద్భుత దర్శనాన్ని కోల్పోయి ఉండేవాణ్ణో కదా అనిపించింది.

ప్రపంచాన్ని నీళ్ళు ముంచెత్తినప్పుడు కళలు మునిగిపోకుండా కాపాడిన చోట సంబంధర్ వంటి కవి పుట్టడంలో ఆశ్చర్యమేముంది? ఆ రోజు పుష్కరిణి గట్టున సద్యోజాతంగా కవిత్వం పలికిన తర్వాత, ఆ బాలప్రతిభామూర్తి ఆ కుటుంబానికి, ఆ గ్రామానికి, ఆ ప్రాంతానికి ఒక స్ఫూర్తిగా మారిపోయేడు. మొదట్లో ఆయన తన తండ్రి భుజాల మీద ఎక్కి చుట్టుపక్కల దేవాలయాలు పర్యటిస్తూ కవిత్వం చెప్పడం మొదలుపెట్టాడు. కొన్నాళ్ళకు ఆయనకోసం ముత్యాల పల్లకీ, ఛత్రమూ వచ్చి చేరాయి. ఆయన సాహిత్య జైత్రయాత్ర మొదలయ్యింది.

ఆ యాత్రలో పతాక ఘట్టం ఆయన మధుర రాజైన పాండ్యుణ్ణి జైనం నుంచి శైవంలోకి మార్చడం. ఆ రాణి మొదటినుంచీ శివభక్తురాలు. అరవై ముగ్గురు నాయనార్లలోనూ చోటు దక్కించుకున్న ముగ్గురు మహిళల్లో ఆమె కూడా ఒకరు. ఇప్పుడామె సంబంధుల్ని ఆశ్రయించి రాజుని కూడా శైవుణ్ణి చేయడంతో, తమిళ శైవం ఏకకాలంలో ప్రజామతంగానూ, రాజమతంగానూ కూడా మారిపోయింది. రాజు శైవుడు కాగానే కొత్త మతోత్సాహం కాస్తా మతవిద్వేషంగా మారింది. అంతదాకా తనని ఆశ్రయించుకున్న జైనుల్ని రాజు దూరం పెట్టాడు. సంబంధర్ మీద హత్యా ప్రయత్నాలు మొదలయ్యాయి. చివరికి, ఆయన పదహారవ ఏట, పెళ్ళి వేడుకలో, నవవధువుతో అగ్ని చుట్టూ ఏడడుగులు నడవగానే మధుపర్కాలకు నిప్పంటుకుంది. ఆ నవదంపతులతో సహా, ఆ పెళ్ళి వేడుక తిలకించడానికి వచ్చినవాళ్ళంతా కూడా ఆ అగ్నిలో దగ్ధమై పోయారు.

ఆ అగ్ని ప్రమాదవశమా, లేక విద్వేషవశమా అనేది తెలియదు. పెరియపురాణ కర్త ఆ విషయాన్ని మరోలా చెప్తాడు. సంబంధులే ఇక తాను ఈ ప్రపంచంలో నిర్వహించవలసిన పాత్ర పూర్తయిందని నిర్ణయించుకుని, స్వయంగా అగ్నికి ఆహూతి అయ్యారని చెప్తాడు. కాని, అంతకుముందు, ఒక వర్తక కుటుంబానికి చెందిన ఒక మృతబాలికకు సంబంధులు ప్రాణం పోసినప్పుడు, ఆ తండ్రి తన కుమార్తెను వివాహమాడవలసిందిగా సంబంధుల్ని కోరినప్పుడు, ఆయన తిరస్కరించారనీ, అందుకు కారణం తాను అల్పాయుష్కుడని ఆయనకి తెలియడమేననీ చెప్తాడు. అటువంటిది నవవధువుతో సహా మొత్తం పరివారమంతటినీ సంబంధులు తానే అగ్నికి ఆహుతిచ్చారనడం సముచితంగా తోచదు.

అసలు మతానికీ, రాజ్యానికీ ఉండే సంబంధంలోనే ఒక క్రూరత్వం ఉంది. మనుషులు తమ జీవితాలు సౌకర్యవంతంగా ఉండాలనుకునే క్రమంలో రాజాశ్రయానికి దగ్గరయ్యే కొద్దీ, ఒక privileged class రూపొందుతుంది. అదనపు సౌకర్యాలకు అలవాటు పడ్డ ఆ తరగతిని ధిక్కరిస్తూ సామాన్యప్రజలు మరొక మతాన్నో, ideology నో ఆశ్రయించి ఒక ఉత్తుంగ తరంగంలాగా ఎగిసిపడ్డప్పుడు, జనమేధం సంభవించకుండా ఉండే ఘట్టాలు చరిత్రలో చాలా అరుదు.

కాని, జ్ఞానసంబంధుల కవిత్వానికి చరిత్ర మరకలు అంటలేదు. ఎందుకని?

మూడు కారణాలు చెప్పవచ్చు. మొదటిది, ఆయన తమిళభాషలోని నిసర్గ సౌందర్యాన్ని రెండుచేతులా విరజిమ్మాడు. సంగం సాహిత్యంలోని ప్రకృతి సౌందర్యం, ప్రణయానుభూతి, జైన సాహిత్యంలోని నిర్మల నైతికత, కారైకల్ అమ్మవారు దర్శించిన శివానుభూతి ఆయన కవిత్వాన్ని త్రివేణిగా మార్చేసాయి. సంగం కవులు, ఇళంగో

అడిగళ్ వంటివారు లౌకిక జీవితంలో ఏ అందాన్ని చూసారో, ఆయన వాళ్ళ దారిలోనే దాన్ని తమిళ పల్లెసీమల్లోనూ, కొండ చరియల్లోనూ, నదీప్రవాహాల్లోనూ, సముద్రతీరాల్లోనూ చూసాడు, వర్ణించాడు, ఆ అందాన్ని తన ముందున్న లోకం ముందు కుప్పబోసాడు.

రెండవది, ఆ భాష. అది సంపూర్ణ సంగీతమయం. ఆయన సాహిత్య జైత్రయాత్రలో తిరునీలకంఠ యాళ్‌పనార్ అనే ఒక భక్తుడు తన భార్యతో కలిసి సంబంధుల సహయాత్రికుడిగా ఉండేవాడు. ఆయన యాళ్ అనే ఒక తంత్రీ వాద్యం మీద సంబంధుల గీతాలకు స్వరకల్పన చేసి పాటలు కట్టి పాడేవాడు. తాను ఎక్కడికి వెళ్ళినా సంబంధులు ఆ దంపతుల్ని తన కూడా తీసుకువెళ్ళేవారు. ఒకసారి ఒక గృహస్థు ఆ దంపతుల్ని ఇంట్లోకి అనుమతించడానికి సందేహిస్తుంటే, వాళ్ళకి ఆ ఇంట్లో హోమవేదిక దగ్గర వసతి కల్పించమని పట్టుబట్టేడట సంబంధర్.

తర్వాత రోజుల్లో రాజరాజ చోళుడికి తాళపత్రాల్లో తేవారం దొరికినప్పుడు, ఆ కావ్యపాఠం దొరికిందిగాని, ఆ సంగీతస్వరకల్పన దొరకలేదు. అప్పుడు నంబి యాండార్ నంబి తిరు యాళ్‌పనార్ స్వగ్రామం వెతుక్కుంటూ వెళ్ళినప్పుడు ఆ కుటుంబానికి వారసురాలుగా ఉన్న ఒక మహిళ తేవారం సంగీతమెలా ఉంటుందో వివరించిందట.

మూడవది, అన్నిటికన్నా, ముఖ్యమైంది, సంబంధులకి మనుషుల పట్ల ఉండే ప్రేమ. ఆయన కవిత్వంలో ఉండే శివుడు సగం మాత్రమే పురాణ శివుడు. మిగిలిన సగం తమిళ శివుడు. చోళ శివుడు, పాండ్యశివుడు, తొండై శివుడు. తన పాటల్తో ఆయన తమిళ దేశాన్నంతటినీ ఒక sacred landscape గా మార్చేసాడు.

ఆయన చూసిన, వర్ణించిన తమిళదేశం ఇప్పటి తమిళనాడుకన్నా కూడా విస్తారమైనది. శ్రీశైలం నుండి రామనాథపురం దాకా దాదాపు రెండువందల ఇరవై క్షేత్రాల గురించి ఆయన గీతాలు అల్లాడు. (రెండు గీతాల్లో కైలాసాన్ని కూడా వర్ణించాడు!)

'పాటలు పుట్టిన తావులు' గా వన్నెకెక్కిన వాటిలో దాదాపు ఎనభై శాతం స్థలాల మీద ఆయన కవిత్వం చెప్పాడు. వాటిలో 112 దాకా క్షేత్రాల మీద ఆయన మాత్రమే పాటలు పాడాడు. ఆయా క్షేత్రాల గురించి పాటలు కడుతున్నప్పుడు, ఆయనకి అక్కడ నెలకొన్న శివుణ్ణి స్తుతించడం కన్నా, ఆ స్థలాన్ని సంస్తుతించడమే ప్రధానం. అందుకనే, ఒక పరిశోధకురాలు ఇలా రాస్తున్నది:

> 'సముద్రతీరంలోనో, కొండలమీదనో, నది ఒడ్డునో శివుడు నెలకొన్న తావుల ప్రాకృతిక సౌందర్యంతో పాటు, సంబంధర్, ఆ దేవాలయం చుట్టూతా లేదా ఆ పట్టణం చుట్టూతా ఉన్న తోటలగురించీ, తోపులగురించీ, వరిచేల గురించీ

కూడా రాస్తాడు. తేవారంలోని మరే కవి కన్నా కూడా ఎక్కువగా అతడు మానవనిర్మిత స్థలాలు, అంటే భవనాల గురించీ, గోడలు, గోపురాల గురించి కూడా రాస్తాడు. ఆ స్థలాల్లో గుమికూడే సాంఘికజీవనదృశ్యాల్ని, ఆ స్థలాల్లో తిరుగాడేఅందమైన స్త్రీలు, భక్తులు, తాపసులు, బ్రాహ్మణులు, మరీ ముఖ్యంగా అందమైన స్త్రీలని వర్ణిస్తాడు. సంబంధర్ వర్ణించే స్థలాలు ప్రశాంతమైనవో, నిదురించే పల్లెపట్టులో కావు. మానవజీవన సంరంభం– పండగలు, సంగీతం, నాట్యం– బాజాల చప్పుళ్ళతో, వేదఘోషతో కిక్కిరిసిన స్థలాలవి. చాలాసార్లు అతడు మనల్ని కూడా ఆ భక్తసందోహం మధ్యకి రమ్మని ఆహ్వానిస్తూంటాడు. ఎవరైతే తాను వర్ణిస్తున్న శివుణ్ణి కొలుస్తారో వారు ఈ కర్మబంధం నుంచి బయటపడి ముక్తిపొందుతారని కూడా హామీ ఇస్తాడు.'

అలాగని సంబంధర్ నిజంగా కీర్తిస్తున్నది ఆ స్థలాల్ని కాదు. ఆ శివుణ్ణే. ఆ స్థలాలచుట్టూతా ఆయన చూస్తున్న, చూపిస్తున్న సౌందర్యం శివసౌందర్యమే. ఆ స్థలాలు శివుడివి కాబట్టే అవి సుందరంగానూ, చూడదగ్గవిగానూ ఉన్నాయి. కవి ఏం చెప్తున్నాడో అర్థం చేసుకోవాలనుకుంటే మనం మన మనోఫలకాన్ని శుభ్రం చేసుకోవలసి ఉంటుంది. ఇప్పుడు మనం చూస్తున్న దేవాలయాలూ, ఆ గోపురాలూ, ఆ ప్రాకారాలూ దాదాపుగా సంబంధుల కాలానికి తర్వాతివి. ఆ రోజుల్లో బహుశా అక్కడొక అడివి, లేదా కొండ, లేదా నది, వాటి మధ్య ఒక చిన్న పల్లెపట్టు ఉండి ఉంటుంది.

ఆయన ఆ పల్లెపట్టుకి వెళ్ళి, అక్కడ ఏ చెట్టునీడనో, ఏ నిట్రాతి కప్పుకిందనో ఉన్న శివుణ్ణి చూసి ఉంటాడు. ఆ శివుడు ఆయనకి వట్టి లింగం కాదు. ఆ సమస్త పార్థివ, అపార్థివ సౌందర్యానికంతటికీ, ఆ లింగం ఒక నిజమైన సంజ్ఞ (లింగం అంటే అసలైన అర్థం సంజ్ఞ, signifier అని). ఆ సంజ్ఞానం వల్ల ఆయన తాను ఏ గ్రామానికి వెళ్ళినా, ఏ క్షేత్రానికి వెళ్ళినా అక్కడి సమాజానికొక అపూర్వానుభూతిని కానుక చేసేవాడు. తాముంటున్న గ్రామం, తమ గ్రామంలో కొలువైన శివుడి వల్ల, భూమ్యాకాశాల సంగమ స్థలిగా మారిపోయిందనిపించేది వారికి.

తన గీత నిర్మాణంలో కూడా సంబంధులు ఈ మెలకువనే పాటించాడు. తాను చూస్తున్న గ్రామాలు,పట్టణాలు తన కాలం నాటివి. ఆ మనుషులు తన సమకాలికులు. కాని,శివస్మరణ వల్ల వారొక అతీతకాలంతో, ఒక పురాణకాలంతో అనుసంధాన మవుతున్నారు.

అందుకని ఆయన నాలుగు చరణాల తన పద్యంలో ఒక భాగం పురాణశివ లీలావర్ణన చేస్తాడు. మిగిలిన రెండు పంక్తుల్లోనూ, తన కళ్ళముందు కనిపిస్తున్న లోకాన్ని వర్ణిస్తాడు. అంతదాకా శ్మశానాల్లో మాత్రమే సంచరిస్తున్న శివుణ్ణి ఆయన గ్రామాల మధ్యకు, పెళ్ళి పందిళ్ళలోకి, యజ్ఞశాలల్లోకీ తీసుకొచ్చాడు.

అభౌతికం, మార్మికం, ఇంద్రియాలకు అగ్రాహ్యం, అగోచరం అయిన అనుభూతి ఒకవైపు. కంటికి కనిపించే సమ్మోహపరిచే, సంతోష పరిచే సౌందర్యం, సంగీతం, సంరంభం మరొకవైపు. ఈ రెండింటినీ ఆయన తన పద్యంతో ముడివేస్తాడు.

కవిత్వం వరకూ ఆయనలో నాకు ఆసక్తి కలిగించిన మరొక అంశం, మతధర్మానికి సంబంధించిన తన భావోద్వేగాలతో తన కవిత్వాన్ని పూర్తిగా నింపెయ్యక పోవడం. ఆ కవిత్వంలో జైన విమర్శ ఉంది కాని, ఆయన దాన్ని తన ప్రతి గీతంలోనూ ఒక చరణానికి మాత్రమే పరిమితం చేస్తాడు. ఆ చరణంలో కూడా నిరసన ఉంటుంది గాని, విద్వేషం పొగలు కక్కదు. తన ప్రతికక్షులకి శివసౌందర్యం దొరకడం లేదనే బాధ మటుకే వుంటుంది.

మరొక చరణంలో తప్పకుండా రావణుడి ప్రసక్తి ఉంటుంది. దశకంఠుడి పూజలో పదితలలకు సరిపడా అహంకారం ఉందనీ, దాన్ని శివుడు బొటనవేలితో అణచివేసాడనీ ఆయన పదే పదే గుర్తు చేస్తుంటాడు. పదికంలోని మిగిలిన ఎనిమిది చరణాల్లోనూ శివుడూ, సౌందర్యమూ ఒకరినొకరు పెనవైచుకుని కనిపిస్తారు.

సంగం కవులు ప్రకృతిలోని అందాన్నీ, పురంలోని వీరత్వాన్నీ వేటికవి విడివిడిగా కీర్తించారు. అక్కడ ప్రణయం వేరు, దానం వేరు. విరహం వేరు, యుద్ధం వేరు. ప్రియుడు వేరు, రాజు వేరు. కాని సంబంధుల కవిత్వంలో ఒక వాక్యంలో శివశివానీ ప్రణయం కనిపిస్తుంది, మరు వాక్యంలో త్రిపురాసురసంహారం కనిపిస్తుంది. పది చరణాలలో సంబంధుల ప్రతి ఒక్క గీతం చదవగానే ఒక కావ్యం చదివిన అనుభూతి కలుగుతుంది.

ఉదాహరణకి, ఆయన శ్రీకాళహస్తి మీద రాసిన ఈ కవిత చూడండి:

## కాళత్తి కొండ

### 1

**కొండలన్నిటిలోకీ ఏ కొండ అంటే**
**ఆయనకెక్కువ మక్కువ అని అడిగావనుకో**
**అది కాళత్తికొండ అని చెప్తాను.**

**సముద్రాన్ని చిలికినప్పుడు చిమ్మిన విషం తాగి**
**కరుణామృతాన్ని కురిపించిన శివుడు మెచ్చిన కొండ.**

పంటపొలాల్లో అడివిపందుల్ని, జింకల్ని, చిలకల్ని
తరమటానికి పల్లెపడుచులు ఉండేలు బద్దల్లో
రాళ్ళకి బదులు మణులు సంధించే కొండ కాళత్తి కొండ.

*2*

కొండలన్నిటిలోకీ ఏ కొండ అంటే
ఆయనకెక్కువ మక్కువ అని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని చెప్తాను.

జటలుకట్టిన శిరసుమీద నెలవంకతగిలించుకున్నవాడు
మూడునగరాల్ని ఒక్క శరంతో క్షణంలో దహించినవాడు
ఇష్టపడే కొండ కాళత్తి కొండ.

ఎండినవెదుళ్ళు ఒకదానికొకటి రాచుకున్నప్పుడు
నిప్పుతునకలు ఎగిసిపడే కొండ
అడవిపందులు నేలని పెళ్ళగించినప్పుడు
వజ్రాలు బయటపడిమెరిసే కొండ కాళత్తి కొండ.

*3*

కొండలన్నిటిలోనూ ఏ కొండమీద
ఆయనకెక్కువ మక్కువ అని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని చెప్తాను.

తాగిమదించి చెలరేగిన తారకాసురుడి
మదమణచడానికి కాళిని పంపిన
శివుడిష్టపడే కొండ కాళత్తికొండ.

అడవిలో మిగలముగ్గిన పండ్లరసాలు
జుర్రుకుంటూ బండలమీద కొండముచ్చులు
కలకల్లాడే కొండ కాళత్తి కొండ.

## 4

కొండలన్నిటిలోనూ ఆయనది ఏ కొండ
అని అడిగావనుకో,
అది కాళత్తి కొండ అని చెప్తాను.

లేతవెదురులాంటి నడుమున్న ఉమాదేవిని
తనలో సగభాగం చేసుకున్నవాడు
ఎద్దునెక్కి శ్మశానాల్లో నర్తించే
చంద్రమౌళి సొంతకొండ కాళత్తి కొండ.

నీళ్ళు పుక్కిలించి శివుణ్ణి స్నానం చేయించి
పువ్వులాంటి తనకంటిని అంబుతో ఊడబెరికి
ముక్కంటికి కన్నిచ్చిన కన్నప్ప కొండ కాళత్తి కొండ.

## 5

కొండలన్నిటిలోనూ ఏ కొండమీద
ఆయనకెక్కువ మక్కువ అని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని చెప్తాను.

కొండమీద వంగిన కారుమబ్బులాగా మీదపడి
ఉమాదేవిని భయపెట్టిన గజాసురుణ్ణి
దునుమాడిన శివుడిష్టపడే కొండ కాళత్తి కొండ.

పగిలిన వెదుళ్ళలోంచి ముత్యాలు రాలిపడే కొండ
సెలయేళ్ళు, జలపాతాలు ఉరకలెత్తే కొండ కాళత్తి కొండ.

## 6

కొండలన్నిటిలోనూ ఏ కొండమీద
ఆయనకెక్కువ మక్కువ అని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని చెప్తాను.

లోకప్రసిద్ధుడు భగీరథుడి తపసు మెచ్చి
పరవళ్ళు తొక్కుతూ భువికి దిగిన గంగకి
నెలవైన జటాధారి మెచ్చిన కొండ కాళత్తి కొండ.

కురవజాతి కుటుంబాలు నెగళ్ళురగిలించినప్పుడు
అగరు పొగలు ఆకాశమంతా అల్లుకుని
పరిమళాలు వెదజల్లే కొండ కాళత్తికొండ

7

కొండలన్నిటిలోనూ ఏది ఆయన నిజనివాసమని
అడిగావనుకో
అది కాళత్తి కొండ అంటాను.

అజేయుడు జలంధరుణ్ణి మట్టుపెట్టడానికి
పెరుమాళ్ళకి కిటుకులు చెప్పినవాడెవడో
వాడుండే కొండ కాళత్తి కొండ.

చెట్లకి చుట్టుకున్న ఫణిఫణాగ్రమణికాంతులతో
రాత్రిపూట కూడా మెరిసే బంగారు కొండ కాళత్తికొండ.

8

వైభవోపేతమైన ఏ పర్వతప్రాంతం
ఆయనదని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని అంటాను.

పదితలల గర్వాన్ని కాలిబొటనవేలితో
అణచివేసి, ఆ పైన అనుగ్రహించిన
శివుడుండే గొప్ప కొండ కాళత్తి కొండ.

కొండచరియలమీద వేటగాళ్ళు వింటినారి
బిగించగానే సింహాలు, ఏనుగులు, చిరుతపులులు
భయభ్రాంతితో పరుగెత్తే కొండ కాళత్తి కొండ.

9

కొండలన్నిటిలోకీ ఆయనకి
ఏ కొండ మీద ఎక్కువ మక్కువ అని అడిగానుకో
కాళత్తికొండ మీద అంటాన్నేను.

తన ఆద్యంతాలు అంచనా వెయ్యాలనుకున్నవాళ్ళకి
అగుపించనివాడు, అంతుబట్టనివాడు
ఇష్టపడే కొండ కాళత్తి కొండ.

బంగారు పూలు పూసిన దిరిసెన చెట్లనీడన
నెమలికన్నెల్లాంటి నెలతల్ని కొండకొనల మొనగాళ్ళు
పాణిగ్రహణం చేసే పండగ కొండ కాళత్తి కొండ.

## 10

కొండలన్నిటిలోకి ఏ కొండ
మేలంటాడు ఆయన అని అడిగావనుకో
అది కాళత్తి కొండ అని అంటాన్నేను.

తలగుండు చేసుకుని, నిలబడే కూడారగించే
శ్రమణసంఘానికి తన నిజరూపం వెల్లడిచేయనివాడు
తిరుగాడే కొండ కాళత్తి కొండ.

గున్న ఏనుగుల్ని వెంటపెట్టుకుని తల్లి ఏనుగులు
లేత చందనవృక్షాల చిగుళ్ళు మేసి
ఆడుకునే అందమైన కొండ కాళత్తి కొండ.

## 11

ఎత్తైన భవనాలతో గోపురాలతో అలరారే
కొచ్చైవయం పట్టణవాసి, ప్రసిద్ధుడు
జ్ఞానసంబంధర్ పాడిన ఈ చక్కటి తమిళ పదాలు
శ్మశాననర్తకుడైన శివుడికిష్టమైన కాళత్తి కొండమీద
పాడిన చక్కటి ఈ పాటలు
ఎవరు పాడుకుంటారో వాళ్ళకి
శివలోకం చేతికందుతుంది.

# మరికొన్ని దివ్యానుభూతులు

**ము**గ్గురు నాయన్మార్లూ పుట్టిన ఊళ్ళు చూడటంతో నేను విల్లుపురం వెళ్ళిన పని పూర్తయిపోయిందనుకున్నానుగాని, తమిళదేశం నాకోసం మరికొన్ని దివ్యానుభూతుల్ని దాచి పెట్టిందని నెమ్మదిగా అర్థమయింది.

## 1

**పో**లింగ్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసిన రోజు. సిబ్బంది అంతా జమకావడానికి ఇంకా మరికొంత సమయం పట్టేటట్టు ఉందనీ ఈలోపల దగ్గరలోనే తిరువామత్తూర్ అనే చోట ఒక ప్రాచీన శివాలయం ఉందనీ, పోయి చూసి రావచ్చనీ అనడంతో, అక్కడికి వెళ్ళాం.

తిరువామత్తూర్ ఏ అతీతకాలం నుంచో ఒక శివక్షేత్రంగా వర్ధిల్లుతూ ఉంది. అక్కడి దేవాలయం వెయ్యేళ్ళ కాలం నాటిది. చోళ చక్రవర్తుల్లో ముఖ్యులందరూ ఆ దేవాలయానికి ఇతోధికంగా కానుకలు సమర్పించుకున్నట్టు శాసనాలున్నాయి. మేం వెళ్ళేటప్పటికి దేవాలయ ప్రాంగణం చాలా ప్రశాంతంగా ఉంది. అక్కడి దేవుడు అభిరామేశ్వరుడు. అభిరామేశ్వరి ఆలయం శివాలయానికి ఎదురుగా ఉంది. ఆ శివాలయానికొక స్థల పురాణం కూడా ఉంది. ఒకప్పుడు, భూమి పుట్టిన తొలికాలంలో, ఆవులకి కొమ్ములుండేవి కావట. అప్పుడు ప్రతి ఒక్క క్రూరమృగమూ, చివరికి మామూలు మృగాలు కూడా ఆవుల్ని హింసించేవట. అప్పుడు ఆవులు శివుణ్ణి ప్రార్థించేయట. ఆయన వాటికి కొమ్ముల్ని అనుగ్రహించేడట. 'ఆ' వులకి కొమ్ములు లభించిన చోటు కాబట్టి అది ఆమత్తూరు అయింది.

రూపకాలంకారం స్పష్టంగానే ఉంది కదా.

గుడి ప్రాంగణం దాదాపు రెండెకరాలు. గ్రామీణ ప్రశాంతత, ఆవులు నెమరు వేసుకునేటప్పటి నీరవ ప్రశాంతంగా అక్కడ అనుభవానికొస్తూ ఉంది. ఆ ప్రాంగణంలో ప్రదక్షిణం చేస్తున్నప్పుడూ, లోపల గర్భాలయం చుట్టూ ప్రదక్షిణం చేస్తున్నప్పుడూ,

ఎప్పటిదో మన పూర్వీకుల ఇంటికి వెళ్ళినట్టుగా అనిపించింది. లంకంత ఇంట్లో నీ తల్లిదండ్రులొక్కళ్ళే ఉంటున్నారనుకో, వాళ్ళని ఎప్పుడో ఒకసారి చూసిరావడానికి వెళ్తే ఎలా ఉంటుందో అలా అనిపించింది.

పాటలు పుట్టిన స్థలాల్లో తిరువామత్తూర్ కూడా ఒకటని అక్కడికి వెళ్ళాక తెలిసింది. అప్పర్, సంబంధర్, సుందరర్, మాణిక్యవాచకర్ నలుగురూ కూడా ఆ గుడిని సందర్శించారు. కవిత్వం చెప్పారు. తేవారంలో ఆ స్థలమ్మీద చెప్పిన కవిత్వం అక్కడి గోడల మీద చెక్కిపెట్టారు. అందులో ప్రముఖంగా కనిపిస్తున్న ఒక గీతం సుందరర్ రాసిన కవిత (తేవారం, 7:45) అని నెమ్మది మీద పోల్చుకున్నాం.

అది వట్టి కవితనా! సుందరమూర్తి శబ్దాలతో నాట్యం చేయించాడు. భావం అలా ఉంచి, ముందు ఆ శబ్ద విన్యాసం చూడండి:

**కాండనన్ కాండనన్ కారిహై యాళ్దన్ కరుత్తనాయ్**
**ఆండనన్ ఆండనన్ ఆమాత్తూర్ ఎం మడిహట్కాట్**
**పూండనన్ పూండనన్ పొయ్యంద్రు సొల్లువన్ కేణ్మిణ్కల్**
**మీండనన్ మీండనన్ వేదవిత్ తల్లా తవర్గట్కే.**

**పాడువన్ పాడువన్ పార్పది తన్నడి పట్రినాన్**
**తేడువన్ తేడువన్ తిణ్ణెనప్ పట్రిచ్ చెరిదర**
**ఆడువన్ ఆడువన్ ఆమాత్తూర్ ఎం మడిహళైక్**
**కూడువన్ కూడువన్ కుట్రమట్రైన్ కురిప్పాదే.**

పదిచరణాలూ ఇలానే సాగే ఆ గీతం ఇప్పటికీ  నా చెవుల్లో మార్మోగుతూనే ఉంది.

## *2*

**మ**రొక రోజు పోలింగ్ స్టేషన్లు తనిఖీ చేస్తూ పణయపురం అనే గ్రామానికి వెళ్ళాం. విల్లుపురం పాండిచ్చేరి రహదారి మీద ఉన్న ఆ గ్రామంలో కూడా ఒక శివాలయం ఉంది. అక్కడి దేవుడు పనంగట్టేశ్వరుడు. ఆ క్షేత్రం కూడా పాటలు పుట్టిన స్థలాల్లో ఒకటని అక్కడికి వెళ్ళాకే తెలిసింది. సంబంధర్ ఆ దేవుడి మీద పాటలు కట్టాడు.

పనంగట్టూరు అంటే తాటిచెట్ల ఊరు. ఆ దేవాలయ స్థల వృక్షం కూడా తాటిచెట్టే. అట్లా చెట్ల పేర్ల మీద ఊళ్ళనీ, దేవుళ్ళనీ చూస్తున్నప్పుడు నాకు పదే పదే గిరిజనులు గుర్తొస్తూ ఉన్నారు. గిరిజన ప్రాంతాల్లో చాలా ఊళ్ళు- మామిడిమానుగూడ,

ఈతమానుగూడ, నేరేడుగొండ–చెట్లపేర్లే. ప్రకృతితో ఒకటైన జీవితంలో మాత్రమే ఆవులపేరు మీదా, తాటిచెట్ల పేరు మీదా దేవుళ్ళు వెలుస్తారు. ఆ గుడి ప్రాంగణంలో తాటిచెట్లు స్థలవృక్షాలుగా పూజలందుకుంటాయి.

ఆ గుడి కూడా దాదాపు ఏడెనిమిది వందల ఏళ్ళ నిర్మాణం. చోళ రాజు పరాంతకుడు ఆ గుడి కట్టించాడని అర్చకుడు చెప్పాడు. ప్రతి శివాలయంలోనూ దక్షిణం వైపు అరవైముగ్గురు నాయనార్ల విగ్రహాలూ ఉన్నట్టే అక్కడ కూడా ఉన్నాయి. వాటిని చూపిస్తూ, అర్చకుడు, 'ఈ విగ్రహాల్లో ఒక ప్రత్యేకత చూడండి, తిరునీలకంఠనాయనారు విగ్రహం మరొక చోట ఎక్కడేనా ఒక్కరిదే ఉంటుంది. కాని, ఇక్కడ ఆయన భార్యతో కలిసి ఉన్నాడు చూడండి. ఇట్లా ఈ భార్యాభర్త లిద్దరూ కలిసిఉన్న విగ్రహం మొత్తం తమిళనాడులో మరొకచోట ఎక్కడా మీకు కనబడదు' అన్నాడు.

ఆ విగ్రహాన్ని పరిశీలనగా చూసాను. నా మనసులో ఒక అనిర్వచనీయమైన పులకింత కలిగింది. అది ఎందుకు కలిగిందో చెప్పాలంటే, మీకు తిరునీలకంఠ నాయనారు కథ చెప్పాలి.

సుందరమూర్తి శివభక్తుల్ని కీర్తిస్తూ చెప్పిన 'తిరుత్తొండ తొగై' (శ్రీభక్తగీతం) తిరునీలకంఠ నాయనారుని స్మరిస్తూనే మొదలుపెట్టాడు. నీలకంఠుడు చిదంబరానికి చెందిన ఒక కుమ్మరి. శివభక్తుడు. కాని అతడికి వేశ్యాలోలత్వం ఉండేది. అతడి బలహీనత భరించలేని వ్యసనంగా మారడంతో అతడి భార్య చెప్పలేనంత మనస్తాపానికి గురయ్యింది. ఒకరోజు అతడట్లానే రాత్రంతా ఎక్కడో గడిపి, పొద్దున్నే ఇంటికి రాగానే, దుఃఖితురాలిగా ఉన్న భార్యని చూసి అనునయించాలనుకుని దగ్గరకు తీసుకోబోయాడు.

ఆమె అతణ్ణి విదిలించుకుని 'నీలకంఠా, ఈ రోజునుంచీ మీరు నన్ను తాకితే నా మీద ఒట్టే' అంది. 'నీలకంఠా' అని ఆమె పిలిచింది తననే అయినప్పటికీ, ఆ క్షణాన అతడికి అది ఆమె శివుణ్ణి సంబోధించినట్టే అనిపించింది. పైగా 'నన్ను' అని కాక, 'మమ్మల్ని' అని కూడా అంది కాబట్టి, ఆ క్షణం నుంచీ అతడు ఆమెని మాత్రమే కాక, మరే స్త్రీనీ కూడా తాకడం మానేసాడు.

తన భక్తుడు భార్యస్పర్శకి దూరమయ్యాడని తెలిసి శివుడు బాధపడ్డాడు. ఎలాగేనా అతడి వ్రతాన్ని భంగం చెయ్యాలనుకున్నాడు. ఒకరోజు ఒక సన్యాసిగా అతడి ఇంటికి వచ్చి, తన భిక్షాపాత్ర ఆ ఇంట్లో పెట్టమనీ, తాను స్నానానికి పోయివస్తాననీ చెప్పి వెళ్ళాడు. అతడు మళ్ళా ఇంటికి వచ్చి, ఆ భిక్షాపాత్ర తిరిగి ఇమ్మని అడిగితే, ఆ పాత్ర కనిపించలేదు. భార్యాభర్తలిద్దరూ ఇల్లంతా వెతికారు. ఆ పాత్ర కనిపించలేదు. వారతడికి క్షమాపణ చెప్పుకుని, మరొక కొత్త పాత్ర తయారు చేసి ఇస్తామని చెప్పారు. కాని ఆ సన్యాసి ఆ పాత పాత్రనే కావాలని పట్టు బడుతూ, తన భిక్షాపాత్ర నీలకంఠుడే కాజేసాడని

ఆరోపించడం మొదలుపెట్టాడు. తనకి దొంగతనం చేయవలసిన అవసరం ఏముందనీ, తన మాట నమ్మమనీ, తాను అంతకన్నా మంచి పాత్ర మరొకటి ఇస్తాననీ నీలకంఠుడు చెప్తూనే ఉన్నాడు. 'నువ్వు నా పాత్ర దొంగిలించక పోతే, ఆ మాట నీ భార్య చేతిలో చేయి వేసి సప్రమాణంగా చెప్పు' అన్నాడు ఆ సన్యాసి.

తాను దొంగతనం చేయలేదనీ, కాని, ఆ మాట తన భార్య చేతిలో చేయి వేసి మటుకు చెప్పలేననీ అన్నాడు నీలకంఠుడు. ఆ తగవు తెగేట్టుగా కనిపించలేదు. వాళ్ళు ముగ్గురూ ఊళ్ళో పెద్దల ముందుకు పోయి పంచాయితీ పెట్టమని అడిగారు. పెద్దలు కూచుని తగవు విన్నారు. 'అయితే ఒక పని చేయండి, మీ దంపతులిద్దరూ చెప్తున్న మాట నిజమే గనుక అయితే, మీరిద్దరూ ఒకరి చేతిలో ఒకరు చేయి వేసుకుని, ఆ కోనేట్లో స్నానం చేసి తిరిగి వచ్చి మీరు చెప్పాలనుకున్నదేదో మరోసారి మాకు చెప్పండి' అన్నారు ఆ పెద్దలు.

చేతిలో చెయ్యి వేయడమే వ్రతభంగంగా భావించిన నీలకంఠుడు ఇప్పుడు తన భార్య చెయ్యి పట్టుకుని కోనేట్లో ఎలా స్నానానికి దిగుతాడు? కాని పెద్దలు చెప్పినట్టు చేయకపోతే తాను అబద్ధమాడుతున్నట్టే అనిపిస్తుంది. అందుకని అతడొక ఉపాయం ఆలోచించాడు. చిన్న కర్ర ఒకటి చేతుల్లోకి తీసుకుని దాని ఒక కొస తన చేత్తో పట్టుకుని మరొక కొస తన భార్యను పట్టుకొమ్మన్నాడు. ఆ కర్రని అట్లా పట్టుకుని ఆ ఇద్దరూ కోనేట్లో మూడు మునకలు వేసి పైకి వచ్చారు.

తన భిక్షాపాత్ర పోయిందని యాగీ చేసి శివుడుగానీ, వారిద్దర్నీ కోనేట్లో స్నానం చేసి రమ్మని ఆదేశించిన ఆ పండితపరిషత్తుగానీ, నీలకంఠుడి స్మరణతో శివభక్తుల చరిత్ర మొదలుపెట్టిన సుందరమూర్తిగానీ, నీలకంఠుణ్ణి తిరునీలకంఠనాయనారుగా ప్రస్తుతించిన శేక్కిలార్ గానీ ఆ భార్యాభర్తల్ని కలపలేకపోయారు. కానీ, పణయపురంలో ఆ నాయనార్ల విగ్రహాలు చెక్కిన ఆ అజ్ఞాత శిల్పి ఎవరోగాని, వారిద్దరినీ తన శిల్పంలో కలిపి చెక్కిపెట్టాడు. నిష్కపటులైన ఆ భార్యాభర్తల్ని ఒక శాశ్వత స్పర్శలో సుప్రతిష్ఠుల్ని చేసేసాడు. బహుశా శివుడే తన పట్టువిడవకుండా, ఆ శిల్పి రూపంలో, ఆ దంపతులిద్దర్నీ ఒక్కచోటకు చేర్చిపెట్టాడనీ, యుగాలు గడిచినా కూడా చెక్కుచెదరని ఒక సాన్నిహిత్యాన్ని ఆ దంపతులకి ప్రసాదించాడనీ అనిపించగానే వివరించలేని ఒక పులకింత కలిగింది నాకు.

# సిరి గంటి చెన్ను మించిన మేను కంటి

**ర**వీంద్ర కుమార శర్మ తరచూ చెప్తుండేవారు 'మనమేదైనా కొత్త చోటుకి వెళ్ళి ఏదేనా చూడాలనుకుంటే, ఏదో ఒకటి చూడాలని వెళ్ళకూడదు, ఏదేనా సరే చూడాలని వెళ్ళాలి' అని. తిరుక్కోవిలూరు వెళ్ళాలని అనుకున్నప్పుడు, నా మనసులో ఉన్నదల్లా, ఎనిమిది వీరట్టాణాల్లో అది కూడా ఒకటని మటుకే. కాని, అక్కడ అడుగుపెట్టాకే అది ప్రసిద్ధ వైష్ణవక్షేత్రమనీ, 'నడునాడు తిరుపతి' అని పిలుస్తారనీ, నూట ఎనిమిది దివ్యదేశాల్లో అది కూడా ఒకటనీ తెలిసింది.

నాయనార్ల గీతాలని. 'తేవారమ'ని పిలిచినట్టే, ఆళ్వారుల గీతసంకలనాన్ని 'నాలాయిర దివ్యప్రబంధం' అని పిలుస్తారు. అంటే నాలుగు వేల కీర్తనల సంపుటమన్నమాట. నాయనార్ల గీతాల్లో 276 పాటలు పుట్టిన స్థలాలు ఉన్నట్టే, ఆళ్వారుల పాశురాల్లో 108 దివ్యదేశాల ప్రసక్తి, వర్ణన కనిపిస్తాయి. అందులో దాదాపు ఎనభైకి పైగా తమిళనాడులోనూ, తక్కినవి భారతదేశమంతటా, ఒకటి నేపాల్లోనూ ఉన్నాయి. పార్థివలోకానికి చెందని పాలకడలీ, పరమపదమూ కూడా ఆళ్వారులు దర్శించి వర్ణించిన దివ్యదేశాల్లో ఉన్నాయి.

తిరుక్కోవిలూరు అటువంటి దివ్యదేశాల్లో ఒకటనీ, ముందు పెరుమాళ్ళు ఆలయం చూసేక అప్పుడు శివాలయానికి వెళ్ళవచ్చుననీ అక్కడి సిబ్బంది సూచించారు. ఆ విష్ణ్వాలయంలోని దేవుడు 'ఉలగం అలైమ్ద పెరుమాళ్ళు'. అంటే 'లోకాన్ని కొలిచిన దేవుడు' అని అర్థం. మమ్మల్ని ముందు అమ్మవారి సన్నిధికి తీసుకువెళ్ళారు. అక్కడ దర్శనం అయినతర్వాత స్వామివారి సన్నిధికి తీసుకువచ్చారు.

వామనుడు త్రివిక్రముడిగా లోకాన్ని కొలిచిన మూర్తిగా అక్కడ పూజ లందుకుంటున్నాడు. ఒకపాదం ఆకాశాన్ని ఆక్రమించడంతో ఒక పాదం మాత్రమే నేలమీద ఆని ఉంది. ఆ పాదమే పరమపదంగా ఆ దేవుడు అత్యంత ప్రాచీన కాలం నుంచీ అక్కడ కొలువై ఉన్నాడు. మేము వెళ్ళింది దసరా రోజులు కావడంతోనూ, అది కూడా విష్ణ్వాలయం కావడంతోనూ ఆలయ ప్రాంగణంలో మంగళవాద్యాలు, చందన,

కర్పూర పరిమళాలు, రంగురంగుల పూలు, వస్త్రాలు, అలంకారాలతో కన్నుల పండువులాగా ఉంది.

అక్కణ్ణుంచి మమ్మల్ని ఆ ప్రాంగణంలోనే మరొకపక్కగా ఉన్న శ్రీవేణుగోపాల స్వామి ఆలయానికి తీసుకువెళ్ళారు. వేణుగోపాలస్వామి ఎక్కడున్నా భక్తులు ఆయన్ని సంతానవేణుగోపాలుడిగా మార్చేస్తారు కదా. అక్కడ కూడా పిల్లలకోసం మొక్కుకున్న చిన్ని చిన్ని ఊయలలూ, ఆ ఊయెలల్లో అనేకబాలకృష్ణులూ కనిపిస్తున్నారు. గర్భగుడిలో రుక్మిణీ సత్యభామా సమేతుడైన వేణుగోపాలుడు ఆ వేళ మరింత శోభిస్తూ ఉన్నాడు. కనకాభరణాలతోనూ, ముత్యాలమాలలతోనూ విరాజిల్లుతున్న ఆ మూర్తిని చూపిస్తూ, అక్కడి మిత్రుడు, 'ఇవాళ పురట్టాసి మాసం మూడో శనివారం. మాకు చాలా ముఖ్యమైన రోజు. మీవల్ల మాకు కూడా ఇంత అందమైన దర్శనం దొరికిందీ రోజు' అన్నాడు. నిజానికి, ఆ దర్శనం వాళ్ళ వల్ల నాకు దొరికింది!

ఆ అర్చకుడు స్వామివారికి హారతి ఇచ్చి సుమధుర స్వరంతో దివ్యప్రబంధం నుంచి గీతాలు ఆలపించాడు. ఆపైన మాకు తీర్థప్రసాదాలు అందిస్తూ తాను పఠించిన పాశురాలు తొలి ఆళ్వారులవని చెప్పాడు. అప్పుడు గుర్తొచ్చింది నాకు, ఇక్కడే కదా తొలి ఆళ్వారులకి దివ్యదర్శనం సంభవించింది అని! ఎట్లా మర్చిపోయేను, తిరుక్కోవిలూరు అనగానే, నా మనసులో అన్నిటికన్నా ముందు మెదలవలసిన మహిమాన్విత ఘట్టమదే కదా అనుకున్నాను.

తమిళ వైష్ణవంలోనూ, భారతీయ భక్తి సాహిత్య చరిత్రలోనూ అదొక ఉజ్జ్వలఘట్టం. దాదాపు పదమూడు శతాబ్దాల కిందటి మాట. అప్పుడు తిరుక్కోవిలూరులో కుండపోతగా వాన కురుస్తోంది. పట్టపగలే చీకటి కమ్మినట్టుగా ఉంది. మనిషిని మనిషి పోల్చుకోలేనంత గాఢాంధకారం. ఆ కుంభవృష్టిలో, ఆ చిమ్మచీకటిలో, పొయ్ గై ఆళ్వారు అనే ఒక విష్ణుభక్తుడు తలదాచుకోడానికి చిన్న నడవా ఒకటి దొరికింది. బయట ధారాపాతంగా కురుస్తున్న వాననుంచి తప్పించుకుని ఆయన ఆ చిన్ని నడవాలో ముణగదీసుకుని పడుకున్నాడు.

కొంతసేపటికి మరొక మనిషి ఆ చోటులో అడుగుపెట్టాడు. అతడి పేరు భూతత్తాళ్వారు. ఆయన్ని చూసి అప్పటిదాకా అక్కడ పడుకున్న మనిషి లేచి కూచుని, 'ఈ చోటు ఒక్కరికైతే పడుకోడానికి సరిపోతుంది. కానీ, ఇద్దరమైతే కూచోడానికే సరిపోతుంది, పర్వాలేదు, ఉన్న జాగానే పంచుకుందాం' అన్నాడు. మరికొంతసేపటికి మరొక మనిషి కూడా అక్కడ అడుగుపెట్టాడు. ఆయన పేరు పేయాళ్వారు. ఆయన్ని చూడగానే, అంతదాకా అక్కడ కూచున్నవాళ్ళిద్దరూ లేచి నిలబడి 'ఈ చిన్ని చోటు

ఇద్దరికైతే కూచోడానికి సరిపోతుంది, ముగ్గురైతే నిలబడవలసి ఉంటుంది, పర్వాలేదు, ఎట్లానో సర్దుకుందాం' అన్నారు. ఆ ముగ్గురూ ఆ ఇరుకు జాగాలో ఒకరినొకరు ఆనుకుని నిలబడి ఉండగా మరొకరెవరో, నాలుగవ మనిషి కూడా తమ మధ్యకు వచ్చినట్టనిపించింది వాళ్ళకి. అతడెవరో ఉనికి తెలుస్తున్నది కాని, మనిషి కనిపించడం లేదు. అంతేకాదు, ఆ నాలుగవ మనిషి బలంగా ఆ ముగ్గురినీ దగ్గరకు లాక్కుంటున్నట్టుగా అనిపించడం మొదలుపెట్టింది వాళ్ళకి. కొంతసేపటికి, ఆ ముగ్గురికీ, తమ మధ్య తమకి అనుభవానికి వస్తున్న ఆ ఉనికి సర్వేశ్వరుడిదేనని అర్థమయింది.

అప్పుడు మొదటి ఆళ్వారు, గొంతు పెగుల్చుకుని, ఒక పద్యం చెప్పారు:

**ఈ లోకమొక ప్రమిదగా, సముద్రాలు నేయిగా**
**సూర్యుణ్ణి వత్తిచేసి, దీపం వెలిగిస్తాను.**
**సముద్రమంత దుఃఖం నుంచి నన్ను తప్పించగల**
**సుదర్శనధారి చరణకమలాలకు సమర్పిస్తాను.**

అది ఆరంభ క్షణం. తర్వాతి రోజుల్లో భక్తి సాహిత్యాన్నీ, భక్తి ఉద్యమాన్నీ సుసంపన్నం చేసిన శ్రీవైష్ణవం, శ్రీమద్భాగవతం, శ్రీమద్రామానుజులు, మధ్వాచార్యులు, వల్లభాచార్యులు, చైతన్యమహాప్రభువు, గీతగోవిందం, ఆండాళ్, ఆముక్తమాల్యద, మీరా, సూర్‌దాస్, చండీదాస్, విద్యాపతి, పోతన, నారాయణతీర్థుల సమస్త కృష్ణభక్తి సాహిత్యమంతా క్షణమే ప్రభవించింది.

తొలి ఆళ్వారునోటి వెంటా వెలువడ్డ ఆ పద్యం వినగానే, భూతత్తాళ్వారు తాను కూడా ఒక పద్యం చెప్పారు:

**ఈ పద్యంతో నేను ప్రేమని ప్రమిదచేసి,**
**తత్పరత నేయిగా పోసి, జ్ఞానం వత్తిగా**
**ఒక దీపం వెలిగించాను, ఆయనకే**
**నా జీవితం అంకితమొనరుస్తాను.**

అప్పుడు మూడవ ఆళ్వారు తాను కూడా ఒక పద్యం చెప్పకుండా ఉండలేక పోయారు. కాని, అది తమ మధ్య అనుభవానికొస్తున్న ఉనికిని ఒక వెలుగుగా మాత్రమే కాక, దివ్యమంగళ రూపంగా దర్శించి, వర్ణించి గానం చేసారు:

**ఇప్పుడే ఈ క్షణమే నా కళ్ళముందొకదివ్యదర్శనం కలిగింది**
**నీలసముద్రుడులాంటి నా స్వామితో జగన్మాత కనిపించింది**

**సూర్యతేజంతో వెలుగుతున్న ఆయన వదనాన్ని చూసాను,**
**సమరసంహారం చేస్తున్న చక్రం చూసాను, శంఖం చూసాను.**

అపూర్వమైన ఈ సంఘటనని, ఇప్పటికి అయిదువందల ఏళ్ళ దట, అన్నమయ్య మనమడు, చిన్నన్నగా ప్రసిద్ధి కెక్కిన తాళ్ళపాక తిరువేంగళనాథుడు, తన 'పరమయోగి విలాసము' లో ఈ విధంగా (1:871–910) వర్ణించాడు:

**మనము మువ్వురమిందు మసలనెన్నడును**
**జనుదెంచి తన రూపు చందంబు డాచి**
**యిరికెడి నడుమ వీడెవ్వడో వీని**
**తెరగు తెల్లంబుగా తెలియుద మనుచు**
**అచ్చెరు పడుచుండి రయ్యాదియోగి**
**నిచ్చలంబగు భక్తి నిలిపి డెందమున**

**ధరణి పంతియ సముద్రంబులు నేయి**
**అరుణు దీపము చేసి అరుణాంశుతతుల**
**గారాబు చక్రంబుకై పూన్చినట్టి**
**నీరజాక్షున కిచ్చి నీరాజనంబు**

**అంత రెండవయోగి అతనిపై ప్రేమ**
**పంతియ, మితిలేని భక్తియే చమురు**
**ఆనందభరితమైన హృదబ్జంబె వత్తి**
**గానొనరించి వికాసమై ఆత్మ**
**తిర మొందు జ్ఞానంబు దీపంబు చేసి**
**పెరిమె నారాయణార్పితము కావించె**
**బంధుర జ్ఞాన దీప ప్రకాశమున**
**అంధకారంబెల్ల నణగెనవ్వేళ**
**అనుపముడైన మూడవయోగి శౌరి**
**తనముందరను ప్రత్యక్షమై నిలువ**

**సిరి గంటి చెన్ను మించిన మేను కంటి**
**కరమొప్పు వదన వికాసంబు కంటి**

**సల్లలితావనీ స్తనకుంభశుంభ**
**పల్లవంబుల పోలు పాదముల్గంటి**
**సరసిజ హల శంఖ చక్రాంకుశాంక**
**చరణముల్ జగదేక చరణముల్ కంటి**
**దరణిబింబము చాయ తరళించు కనక**
**సురుచిరాంశుకము నంశుకము కన్గొంటి**
**శ్రీమించు కటితట శ్రీసతీవరణ**
**దామముల్ మేఖలాదామముల్గంటి**
**వాత్సల్యజలధి కైవడి నొప్పుచున్న**
**వత్సంబు కంటి, శ్రీవత్సంబు కంటి**
**చుట్టు కైదువు, వల చుట్టు శంఖంబు**
**పట్టి చూపట్టిన బాహువుల్గంటి**
**శాంతాశుమండల శతకోటికోటి**
**రీతి చూపట్టు కిరీటంబు కంటి**
**మలగులై తెల్లతామరల తామరల**
**కలహించు నిడువాలుకన్నుల కంటి**
**మకరకుండల మార్తాండ రుచుల**
**వికసించు వదనారవిందంబు కంటి**

ఆ సాయంకాలం నా సంతోషానికి అంతం లేదు. ముగ్గురు నాయనార్లూ పుట్టిన ఊళ్ళు తిరగడానికి అంతదాకా వారం రోజులు పట్టిన నాకు ఆ రాత్రిపూట ఆ తొలి ఆళ్వార్లు ముగ్గుర్నీ ఒక్కచోటే ఒక్కసారిగా కలుసుకోగలిగాననిపించింది.

# స్వర్గానికి వెళ్లాలని తొందరపడ్డ కవయిత్రి

**అ**సలు తిరుక్కోయిలూరు మట్టిలోనే ఏదో మహత్తు ఉందనిపిస్తుంది. రెండువేల ఏళ్ళ తమిళ సాహిత్యంలోని ప్రధానదశలన్నీ పొరలుపొరలుగా పేరుకున్న చోటు ఎక్కడన్నా ఉందా అంటే బహుశా మధురై తర్వాత తిరుక్కోయిలూరు అనే చెప్పవలసి ఉంటుంది. సంగం సాహిత్యం నుంచి రమణమహర్షిదాకా మహాకవుల పాదముద్రలెన్నో తిరుక్కోయిలూర్ తెన్ పెన్న నది ఒడ్డున కనిపిస్తాయి.

ఆ సాయంకాలం మేము వామనావతార ఆలయం నుంచి వీరట్టానేశ్వరుడి ఆలయానికి వెళ్ళాం. అత్యంత ప్రాచీనమైన ఆ శివాలయంలో శివుడు అంధకాసురుణ్ణి దునుమాడిన వీరుడు. ప్రస్తుతం ఉన్న నిర్మాణం పల్లవుల కాలంలో మొదలై చోళ రాజుల కాలంలో పూర్తి స్థాయికి చేరుకుంది. రాష్ట్రకూటులనుంచి విజయనగర కాలందాకా కూడా ఆ దేవాలయానికి రాజాదరణ లభించినట్టుగా శాసనాలున్నాయి.

ఆ రోజు గుడిముంగిలి దసరా ఉత్సవాలతో కలకల్లాడుతూ ఉంది. మేము గుడిలో అడుగుపెట్టగానే మమ్మల్ని నేరుగా స్వామి దర్శనానికి తీసుకుపోకుండా కుడివైపుగా ఉన్న వినాయకుడిదగ్గరకు తీసుకువెళ్ళారు. అక్కడ గోడమీద ఒక సుదీర్ఘమైన గీతం ఉంది. అది అవ్వయ్యారు రాసిన 'వినాయగర్ అగవల్' అని చెప్పారు. ఆ గీతం కింద చిన్న బొమ్మ ఒకటి రాతిలో చెక్కి ఉంది. ఆ బొమ్మగురించీ, ఆ కవిత గురించీ అక్కడివాళ్ళు మనోహరమైన ఒక ఐతిహ్యం చెప్పుకొచ్చారు.

అవ్వయ్యారు ప్రాచీన తమిళదేశానికి చెందిన ఒక జ్ఞాని, వివేకి, కవయిత్రి. నిజానికి, ఆమె ఒకరు కాదనీ, ఆ పేరు మీద కనీసం ముగ్గురున్నారనీ పరిశోధకులు చెప్తున్నారు. మొదటి అవ్వయ్యారు సంగం కాలం నాటి కవయిత్రి. సంగకాలం నాటి సంకలనం 'పురనానూరు' లో ఆమె పేరుమీద దాదాపు అరవై కవితలదాకా ఉన్నాయి. రెండవ అవ్వయ్యారు పదవశతాబ్దానికి చెందిన చోళరాజుల కాలం నాటి కవయిత్రి. కంబమహాకవికి సమకాలికురాలు. 'అవ్వై కురల్' పేరిట ఆమె పద్యసంపుటం ఒకటి

లభ్యమవుతూ ఉంది. ఆమెని కూడా ఒక వివేకిగా ప్రస్తుతించే కథలెన్నో ఉన్నాయి. ఒకప్పుడు ఆమె దారిన పోతూండగా ఒక సాలీడు గూడు కట్టుకుంటూ కనిపించిందట. ఆమె ఆ సాలీడుని చూపిస్తూ, తన పక్కనున్నవారితో, 'ఈ సాలీడు కన్నా కంబరు ఏ విధంగా అధికుడు? ఇద్దరిదీ అల్లికనే కదా' అన్నదట. మూడవ అవ్వయ్యారు పన్నెండు పదమూడు శతాబ్దాలకు చెందిన కవయిత్రి. 'వినాయగర్ అగవల్' ఆమె సుప్రసిద్ధ గీతం.

ఆ రోజు అక్కడివాళ్ళు చెప్పిన ఐతిహ్యం 'వినాయగర్ అగవల్' రాసిన అవ్వయ్యారు గురించి. ఒకరోజు ఆమె వినాయకుడికి తొందర తొందరగా పూజచేస్తూ ఉన్నదట. ఆమె మనసు మనసులోలేదని గమనించిన వినాయకుడు 'ఎందుకంత తొందర' అనడిగాడట. అందుకామె 'చూడు, సుందరమూర్తీ, చేరమాన్ పెరుమాళూ స్వర్గానికి వెళ్ళిపోతున్నారు, వాళ్ళని తీసుకువెళ్ళడానికి ఐరావతం దిగి వచ్చింది, నేను కూడా వాళ్ళతో పాటు వెళ్ళకపోతే స్వర్గానికి చేరుకోలేను, అందుకే తొందర తొందరగా పూజచేస్తున్నాను' అని చెప్పిందట.

అప్పుడు వినాయకుడు ఆమెతో 'తొందర వద్దు, నెమ్మదిగా పూజచేసుకో, నిన్ను వాళ్ళిద్దరి కన్నా ముందు కైలాసానికి చేరుస్తాను' అన్నాడట. అన్నట్లే ఆమె పూజ ముగించేటప్పటికి ఆమెను తన తొండంతో పైకెత్తి నేరుగా కైలాసానికి చేర్చాడట. అదంతా అక్కడ రాతిమీద బొమ్మగా చెక్కిఉంది. ఆ బొమ్మలో అవ్వయ్యారు ముందుగా కైలాసానికి చేరుకుంటే, సుందరమూర్తీ, చేరమాన్ పెరుమాళూ ఆమె వెనగ్గా కైలాసంలో అడుగుపెడుతూ కనిపిస్తున్నారు.

ఆ కథ వినగానే నాకు నా రాజమండ్రి రోజులు గుర్తొచ్చాయి. అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి. ఇరవై ఏళ్ళ వయసు. కాని, రాజమండ్రిలో నా మిత్రులు గోదావరి గట్టుమీద సాయంకాలాలు కూచుని సాహిత్యం గురించి మాట్లాడుకుంటూ ఉంటే, వాళ్ళప్పటికే ఒక కావ్యస్వర్గంలో అడుగుపెట్టారనీ, నేను వాళ్ళ కన్నా ఎంతో వెనకబడి ఉన్నాననీ నాకొకటే గుబులుగా ఉండేది. అందుకని ప్రతి రాత్రీ గోదావరి గట్టునుంచి నా రూముకి చేరుకోగానే, ఏ పుస్తకం దొరికితే ఆ పుస్తకం తొందర తొందరగా చదివెయ్యడానికి ఉపక్రమిస్తూండేవాణ్ణి.

'వినాయగర్ అగవల్' అవ్వయ్యారు కృతులన్నిటిలోకీ అత్యంత సుమనోహరమైన రచనగా తమిళ ప్రజల మన్ననలందుకుంది. 'అగవల్' అనేది మన మంజరీ ద్విపద లాంటి ఛందస్సు. సంగం కాలం నాటి ఛందస్సు. సరళంగానూ, శ్రోతృ సులభంగానూ ఉండే ఆ ఛందస్సుని అవ్వయ్యారు పూర్తిగా సానబెట్టింది.

**శీతక్కలభ సెందామరైపుం**
**పాధై సిలంబు పల ఇసై పాడ**
**పొన్ అరైగ్నానం పూంథుగిలాడయుం**
**వన్న మరుంగిల్ వళందర ఎడిప్ప**
**పేళై వయిరుం పెరుంబార కోడుం..**

తమిళం మీదా, తెలుగు మీదా సమానమైన అధికారం, ఇష్టం ఉన్న భావుకుడెవరేనా ఈ గీతాన్ని ద్విపదలోనో, రగడలోనో అనుసృజిస్తే చదవాలని ఉంది. కాని, ఇప్పటికైతే ఒక చరణాన్నిట్లా తెలుగు చేస్తున్నాను:

**శీతల చందనచర్చ చేసిన**
**కెందామర పాదాల సరిమువ్వ గజ్జెలు**
**పాటలు పాడగా, ఆ బంగారుమొలనూలు**
**కుసుమపేశలమైన ఆ వస్త్రాలు**
**ఇంద్రచాపపు రంగులీనగా,**
**ఆ చిరుబొజ్జ, నిండైన దంతం**
**ఏనుగు వదనంపైన సిందూరచుక్క**
**అయిదు చేతులు, పాశం, అంకుశం**
**ఆ నీలదేహుడు మనమనసుల్ని పట్టిలాగగా,**
**వేలాడే తొండం, నాలుగు జతల బుజాలు**
**మూడు కళ్ళు, నును పాదముద్రలు**
**రెండు చెవులు, బంగారుశిరోజాలు**
**యజ్ఞోపవీతం కదలాడే ఆ విశాలవక్షం**
**తురీయస్థితిని తెలుసుకున్న దివ్యజ్ఞాని**
**వాగనుశాసనుడు, కల్పవృక్షంలాంటి**
**ఆ గజముఖుడిముందు చేష్టలుడిగి నిల్చున్నాను.**

స్వామి దర్శనం అయ్యాక గర్భాలయం చుట్టూ ఒక ప్రదక్షిణం చేస్తూండగా, ఆ అర్చకుడు మావెంటనే నడుస్తూ అడుగడుగునా అక్కడ ఉన్న ప్రతి శిల్పాన్ని వివరిస్తూ, ఆ శిల్పం వెనక ఉన్న కథల్నీ, చరిత్రనీ చెప్పుకొచ్చాడు. వెయ్యేళ్ళుగా ఆ దేవాలయ శిల్పాలు ఇట్లా తమ కథల్ని ఎందరు సందర్శకులకు చెప్తూ వచ్చాయో కదా.

ఆ రాత్రిపూట, అతడట్లా ఒక దీపం చేత్తో పట్టుకుని ఒక్కొక్క శిల్పం దగ్గరే ఆగుతూ, దీపం పైకెత్తి ఆ శిల్పాన్ని చూపిస్తూ, ఆ కథలు వివరిస్తూ ఉండే దృశ్యం మరవడం కష్టం.

దర్శనమయ్యాక పక్కనే ఉన్న అమ్మవారి ఆలయంలో కూడా దర్శనం చేసుకుని, గుడిముంగట మంటపంలో కూచున్నాం. పెరుమాళ్ళు ఆలయంలో మాకోసం పెద్ద గిన్నె నిండా పులిహోర ఇచ్చారు. అందరం ఆ మంటపంలో కూచుని ఆ పులిహోర ఆవురావురుమంటూ తిన్నాం. అప్పుడు గుర్తొచ్చింది నాకు, దాదాపు నూట పాతికేళ్ళ కిందట, రమణ మహర్షి కూడా మేము కూచున్న చోటనే కూచున్నాడనీ, దేవాలయ మంగళవాద్యకారుడు తనవంతు ప్రసాదాన్ని ఆయనకి అందిస్తే అట్లానే ఆవురావురుమంటూ భుజించాడనీ.

వేంకటరామన్ మధురైకి చెందిన ఒక యువకుడు. అతడికి చిన్నప్పణ్ణుంచీ పెరియపురాణం అంటే ప్రాణం. శివభక్తుల కథలు ఆయన్ని వశపర్చుకున్నాయి. మిషనరీ స్కూల్లో చదువుకునే ఇంగ్లీషు చదువు మీద అతడి దృష్టి నిలిచేది కాదు. రోజూ బడికి వెళ్తున్నప్పుడు ఆకాశం కేసి చూసేవాడు. వృషభవాహనుడైన శివుడు పార్వతితో కూడి సంబంధులకు దర్శనమిచ్చినట్టే తనకి కూడా కనబడతారని ఆశగా చూసేవాడు. ఒకరోజు అతడి బంధువొకాయన ఇంటికి వచ్చినప్పుడు ఎవరో ఆయన్ని ఎక్కణ్ణుంచి వస్తున్నారు అని అడిగారు. 'తిరువణ్ణామలై' అన్నాడాయన.

ఆ మాట వినగానే వేంకట రామన్ తల్లకిందులైపోయాడు. ఆ మాట ఆయన్నింక ఇంటిలో నిలవనివ్వలేదు. తన సోదరుడు పరీక్ష ఫీజు కట్టమని ఇచ్చిన డబ్బులో రైలు టిక్కెట్టుకి సరిపడా డబ్బు తీసుకుని, ఒక ఉత్తరం రాసిపెట్టి, ఆ యువకుడు ఇల్లు వదిలిపెట్టేసాడు. తిరువణ్ణామలై వెళ్ళడం కోసం 'తిండివనం' దాకా టికెట్టు కొనుక్కున్నాడు. మధ్యలో రైల్లో కలిసినవాళ్ళెవరో, తిరువణ్ణామలై వెళ్ళడానికి తిండివనం దాకా వెళ్ళవలసిన అవసరం లేదనీ, విల్లుపురం దగ్గర దిగిపోవచ్చునీ చెప్పారు. ఆయన విల్లుపురం దగ్గర దిగి మాంబళపట్టు స్టేషను దాకా టికెట్టు కొనుక్కున్నాడు. అక్కడ దిగి తిరువణ్ణామలై వైపు నడక సాగించాడు. పదిమైళ్ళు నడిచేటప్పటికి తిరుక్కోవిలూరు పొలిమేరల్లో ఉన్న 'అరయని నల్లూరు' శివాలయానికి చేరుకున్నాడు.

ఆ గుడిలో అడుగుపెట్టి ఒక స్తంభం దగ్గర నీరసంగా జారగిల్లాడు. ఇంతలో ఆయనకి ఆ దేవాలయాన్నంతటినీ చుట్టబెడుతున్నట్టు గొప్ప వెలుగు కనిపించింది. ఆ వెలుగు గర్భగుడి లోంచి వస్తున్నదేమో చూతామని ఆయన లేచి ముందుకు అడుగేసాడు. కాని, ఆ వెలుగు మళ్ళా కనబడలేదు. గర్భాలయంలో కూడా కనిపించలేదు. (కాని ఆ రోజు తాను చూసిన ఆ వెలుగు అప్పటికి పదమూడువందల ఏళ్ళ కిందట జ్ఞానసంబంధ

నాయనారుకి కూడా అదే చోట కనిపించిందని ఆయనకి తర్వాత తెలిసింది.)

ఆయన అక్కడే ధ్యానంలో కూచునిపోయాడు. కాని దేవాలయం తలుపులు మూసేవేళ అయ్యిందని చెప్పి పూజారులు ఆయన్ని అక్కణ్ణుంచి బయటకి పంపించేసారు. అప్పుడాయన మరలా అక్కణ్ణుంచి నడక సాగించి మేము చూసిన వీరట్టానేశ్వరుడి గుడికి వచ్చాడు. ఆ గుడిలో మరొకసారి ధ్యానపరవశుడయ్యాడు. మెలకువ వచ్చేటప్పటికి విపరీతంగా ఆకలి వేసింది. అన్నమో, ప్రసాదమో ఏదో ఒకటి పెట్టమని అక్కడి అర్చకుల్ని అడిగాడు. వాళ్ళతడిమీద కసురుకున్నారు. అప్పుడు దేవాలయంలో మంగళవాద్యాలు వాయించే బృందానికి చెందిన ఒకాయన తన వంతు ప్రసాదం ఆ పిల్లవాడికి పెట్టాడు. ఆ పిల్లవాడు ఆవురావురుమంటూ ఆ అన్నం తిని మంచినీళ్ళ కోసం గుడి బయట ఉన్న ఇళ్ళవైపు అడుగేసాడు. కాని ఆకలికీ, నడకకీ తట్టుకోలేని ఆ దేహం సొమ్మసిల్లి పోయింది. అక్కడే తెలివి తప్పిపడిపోయాడు. కళ్ళు తెరిచేసరికి ఒక గుంపు తనచుట్టూ నిలబడి చోద్యం చూస్తున్నది. ఆయన లేచి మంచినీళ్ళు తాగి మళ్ళా నడక సాగించాడు. మర్నాడు గోకులాష్టమి కావడంతో ఆ మర్నాడు ఆయనకి విందుభోజనం లభించింది.

అక్కణ్ణుంచి తిరువణ్ణామలై వెళ్ళడానికి ఆయన తన చెవిపోగు కుదువపెట్టి నాలుగణాలు సంపాదించి ఎట్లానో తిరువణ్ణామలై చేరుకున్నాడు. చేరుకోగానే నేరుగా అరుణాచలేశ్వరుడి గుడికి వెళ్ళిపోయాడు. అక్కడ దేవాలయ ద్వారాలు, గర్భాలయ ద్వారాలు పూర్తిగా తెరిచి ఉన్నాయి. ఆయన నేరుగా అరుణాచలేశ్వరుడి ముందుకు వెళ్ళి నిల్చున్నాడు. నమస్కరించాడు. 'తండ్రీ, నీ పిలుపు విని ఇల్లు వదిలిపెట్టి వచ్చేసాను. ఇంక నన్నేమి చేసుకుంటావో అది నీ ఇష్టం' అన్నాడు. అలా అన్నవాడు, తన చివరి క్షణాల దాకా, అరుణాచలసన్నిధిలోనే యాభై నాలుగేళ్ళపాటు ఉండిపోయాడు. ఒక్కరోజు కూడా ఆ అరుణాచలాన్ని వదిలిపెట్టి మరెక్కడికీ వెళ్ళిందిలేదు.

# ఆయనది మానసిక యాత్ర

శ్రీరంగం చూడాలని నాకెంతో కాలంగా మనసులో ఉన్నా అంత తొందరగా చూస్తానని అనుకోలేదు. దుర్గాష్టమిరోజు సెలవు కావడంతో విజ్జీ, పిల్లలూ నన్ను చూడటానికి వచ్చారు. ముందురోజు సాయంకాలం తిరుక్కోయిలూరు వెళ్ళాం. మర్నాడు ఎక్కడికేనా వెళ్ళాలి అనుకున్నప్పుడు విజ్జి సిర్వాచూర్ అమ్మవారిని చూడాలని అనుకుంది. సిరువాచూరు విల్లుపురం తిరుచిరాపల్లి రహదారి మీదనే ఉంది. అక్కడి దేవత మధురకాళి అమ్మన్. శిలప్పదికారంలో కన్నగి మధురై నగరం మీద ఆగ్రహించి తన దుఃఖంతో ఆ నగరాన్ని దగ్ధం చేసేసాక కొన్నాళ్ళ పాటు మతిస్థిమితంలేకుండా సంచరించి సిర్వాచూర్ చేరుకున్నాక స్థిమితపడిందని చెప్తారు. ఆమె ద్వారా మధురైని దహించివేసిన కాళి అమ్మన్ సిర్వాచూర్‌లో శాంతించి కొలువైందని ఐతిహ్యం.

సిర్వాచూర్ వెళ్ళినతరువాత తెలిసింది, శ్రీరంగం అక్కణ్ణుంచి అరగంట దూరంలోనే ఉందని. శ్రీరంగం చూడగలనని అనుకోగానే నా గుండె వేగంగా కొట్టుకుంది. ఒక రాజాధిరాజుని, చక్రవర్తిని చూడబోతున్నామంటే కలిగే తత్తరపాటు. నా చిన్నప్పుడు తాడికొండలో మా ప్రిన్సిపాలుగారు నన్ను పిలిపించినప్పుడు అట్లాంటి కలవరపాటు కలిగేది. ఆమెకి నేనంటే వల్లమాలిన వాత్సల్యం. కాని నాకు ఆమెని చూస్తే ఒకటే దడగా ఉండేది. కాళ్ళు వణికిపోయేవి. గొంతు గుటక పడేది కాదు. శ్రీరంగనాథ స్వామికి అతి చేరువలో ఉన్నానని తెలిసినప్పుడు నా మనఃస్థితి అట్లానే ఉండింది.

అప్పటికే రోజు దాదాపుగా అయిపోవచ్చింది. శ్రీరంగం వెళ్ళినా కూడా రెండు మూడు గంటల కన్నా ఎక్కువ సేపు ఉండే అవకాశం లేదు. ఆ ఊళ్ళో, ఆ దేవాలయంలో ఒక్కొక్క ఆళ్వారునీ తలుచుకుంటూ ఒక్కొక్కరోజేనా కనీసం రెండువారాలేనా గడపవలసిన చోటు. రెండు గంటల్లో ఏమి చూస్తాం? ఏమి గ్రహిస్తాం?అయినా శ్రీరంగం వెళ్ళాలనే అనుకున్నాను. ఒకసారి అక్కడ అడుగుపెట్టి, శ్రీరంగం చూసి నా కళ్ళతో శ్రీరంగం చూసానని చెప్పుకోడానికి. గంగ ఒడ్డున వారణాసిని చూసాను కాబట్టి, కావేరి ఒడ్డున

శ్రీరంగాన్ని చూసినట్లయితే, నా ఉత్తర దక్షిణ ధ్రువాలను కలుపుకున్నట్టు అవుతుందనుకున్నాను.

నిజంగానే ఆ సాయంకాలం మేము శ్రీరంగంలో రెండు గంటల కన్నా ఎక్కువసేపు ఉండలేకపోయాం. మర్నాడు తెల్లవారుజామునే విజ్జి పిల్లలు చెన్నై వెళ్ళిపోవాలి కాబట్టి ఆ రాత్రికి మేం మళ్ళా విల్లుపురం చేరుకోక తప్పదు.

కాని అక్కడ గడిపిన ఆ కొద్దిసేపట్లోనూ నాకు నిజంగానే ఒక రాజధానిలో గడిపినట్టనిపించింది. చిదంబరం తమిళశైవానికి ఆధ్యాత్మిక రాజధాని ఎలానో, శ్రీరంగం తమిళ వైష్ణవానికి రాజధాని. అయితే అది కేవలం ఆలంకారిక అర్థంలో మాత్రమే కాదు. శ్రీరంగం నిజంగానే ఒక కోట. దుర్భేద్యమైన ఆ ప్రాకారాలు, సమున్నతమైన ఆ కుడ్యాలు, ఆకాశంలోకి చొచ్చుకుపోయే ఆ గోపురాలు, ఆ మంటపాలు, ఆ స్తంభాలు మనమొక దేవాలయ ప్రాంగణంలో మాత్రమే కాదు, శతాబ్దాలుగా దండయాత్రల్నీ, యుద్ధాల్నీ, కల్లోలాన్నీ చవిచూసిన ఒక రాజనగరులో కూడా సంచరిస్తున్నామనిపిస్తుంది.

దాదాపు నూట అరవై ఎకరాల విస్తీర్ణంలో సప్తప్రాకారాలతో, ఇరవైఒక్క గోపురాలతో కావేరి, కొల్లిడం నదుల మధ్య ఒక సుందరద్వీపంలో నెలకొన్న శ్రీరంగనాథ స్వామి ఆలయం ప్రపంచంలో అత్యంత విశాలమైన ఆలయసముదాయం. విస్తృతిలోనూ, నిర్మాణాల్లోనో బహుశా ఆంకార్‌వాట్ దేవాలయ సముదాయం ఒక్కటే శ్రీరంగం కన్నా పెద్దది కావచ్చుగాని, నిత్యధూపదీపార్చనలు అందుకుంటున్న దేవాలయంగా చూసినప్పుడు ప్రపంచమ్మొత్తం మీద ఇంత పెద్ద దేవాలయం మరొకటి లేదు. దేవాలయ దక్షిణ గోపురం ఆసియాలోని అతి పెద్ద గోపురం. నిజానికి, శ్రీరంగం పట్టణం మొత్తాన్ని మనం దేవాలయ ప్రాంగణంగా చెప్పుకోవచ్చు. ప్రాచీన ఆగమాల ప్రకారం, దేవాలయ వాస్తు ప్రకారం నిర్మాణం జరిగిన ఒక పరిపూర్ణ నగరంగా శ్రీరంగాన్ని ఇప్పటి నగరవాస్తు నిపుణులు కొనియాడుతున్నారంటే ఆశ్చర్యం లేదు.

ఆ రోజు పండగ సంరంభం కూడా తోడవడంతో సందర్శకులు అప్పటికే బారులు తీరి ఉన్నారు. మేము ఆ దేవాలయంలోకి అడుగుపెట్టి కొద్దిగా చూద్దామనుకునేలోపలే, దర్శనానికి తీసుకువెళ్ళిపోయారు. ఆ గర్భగుడిలో స్వామి, ఆ శయనమూర్తి, ఎవరిని చూసి, ఆండాళ్ 'నాచ్చియార్ తిరుమొళి' పాడకుండా ఉండలేకపోయిందో, ఆ శయన సుందరమూర్తి, శతాబ్దాల చరిత్ర చూసిన ఆ గంభీరమూర్తి శాంతసుప్రసన్నంగా దర్శనమిచ్చాడు.

ఏడాది పొడుగునా, స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలు ధరించి స్వామి దేహం కందిపోయి ఉంటుందని, ఏడాదికొకసారి నలభై రోజుల పాటు ఆయన నగలూ, పట్టు

పీతాంబరాలూ లేకుండా సరళ వస్త్రాలు ధరించి ఉంటాడట. అందుకని మేము వెళ్ళినప్పుడు నిరలంకారంగానూ, నిరాడంబర సత్త్వమూర్తిగానూ కనిపించాడు. ఆ నలభై రోజులూ ఆయన వంటికి తైలం పట్టించి ఉంచుతారట. నాకు ఆ మూర్తిని అట్లా చూసినప్పుడు కొంత చిలిపి భావన కూడా కలిగింది. మనమొక గ్రామపెద్దని కలవడానికి ఇంటికి వెళ్తే ఆయన వళ్ళంతా నూనెపట్టించుకుని ఒక అడ్డపంచెకట్టుకుని తన ఇంట్లోకి పిలిచి మరీ మనతో మాట్లాడుతుంటే ఎలా ఉంటుందో అలా అన్న మాట. ఆయన్ని అలా చూడటం మనకి కొంత ఇబ్బందిగా అనిపించినా, అంతదాకా మనలో ఉన్న బెరుకునుంచి మనం నెమ్మదిగా బయటపడతాం కదా. ఆ రోజు నా అనుభవమూ అట్లానే ఉండింది.

అక్కణ్ణుంచి ఆండాళ్ కోవెలకి వెళ్ళాం. పండగ సంరంభమంతా అక్కడ పోగుపడింది. ఆ దేవాలయ ప్రాంగణంలో ఏనుగులు, మంగళవాద్యబృందాలు, అర్చకులు మరికొద్దిసేపట్లో ఊరేగింపుకోసం సమాయత్తమవుతున్నారు. కొంతసేపు ఆ ప్రాంగణంలో కూచున్నాం. ఆ ఊరేగింపు మొదలవడానికి మరికొంతసమయం పట్టేలా ఉండంతో అక్కణ్ణుంచి లేచి శ్రీరామానుజ సన్నిధిని, మరికొన్ని మంటపాల్నీ చూసుకుంటూ తిరుమంగై ఆళ్వారు నిర్మించి పెట్టిన ధాన్యాగారాలు చూసేం. అక్కడ గోడల మీద ఆళ్వారులు శ్రీరంగనాథ దేవాలయం మీద చెప్పిన మంగళాశాసనాలు రాసిపెట్టి ఉన్నాయి. పన్నెండు మందిలో ఒక్కరు తప్ప మిగిలిన పదకొండుమందీ ఆ దేవాలయాన్ని స్తుతిస్తూ చెప్పిన పద్యాలవి.

శ్రీరంగం అనగానే అందరికన్నా ముందు స్ఫురించేది ఆండాళ్ కూడా కాదు, నమ్మాళ్వారు. తమిళ శైవానికి సంబంధులు ఎటువంటివారో, వైష్ణవానికి నమ్మాళ్వారు అటువంటివారు. నమ్మాళ్వారు అసలు పేరు మారన్. కాని ఆయన గానవైభవానికి పరవశుడై శ్రీరంగనాథ స్వామి ఆయన్ని 'నా ఆళ్వారు' అనడంతో ఆయన నమ్మాళ్వారు అయ్యాడు. 'నాలాయిర దివ్యప్రబంధం'లో నమ్మాళ్వారు గీతాలు దాదాపు పధ్నాలుగు వందల దాకా ఉన్నాయి. వాటన్నిటిలోనూ 'తిరువాయి మొళి' (శ్రీసూక్తం) సర్వోన్నత కృతి. అది వైష్ణవదివ్యదేశాల స్తుతిగీతసముచ్చయం.

అయితే అప్పర్, సంబంధర్, సుందరర్‌ల లాగా నమ్మాళ్వారు ఏ దివ్యక్షేత్రాలూ భౌతికంగా సంచరించలేదు. ఆయనది మానసిక యాత్ర. తన ఇంట్లో మంచం మీద పడుకునే తాను చీనా అంతా సంచరిస్తున్నానని ఒక ప్రాచీన చీనాచిత్రకారుడు చెప్పుకున్నట్లుగా, నమ్మాళ్వారు శ్రీరంగనాథుడి సన్నిధిలో కూచునే సమస్తవైష్ణవ దివ్యధామాలనూ చుట్టివచ్చాడు. తన వాక్కుద్వారా వాటిని మరింత సుప్రతిష్ఠం చేసాడు.

నమ్మాళ్వారుది సఖ్యభక్తి. కాని ఆయన ప్రతి గీతంలోనూ అపారమైన దాస్యభక్తిని కనపరుస్తాడు. చాలాసార్లు తనకొక నాయికా భావాన్ని ఆరోపించుకుని మధురభక్తిలోకి అడుగుపెట్టాలని చూస్తాడు. తన వివిధమానసికావస్థలన్నిటినీ భగవంతుడితో మొరపెట్టుకుంటాడు. తనని తాను భగవంతుడికెట్లా సమర్పించుకున్నాడో కాక, చాలాసార్లు ఆ కవితల్లో, భగవంతుడు తననెట్లా నమిలిమింగేసాడో ఆ అనుభవాన్నే పదే పదే పాడుతుంటాడు.

'సర్వలోకాధీశ్వరా, నేనే లేకపోతే నీ ప్రేమ ఏమవుతుంది?' అనడిగాడు టాగోర్. 'నువ్వే లేకపోతే నేనీ ఆకాశాన్ని సృజించిఉండేవాణ్ణే కాను' అన్నాడట సర్వేశ్వరుడు అబ్రహాముతో. నమ్మాళ్వారే లేకపోయుంటే శ్రీరంగనాథుడు ఎంత ఒంటరివాడయిపోయి ఉండేవాడు అనిపిస్తుంది మనకి తిరువాయి మొళి చదువుతుంటే.

ఆ దేవాలయ ప్రాంగణంలో నెమ్మదిగా సాయం సంధ్య వెలుగు పరుచుకుంటూ ఉంది. బయటి ప్రపంచంతో ఏమీ సంబంధం లేదన్నట్టుగా, గడచిన ఎన్నో శతాబ్దాలుగా, రానున్న మరెన్నో శతాబ్దాలుగా అక్కడ జరగవలసిన నిత్యపూజలు జరుగుతూనే ఉంటాయన్నట్టుగా, దీపాలు వెలిగాయి, హారతి గంటలు వినిపిస్తున్నాయి. ఆకాశం పట్టుపీతాంబరం తొలగించి నారింజరంగు వస్త్రం ధరించడం చూస్తూ నమ్మాళ్వారునే తలుచుకున్నాను.

జీవితంలో ఒక్క కవితేనా నమ్మాళ్వారుని చదివి ఉండటం ఒక అనుభవం. అదృష్టవశాత్తూ మనకోసం, ప్రపంచం కోసం నమ్మాళ్వారుని Hymns for the Drowning: Poems for Vishnu (1981) పేరిట ఎ.కె.రామానుజన్ ఇంగ్లీషు చేసిపెట్టాడు. ఆ పుస్తకం ఆసాంతం చదివినవాళ్ళు నమ్మాళ్వారుకి జీవితకాల ఆరాధకులుగా మారకుండా ఉండలేరు.

ఇంతచెప్పి నమ్మాళ్వారు గీతమొకటి మీకు వినిపించకుండా ఎలా ఉండగలను? శ్రీరామభారతి, సౌభాగ్యలక్ష్మి అనేవారు తిరువాయి మొళి నుంచి కొన్ని కవితల్ని అనువదించి సంకలనం చేసారు. The Tiruvaimoli of Nammalvar Rendered in English (1987) నుంచి ఒక గీతార్థం తెలుగులో.

## తిరువిణ్ణగర్‌లో సాక్షాత్కారం

**ప్రతి ఒక్కచోటా ప్రతి ఒక్కదారిలోనూ కనిపిస్తున్నాడు నా ప్రభువు.**
**పేదరికంగా, మహదైశ్వర్యంగా; స్వర్గంగా, నరకంగా**
**ఆజన్మవైరంగా, అద్భుతస్నేహంగా; విషప్రాయంగా, ఔషధతుల్యంగా.**
**విణ్ణగర్ దేవాలయంలో సద్భక్తకూటమి మధ్య కొలువైన నా ప్రభువుగా.**

కనిపించాదాయన, సంతోషంగా, దుఃఖంగా; సంక్షోభంగా, సమచిత్తంగా
దయార్ద్ర హృదయుడి క్షమగా, దండనాథుడి శిక్షగా; కాంతిగా, నీడగా.
అర్థం కాదు ఒక పట్టాన ఆయన, కనిపిస్తాడాయన దుర్గ్రాహ్యుడిగా
నిర్మలనదీతీరం చెంత విణ్ణగర్ దేవళంలో కొలువున్న ప్రభువుగా.

అగుపిస్తాడాయన, నగరాలుగా, గ్రామాలుగా; జ్ఞానంగా, అజ్ఞానంగా
దివ్యలోకాలుగా, గాఢాంధకారంగా; నేలగా, ఎల్లల్లేని నింగిగా
సుందరహర్మ్యాల మధ్య తిరువిణ్ణగర్ లో నెలకొన్న ప్రభువుగా,
తన కరుణార్ద్రచిత్తం తప్ప మరొక దిక్కు మనకు లేనట్టుగా.

కనిపిస్తున్నాడు, సత్కర్మ, దుష్కర్మలుగా; సంయోగవియోగాలుగా
స్మృతి విభ్రమాలుగా; భ్రమప్రమలుగా, అన్నీ తానుగా, ఏదీ కానట్టుగా,
ఆకాశహర్మ్యాల మధ్య విణ్ణగర్ లో కొలువైన ప్రభువు కృష్ణుడిగా
ఆయన తప్ప మరొక కర్త ఎవరూ లేనట్టుగా, అన్నిటికీ తానే సాక్షిగా.

శ్వేతం, అరుణిమ, నలుపు, తెలుపు, రంగులన్నీ తానుగా
సత్యాసత్యాలుగా; యవ్వనవార్థక్యాలుగా; ప్రాచీన అర్వాచీనాలుగా
తిరువిణ్ణగర్‌లో దుర్భేద్యప్రాకార పరివేష్ఠితుడిగా, అందమైన
తోటలాంటి ఈ లోకాన్నిక్కడ పెట్టి అందులో దొడ్డవృక్షం నాటినవాడిగా.

ఈ త్రిలోకాలూ తానుగా, అయినా కానట్టుగా, హ్లాద నిర్వేదాలుగా,
ఉత్కృష్ట నికృష్టాలుగా; స్తుతిగా, దుర్భరమైన నిందగా,
కొలువై ఉన్నాడు దేవతలు కొనియాడే తిరువణ్ణగర్ ప్రభువుగా
నా గుండెలోపల కాంతులీనుతూ పూచిన తామరపువ్వుగా.

లావణ్యమోహమయ దేహంగా, మలమూత్రపురీషాదుల తిత్తిగా,
ఇంతలోనో దాక్కుని, ఇంతలోనే బయల్పడి; స్థిరుడిగా, కొంటెగా
బృందారక బృందమంతా సాగిలపడి మొక్కే తిరువణ్ణగరి ప్రభువుగా,
తన చరణపద్మాలు తప్ప మనకు మరొక దారి చూపనివాడిగా.

సురలోకానికి శాశ్వతశరణ్యుడిగా, అసురగణాలకు దారుణ మృత్యువుగా,
తన పాదపద్మాలకింద ప్రపంచాన్ని కాపాడేవాడుగా, అయినా ఆ బాధ్యత
లేవీ పట్టనివాడుగా, తిరువణ్ణగర్ ప్రభువు, దక్షిణదిక్కున కాపాడేవాడిగా
నా సదాశ్రయంగా, కొలువై ఉన్నాడు కృష్ణుడు నా తండ్రిగా, ప్రభువుగా.

నా ప్రభువు, నా తండ్రి నిలిచి ఉన్నాడు, తల్లిగా, నా పెంపుడుతల్లిగా
బంగారు తండ్రిగా, రత్నాల తండ్రిగా, ముత్యాల తండ్రిగా, తండ్రిగా!
సువర్ణమయ ప్రాకారాలమధ్య ప్రతిష్ఠితుడై ఉన్నాడు విణ్ణగర్ ప్రభువుగా,
తన హేమమయ చరణాల చెంత నాకు చల్లని నీడ ప్రసాదించినవాడుగా.

ఛాయగా, సూర్యుడిగా; అల్పంగా, అధికంగా; పొట్టిగా, పొడవుగా
స్థావరంగా, జంగమంగా; మరెన్నో వాటిగా, అయినా ఏదీ కాదన్నట్టుగా
తేనెటీగలు ఝుమ్మని ముసురుకునే విణ్ణగర్ దేవాలయాధీశుడిగా,
తన చరణాలే మనకు రక్షగా, మనమీ సత్యం గ్రహించక తప్పదన్నట్టుగా.

# ఒక కాలం వీరుడు, కలకాలం కవి

నువ్వెవరినైనా గాఢంగా ప్రేమిస్తే ఆ ప్రేమ రెండు రకాలుగా వ్యక్తీకరణకొస్తుంది. ఒకటి నీ బాధ్యతలన్నీ పక్కనపెట్టి, నువ్వు ప్రేమించిన వ్యక్తి ధ్యానంలోనో, సన్నిధిలోనో మైమరచి గడపడం. లేదా, అన్ని బాధ్యతలూ నీ భుజాన వేసుకుని నువ్వు ప్రేమించిన వ్యక్తికోసం ఇంకా ఏమి చెయ్యగలనా అని ఎదురుచూడటం. చలంగారు తన 'మార్తా' నవలలో చిత్రించిందిదే. ఈ రెండింటిలోనూ ఒకటి ఎక్కువ, ఒకటి తక్కువ అని చెప్పలేం. అవి రెండూ సమానమైన ప్రేమప్రకటనలే. ఆ రెండింటిలో నువ్వు ఏ మార్గం స్వీకరిస్తావనేది నీ జీవలక్షణాన్ని బట్టి ఆధారపడుతుంది.

ఆళ్వారుల్లో నమ్మాళ్వారు మొదటి కోవకు చెందిన భక్తుడైతే, తిరుమంగై ఆళ్వారు రెండవ కోవకు చెందినవాడు. ఆళ్వారుల్లోనూ, నాయనార్లలోనూ కూడా అంత జీవశక్తి, అంత ఔద్ధత్యం చూపించిన వ్యక్తి మరొకరు కనిపించరు. అతడి గురించి ఒక్కమాటలో చెప్పడం కూడా కష్టం. అతడు సైనికుడు, సాహసి, మండలాధీశుడు, ప్రేమికుడు, కవి, పండితుడు, దొంగ, దుండగుడు, వెరసి ఒక కాలం వీరుడు, కలకాలం కవి.

అతడి అసలు పేరు నీలన్. బలశాలి కావడంతో 'కలియన్' అని కూడా పేరుపడ్డాడు. ఎనిమిదో శతాబ్దపు చివరికాలంలో, తొమ్మిదో శతాబ్దపు ప్రథమార్ధంలో జీవించాడు. మొదట్లో సైనికుడిగా, ముఖ్యంగా బల్లెం వీరుడిగా ప్రతాపం చూపించేడు. కొద్దిరోజులకి అతణ్ణి చోళరాజులు తిరుమంగై ప్రాంతానికి మండలాధీశుడిగా నియమించారు. శత్రువుల మీద అతడి ప్రతాపానికి గుర్తుగా 'పరకాలుడు' అని కూడా పేరువచ్చింది.

అతడి జీవితం అట్లానే గడిచి ఉండేదేమో గాని, ఒకరోజు అతడొక యువతిని చూసి ఆమె ప్రేమలో పడ్డాడు. ఆమె పేరు కుముదవల్లి. తాను అతణ్ణి పెళ్ళాడటానికి ఆమె రెండు షరతులు పెట్టింది. ఒకటి అతడు శ్రీవైష్ణవమతంలోకి మారాలని, రెండవది, తన స్వజనం దాదాపు వెయ్యిమందికి ప్రతి రోజూ అన్నసంతర్పణ చెయ్యాలనీ.

ఆమె మీద పట్టలేని మోహంతో అతడు ఆ షరతులకు ఒప్పుకున్నాడు. కాని ప్రతి రోజూ వెయ్యిమందికి అన్నం పెట్టడం మాటలు కాదు కదా. కొన్నాళ్ళకి అతడి వనరులు పూర్తిగా సన్నగిల్లిపోయాయి. చివరికి, చోళరాజులకి కట్టవలసిన పన్నుకూడా కైంకర్యం చేసేసాడు. రాజు ఆగ్రహించి అతణ్ణి కైదులో పెట్టాడు. ఎట్లానో చెరనుండి బయటపడ్డాడు. తన ప్రేయసికి తాను ఇచ్చిన మాట నిలబెట్టుకోడానికి, చివరికి అతడికి దారిదోపిడీలు చెయ్యడం తప్ప మరో మార్గం కనిపించలేదు. అతడు గజదొంగగా మారేడు.

బహుశా ఆ జీవితం అలానే గడిచి ఉండేదేమో, కాని ఒక సంఘటన జరిగింది. తన దారిదోపిడీల్లో భాగంగా అతడొక రోజు తన అనుచరులతో ఒక పెళ్ళిబృందం మీద దాడిచేసాడు. ఆ పెళ్ళివాళ్ళ సంపద, ఆభరణాలు సమస్తం కొల్లగొట్టుకున్నాడు. కాని, పెళ్ళికొడుకు కాలి బొటనవేలుకి చుట్టుకున్న ఉంగరమొకటి ఊడిరాలేదు. దాన్నెట్లాగేనా ఊడదియ్యాలని అతడు కిందకి వంగి ఆ ఉంగరాన్ని తన పళ్ళతో ఊడబెరకడానికి ఉపక్రమించాడు. అతడట్లా పళ్ళతో ఆ ఉంగరాన్ని కొరుకుతుంటే, ఆ పెళ్ళి కొడుకు 'నువ్వేనా ఆ కలియన్ వి? (బలశాలివి)' అనడిగాడు. ఆ ఒక్క ప్రశ్న ఆ పరకాలుణ్ణి తల్లకిందులు చేసేసింది. తాను నిజంగా బలశాలినా? అయితే తాను చేస్తున్నదేమిటి? తాను ఒక స్త్రీని ప్రేమించినందువల్ల, ఆ స్త్రీకి భగవంతుడిమీద ఉన్న ప్రేమకోసం తాను దొంగగా మారేడు. ఆ క్షణం అతడిలో ఏదో సంభవించింది. ఇప్పుడు తానే నేరుగా ఆ భగవంతుణ్ణి ప్రేమించవచ్చుకదా అనిపించింది. అంతే, అతడి నోటివెంట అప్రయత్నంగా ఒక పాశురం వెలువడింది. తిరుమంగైకి చెందిన కలియన్ తిరుమంగై ఆళ్వారుగా మారిపోయేడు.

ఆ తర్వాత జీవితమంతా తిరుమంగై ఆళ్వారు దేవుడికోసం తానేమి చెయ్యగలననుకున్నాడో అదంతా చేసాడు. శ్రీరంగం దేవాలయానికి దుర్భేద్యమైన ప్రాకారాలు నిర్మించాడు. శ్రీరంగంలో వైష్ణవభక్తులకోసం ధాన్యాగారాలు నిర్మించేడు. నమ్మాళ్వారు పుట్టిన ఊరినుంచి ఆయన ప్రతిమ తీసుకొచ్చి శ్రీరంగంలో ధనుర్మాసంలో పండగ మొదలుపెట్టాడు. శ్రీవైష్ణవ దివ్యదేశాలు 108 లోనూ దాదాపు ఎనభైకి పైగా స్వయంగా తిరిగాడు, ఆయా దేవాలయాల్లో కొలువైన అర్చామూర్తుల మీద గీతాలు పాడాడు. అలా అతడు కూర్చి గానం చేసిన పాశురాలు ఆరుసంపుటాలు. అవన్నీ కలిపి 'నాలాయిర దివ్యప్రబంధం'లో నాలుగవ వంతు. వాటన్నిటిలోనూ పెద్ద సంపుటం 'పెరియ తిరుమొళి' (పెద్ద శ్రీ సూక్తం). తాను చూసిన దివ్యదేశాలమీద పాడిన పాటల సంపుటం అది. అవికాక మరొక అయిదు చిన్నసంపుటాలు కూడా ఉన్నాయి.

తనకి కవిత్వం పలుకుతోందని తెలిసాక అతడు నాయనార్లను తనకు స్ఫూర్తిగా తీసుకున్నాడు. వారిలో ప్రతి ఒక్కరితోనూ మానసికంగా పోటీపడ్డాడు. అప్పర్ లాగా దండకాలు రాసాడు. సంబంధర్ అతడికి సమకాలికుడు. ఇద్దరిదీ ఒక ప్రాంతమే. సంబంధర్ శివక్షేత్రాలన్నీ తిరుగుతూ పాటలు కడుతున్నాడు కాబట్టి తాను కూడా వైష్ణవక్షేత్రాలు తిరిగి పాటలు కట్టాడు. సుందరమూర్తిని అతడు చదివి ఉండే అవకాశం లేదు కాని, అతడిలానే తాను కూడా దుడుకు భక్తుడిగా, చాలాచోట్ల దేవుడిపట్ల పొగరుతో కూడిన ప్రేమ కనపరుస్తాడు. ఒకసారి తిరు ఇందలూరు అనే క్షేత్రానికి వెళ్ళినప్పుడు, ఆ దేవాలయం తలుపులు మూసి ఉంటే దేవుణ్ణి దాదాపుగా తిట్టినంత పనిచేసాడు. కాని అతడి దుందుడుకుని దేవుడు అంగీకరించినట్టే ఒక కథ ప్రచారంలో ఉంది.

ఒకప్పుడు శ్రీరంగనాథస్వామి సన్నిధిలో ఒక పరిచారకుడు పూలమాలలు కట్టేవాడట. పూలు మాల కడుతూ అతడు తనలో తాను మాట్లాడుకుంటూ ఉండేవాడట. అర్చకులూ, భక్తులూ లేనివేళల్లో కాలక్షేపం కోసం శ్రీరంగనాథుడు కూడా అతడితో మాటలు కలుపుతూ ఉండేవాడట. ఒకరోజు ఆ పరిచారకుడు, దేవాలయంలో తిరుమంగై ఆళ్వారు ఒక గీతం పాడటం విన్నాడు. అందులో ఆళ్వారు తన గురించి తాను స్వాతిశయంగా చెప్పుకుంటున్నట్టుగా అనిపించిందతడికి. ఆ మాటే శ్రీరంగనాథస్వామితో కూడా అన్నాడట. 'ఆ కవి నిన్ను స్తుతిస్తూ పాశురాలు మొదలుపెట్టాడుగాని చివరికి తన్ను తాను పొగుడుకోడంతో ముగించేడు' అని. ఆ మాటలు వినగానే స్వామికి కోపం వచ్చిందట. 'అయితే ఏమిటి? అతడికి ఆ కవిత్వాన్ని అనుగ్రహించింది నేనే కదా. తనని తాను పొగుడుకుంటున్నాడంటే నన్ను పొగుడుతున్నట్టే కదా. ఇంకెప్పుడూ ఇలాంటి చాడీలు చెప్పకు నాకు' అన్నాడట. ఇక ఆ తర్వాత ఎప్పుడూ మళ్ళా ఆయన ఆ పనివాడితో మాటాడలేదట!

తిరుమంగై ఆళ్వారుమీద ఇట్లాంటి కథలు చాలా ప్రచారంలో ఉన్నాయి. ఒకసారి అతడు వరసగా దివ్యక్షేత్రాలు దర్శించుకుంటూ పాటలు పాడుకుంటూపోతూ తిరునిన్రవూరు అనే క్షేత్రాన్ని దాటి వెళ్ళిపోతున్నాడట. ఆ ఊళ్ళో ఉన్న ఆలయంలో విష్ణువు, లక్ష్మి చదరంగం ఆడుకుంటూ అతణ్ణి గమనించలేదు. కాని లక్ష్మీదేవి అతణ్ణి గుర్తుపట్టి విష్ణువుతో అన్నదట: 'చూడండి, తిరుమంగై వెళ్ళిపోతున్నాడు, రమ్మని పిలవండి, అతడు మన గుళ్ళో అడుగుపెట్టకపోతే, మన ఆలయానికి దివ్యదేశాల జాబితాలో చోటుదొరకదు' అని. దేవుడు ఆళ్వారుని లోపలకి ఆహ్వానించాడు. ఆళ్వారు ఆ క్షేత్రం గురించి ప్రత్యేకంగా పాశురమేదీ చెప్పలేదు గాని, తిరుక్కడల్ మల్లై క్షేత్రం గురించి గానం చేస్తూ, 'నిన్రవూర్ నిథిలాత్తై' (ముత్యంలాంటి నిన్రవూర్) అని ఒక్క మాట మాత్రం అన్నాడు. ఆ ఒక్కమాట తోటే ఆ క్షేత్రం దివ్యదేశాల జాబితాలోకి చేరిపోయింది.

కాని తిరుమంగై ఒక కవిగా నమ్మాళ్వారుతో ఎక్కువ స్పర్థకు లోనయ్యా డనిపిస్తోంది. అతడు నమ్మాళ్వారును ఆరాధించాడు. భగవత్సమానుడిగా భావించాడు. కాని, అతణ్ణి మించిన కవిత్వం చెప్పాలన్న ఒక తపన అతణ్ణి జీవితకాలం పొడుగునా వెన్నాడిందనడానికి అతడి కవిత్వమే సాక్షి. నమ్మాళ్వారు సంగం సాహిత్యంలోని 'అకం' సంప్రదాయాల్ని, కవి సమయాల్నీ స్ఫూర్తిగా తీసుకుని దేవుడిపైన అద్భుతమైన ప్రణయ కవిత్వం చెప్పాడు. చాలాసార్లు తనపైన ఒక నాయికా భావాన్ని ఆరోపించుకుని, తననొక 'పరాంకుశ నాయిక' గా పిలుచుకుంటూ, ప్రణయభక్తి కవిత్వం చెప్పాడు.

తిరుమంగై కూడా ఆ దారిలోనే తననొక 'పరకాల నాయిక' గా భావించుకుంటూ విస్తారమైన ప్రణయభక్తి కవిత్వం చెప్పాడు. అందుకోసం అతడు విస్తారంగా చదివాడు, ఛందస్సులమీద అధికారంకోసం సాధనచేసాడు. అలంకార శాస్త్రాలు క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. తన కవిత్వంలో తన ముద్ర బలంగా కనిపించడం కోసం చివరికి అలంకార శాస్త్రాల నియమాల్ని కూడా ధిక్కరించేడు.

సంగం కవిత్వం అయిదు రకాల ప్రణయావస్థల్ని వర్ణించిందనీ అవి కాక రెండు ప్రేమావస్థల్ని తిరస్కరించిందనీ మనకు తెలుసు. ఆ రెండూ, ఒకటి నిషిద్ధ ప్రేమ, రెండోది పొసగని ప్రేమ. ఎవరేనా ఒక అమ్మాయిని ప్రేమించాడనుకోండి. ఆమె తన ప్రేమకు ఎంతకూ ప్రతిస్పందించట్లేదనుకోండి. అప్పుడు ఆమె ఉంటున్న వీధిలో ఆమె ఇంటిముందుకు వెళ్ళి నలుగురూ చూసేలా తనని తాను అవమానించుకోవడం కూడా ఒకరకమైన ప్రేమ వ్యక్తీకరణనే. కాని అది ధూర్తప్రేమ, క్రూరప్రేమ. ఆ రోజుల్లో ఒక ప్రేమికుడు తనని తాను అలా అవమానపరుచుకునే క్రమంలో ఒక పచ్చితాటిమట్ట తీసుకువెళ్ళి దాని మీద కూచుని గుర్రమెక్కినట్టుగా అభినయిస్తూండే పద్ధతి ఒకటుండేది. దాన్ని 'మడల్' అనేవారు. మడల్ అంటే ఆకు, ఇక్కడ పచ్చి తాటికొమ్మ. అలాంటి అవస్థ మీద చెప్పే కవితకి కూడా 'మడల్ ' అనే పేరు స్థిరపడింది. అది జుగుప్సాకరమైన ప్రేమప్రకటన కాబట్టి సంగం సాహిత్యం అటువంటి కవిత్వాన్ని నిషేధించింది. కాని తిరుమంగై ఆళ్వారు దేవుడిమీద అటువంటి మడలు ఒకటి కాదు, రెండు చెప్పాడు.

మడల్ని నిషేధిస్తూ తొల్కాప్పియం, ఒకవేళ ఎవరేనా మడల్ తరహా కవిత్వం రాయకుండా ఉండలేకపోతే, రాస్తే రాయవచ్చేమోకాని, అటువంటి కవిత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ స్త్రీలు మాత్రం రాయకూడదని చెప్పింది. ఎందుకంటే, అట్లా పచ్చితాటిమట్టని గుర్రంగా ఊహిస్తూ ఒక స్త్రీ నడివీథిలో ఊరేగడం కన్నా ఆమె వ్యక్తిత్వాన్ని కించపరుచుకునే పరిస్థితి మరొకటి ఉండదని తొల్కాప్పియకారుడు ఎంతో సంస్కారవంతంగా భావించేడు.

తిరుమంగై ఆళ్వారు మడల్ రాయడానికి పూనుకోవడమే కాకుండా, ఆ మడల్ ఒక పురుషకంఠంతో కాకుండా, ఒక నాయిక, ప్రేమైక చిత్త అయిన నాయికా స్వరంతో రాసాడు. ఏ ప్రమాణాల ప్రకారం చూసినా అంతకన్నా సాహిత్య ధిక్కారం మరొకటి ఉండబోదు. కాని అతడు రాసిన రెండు మడలూ, 'సిరియ తిరుమడల్' (చిన్న గీతం), 'పెరియ తిరుమడల్' (పెద్ద గీతం) అపూర్వమైన సాహిత్యకృతులు. వాటిని ఇన్ని వందల ఏళ్ళ తరువాత చదువుతున్నా కూడా మన హృదయం స్పందించకుండా ఉండదు. అంత ధూర్తప్రేమనీ శ్రీరంగనాథుడు కూడా ఇష్టపడ్డాడనే ఐతిహ్యాలు చెప్తున్నాయి.

తిరుమడల్ కావ్యాలు తిరునరయూర్ దేవాలయంలోని అర్చామూర్తిని ఉద్దేశిస్తూ చెప్పినవి. ఆ గీతాలు తన చెవిన పడినప్పుడు శ్రీరంగనాథుడు తిరుమంగై ఆళ్వారుని అడిగాడట. 'ఏమీ అళ్వారూ, నీ జీవితంలో గొప్ప కవిత్వమంతా నరయూర్ నంబికే అంకితం చేసినట్టున్నావు' అని. శ్రీరంగనాథుడు ఏమంటున్నాడో తిరుమంగైకి అర్థమయింది. ఆయన్ని సముదాయించాలనుకుని, 'ఏమి స్వామీ, నీకేమి తక్కువ చేసాను? నీ గుడికి బంగారు ప్రాకారాలు కట్టించాను కదా' అన్నాడట. శ్రీరంగనాథుడు నిట్టూరుస్తూ, 'ఏమి లాభం! ఆ ప్రాకారాలేవో ఆ నంబికే కట్టించి ఆ మడలు ఏదో ఇక్కడ నాకోసం పాడి ఉండకూడదా' అన్నాడట!

## సఖీ, ప్రపంచమంతా పుకారు చెలరేగనీ

సంగం సాహిత్యసూత్రాలు నిషేధించినప్పటికీ, మడలు తరహా కవిత్వం చెప్పకుండా ఉండలేకపోయింది మొదట నమ్మాళ్వారే. తీవ్ర భావోద్రేకంలోనూ, పట్టలేనంత ప్రేమోన్మత్తతలోనూ, ఆయన ఒక కవితలో (తిరువాయి మొళి, 5:3:9-10) ఇలా అంటున్నాడు:

**'సఖీ, ప్రపంచమంతా పుకారు చెలరేగనీ, ఆయన నా**
**సిగ్గు, నా సమస్తం దొంగిలించి ఎక్కడో స్వర్గంలో కూచుని**
**నా హృదయం తన దగ్గరకి లాక్కున్నాడు, నామీద ఒట్టు,**
**ఎవరన్నా ఏమైనా అనుకోనీ, నేను గుర్రమెక్కి తీరుతాను."**

**లోకమంతా నన్ను నిందించనీ, ఇరుగు పొరుగు ఆడవాళ్ళు**
**చెవులు కొరుక్కోనీ, నోటికి వచ్చినట్టు వాగనీ, నచ్చినట్టు సాగనీ**
**ప్రేమాస్పదమైన నా ముగ్ధత్వం నట్టేట మునగనీ, నేను గుర్రమెక్కి**
**ఆ చక్రధారి వక్షమ్మీది చల్లని తులసిమాల తెచ్చుకుతీరుతాను.'**

ఇంత నిస్సిగ్గుగానూ, నిందల్ని కూడా లెక్కచేయకుండానూ, ఒక నాయికా భావంతో కవి కోరుకుంటున్నదేమిటి? 'ప్రాపంచిక పరాజయం ఒక సౌభాగ్యం' అని నేనొక కవితలో రాసుకున్నాను. లోకం దృష్టిలో ఎంతగా దిగజారితే, తాను, అంతగా ఆయన అనుగ్రహానికి చేరువకాగలనని కవి ఉద్దేశ్యం. తక్కినవాళ్ళ దృష్టిలో చీకటి భక్తుడికి వెలుగు.

ఈ రెండు పాశురాల స్ఫూర్తితో తిరుమంగై 'సిరియ తిరుమడల్' 'పెరియ తిరుమడల్' రాయకుండా ఉండలేకపోయాడు. ఇవి సంగకాలం నాటి పత్తుప్పాట్టు తరహా దీర్ఘకవితలు. 'నెడునల్వాడై', 'ముల్లైప్పాట్టు' , 'కురింజిప్పాట్టు' లాగా సిరియ తిరుమడల్, పెరియ తిరుమడల్ కూడా తేనెలూరే పూలగుత్తులు.

సిరియతిరుమడల్‌లో నాయకి, తన హృదయాన్ని కొల్లగొట్టినవాడి దర్శనం లభించక చిక్కిపోయి, కళతప్పి, దివ్యదేశాలన్నీ తలచుకుని, చివరికి ఇలా అంటుంది:

**‘ఒక ఏనుగుని లొంగదీసాడు, ఆయన, మరొక ఏనుగుకి**
**ప్రాణం పోసాడు, అందగాడు, ఎర్రటికళ్ళవాడు, దూరస్థుడు**
**వక్షమ్మీద తేనెలూరే తులసిమాల, కమలదళాల్లాంటి కళ్ళు,**
**ఊరంతాననేమైనా అనుకోనీ, గుర్రమెక్కి ఊరేగుతాను.’**

పెరియతిరుమడల్ కూడా నిర్మాణ రీత్యా సిరియతిరుమడల్ లాంటి కవితనే అయినప్పటికీ, ప్రేమావస్థ వర్ణనల్లో మరింత గాఢతని అందుకుంది. మానావమానాలతో నిమిత్తం లేకుండా ఒక స్త్రీ తన విహ్వల ప్రేమభావనని వ్యక్తం చెయ్యకూడదనేది కేవలం తమిళ సంప్రదాయం మాత్రమేననీ, సంస్కృత సాహిత్యంలో అటువంటి నిషేధాలు లేవనీ, కాబట్టి, తాను సంస్కృత కావ్యనాయికల పద్ధతిలో తన ప్రగాఢ ప్రేమోద్వేగాన్ని ప్రకటించకుండా ఉండలేననీ చెప్తూ, ఇలా అంటున్నది:

**‘ప్రేమోద్వేగం తెలియనివాళ్ళకి చందనపుముద్ద ఎలా ఉంటుందో తెలియదు**
**దక్షిణపర్వతాలమీంచి వీచే వేసవి తెమ్మెర ఎలా ఉంటుందో తెలియదు**
**పసులుకాచుకునేవాడి పిల్లనగోవి పిలుపు ఎలా ఉంటుందో తెలియదు,**
**మోహవృషభాల మెడలో చిరుగంటల సవ్వడి తెలియదు,**
**తాటిచెట్టుమీదగూడుకట్టుకునే చిన్నపిట్ట లేతకూత వినగానే తమ ప్రియుడు**
**తలపుకొచ్చికరిగినీరయిపోవడమెలా ఉంటుందో తెలియదు,**
**ఆకాశంలో నిండుచంద్రుడుచల్లని వెన్నెలతో రగిలించిన పెద్దనెగడిలో దేహం**
**దహించుకుపోవడమెలాఉంటుందో తెలియదు.**

**ఒడుపుగా కాముడు పూలబాణాలు సంధించినప్పుడు**
**తేనెలూరే ఉత్తరపవనం తమ కేశరాశిని, జఘనాన్ని, చనుదోయిని**
**స్పృశిస్తుంటే వెర్రిగా వీథుల్లో పరుగెత్తకుండా ఇళ్ళల్లో పట్టుపానుపు**
**మీద పడినిద్రపోతుంటారు వాళ్ళు..’**

కాని తిరుమంగై కృతులన్నిటిలోనూ ఉత్కృష్టమైంది ‘తిరునెడు దండకం’. తనకోసం ఒక మడలు పాడి ఉండకూడదా అని శ్రీరంగనాథుడు కోరుకున్నందుకో ఏమో, తిరుమంగై, ఆయన్నే ఉద్దేశించి తిరునెడు దండకం రాసాడు. ‘నెడు’ అంటే దీర్ఘమని అర్థం. ‘దీర్ఘ శుభగీతం’ అని దానికి మనం అర్థం చెప్పుకోవచ్చు. శ్రీవైష్ణవ సాహిత్యంలో

తిరునెడుదండకానికి అద్వితీయమైన స్థానం లభించింది. రామానుజుల శిష్యులు పరాశరభట్టారు దానికొక అద్భుతమైన వ్యాఖ్యానం సంతరించిపెట్టారు.

పరాశరభట్టారుకీ, తిరునెడుదండకానికీ సంబంధించి అందమైన ఒక ఐతిహ్యం ప్రచారంలో ఉంది. ఒకప్పుడు మేల్కోటే దగ్గర మాధవాచార్యుడనే ఒక వేదాంతి ఉండేవాడట. అతడితో శాస్త్రచర్చ చేసి, అతణ్ణి ఓడించి, శ్రీవైష్ణవాన్ని నిలబెట్టమని రామానుజులు పరాశరుణ్ణి ఆదేశించారట.

అప్పుడు పరాశరుల శిష్యులు ఆ వేదాంతి దగ్గరకు పోయి శాస్త్ర చర్చకు రమ్మని పిలిచినప్పుడు, అతడు 'మీగురువు ఏ శాస్త్రాలు చదివాడు?' అనడిగాడట. వీళ్ళేమో, తర్కం, న్యాయం, వ్యాకరణం లాంటి వేదాంగాలన్నీ ప్రస్తావించి, ఆ సంగతే పరాశరులకి వచ్చి చెప్పారట. ఆయన వాళ్ళతో 'ఆ వేదాంతి తిరునెడు దండకం చదివేడేమో కనుక్కోండి' అన్నారట. ఆ సంగతి ఆ వేదాంతికి చెప్పగానే, అతడు 'ఈ తిరునెడు దండకం ఎక్కడి శాస్త్రం? ఈ పేరెప్పుడూ నేను వినలేదే' అన్నాడట. తాను చదవని ఆ శాస్త్రంతో పరాశరభట్టారుతో వాదనకు కూచుంటే తాను ఓడిపోతానేమోనని భయపడిపోయాడట!

తిరునెడు దండకం ముప్పై పాశురాల సుమనోహరమైన కావ్యం. తర్వాతి రోజుల్లో మాణిక్యవాచకర్ 'తిరువెంబావై' కి, ఆండాళ్ 'తిరుప్పావై' కి దారి చూపించిన కృతి అని కూడా చెప్పవచ్చు. తిరుమంగై జీవితకాలం పాటు చేసిన సాహిత్యసాధన తిరునెడు దండకంలో సాఫల్యత పొందింది. నిర్మాణరీత్యా, అనుభూతి ప్రకటన రీత్యా ఆ చిన్న కావ్యం భారతీయ సాహిత్యంలోని ఉత్తమ కృతుల్లో ఒకటని చెప్పవచ్చు.

అందులో ఉన్న ముప్పై పద్యాల్లోనూ, కవి ఒక క్రమవికాసాన్ని పాటించాడు. మొదటి పది పద్యాలూ కవి గొంతుకతో వినిపిస్తాయి. తర్వాతి ఇరవై పద్యాలూ, నాయిక తల్లిమాట్లాడే మాటలు. చివరి పది పద్యాలూ నాయిక భగవంతుడిని ఉద్దేశించి పలికిన మాటలు, మంచిగంధపు మూటలు.

కావ్యాన్నిట్లా మూడు భాగాలుగా విభజించడంలోని ఔచిత్యాన్ని పరాశరభట్టారు తన వ్యాఖ్యానంలో ఎన్నో విధాలుగా కొనియాడారని చెప్తారు. నేను చదివిన ఇంగ్లీషు అనువాదం, Tirunedudamdakam of Tirumamgai Alwar (2003) లో అనువాదకుడు ఈ విషయాన్ని వివరిస్తూ భర్తృహరి రాసిన ఈ శ్లోకాన్ని ఉదాహరించాడు.

**అదర్శనే దర్శనమాత్ర కామా**
**దృష్ట్వా పరిష్వంగ రసైక లోలాః**
**ఆలింగితాయాం పునరాయతాక్ష్యాం**
**ఆశాస్మహే విగ్రహయోరభేదమ్**

**(చూడనంతసేపూ ఒక్కసారి చూస్తే చాలనిపిస్తుంది. చూసిన తర్వాత దగ్గరకి తీసుకుని కావిలించుకోవాలనిపిస్తుంది. తీరా కావిలించుకున్నాక, ఒకరిలో ఒకరు కరిగిపోవాలనిపిస్తుంది.)**

తిరునెడుదండకం ఈ ప్రేమప్రలోభక్రమం తాలూకు రసరమ్య వర్ణన. మొదటి పది పాశురాలు దర్శనమాత్ర తృప్తిని కోరుకుంటాయి, తర్వాతి పది పాశురాలూ పరిష్వంగ తృప్తికోసం పరితపిస్తాయి. చివరి పది పాశురాలకూ వచ్చేటప్పటికి, తానూ, తన ప్రేమికుడూ, ఇద్దరూ ఉండరు, ఒకటే మహానుభూతి మిగుల్తుంది. ఆ ఆనవాలు ఎలా ఉంటుందో ఒకటి రెండు పద్యాలు:

## అన్నానేగాని ఆ ఉక్రోషానికి బలం లేదు

### 23

**నా గాజులూడ్చేసాడు, నా కళాకాంతీ దోచుకున్నాడు, తీరని**
**వ్యథ ఒకటి నా ఎముకల్లోకీ కుక్కేసాడు, కలలుగనే తావుల్లో**
**నేనతణ్ణి కనుగొన్నప్పుడు, తేనెలూరే తులసిమాలతో, 'కొబ్బరి నీళ్ళు**
**కాలువలై పారే శ్రీరంగం మా వూర'ని చెప్పాడు, 'ఓయి, దొంగా,**
**పక్షినెక్కి పారిపోకు' అన్నానేగాని ఆ ఉక్రోషానికి బలం లేదు.**

### 24

**మదపుటేనుగు మెడలు వంచిన ఆ భుజాలు, ఆ కళ్ళు, ఆ పెదాలు**
**ఆ మకరకుండలాలు, సూక్ష్మసుగంధాలు విరజిల్లే తులసిదళాలు,**
**అతడొక్కసారిగా మెరుపులాగా ప్రత్యక్షమై, నా శీలం, నా స్త్రీత్వం**
**నా తలపులు, నా గాజులు ఊడబెరుక్కుని నన్ను బానిసను చేసుకున్నాడు**
**'బంగారు సంపెంగలు పూచే శ్రీరంగం మా వూరం'టూ తప్పించుకున్నాడు.**

### 25

**ఓ షట్పదీ, నువ్వూ నీ సహచరీ, తేనెలూరే తోటల్లో పూలగుత్తుల మధ్య**
**మత్తుగా మకరందం పీలుస్తూ ఎంతగామైమరచిపోతున్నారో కదా, నీకు**
**దణ్ణం పెడతాను, ఒక్కసారి అలందూరు పోయి ఆ పసులకాపరి**
**ముందు బెదురులేకుండా, తొట్రుపడకుండా, ఒక్క మాట చెప్పు, 'ఆమెకి**
**నువ్వంటే ప్రాణమ'ని. అప్పుడేమవుతుందో నీ కళ్ళతో నువ్వే చూడు.**

# కైలాసం నేలకి దిగిన చోటు

**వి**జయదశమి. సెలవురోజు కావడంతో పోలింగు స్టేషన్లు చూసే అవకాశం లేదు. మొత్తం ఎన్నికల సిబ్బంది అంతా దసరా తీరికదనంలో ఉన్నారు. ఒక్కణ్ణీ రోజంతా గెస్ట్ హవుజ్ లో గడపడం కన్నా ఎక్కడికేనా వెళ్ళి రావచ్చు కదా అనుకున్నాను. 'మీరు తమిళనాడులో ఏమి చూసినా చూడకపోయినా పరవాలేదు, బృహదీశ్వరాలయం మాత్రం చూడకుండా రాకండి, ఆ కట్టడం చూసేక నాకు మానవహస్తాలమీద గౌరవం పెరిగింది' అన్నాడు మిత్రుడు విజయకుమార్ అప్పటికే రెండు మూడు సార్లు. అందుకని ఆ రోజు తంజావూరు వెళ్ళక తప్పదనుకున్నాను.

చాలా ఏళ్ళుగా నాకు చోళనాడు ఎలా ఉంటుందో చూడాలన్న కోరిక ఉంది. సంబంధర్ కవిత్వంలో కనిపించే ఆ పంటపొలాలూ, తామరపూల చెరువులూ, దొరువులూ, కొబ్బరి తోటలూ, పల్లెలూ, పట్టణాలూ కళ్ళారా చూడాలన్న కోరిక ఆ రోజు పూర్తిగా తీరింది. ఆ రోజు తలుచుకుంటే ఇప్పుడు నా కళ్ళముందు మేఘాల దొంతరలూ, నిండుగా విప్పారిన తామరపూలూ కదలాడుతున్నాయి.

ఆ రోజు మా ప్రయాణం మొదలుకాగానే నారాయణమూర్తి 'మనం ముందు గంగైకొండ చోళపురం వెళ్తున్నాం' అన్నాడు.

గంగైకొండ చోళపురం! ఎన్నాళ్ళ తరువాత విన్నానీ మాట! చిన్నప్పుడు తాడికొండలో మా సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు సి.ఎస్.ఎన్ గారు పరిచయం చేసిన పదం. చోళ చక్రవర్తుల్లో రాజరాజ చోళుడి తర్వాత ఎన్నదగ్గవాడు, రాజరాజు కొడుకు, రాజేంద్ర చోళుడు నిర్మించిన నగరం. 'గంగైకొండాన్' అంటే 'గంగని తెచ్చిన' అని అర్థం. పదకొండో శతాబ్దం నాటికి చోళ సామ్రాజ్యం అత్యున్నత స్థితికి చేరుకుంది. రాజేంద్ర చోళుడు ఉత్తరభారతదేశాన్ని కూడా జయించి గంగాజలాల్ని తీసుకొచ్చి కొత్తగా ఒక రాజధానిని నిర్మించాడు. తంజావూరు వదిలిపెట్టి దాదాపు రెండువందల ఏళ్ళపాటు చోళసామ్రాజ్యం కొత్త రాజధానికి తరలివచ్చింది.

మధ్యయుగాల్లో మొత్తం ఆసియాలోనే అతిపెద్ద నగరంగా విలసిల్లిన గంగైకొండ చోళపురం ఇప్పుడు అరియలూరు జిల్లాలో ఉడయార్ పాళ్యం తాలూకాలో చిన్న కుగ్రామం. ఏ నగరాన్ని కంబ మహాకవి తన రామాయణకావ్యంలో అయోధ్యానగరంగా వర్ణించాడో, ఏ నగరం నమూనాగా శేక్కిలార్ పెరియపురాణంలో నగరవర్ణనలు చేసాడో, ఇప్పుడా నగరం ఆనవాలుగా మిగిలింది గంగైకొండ చోళేశ్వరం అనే ఒక బృహద్దేవాలయం మటుకే.

మేం ఆ గ్రామాన్ని సమీపిస్తుండగా దూరం నుంచే ఆ దేవాలయగోపురం ఆకాశంలోకి పైకిఎత్తి చూపిస్తున్న వజ్రంలాగా ధగధగా మెరుస్తూ కనిపించింది. రాజేంద్రచోళుడు తన తండ్రి రాజరాజు తంజావూరులో నిర్మించిన బృహదీశ్వరాలయానికి పోటీగా నిర్మించిన ఆ దేవాలయం గంభీరంగానూ, శతాబ్దాలు గడిచినా వన్నె తగ్గని రాజసంతోనూ విరాజిల్లుతూ ఉంది. ఒకప్పుడు తూర్పు, ఈశాన్య భారతంనుంచి, ఆగ్నేయాసియాదాకా రాజేంద్ర చోళుడి సైన్యాలు, నౌకలు ప్రయాణించి కొల్లగొట్టుకొచ్చిన ధనరాశులతో పూజలందుకున్న ఆ శివలింగం దక్షిణభారతంలోనే అతిపెద్ద శివలింగం. ఇప్పటికీ ఆ శివుడుకి నిత్యధూపదీపాలు అందుతూనే ఉన్నాయి.

ఆ దేవాలయ ప్రాంగణమంతా ఒక సారి చుట్టివచ్చాను. అక్కడ చరిత్ర గడ్డకట్టి ఆ దేవాలయ శిల్పసంపదగా నిలబడిపోయింది. ఆ గోపురం, ఆ విమానం, ద్వారపాలకులు, ప్రాకారాలు, మంటపాలు ప్రతి ఒక్కటీ కాలాన్ని దాటి బతికిన వైభవాలు. మా అన్నయ్యకు ఫోన్ చేసి గంగైకొండ చోళపురంలో ఉన్నానని చెప్తే, అది తెలుగు సంస్కృతికీ, సాహిత్యానికీ చాలావెన్నుదన్నుగా నిలబడ్డ ఊరు అని చెప్పాడు. అప్పుడు గుర్తొచ్చింది, రాజరాజనరేంద్రుడి భార్య అమ్మంగదేవి రాజేంద్ర చోళుడి కుమార్తెనేననీ, వేంగీచాళుక్యులమీద పశ్చిమచాళుక్యులు దండయాత్రలు చేసినప్పుడల్లా రాజరాజనరేంద్రుడికి బాసటగా నిలబడ్డది గంగైకొండ చోళపురమేననీ. అంతేకాదు, గంగైకొండ చోళపురం నమూనాలోనే తెలుగు రాజరాజు రాజమహేంద్రవరాన్ని నిర్మించాడని కూడా.

## 2

గంగైకొండ చోళపురం నుంచి తంజావూరు వెళ్ళే దారిలోనే తిరువయ్యారు ఉందనీ మేం తర్వాత అక్కడికే వెళ్ళబోతున్నామనీ నారాయణమూర్తి చెప్పినప్పుడు నా గుండె వేగంగా కొట్టుకోడం మొదలుపెట్టింది. ప్రతి ఏటా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్ని టెలివిజన్లో చూసినప్పుడల్లా, ఎప్పటికేనా, ఆ ఊరు వెళ్ళగలనా, ఆ సంగీతసామ్రాజ్యంలో అడుగుపెట్టగలనా అనుకునేవాణ్ణి.

కాని, తిరువయ్యారు అన్నిటికన్నా ముందు ప్రాచీన శైవక్షేత్రమనీ, అక్కడ చోళకాలం నాటి పెద్ద శివాలయం ఒకటి ఉందనీ అక్కడ అడుగుపెట్టాకే తెలిసింది. అయ్యారు అంటే అయిదు నదులని అర్థం. తిరువయ్యారులో నెలకొన్న శివుడు పంచనదీశ్వరుడు.

పాటలు పుట్టిన స్థలాల్లో తిరువయ్యారు ముందు వరసలో ఉంటుంది. అప్పర్, సంబంధర్, సుందరమూర్తి ముగ్గురూ తిరువయ్యారుమీద కవిత్వం చెప్పారు. మామూలుగా పెరిగే చెరకుగడలు కూడా అక్కడి గాలికి మరింత బారెడు పెరుగుతాయని సంబంధర్ చెప్పిన మాటలు నేనింతకుముందే ప్రస్తావించాను. మామూలుగా కొట్టుకునే గుండె కూడా మరింత లయాత్మకంగా కొట్టుకుంటుందని పంచనదీశ్వర దేవాలయ ప్రాంగణంలో అడుగుపెట్టాక అనుభవానికొచ్చింది. జ్ఞానసంబంధర్ అంతటివాడే తిరువయ్యారులో అడుగుపెట్టినప్పుడు ఇలా పాడకుండా (తేవారం, 1:130:1–5) ఉండలేకపోయాడు.

## నేనున్నానని శివుడు పలికే చోటు

1

**పంచేంద్రియాలూ పట్టుదప్పినప్పుడు, గొంతు కఫంతో పూడుకుపోయినప్పుడు**
**మనసు బాధకులోనైన వేళల్లో 'నేనున్నాన'ని శివుడు పలికే చోటు,**
**యువతులు నాట్యమాడేవేళ, సంగీతవాద్యాలు సుమధురంగా మోగేవేళ,**
**దరువుల్ని ఉరుములనుకొని కోతులు చెట్లమీద చేరే ఊరు తిరువయ్యారు.**

*2*

**విషసర్పాల్ని నడుముకు చుట్టుకుని కొండకన్నెను వెంటబెట్టుకుని**
**ఎద్దునెక్కి అందమైన యువతుల చుట్టూ భిక్షార్థిగా శివుడు తిరిగే చోటు,**
**కావేరి ప్రవాహం పొడుగునా శంఖరాశులు కొట్టుకొచ్చే సముద్రజలాలు**
**తీరాన్ని తాకినప్పుడల్లా ముత్యాలు విరజిమ్మే చోటు తిరువయ్యారు.**

*3*

**స్త్రీని సగభాగం చేసుకున్నవాడు, సృష్టికర్తనీ, స్థితికారుణ్ణీ తన ఎముకల్లో**
**కుక్కుకున్న కైలాసవాసి, త్రిశూలధారి, వృషభవాహనుడు కొలువున్నచోటు,**
**తేనెవాకలూరే తోటల్లో సన్నదారుల్లో ఎర్రకాళ్ళ తెల్లకొంగలు ముక్కుతో**
**ఈకలు దిద్దుకుంటూ ఆహారం వెతుక్కునే అందమైన ఊరు తిరువయ్యారు.**

## 4

**ఆ కపాలాన్ని ఇంకా పచ్చిమాంసపు వాసన వదల్లేదు, అయినా దానితోనే భిక్షార్చన చేసేవాడు, అర్ధనారి, వృషభవాహనుడు, శంకరుడు తిరిగే చోటు, లేళ్ళూ, ఆడకోతులూ పొలాల్లో, చెట్లమీద తుళ్ళింతలాడే చోటు, తామరపూల దొరువుల్లో గండుమీనులు ఎగిసిపడుతూ తేనెలొంపే చోటు తిరువయ్యారు.**

## 5

**శిరాన గంగ, మారేడు, చంద్రవంక, ఉమ్మెత్త, రేలపూల గుత్తులు, తులసి మాలలు ధరించిన వాడు, తత్త్వమూర్తి, పరమేశ్వరుడు కొలువైన చోటు, ఆకాశమంతా పరిమళాలు జల్లే పూలతోటలు, రథవీథుల్లో, సౌగంధిక గృహాల్లో సాలంకృతస్త్రీలు నర్తిస్తూ కలకల్లాడే ఊరు తిరువయ్యారు.**

పంచనదీశ్వర దేవాలయ ప్రాంగణంలో అడుగుపెట్టినప్పుడు ఆ సుగంధాలూ, ఆ మంగళ వాద్యాలూ, ఆ తామరపూల కొలనులూ మనల్ని ముప్పిరిగొన్నట్టే అనిపిస్తుంది. నేను ఆ గుడినుంచి బయటకు వస్తుంటే ఆ మంటపంలో తేవారం రికార్డు వినిపిస్తోంది. ఒక క్షణం అక్కడి స్తంభాలే ఆ సంకీర్తన చేస్తున్నాయా అనిపించింది.

ఆ సంకీర్తనాసౌరభం అక్కడ గోడల్లోకీ ఇంకిపోయిందనడంలో సందేహం లేదు. అప్పర్ కైలాసం వెళ్ళాలనుకుని యాత్ర మొదలుపెడితే తిరువైయారు దేవాలయ పుష్కరిణిలో తేలాడని ఒక ఐతిహ్యం. అందులో ఆశ్చర్యం లేదు. కైలాసం నేలకి దిగిన చోటు తిరువయ్యారు.

## 3

**కా**ని నా జీవితంలో అత్యంత మహిమాన్వితమైన క్షణాల్ని లెక్కపెట్టమంటే, ఆ రోజు కావేరి ఒడ్డున త్యాగరాజస్వామి ఆరాధనామందిరంలో గడిపిన క్షణాలు కూడా ఉంటాయని చెప్పగలను. నేను మరణశయ్య మీద ఉన్నప్పుడు, ఉపనిషత్కారుడు చెప్పినట్లుగా 'క్రతో స్మర! కృతం స్మర!' అనుకున్నప్పుడు, ఆ చివరి క్షణాల్లో, ఆ కావేరి నది, ఆ త్యాగరాజసన్నిధి, అక్కడ ప్రతిధ్వనిస్తున్న ఆ వాగ్గేయకారుడి హృదయ సంస్పందనం తప్పకుండా గుర్తొస్తాయని నాకిప్పుడు చాలా నమ్మకంగా ఉంది.

# జ్ఞానముతో, రామధ్యానముతో, మంచిగానముతో

**తి**రువయ్యారులో అడుగుపెట్టినప్పణ్ణుంచీ నాకొకటే ఆత్రుత త్యాగరాజ స్వామి ఆరాధనామందిరానికి ఎప్పుడు వెళ్తానా అని. ఆ మందిరం ఎక్కడుంటుందో, ఎలా ఉంటుందో నాకు ఊహ కూడా లేదు. కాని, నా ఎదట కావేరి నది, ఆ నది ఒడ్డున చిన్న మందిరం చూసేటప్పటికి నామనసుని గొప్ప సంతోషం ఆవరించింది. ఆ ఏరు, ఆ మందిరం చూడగానే నాకు మా ఊరిని, మా ఊళ్ళో రామకోవెలనీ, మా ఊరిని ఆనుకుని ప్రవహించే ఏరునీ చూసినట్టే అనిపించింది. ఎక్కడికి వెళ్ళు, ఎంత దూరం వెళ్ళు, ఏ దేశ విదేశాలకి వెళ్ళు, ఎక్కడ నీకు నీ ఊరూ, ఆ ఊళ్ళో ఏరూ కనిపిస్తాయో, అక్కడల్లా నీకు స్వర్గం ఎదురయినట్టే. అప్పుడొకసారి కన్నెగంటి రామారావిట్లానే ఇన్నిస్ ఫ్రీ సరోవరం దగ్గరకి వెళ్ళినప్పుడు మా ఊరు చూసినట్టనిపించిందని రాసాడు. ఏట్సునుంచి త్యాగయ్యదాకా ప్రతి ఒక్కరూ మా ఊరివాళ్ళేనని నాకు మరోసారి ధ్రువపడింది.

ఆ కావేరి నిండుగా, నెమ్మదిగా, నిర్మలంగా ప్రవహిస్తోంది. ఆ గట్టుమీద ఒకటి రెండు గోవులు సేదదీరుతున్నాయి. ఇద్దరు ముగ్గురు పిల్లలు నదిలో గాలాలు దింపి కూచున్నారు. ఆకాశమంతా వెలిగించిన మేఘజ్యోతులు ఆ నీళ్ళల్లో మరింత కాంతులీనుతున్నాయి. ఆ కావేరి ఒక యమున, ఒక గంగ, ఒక నర్మద, ఒక నాగావళి. ఆ గట్టుమీద అట్లానే కొంతసేపు కూచుండిపోయాను. ఆ నది ఎట్లాంటిదో అప్పర్, సంబంధర్‌లు మాత్రమే కాదు, త్యాగయ్య కూడా నోరారా కీర్తించాడు:

**సారి వెడలిన ఈ కావేరిని జూడరే**
**వారు వీరనుచు జూడక తా న**
**వ్వారిగాభీష్టముల నొసంగుచు**
**సారి వెడలిన ఈ కావేరిని జూడరే.**

**దురమున నొక తావున గర్జన భీ**
**కరమొక తావున నిండు కరుణతో**

నిరతముగ నొక తావున నడచుచు
వర కావేరి కన్యకామణి
సారి వెడలిన ఈ కావేరిని జూడరే.

వేడుకగా కోకిలలు మ్రోయగను
వేడుచు రంగేశుని జూచి మరి ఈ-
రేడు జగములకు జీవనమైన
మూడు రెండు నదినాథుని జూడ
సారి వెడలిన ఈ కావేరిని జూడరే.

రాజరాజేశ్వరియని పొగడుచు
జాజిసుమముల ధరామరగణములు
పూజలిరుగడల సేయగ త్యాగ
రాజసన్నుతిరాలై ముద్దుగా
సారి వెడలిన ఈ కావేరిని జూడరే.

అవును, ఆ నది ఎంతో ముద్దుగా ఉంది. తల్లిచేసే ముద్దులాగా, నీ తనయ పట్ల నీలో పొంగుకొచ్చే ముద్దులాగా. నా జీవితంలో నన్నంతదాకా బాధించిన అన్ని రకాల అలసటలూ, వేసటలూ ఒక్కసారిగా అదృశ్యమైపోయాయనిపించింది. రోజూ ఆ గట్టుమీద కూచుని ఆ నీళ్ళల్లో ఆ మేఘాలందం చూసే కళ్ళది కదా సౌభాగ్యం!

అక్కణ్ణుంచి త్యాగరాజ ఆరాధనామందిరంలో అడుగుపెట్టాం. ఆ మందిరం లోపల గోడల మీద పాలరాతిలో త్యాగరాజ కీర్తనలన్నీ చెక్కిపెట్టారు. అంతదాకా తమిళదేశ మంతటా, ఏ దేవాలయంలో అడుగుపెట్టినా, నాయనార్లవో, ఆళ్వార్లవో, మాణిక్య వాచకర్‌వో, అభిరామ భట్టార్‌వో మాత్రమే పద్యాలూ, పాటలూ కనిపిస్తూ వస్తున్న నాకు, అట్లా తెలుగు నేల మీద ఎక్కడా అటువంటి దృశ్యాలు కనిపించవేమా అన్న చింతతోనూ, సిగ్గుతోనూ కుంగిపోతూ వస్తున్న నాకు, అక్కడ తమిళదేశపు నడిబొడ్డున, ఆ మందిరంలో అంత తెలుగు కవిత్వాన్ని చూసేటప్పటికి, నాకెంత గర్వం కలిగిందో మాటల్లో చెప్పలేను. చూడవలసిన ఒక కవిని చూడవలసిన చోట చూసాననుకున్నాను. ఇతడుకదా సార్థకమానవుడు, కవి, గాయకుడు! ఒకసారి ఇతడు ప్రభవించిన తర్వాత, తమిళదేశమంతా, ఆళ్వారుల్నీ, నాయనార్లనీ, అరుణగిరినాథుల్నీ కూడా పక్కనపెట్టి, ఇతడి కీర్తనలే కదా నోరారా పాడుకోవడం మొదలుపెట్టింది! ఒకప్పుడు పోతన గురించి రాస్తూ, మా మాష్టారు, 'ఒక జాతి తరించాలంటే, ఇటువంటి కవి ఒక్కడుంటే చాల'ని

రాసారు. ఆరోజు, అక్కడ, రామనామామృతమనే తెలుగు కవితామృత భాండాన్ని భద్రపరిచిన ఆ మందిరంలో నిల్చున్నప్పుడు, ఒక భాష ధన్యత పొందడానికి, ఇటువంటి కవి ఒక్కడుంటే చాలు కదా అనుకున్నాను.

ఆ ఆరాధనా మందిరం త్యాగరాయ కీర్తనలాగా ఎంతో సరళంగానూ, రామనామంలాగా పవిత్రంగానూ ఉంది. అది చీనా ఋషిశ్రేష్ఠుడు తావోచిన్ కట్టుకున్న చామంతిపూల కుటీరంలానూ, జెన్ కవీంద్రుడు బషో కట్టుకున్న అరటాకుల పర్ణశాలలానూ ఉంది. అక్కడ త్యాగరాజు వంశానికి చెందిన అయిదవ తరం వారసులు అర్చకులుగా ఉన్నారు. ఆ అర్చకుడు నన్ను తెలుగులో పలకరించాడు. అప్పుడే ఎవరో త్యాగరాజ స్వామికి సమర్పించిన గులాబీ మాల ఆయన రెండు చేతులా నన్ననుగ్రహిస్తూ నా మెడలో వేసాడు. మంచిగంధపు తెలుగుపలుకులాగా ఆ మాల చల్లగానూ, సురభిళసుసంపన్నంగానూ ఉంది. ఆ పూరేకలమీంచి సన్నని కావేరి నీటిబిందువులు నా శిరసుమీదా, చెంపల మీదా, బుజం మీదా చింది నాకు కావేరి స్నానం చేసిన అనుభూతి కలిగింది. ఆయన త్యాగరాజు బొమ్మలు ముద్రించిన నాలుగైదు విభూతి పొట్లాలు నా చేతుల్లో పెట్టాడు. ఆ విభూతి పరిమళం సహృదయుడి శుభాకాంక్షలాగా నా హృదయాన్ని నేరుగా తాకింది. నేను త్యాగరాజస్వామి ముందు సాష్టాంగపడ్డాను. 'సంగీత వంశాభివృద్ధిరస్తు' అని ఆశీర్వదించాడు ఆ అర్చకుడు.

కొద్దిసేపు ఆ మంటపంలో కూచుని బయటకు వచ్చాను. ఆ మందిరం ఎదట పెద్ద మైదానం. ప్రతి ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు జరిగేది ఆ మైదానంలోనే. ఆ మైదానానికి ఆ పక్క బెంగుళూరు నాగరత్నమ్మ సమాధి ఉంది. త్యాగరాజు రాముడి ఎదట ఎంత వినయంతో ఒదిగి ఉంటాడో, నాగరత్నమ్మ కూడా అంతే వినయంతో త్యాగరాజు ముందు ఒదిగి ఉన్నట్టుగా ఉంది ఆ సమాధి. ధన్యజీవి. ఒక తెలుగు కవికి ఏ చక్రవర్తులూ చేయలేని పట్టాభిషేకం చేసిందామె అక్కడా మందిరం నిర్మించి.

మరొకసారి కావేరి గట్టుదగ్గరికి వెళ్ళాను. అప్పుడెవరేనా ఒక త్యాగరాజ కృతి ఆలపిస్తే బాగుణ్ణనిపించింది. అప్పుడే హృదయతంత్రుల్ని మీటుతో ఒక వాయులీన స్వరం వినిపించింది. అదెవరో చూతామని మళ్ళా మందిరంలోకి వెళ్ళాను. ఒక విద్యార్థి త్యాగరాజ సన్నిధిలో ఒక వర్ణం వినిపిస్తున్నాడు. అట్లా మదిలో తలపు పుట్టగానే ఆ సంగీతమట్లా వినబడగానే అక్కడ దేవతలు నన్నే గమనిస్తున్నారని నాకు అర్థమయింది.

మళ్ళా కావేరి ఒడ్డుకి వెళ్ళాను. అప్పటికి అర్థమయింది నాకు, త్యాగరాజు సంగీత స్వరార్ణవ రహస్యం ఎక్కడుందో. అది ఆ గాలిలో అలముకున్న అపారమైన నిశ్శబ్దంలో ఉంది. ఆ ఆకాశంలోనూ, ఆ ప్రవాహంలోనూ ఇమిడి ఉన్న మహాప్రశాంతతలో ఉంది. వెయ్యేళ్ళ కిందట, అప్పర్, సంబంధర్, సుందరమూర్తి పాడుకున్న పాటలు అక్కడ

వదిలిపెట్టి వెళ్ళిన సూక్ష్మసుగంధంలో ఉంది. తిరువైయారులో దేవతలు తమతో తాము మాట్లాడుకుంటూ ఉంటారని జ్ఞాన సంబంధర్ కూడా అన్నాడు. కనుకనే, అట్లాంటి ఊళ్ళో ఉండాలని రాముడే ముచ్చటపడ్డాడని అంటున్నాడు త్యాగయ్య.

**మురిపెము కలిగె కదా రామ స-**
**న్మునినుత కరి వరద శ్రీరామ**
**పరమపురుష జగదీశ వరమృదు**
**భాష సుగుణీమణికోశ నీకు**

**ఈడులేని మలయమారుతముచే కూడిన కావేరీతటమందు**
**మేడల మిద్దెలతో శృంగారము మించు సదనములతో**
**వేడుచు భూసురు లగ్నిహోత్రులై వేదఘోషములచే నుతియింప**
**జూడ శివుడు కోరు యోగ్యమైన సుందరమగు పురము దొరికెననుచు.**

**సకల సుగంధ రాజ సుమములు సలలితములగు కోకిలనాదమ్ములు**
**శుకముఖ సనకాదులనుతమైన సురతరువులు కలిగి**
**నికటమందు వాణికొలువ సురపతి నీలమణి నిభశరీర నేడు**
**ప్రకటమైన నవరత్న ఖచిత హాటకమంటప వాసము కలిగెననుచు**

**ఈ మహిలో సొగసైన చోళసీమ యందు వరమైన పంచనద పుర**
**ధాముని చెంతను వసించుటకై నీ మది నెంచగ**
**కామజనక త్యాగరాజ సన్నుత నామ పవన తనయ విధృత చరణ**
**క్షేమముగ వర్ధిల్లునట్టి పురమున సీతభామ సౌమిత్రి ప్రక్క గొలిచెరని**

**మురిపెము కలిగె కదా రామ స-**
**న్మునినుత కరి వరద శ్రీరామ.**

'ఒక సజ్జనుణ్ణి కలుసుకున్న ఆనందానికి సాటిలేదు, అతణ్ణి వదిలిపెట్టి రావడాన్ని మించిన బాధలేదు' అన్నాడు తిరువళ్ళువర్. అతి కష్టమ్మీద వదల్లేక, వదల్లేక ఆ మందిరం వదిలిపెట్టి, ఊళ్ళో త్యాగరాజ స్వామి నివసించిన ఇల్లు చూడ్డానికి బయల్దేరాను. తిరువైయారు ఊళ్ళో ఆ వీధి ఇంకా 'జ్ఞానముతో, రామధ్యానముతో, మంచిగానముతో' త్యాగరాజు పాటలు పాడుకున్నప్పటిలానే ఉంది. ప్రతిరోజూ తెల్లవారగానే త్యాగయ్య ఆ వీధిలో ఈ దృశ్యాలే చూశాడా అన్నట్టుగా ఉంది.

**హరిదాసులు వెడలే ముచ్చట గని ఆనందమాయె దయాళో**
**హరిగోవింద నరహరి రామకృష్ణ యని వరుసగ నామము కరుణతో చేయుచు**
**సంగతిగాను మృదంగ ఘోషములచే పొంగుచు వీథుల కేగుచు మెరయుచు**
**చక్కని హరి చేజిక్కితిమని మది సొక్కుచు నామమె దిక్కని పొగడుచు**
**దిట్టముగా నడుకట్టుతో నడుగులు బెట్టుచు తాళము బట్టి గల్ గలనగ**
**జ్ఞానముతో రామధ్యానముతో మంచిగానముతో మేను దానమొసంగుచు**

**రాజరాజునిపై జాజులు రాజిల్లుచు శ్రీ త్యాగరాజనుతునితో గూడి**
**హరిదాసులు వెడలే ముచ్చట గని ఆనందమాయె దయాళో**

ఆ ఇంటిని కూడా ఇప్పుడు పాలరాతి మందిరంగా మార్చారు. అక్కడ త్యాగయ్య కాలం నాటి బావి ఒకటి నిర్మలంగా ఇప్పటికీ నీళ్ళూరుతూ ఉంది. ఆ మందిరంలో కొన్ని క్షణాలు కూచున్నాను. తన అన్న జపేశుడు రామపంచాయతన విగ్రహాలు కావేరిలో పారేసినప్పుడు, ఆ విగ్రహాలు మళ్ళా చేతికి చిక్కినప్పుడు, త్యాగయ్య పాడుకున్న పాటని అక్కడి అర్చకుడు గుర్తు చేసుకున్నాడు. ఆ శుభసన్నిధిలో నాకు గుర్తుచేసిన ఆ గీతాన్ని మీకు గుర్తు చేయకుండా ఎలా ఉండగలను!

**కనుగొంటిని శ్రీరాముని నేడు**

**ఇనకులమందు ఇంపుగాను బుట్టి**
**ఇలలోన సీతానాయకుని నేడు**
**కనుగొంటిని శ్రీరాముని నేడు**
**భరత లక్ష్మణ శతృఘ్నులు కొలువ**
**పవమానసుతుడు పాదముల బట్ట**
**ధీరులైన సుగ్రీవ ప్రముఖులు**
**వినుతిసేయ త్యాగరాజనుతుని నేడు**

**కనుగొంటిని శ్రీరాముని నేడు.**

నేరుగా తిరువైయారు మటుకే వెళ్ళి త్యాగరాజస్వామి మందిరమూ, ఇల్లూ మటుకే చూసి ఉంటే నా భావనలేవిధంగా ఉండేవో చెప్పలేనుగాని, ప్రాచీన తమిళభక్తకవి పరంపర శతాబ్దాల పాటు పాటలు పాడుకుంటూ తిరుగాడిన చోటులు చూస్తూ, ఆ కోవలో, త్యాగరాజు పదముద్రలు పోల్చుకున్నప్పుడు నాకు కలిగిన అనుభూతి మాటల్లో

పెట్టలేనిది. అయినా, ఆ కవి గురించి, ఆ స్వతంత్రుడి గురించి, ఆ సాహసి గురించి, ఆ ధన్యుడి గురించి రెండు మాటలు చెప్పాలంటే, మళ్ళా ఆయన మాటలే అప్పుతీసుకోవలసి ఉంటుంది, ఇలా చెప్పవలసి ఉంటుంది:

**రామభక్తి సామ్రాజ్యమే మానవుల కబ్బెనో మనసా**
**ఆ మానవుల సందర్శనమత్యంత బ్రహ్మానందమే.**

**ఈలాగని వివరించలేను, చాలా స్వానుభవ వేద్యమే**
**లీలా సృష్ట జగత్రయమనే కోలాహలత్యాగరాజనుతుడగు**

**రామభక్తి సామ్రాజ్యమే మానవుల కబ్బెనో మనసా**
**ఆ మానవుల సందర్శనమత్యంత బ్రహ్మానందమే.**

## మనుష్యఉత్సాహానికి సజీవ శాశ్వత ప్రతీక

**తం**జావూరు పండగ వెలుగుతో కళకళలాడుతోంది. ఇళ్ళకీ, అంగళ్ళకీ, వీథులకీ అరటిపిలకలు, మామిడాకులు తోరణాలు కట్టారు. మనుషులు కొత్తదుస్తుల్లో పండగ తీరికదనం ముఖాన రాసుకుని తిరుగుతున్నారు. విజయదశమి వేడుకతో ఊరంతా తుళ్ళిపడుతూ ఉంది.

మేం ఊళ్ళోకి అడుగుపెట్టగానే నేరుగా కోటలో సరస్వతీ మహల్ కి వెళ్ళాం. అక్కడ తంజావూరు గురించి వివరించే ఒక చిత్రప్రదర్శన మా కోసం సిద్ధంగా ఉంది. దాదాపు అరగంటపాటు సాగే ఆ డాక్యుమెంటరీ తంజావూరు జిల్లాని విహంగ వీక్షణంలో చూపించింది. కావేరి నది, ఆనకట్టలు, వరిచేలతో సస్యశ్యామలంగా ఉన్న డెల్టా దృశ్యాలు, దేవాలయాలు, కట్టడాలు, వీణలు, శిల్పాలు, సంగీతం మొదలైనవాటిని చూస్తుంటే, తంజావూరు నాకు మరొక రాజమండ్రిలానూ, ఆ డెల్టా కోనసీమలానూ తోచింది. తూర్పుగోదావరిలో కూడా అన్ని వీణలూ, అందరు శిల్పులూ ఉంటే గోదావరి డెల్టాకీ, కావేరి డెల్టాకీ తేడా ఏమీ ఉండదనిపించింది.

ఎంతో ప్రసిద్ధి చెందిన సరస్వతీ మహల్ గ్రంథాలయం ఆ రోజు సెలవురోజు కావటం వల్ల మూసి ఉంది. కాని రెండవ శరభోజి సేకరించిన వస్తు, గ్రంథ సంగ్రహాలయం తెరిచే ఉంది. ఆ ప్రదర్శనశాలలో చోళ, నాయక రాజుల కాలం నాటి శిల్పాలెన్నో ప్రదర్శనలో ఉన్నాయి. ముఖ్యంగా చోళకాంస్య ప్రతిమలు, లెక్కపెట్టలేనన్ని నటరాజ ప్రతిమలు, శివపార్వతులు, నాయన్మారులు అక్కడ కొలువు తీరి ఉన్నారు.

ఆ ప్రదర్శనలో నన్ను అమితంగా ఆకట్టుకున్నది రెండవ శరభోజి తనకోసం సేకరించుకున్న పుస్తకాల, గ్రంథాల, తాళపత్రాల ప్రదర్శన. దాదాపు నాలుగువేల పైచిలుకు పుస్తకాల్లో అపురూపమైన నమూనాలు కొన్ని అక్కడ ప్రదర్శిస్తూ ఉన్నారు. కలోనియల్ భారతదేశం నాటి మహారాజుల్లో శరభోజి వంటి విద్వాంసుడు, రసజ్ఞుడు, సాత్త్వికుడు మరొకరు లేరని విన్నానుగాని, ఆ మానవుడి భావప్రపంచం అంత

విస్తృతమైనదనీ, అంత పాండిత్యస్ఫోరకంగా ఉంటుందనీ అప్పుడే తెలిసింది నాకు. లాటిన్ లోనూ, సంస్కృతంలోనూ సమాన వైదుష్యం కలిగిన ఆ మహారాజు సేకరణలో ఎన్నో ఐరోపీయ గ్రంథాలు, అట్లాసులు, బొటానికల్ చిత్రలేఖనాలు, దిక్సూచిలు, ప్రపంచపటాలు, బైబిలు కథలు, రామాయణం తాళపత్రాలు, ఒకటేమిటి? పందొమ్మిదో శతాబ్ది ప్రపంచమంతా ఉందక్కడ.

ఆ మందిరమధ్యంలో వైభవోపేతమైన దర్బారులో శరభోజి నిలువెత్తు విగ్రహం దర్శనమిస్తూ ఉంది. కావటానికి మరాఠా. కాని, తెలుగు, తమిళం, ఇంగ్లీషు, ఫ్రెంచి, లాటిన్ భాషల్నీ, అన్ని మతాల్నీ సమానంగా ఆదరించిన పోషకుడు. బ్రిటిషు వాళ్ళతో సఖ్యత నెరిపినందుకు వాళ్ళతణ్ణి నీకేమిచ్చి బదులు తీర్చుకోగలం అనడిగారట. 'నేను సేకరించిన అమూల్య శిల్పాలూ, పుస్తకాలూ భద్రంగా ఉండేలా చూడండి' అని మటుకే కోరుకున్నాడట అతడు. అందుకనే, ఎక్కడ ఏది చూసినా లండన్ మ్యూజియంకి తరలించకుండా ఉండలేని బ్రిటిషు వాళ్ళు, శరభోజి సేకరణలోంచి ఒక్క కాగితం కూడా బయటికి తీసుకువెళ్ళలేదు.

శరభోజి నిజంగా ధన్యుడు. ఒక్క త్యాగరాజ కీర్తనని తప్ప ప్రతి ఒక్క సుందర రచననీ అతడు సొంతం చేసుకోగలిగాడు, సేకరించి దాచుకోగలిగాడు.

## 2

సరస్వతీ మహల్ దగ్గరే మాకు చాలా సేపు పట్టింది. అక్కణ్ణుంచి మధ్యాహ్నభోజనం చేసి నగరమధ్యంలోని బృహదీశ్వరాలయానికి వెళ్ళేటప్పటికి పొద్దు వాలుతూ ఉంది.

బృహదీశ్వరాలయం నిజంగానే మనుష్యహస్తాల శక్తికి, ఉత్సాహానికి ఒక సజీవ, శాశ్వత ప్రతీక. చోళ సామ్రాజ్య భుజబలం, భావనాబలం, అంగబలం, అర్థబలం సమస్తం ఇప్పటికీ అక్కడ సజీవంగా కనబడుతున్నాయని చెప్పవచ్చు. ఇది నా మాట మటుకే కాదు, చోళకట్టడాలన్నిటిలోనూ అత్యంత బృహన్నిర్మాణంగానూ, సజీవ దేవాలయంగానూ దాన్ని యునెస్కోనే పేర్కొంది.

పదకొండో శతాబ్దిలో రాజరాజ చోళుడు నిర్మించిన ఆ దేవాలయాన్ని తర్వాతి రోజుల్లో మరాఠాలు, నాయకరాజులు మరింత అభివృద్ధి పరిచారు. ఆ దేవాలయ ప్రాంగణం, గోపురం, విమానం, శిఖరం, ప్రాకారాలు, గర్భాలయం, అన్నిటికన్నా ముఖ్యంగా ఆ నంది, ప్రతి ఒక్కటీ అద్భుతం, అపురూపం. బహుశా ఎల్లోరాలోని కైలాసదేవాలయం ఒక్కటే దానితో పోల్చదగ్గది.

ఆ దేవాలయంలోని శివుడు రాజరాజేశ్వరుడు. తన తండ్రి తన పేరు మీద ఒక బృహద్దేవాలయాన్ని నిర్మించాడు కాబట్టి తాను కూడా అటువంటి మరొక దేవాలయాన్ని నిర్మించాలనే ఉద్దేశ్యంతోనే రాజేంద్ర చోళుడు గంగైకొండ చోళేశ్వరం నిర్మించాడు. కాని, బృహదీశ్వరాలయం ముందు గంగైకొండ చోళేశ్వరం ఏ విధంగానూ నిలబడ జాలదనే చెప్పాలి.

కేవలం పరిమాణంలో మాత్రమే కాదు, బృహదీశ్వరాలయం మనల్ని ఆకట్టు కోవడం వెనక రాజరాజచోళుడి హృదయం కూడా ఉంది. తన సత్త్వాన్ని పరిపూర్ణంగా వ్యక్తం చేసుకునే అవకాశం ఒక్కొక్క జాతికి ఒక్కొక్క కాలంలో లభిస్తుంది. లండన్‌కి విక్టోరియన్ యుగం అటువంటిది. తమిళదేశానికి చోళసామ్రాజ్య కాలం అటువంటిది. తన నేలపట్ల, తన జాతి పట్ల, తన రాజ్యం పట్ల రాజరాజచోళుడి ప్రేమాభిమానాలన్నీ ఆ కట్టడంలో పూర్తి అభివ్యక్తికి నోచుకున్నాయి.

ఆ దేవాలయ ప్రాంగణంలోనే కరువూర్ దేవర సమాధి కూడా ఉంది. కరువూరు దేవర ఒక సిద్ధుడు. ఆయన రాజరాజచోళుడికి రాజగురువు కూడా. తేవారం తాళపత్రాల్ని చిదంబరంనుంచి తీసుకొచ్చి సంకలనం చేయించడం వెనక రాజరాజచోళుడికి స్ఫూర్తినిచ్చింది అతడే. అతడు శివకవినా, సిద్ధుడా అనేది ఇంకా వాదన నడుస్తూనే ఉంది. అతడు ఒకరు కాదు, ఇద్దరు అని వాదించుకోడం తమిళపండితులకి ఒక తీరికసమయపు వ్యాపకం. అతడు ఎవరేనా కానీ, తొమ్మిదో తిరుమురైలో, 'తిరువిసైప్ప' (శ్రీకార్య గీతం) పేరిట సంకలనమైన కవిత్వం రాసింది మాత్రం అతడే అనేది నిర్వివాదాంశం.

తిరువిసైప్పలో గంగైకొండ చోళేశ్వరంతో పాటు, బృహదీశ్వరాలయం మీద కూడా అతడు పదికాలు చెప్పాడు. 'తంజై రాజరాజేశ్వరం' పేరిట తంజావూరు పెరుం కోయిల్ మీద అతడు చెప్పిన కవిత్వం చాలా కొత్తగానూ, ఇంకా చెప్పాలంటే, ఆ వ్యక్తీకరణ కొంత ఆధునికంగానూ కూడా కనిపిస్తుంది. 'తంజై ఇరాసరాసేచ్చరం' (9:16) నుంచి రెండు మూడు చరణాలు:

### ఒక కారుణ్యమూర్తికి తగిన పనేనా?

1

**కోటతో, వివిధ వస్తుసమాహారంతో నిర్మించిన ఏడు అంతస్తుల గోపురాలు, వెండి తాపడాలతో వెండి వెన్నెల కాంతులీనుతున్నాయి. బహుప్రాకారాల మధ్య తంజావూరు రాజరాజేశ్వరుడి కోవెలలో శివుడు నూరువేలకోట్ల సూర్యుల్లాగా ధగధగలాడుతున్నాడు. అందమైన ఆ వెలుగు ఆశ్చర్య చకితుల్ని చేస్తోంది.**

2

**వడవు నదిలో ఎగసిపడే అలలు, ప్రాకారం చుట్టూ కందకంలో తుళ్ళిపడే మొసళ్ళు, ఆ అగడ్త మధ్య వెలిసిన రాజరాజేశ్వరుడనే ముక్కంటి మూడవకన్ను నా హృదయనేత్రం నుంచి పక్కకు తప్పుకోవడం లేదు. నా మనసులో అందమైన అందెల సవ్వడి మోగుతోంది. నా వంశాన్ని కాపాడటంకోసమే ఆ చరణాలు నా హృదయంలో తిష్ఠవేసుకుని నన్ను వదిలిపెట్టడం లేదు. నాకింతకన్నా మరే బాంధవ్యం కావాలి?**

3

**ఆ వీథుల్లో శ్వేతఛత్రాలు ధరించిన మహారాజులు ఊరేగేటప్పుడు వాళ్ళ కిరీటాలు ఒకదానితో ఒకటి రాసుకుని కిందపడ్డ మాణిక్యాలతో వీథులు తళతళలాడుతున్నాయి. ఆ భవంతుల మధ్య రాజరాజేశ్వరంలో వెలిసిన స్వామి నా స్వామి. చంద్రవంకలాంటి తెల్లని కిరీటంతో, ముత్యాల గొడుగుతో, వృషభవాహనం మీద తిరువీథుల్లో ఆయన ఊరేగేటప్పుడు ఒక యువతి ఆయన్ని చూసి 'ఆ ఊరేగుతున్న ఔన్నత్యం ఎటువంటిదో కదా' అన్నది. ఆ మాట నన్ను ఒకపట్టాన వదలడం లేదు.**

4

**ముత్యాలు పొదిగిన మేడలు, వెన్నెల కొండలా కాంతి విరజిమ్మే వీథులు, చీకటి మటుమాయమయ్యే ప్రాకారాలు.తంజావూరులో వెలిసిన రాజరాజేశ్వరుడు కరుణ ఎలా చూపించాలో తెలిసిన కారుణ్యమూర్తి. ఆ ఏలిక తనని ఏలుకోవాలని భావించి తన అందమైన కళ్ళు, చెవులు, కురులు ఆయనకి చూపించి యాళ్ సంగీతతరంగాల్లాంటి తన మాటల్తో ఆయనకి విన్నవించుకుంటున్న నా కూతురిని ప్రేమజ్వరంలో పడేసాడు. అది ఒక కారుణ్యమూర్తికి తగిన పనేనా?**

బృహదీశ్వరాలయాన్ని సందర్శించే యాత్రికులకి చాలామందికి తెలియని ఒక అపురూప సంపద చోళకాలం నాటి కుడ్యచిత్రాలు. ఇప్పుడు తంజావూరు చిత్రకళగా ప్రసిద్ధి కెక్కిన రేఖాచిత్రణ, వర్ణలేపనం చోళకాలం నాటి కళారూపాలు. ఎంతో అరుదైన ఆ కుడ్య చిత్రాల్ని 1930 లో ఎస్.కె.గోవిందస్వామి అనే పరిశోధకుడు కనుగొన్నాడు. ఆ ఆలయ ప్రాంగణంలోనే ఒక పక్క ఆ కుడ్యచిత్రాల సంగ్రహాలయం ఉంది. దురంతమైన

కాలం తాకిడికి అవి ఇంకా రంగులు పూర్తిగా పోగొట్టుకోకుండా నిలిచి ఉండటం ఆశ్చర్యం. అజంతా చిత్రలేఖనాల్తో పోల్చదగ్గ ఆ వర్ణచిత్రసముదాయం మధ్యయుగాల భారతదేశం దక్కించుకున్న అత్యంత అపురూపమైన సంపదల్లో ఒకటని చెప్పవచ్చు.

## 3

**తం**జావూరులో మేం వెతుక్కున్న చివరి దర్శనీయ స్థలం తొల్కాప్పియర్ సదుక్కం. ప్రపంచ తమిళ మహాసభల ఎనిమిదవ మహాసభ తంజావూరులో జరిగిన సందర్భంగా స్మారకచిహ్నంగా ఆ గోపురాన్ని నిర్మించారు. చుట్టూ చిన్న పార్కు ఏర్పాటు చేసారు. ఆ నిర్మాణం కింది అంతస్తు మీద తొల్కాప్పియారు విగ్రహం చెక్కారు. దాని మీద 'మేము అన్ని స్థలాలకూ చెందినవాళ్ళం, ప్రతి ఒక్కరూ మావారే' అనే సూక్తి రాసిపెట్టారు. ఆ మధ్య ఐక్యరాజ్యసమితిలో తమిళ భాష ప్రాచీనతనూ, ప్రాశస్త్యాన్నీ ప్రస్తుతిస్తూ ప్రధానమంత్రి  పేర్కొన్న వాక్యం అదే.

సంగం కాలం నాటి ఒక కవి పలికిన ఆ వాక్యాన్ని అక్కడ ఉల్లేఖించడంలో ఎంతో ఔచిత్యం ఉంది. తొల్కాప్పియార్ సంగ కాలం నాటి సాహిత్యానికి ఒక లక్షణ గ్రంథం రాసిపెట్టిన రచయిత. ఆయన పేరేమిటో ఎవరికీ తెలియదు.ఆయన రాసిన లక్షణ గ్రంథం పేరు 'తొల్కాప్పియం' (తొలికావ్యం). ఆ పుస్తకం పేరు మీదనే ఆయనకీ తొల్కాప్పియార్ అనే పేరు స్థిరపడింది. అతడు ఒక జైనవిద్వాంసుడు. ఒక భాష, ఒక సాహిత్యం ఎటువంటి వివేచనాశీలికోసం ఎదురుచూస్తాయో అటువంటి విమర్శనాశీలి. సంగం కాలం నాటి సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి సాహిత్యసూత్రాల్నీ, వ్యాకరణాన్నీ రూపొందించాడు. అరిస్టాటిల్ 'పొయెటిక్స్' తోనూ, భరతముని 'నాట్యశాస్త్రం' తోనూ సమానప్రతిపత్తితో నిలబడగల రచన అది.

తమిళకవిపదముద్రల్ని వెతుక్కుంటూ చేస్తున్న నా ప్రయాణం ఆ సాయంకాలం తొల్కాప్పియార్ మంటపం ముందు నిల్చున్నప్పుడు, తమిళ సహృదయుణ్ణి కూడా కనుగొనడంతో సుసంపన్నమైందనిపించింది.

# సముద్రమంత భావాన్ని పలికించే కవిత

జైనం లేకపోతే తమిళసంస్కృతి లేదు. తమిళ సాహిత్య వికాసం లేదు. ఆ మాటకొస్తే కన్నడ సాహిత్యమూ, కన్నడ సంస్కృతీ కూడా జైనానికి పూర్తిగా ఋణపడ్డవే. తెలుగు ఒక మలుపు తిరగడానికి కూడా కారణం జైనులు. అయితే, తెలుగువాళ్ళు జైనం కన్నా, బౌద్ధానికి ఎక్కువ ఋణపడి ఉంటారు, అది వేరే చరిత్ర.

తమిళదేశంలో భక్తి కవులు పుట్టిపెరిగిన తావుల్లో సంచరిస్తూ ఉన్న నేను ఒక జైన స్థలాన్ని కూడా చూడకపోతే తమిళసాహిత్య పటం నా ముందు పూర్తిగా ఆవిష్కృతమైనట్టు కాదని అనుకున్నాను. అందుకని ఒక రోజు విల్లుపురానికి దగ్గరలో ఉన్న మేల్‌సితమూరు జైనక్షేత్రానికి వెళ్ళాను.

తమిళదేశానికి మొదటినుంచీ వెంగడం, అంటే తిరుపతి, ఉత్తర సరిహద్దుగా ఉంటూ వచ్చింది. తమిళ జైనం తొలికేంద్రం కూడా తిరుపతినే. అక్కణ్ణుంచి నెమ్మదిగా ఆ కేంద్రం కంచికి జరిగి, మధ్యయుగాల చివరిరోజుల్లో మేల్ సితమూరు కి తరలి వచ్చింది. నాయకరాజులు ఆ మఠానికి అనుమతీ, ఆర్థికసహాయం కూడా అందించారు. ఇప్పుడు ఆ మఠం తమిళజైనానికి ప్రధానకేంద్రంగా పనిచేస్తున్నది.

అక్కడ ఒక జైనమఠమూ, పార్శ్వనాథ దేవాలయమూ ఉన్నాయి. ముందు మేం మఠానికి వెళ్ళాం. వారు మమ్మల్ని దేవాలయానికి తీసుకువెళ్ళారు. దేవాలయానిది దాదాపు వెయ్యేళ్ళ చరిత్ర. దేవాలయ ప్రాకారాలు, గోపురాలు, గర్భాలయమూ, విగ్రహాలూ అన్నీ శైవ, వైష్ణవ ఆలయాల వాస్తు పద్ధతిలోనే ఉన్నాయి. కొలువైన దేవీదేవతల నామరూపాలు మాత్రమే వేరు. ఆలయం లోపల పై కప్పుమీద తంజావూరు తరహా చిత్రలేఖనాలు ఉన్నాయి. ఆ దేవాలయాల్లో మాదిరే ఇక్కడ కూడా హారతి ఇచ్చారు, గంటమోగించారు. గుడి చూసాక బయట దేవాలయరథం కూడా చూపించారు. ప్రతి ఏటా మహావీర జయంతినాడు పెద్ద రథయాత్ర జరుగుతుందనీ, దాదాపు పదిలక్షలమందిదాకా యాత్రికులు వస్తారనీ చెప్పారు.

ఆలయదర్శనం పూర్తయ్యాక మళ్ళా మఠానికి వచ్చాము. మఠాధిపతి భట్టారక లక్ష్మీసేన మా కోసం ఎదురుచూస్తున్నారు. కొద్దిసేపు అక్కడ కూచున్నాం. ఆ మఠంలో అనిర్వచనీయమైన ఒక ప్రశాంతత, చల్లదనం అనుభవానికొచ్చాయి.

కొద్దిసేపు కుశల ప్రశ్నలు అయ్యాక లోపలనుంచి మధురతైలాలేవో వీస్తున్నట్టుగా ఒక కమ్మతెమ్మెర వీచింది. ఆయన మమ్మల్ని లోపలకి తీసుకువెళ్ళారు. అక్కడ ఒక పెద్ద భోషాణంలో తాళపత్రాల గ్రంథాలు గుట్టలు గుట్టలుగా ఉన్నాయి. ఆ మఠంలో కార్యకర్తలు ఆ తాళపత్రాల గ్రంథాల్ని ఒక్కొక్కటే బయటకు తీసి నిమ్మనూనెలో ముంచిన గుడ్డతో మృదువుగా తుడుస్తున్నారు. మూడు నాలుగు నెలలకొకసారి వాటినట్లా తుడిచి లోపల పెడతామని చెప్పారు. ఆ గ్రంథాలేమిటోచూసి చెప్పగలరా అనడిగారు ఆ స్వామి. ఒక గ్రంథం జాగ్రత్తగా విప్పి చూసాను. కాని అది ఏ భాషనో, ఏ తరహా సాహిత్యమో లేదా వైద్యశాస్త్రగ్రంథమో నేను పోల్చుకోలేకపోయాను.

అక్కడ ఒక బల్లమీద 'జీవకచింతామణి' పూర్తిగ్రంథం వ్యాఖ్యానంతో ఉంది. ఆ పుస్తకాన్ని వారు నిత్యం అధ్యయనం చేస్తున్నట్టే, ఆ పేజీల మీద వేళ్ళ మరకలు కనిపిస్తూ ఉన్నాయి. ప్రాచీన తమిళసాహిత్యంలో ఇతిహాస స్థాయిని అందుకున్న ఏకైక కావ్యం జీవకచింతామణి. కాని ఇంతదాకా నేనా పుస్తకం చదవలేకపోయాను. ఈ మధ్యనే పూర్తి గ్రంథానికి ఇంగ్లీషు అనువాదం వెలువడిందని విన్నాను. ఆ పుస్తకాన్ని చేతుల్లోకి తీసుకుని ఆప్యాయంగా పేజీలు తిప్పాను. అది కొత్తప్రతి అయి ఉంటే మొహమాటం లేకుండా వారిని అడిగి తెచ్చేసుకుని ఉండేవాణ్ణి.

భట్టారకులకి ఆ రోజు ఎందుకో నా మీద ఏదో వాత్సల్యం కలిగింది. ఆయన నా కోసం ఒక పూర్ణఫలం తెప్పించి ఆశీర్వాదంతో నా చేతుల్లో పెట్టారు. ఒక నూతన వస్త్రాన్ని నా భుజాల చుట్టూ కప్పారు. ఆ పరిత్యాగి హస్తాల్లోంచి ఇరవైనలుగురు తీర్థంకరుల ఆశీర్వాదమూ నా మీద పూర్తిగా ప్రసరించినట్టనిపించింది.

'రాజులెవరైనా, రాజ్యాలెవరివైనా జైనం పట్ల ఆదరణ మాత్రం ఒక్కలానే ఉంది. చివరికి బ్రిటిషు వాళ్ళు కూడా మా మఠం పట్ల ఆదరం, గౌరవం చూపకుండా ఉండలేకపోయారు' అన్నారు మఠాధిపతి. అందులో ఆశ్చర్యం లేదు. తమిళదేశంలో, తమిళ శీలంలో జైన సంస్కారం అంతర్వాహిని. అత్యంత ప్రాచీనకాలంలో జైనులు నేర్పిన ఒక నడవడిక వాళ్ళ రక్తంలోకీ ఇంకిపోయింది. ఒకరోజు, మేమొక దేవాలయం నుంచి మరొక దేవాలయానికి వెళ్తున్నప్పుడు నేనొక భక్తి కవి గురించి మాట్లాడుతుండగా, నారాయణమూర్తి, హటాత్తుగా, 'ఈ భక్తి కవులు, ఈ భక్తి కవిత్వం గురించి మీరు ఇంతగా తపిస్తున్నారుగాని, 'నాలదియారు' లోని ఒక్క చరణం ముందు ఇవి ఎందుకూ కొరగావు' అన్నాడు. ఆ మాటలు వింటూనే నేను ఉలిక్కిపడ్డాను. మా మాష్టారు

శరభయ్యగారు అట్లా ఆశ్చర్యపరిచేవారు నన్ను. ఒకరోజు ఆయన ఎదట వ్యాసుణ్ణీ, హోమర్ నీ స్తుతిస్తూ ఉంటే, 'కామమ్మ కథ చదివేవా నువ్వు?' అనడిగారు.

ఆ 'నాలుగూ', ఆ 'రెండూ' లేకపోతే తమిళజాతికి శీలమబ్బేదే కాదని ఒక సామెత. నాలుగు అంటే 'నాలదియారు'. ఒక్కొక్కటీ నాలుగు పాదాలుండే నాలుగువందల పద్యాల సంకలనం అది. రెండు అంటే 'తిరుక్కురళ్'. కురల్ అంటే రెండు పాదాలుండే ఒక ఛందస్సు. దాన్ని పూర్తిగా ద్విపద అని కూడా అనలేం. మొదటి పాదంలో నాలుగూ, రెండవ పాదంలో మూడు పదాలు మాత్రమే ఉండే ఒకటిన్నర పంక్తుల ఛందస్సు అది. కాని ఆ ఒకటిన్నర పాదంలోనే సముద్రమంత భావాన్ని పలికించే కవిత అది.

నాలదియారు, తిరుక్కురళ్ రెండూ కూడా సంగం సాహిత్య మలిదశకు, ఇంకా చెప్పాలంటే, తుదిదశకు చెందిన పద్దెనిమిది చిన్న రచనల విభాగానికి చెందినవి. కాని బౌద్ధసాహిత్యంలో ఖుద్దక నికాయానికి చెందినప్పటికీ, దమ్మపదం ఎలాగైతే, తక్కిన బౌద్ధ వాఙ్మయాన్నంతటినీ మరిపింపచేసే స్థాయికి చేరుకున్నదో, అలానే తిరుక్కురళ్ కూడా తక్కిన తమిళ సాహిత్యాన్నంతటినీ మరపించే సర్వోన్నత కృతిగా వాసికెక్కింది.

తిరుక్కురల్ కర్త వళ్ళువర్‌ని తిరువళ్ళువర్‌గా పిలవడం పరిపాటి. ఆయన చెన్నైలోని మైలాపూరులో పుట్టాడంటారు. కాని తమిళనాడులో దాదాపుగా ప్రతి దిక్కులోనూ ఆయన జన్మస్థలాలున్నాయి. నేనా ఊళ్ళేవీ చూడలేకపోయినా, తిరువళ్ళువర్ ప్రధానంగా జైనుడు కాబట్టి, ఆ సాయంకాలం, ఆ మఠంలో కూచున్నప్పుడు తిరువళ్ళువర్‌ని, తిరుక్కురళ్‌ని తలచుకోకుండా ఉండలేకపోయాను.

తమిళవేదంగా ప్రశస్తి పొందిన తిరుక్కురళ్ పూర్తిగా ఐహిక ప్రపంచానికి చెందిన రచన. నాలుగు పురుషార్థాల్లోనూ, తిరుక్కురళ్ ధర్మార్థకామాలు మూడింటిగురించే ఆలోచించింది. మనిషి తాను జీవించవలసి వచ్చిన ఈ ఒక్క జీవితాన్నీ, ఈ ఒక్క ప్రపంచంలోనూ, తాను ఎక్కడ పుట్టాడో ఆ సమాజంలో ఎంత శాంతితోనూ, సమన్వయంతోనూ జీవించగలడు అన్నదాని చుట్టూతానే ఆ కవిత్వం తిరుగుతుంది.

తిరుక్కురళ్ చదువుతున్నప్పుడు మనకి విదురనీతి, భగవద్గీత, కన్ ఫ్యూసియస్, ప్లేటో, మార్కస్ అరీలియస్, ఎపిక్టెటస్, సువార్తలు తలపుకొచ్చే మాట నిజమేకాని, ఆ గ్రంథం తన ఉద్దేశ్యంలో, సారంలో వాటన్నిటికన్నా భిన్నమైంది. చాలావరకూ భర్తృహరి నీతిశతక త్రయంతో దాన్ని పోల్చవచ్చుగాని, తిరుక్కురళ్ క్లుప్తత, గాఢత, అనుభూతి తీవ్రత భర్తృహరిలో కనరావని నిస్సంకోచంగా చెప్పగలను. కొంతవరకూ వేమన కూడా మనకి గుర్తొస్తూ ఉంటాడుకాని, వేమనలో ఉండే ఆగ్రహం తిరువళ్ళువర్ స్వభావం కాదని మనకి తెలుస్తూంటుంది.

తిరుక్కురళ్ మొత్తం 1330 ద్విపదల సంపుటి. అది 'అరం' (ధర్మం) 'పొరుల్' (అర్థం), 'ఇన్బం' (కామం) అనే మూడు భాగాలుగా ఉంది. మొత్తం 133 అధ్యాయాలు. అందులో అర్థనీతి గురించిన పద్యాలు సింహభాగం ఆక్రమించాయి. అయితే సాధారణంగా తిరుక్కురళ్ అనగానే ధర్మార్థాలకు చెందిన కవిత్వమే ప్రస్తావనకి వస్తూ ఉంటుంది. ఆ గ్రంథాన్ని పద్ధెనిమిదో శతాబ్దంలో లాటిన్‌లోకి అనువదించిన అనువాదకుడు కూడా ఆ రెండు భాగాలే అనువదించి ఊరుకున్నాడు. కామం అనే విభాగం కింద ఉన్న కవిత్వం తన మిషనరీ లక్ష్యాలకు పొసగదని అతడు భావించి ఉండవచ్చు. కాని, తిరుక్కురళ్‌లో నిజమైన కవిత్వమంతా ఆ మూడవ విభాగమే.

మొదటి రెండు విభాగాలూ సుభాషితాలు. వాటిలో విజ్ఞత ఉంది, వివేకం ఉంది, హితసూచన ఉంది. తల్లిలాగా, తండ్రిలాగా, గురువులాగా సుద్దులు చెప్పడం అది. కాని, మూడవ విభాగం ప్రపంచంలోని అత్యున్నత ప్రేమకవిత్వాల సరసన నిలబడగల అత్యున్నత ప్రణయాభివ్యక్తి. అకం సంప్రదాయాల పాదులో పుట్టిపెరిగిన రసజ్ఞుడు మాత్రమే అటువంటి కవిత్వం చెప్పగలడు.

బహుశా పారశీక, ఉర్దూ కవుల ప్రేమైకవిలాపమొక్కటే ఆ స్థాయిన చేర్చదగ్గ కవిత్వమని చెప్పవచ్చుగాని, క్లుప్తతలో కురల్ ముందు గజల్ నిలబడజాలదు. హైకూని కూడా తలుచుకోవచ్చుగానీ, ఆ సామ్యం కేవలం క్లుప్తత వరకూ మటుకే. కురల్ లోని మోహోద్రిక్తత హైకూలో కనబడదు. బహుశా ప్రపంచ సాహిత్యమంతటిలోనూ, కురల్‌కి సాటి రాగలవాడు కబీరు మాత్రమే.

తిరుక్కురళ్‌లోని కామవిభాగం కింద మరొక ఆశ్చర్యం తిరువళ్ళువర్ కూడా మడల్ చెప్పడం. బహుశా నమ్మాళ్వారూ, తిరుమంగై ఆళ్వారూ కూడా తిరువళ్ళువర్‌ని చూసే ధైర్యం చేసారనిపిస్తుంది.

తిరుక్కురళ్‌లోని కామవిభాగం నుంచి కొన్ని కవితలు:

## పాలల్లో తేనె కలిపిన రుచి

### 1082

**నా చూపులకి ఆమె చూపుల్తో బదులిచ్చినప్పుడు అదొక సైన్యాన్ని నడిపిస్తున్న సేనాధిపతిని తలపించింది.**

## 1087

ఆమె పైట ఒక మదపుటేనుగ కుంభస్థలాన్ని ఆచ్ఛాదిస్తున్న వస్త్రంలాగా ఉంది.

## 1090

నువ్వు మత్తెక్కాలంటే తప్పతాగాలి, కాని ప్రేమ నీకు మత్తెక్కించడానికి ఒక్క చూపు చాలు.

## 1092

నన్ను చూస్తూ చూస్తూ ఆమె సిగ్గుతో తలవాల్చుకుంది. ఆ సిగ్గరి చూపు మా మధ్య ప్రేమ అనే తీగకు నీళ్ళుపోయడం మొదలుపెట్టింది.

## 1100

చూపులు చూపుల్తోనూ, హృదయం హృదయం తోనూ మాట్లాడుకోడం మొదలుపెట్టాక మాటల్తో పనేముంది?

## 1103

ఒక రోగాన్ని కుదిర్చే ఉపాయం ఒక ఔషధంలో ఉంటుంది. కాని నువ్వు ప్రేమించినవాడే నీ గాయమూ, ఆ గాయానికి లేపనమూ కూడా.

## 1104

అదేమిటో ఆమె దూరంగా ఉంటే దహిస్తుంది, దగ్గరికొస్తే చల్లబరుస్తుంది. ఇంతకీ ఈమె ఈ విద్య ఎక్కడ నేర్చుకున్నట్టు?

## 1121

ఆమె పెదాల్ని నా పెదాల్తో తాకినప్పుడు పాలల్లో తేనె కలిపిన రుచి.

## 1124

నా హృదయంలో నా ప్రణయిని ఉందని తెలిసాక నాకేదీ వేడిగా తాగాలనిపించడం లేదు, ఆ సెగకి ఆమె కందిపోతుందేమో అని భయం.

## 1134

ప్రేమ అనే వరద ముంచెత్తాక నా పౌరుషమంతా ఒక తెప్పలాగా కొట్టుకుపోయింది.

## 1137

ప్రేమ అనే సముద్రంలో తల్లకిందులవుతున్నాక మళ్ళా ఏ స్త్రీకీ మడల్ ఎక్కాలనిపించదు. ఆ అల్లకల్లోలం కన్నా మరేదీ గొప్పదికాదు.

## 1139

నా రహస్యమెవరికీ తెలియదుకున్నాను, కాని నా ప్రేయసి నడిబజారులో వీరంగమెత్తుతోంది.

## 1142

మా ప్రేమ గురించి పుకార్లు మొదలయ్యాక నాకు ఆశ చిక్కింది. మా ఊరివాళ్ళు నాకెంత మేలుచేసారో వాళ్ళకి తెలీదు.

## 1159

సన్నిహితులకి దూరంగా ఎక్కడో ఏదో మారుమూల గ్రామంలో ఉండవలసి రావడం గొప్ప కష్టం. కాని ప్రియుణ్ణి ఎడబాసి ఉండటం అంతకుమించిన కష్టం.

## 1161

నేనేమో నా ఈ ప్రేమజ్వరం దాచాలనుకుంటాను, అదేమో ఊటనీరులాగా పొంగిపొర్లుతూంటుంది.

## 1166

కలుసుకున్న రాత్రి సముద్రమంత సంతోషాన్నిస్తుంది. కాని ఎడబాటు సముద్రం కన్నా పెద్దది.

## 1179

అతడు దూరంగా ఉన్నప్పుడేమో నా కళ్ళకి శాంతిలేదు, చేరువైనప్పుడు నిద్రలేదు, రెండూ కష్టమే.

## 1180

మా ఊళ్ళో వాళ్ళకి నా రహస్యం కనుక్కోవడం ఏమంత కష్టంకానట్టే ఉంది. గొంతెత్తి మరీ నా కళ్ళే నా కథ చెప్పేస్తున్నాయి.

## 1190

నా ముఖమంతా లక్ష్మీకళ వెల్లివిరిస్తే ఎంత బాగుణ్ణు. నా కళాకాంతీ పోవడానికి నా ప్రియుడే కారణమని లోకం అతణ్ణి ఆడిపోసుకోదు.

## 1203

ఆమె తన చెలికత్తెతో అంటోంది: 'ఇదేమిటిట్లా మాటిమాటికీ తుమ్ములొస్తున్నాయి. అతడు నన్ను పదేపదే తలుచుకుంటున్నాడల్లే ఉంది'.

## 1205

అతడు నన్ను తన హృదయానికి దూరంగా పెట్టాడు. ఇట్లా మాటిమాటికీ నా హృదయంలో చొరబడటానికి అతడికి సిగ్గుగా లేదూ!

## 1214

ఆమె తన చెలికత్తెతో అంటోంది: 'అతడు కలలో నన్ను కౌగిలించు కుంటున్నాడు, ఇంతలో మెలకువ రాగానే నా గుండెలోకి తప్పుకున్నాడు'.

## 1224

ప్రేమ అనే ఈ వ్యాధి పొద్దున్నే మొగ్గతొడుగుతుంది, రోజంతా రెక్కవిప్పి సాయంకాలానికి పూర్తిగా వికసిస్తుంది.

## 1244

హృదయమా! నువ్వతని వెంటపడితే పడ్డావుగాని, ఇదిగో ఈ కళ్ళు కూడా నీ వెంట తీసుకుపో. ఎదురుచూసి చూసి ఇవి నన్ను తినేస్తున్నాయి.

## 1247

ప్రేమ, సిగ్గు- హృదయమా, ఈ రెండింటిలో ఏదో ఒకటి వదిలిపెట్టు, రెండింటి బరువూ ఒక్కసారి మొయ్యాలంటే నా బలం చాలడం లేదు.

## 1274

మొగ్గలో పరిమళం దాగి ఉన్నట్టు ఈమె చిరునవ్వులో ఏదో దాగి ఉంది.

## 1289

ప్రేమ పువ్వుకన్నా సున్నితం. ఆ మృదుత్వం తెలిసినవాళ్ళెంతమందో లేరు.

## 1321

అతడు కావడానికి మంచివాడే గాని అదేమిటో అతడిమీద ఎవరేనా చాడీలు చెప్తుంటే నా ప్రేమ మరింత పెరుగుతోంది.

## 1327

ప్రణయకలహంలో గొప్ప సంతోషముంది. కాని అలకతీరాక కలిసావా అది అమృతమే.

# అదొక ప్రక్షాళనానుభవం

**అ**ప్పటిదాకా, తమిళనాడులో పురాతన పట్టణాల్ని చూస్తూ ఉన్ననాకు ఒక భవిష్యనగరాన్ని కూడా చూడాలనిపించి ఆరోవిల్లి వెళ్ళాలని అనుకున్నాను. ఆరోవిల్లి పుదుచ్చేరిలో భాగమని అనుకునే వాణ్ణి, కాని అది విల్లుపురంజిల్లాలోనే ఉందని అక్కడికి వెళ్ళాకే తెలిసింది.

కులమతాలకీ, విశ్వాసాల అడ్డుగోడలకీ, అన్నిరకాల జాతీయతావాదాలకీ ఆవల వసుధ ఒకే కుటుంబానికి చెందిందనే భావనతో చేపట్టిన ఒక ప్రయోగం ఆరోవిల్లి. అది భవిష్యత్తులో సుమారు యాభైవేలమంది పౌరులు నివసించడానికి వీలుగా అంకురార్పణ చేసిన విశ్వనగరం. ఇప్పుడక్కడ దాదాపు యాభై దేశాలకు చెందిన వాళ్ళు సుమారు రెండున్నరవేలమంది నివసిస్తూ ఉన్నారు. 1968లో శ్రీమాత అక్కడ ఒక విశ్వ నగరానికి బీజారోపణ చేసినప్పుడు దాదాపు నూట ఇరవై దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. అప్పుడక్కడొక చిన్న అడివిలాంటి ప్రదేశంలో ఒక మర్రిచెట్టు కేంద్రంగా ఆమె ఆ నగరానికి శంకుస్థాపన చేసారు. తమిళనాడులో ప్రతి ప్రాచీన దేవాలయానికీ ఒక స్థలవృక్షం ఉన్నట్టే, ఆ నవ్యమానవాలయానికి ఆ మర్రిచెట్టు స్థలవృక్షం అని చెప్పవచ్చు.

ఆ మర్రిచెట్టు ఆరోవిల్లి తాలూకు గరిమనాభి. ఆ చెట్టుని ఆనుకుని ఉన్న అంతర్వలయం ఆ నగరం తాలూకు శాంతివృత్తం. ఆ శాంతివలయంలోనే మాతృమందిరం ఉంది. ఆరోవిల్లి వెళ్తే మాతృమందిరం తప్పకుండా చూడాలని జిల్లా కలెక్టరు కూడా నాతో అన్నాడు. ఆ మాతృమందిరంలో అడుగుపెట్టాలంటే మరీ పొద్దున్నే వెళ్ళవలసి ఉంటుందని చెప్పడంతో మేము తొందర తొందరగా అక్కడికి చేరుకున్నాం గాని, అప్పటికే అక్కడ మాలాంటి సందర్శకులు చాలామంది వేచి ఉన్నారు. తీరా మేమా మందిరంలోకి అడుగుపెట్టేటప్పటికి పదిగంటలు కావొస్తూంది. మాతృమందిరం శ్రీమాత పేరుమీద నిర్మించిన ఒక ధ్యానాలయం.

ఆ నిర్మాణం ఆరోవిల్లికి ఆత్మలాంటిదని శ్రీమాత అన్నారట. ఆ నిర్మాణానికి దాదాపు నలభయ్యేళ్ళు పట్టింది. అది పన్నెండుదళాల మధ్య నిలబెట్టిన ఒక గోళాకార భవనం. ఆ గోళానికి బయటివైపు బంగారు తాపడం చేసారు. దాంతో ఆ భవనం ఆ ఉదయకాలపు ఎండలో ఆరనిజ్యోతిలాగా ధగధగలాడుతూ ఉన్నది. ఆ గోళానికి నాలుగు వేపులా నాలుగు మహాస్తంభాలు ఉన్నాయి.

ఆ అంతరాలయంలో అడుగుపెట్టడానికి అందరికీ అన్నివేళలా అనుమతి దొరకదు. అది ముందస్తు అనుమతిమీద మాత్రమే చూడగల స్థలం. ఆ రోజు ఆరోవిల్లి పౌరులు కొంతమందికి అక్కడ ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి ఉండటంతో వారితో పాటు మాకు కూడా ప్రవేశం దొరికింది.

ఆ లోపల వలయాకారంలో విశాలమైన ఒక మందిరం ఉంది. ఆ మందిరం మధ్యలో ఒక స్ఫటికగోళం ఉంది. భవనం పైన ఏర్పాటు చేసిన కటకాల ద్వారా సూర్యకాంతి సన్నని తీగలాగా కిందకి ప్రసరించి, ఆ స్ఫటికగోళంలో ప్రతిఫలిస్తూ ఉంది. బయట సూర్యుడి భ్రమణాన్ని బట్టి ఆ కటకాలు కూడా తమంతతామే తిరిగి, ఆ సూర్యకాంతి కిరణాల్ని పట్టుకునేటట్టుగా ఏర్పాటు చేసారు. దాంతో రోజంతా కూడా ఒక నిశ్చల సూర్యకాంతిరేఖ ఆ స్ఫటికగోళంలో ప్రతిఫలిస్తూనే ఉంటుంది. ఆ లోపల గోడలు, పైకప్పు తెల్లగా ఉన్నాయి. కింద తెల్లటి పరుపులు, జంబుఖానాలు పరిచి ఉన్నారు. లోపలకి అనుమతించినతర్వాత సందర్శకులు పూర్తి నిశ్శబ్దం పాటించాలి. అట్లా ఇరవైనిమిషాల పాటు ప్రశాంతంగా కూచున్నాక, వ్యవధి ముగిసిందన్నట్టుగా చిన్న సంకేతం వినబడుతుంది. దాంతో సందర్శకులు అక్కణ్ణుంచి బయటకు కదలవలసి ఉంటుంది.

మాతృమందిరంలోని ఆ అంతరాలయంలో ఆ కొద్దిక్షణాలు గడపడం ఒక అనుభవం. ఆ సమయంలో నీలో ఏదో జరుగుతున్నట్టుగా నీకు అనుభవానికొస్తుంది. అయితే ఆ అనుభవం ఎటువంటిది అనేది మనం స్పష్టంగా చెప్పలేం. ఒక సందర్శకుడు అక్కడ కొంతసేపు గడిపిన తరువాత 'అది ధ్యానమందిరం కాదు, ఏకాగ్రతా మందిరం' అన్నాడట. నా మటుకూ నాకు ఆ మందిరమంతా ఒక distilled light పరుచుకుని ఉందనిపించింది. ఆ మందిరం ఒక experiment with light. అక్కడ కూచున్నంత సేపూ ఎవరో ఒక దస్తరు తీసుకుని నెమ్మదిగా నీ మనోమాలిన్యాల్ని తుడిచిపెట్టేస్తున్నట్టు అనిపిస్తుంది. అదొక ప్రక్షాళనానుభవం. అయితే, అక్కడ నీ మనసుని కడిగేది నీళ్ళతో కాదు, కాంతితో.

ఒకసారి అందులో అడుగుపెట్టి కొన్ని క్షణాలు గడిపిన తరువాత మరొకసారి మళ్ళా అక్కడ కొంతసేపు గడపాలనిపించడం సహజం. కాని ఒకసారి

మాతృమందిరంలోకి అడుగుపెట్టడానికి అనుమతి దొరికినవాళ్ళకి మళ్ళా వెంటనే అనుమతి దొరకదు. ఈలోగా అక్కడ గడిపిన ఆ కొద్దిక్షణాల్లోనూ మనలో ఏమి సంభవించిందో మనకై మనం స్పష్టపరుచుకోడానికి ఏదోలా ప్రయత్నిస్తూనే ఉంటాం.

మాతృమందిరం కాక, ఆరోవిల్లి లో చెప్పుకోదగ్గ సందర్శనీయస్థలాలేవీ కనిపించలేదు. అక్కడ ఆరోవిల్లి పౌరులు తయారు చేసే అగరవత్తులు, సుగంధ ద్రవ్యాలు, దుస్తులు, అరవిందుల, శ్రీమాత సాహిత్యాల విక్రయమందిరం ఒకటి ఉంది. అక్కడ ఆరోవిల్లి ఏర్పాటు వెనక ఉన్న ఉద్దేశ్యాన్ని, ఆరోవిల్లి నిర్మాణక్రమాన్ని వివరించే పదినిముషాల డాక్యుమెంటరీ కూడా ఒకటి ప్రదర్శిస్తున్నారు. ఆ విక్రయశాలలో ఆరోవిల్లిలోనే తయారయ్యే అగరువత్తులు కొనుక్కున్నాను. 50 Poems from Auroville అనే ఒక కవితాసంకలనం కూడా కొనుక్కున్నాను. ఆరోవిల్లిలో నివసిస్తున్న విశ్వనగర పౌరులు అప్పుడప్పుడూ రాస్తూ వచ్చిన కవిత్వంలోంచి ఎంపిక చేసిన యాభై కవితలవి. అందులో, 'హెరాక్లిటసూ, మాతృమందిరమూ' అనే కవిత ఒకటి నన్ను ఆకట్టుకుంది. యుకె కి చెందిన డిక్ బాట్సన్ అనే ఆయన రాసిన ఆ కవిత ఇలా ఉంది:

**హెరాక్లిటసూ, మాతృమందిరమూ**

**ఆ నిశ్శబ్దం ఏ రెండుసార్లూ ఒక్కలాంటి నిశ్శబ్దం కాదు.**
**అందులో అడుగుపెట్టేటప్పుడుగాని,**
**బయటకి వచ్చేటప్పుడు గాని**
**ఏ మనిషీ రెండోసారి కూడా ఒక్కలానే ఉండడు.**
**బహుశా అక్కడేదీ అద్భుతం సంభవించకపోవచ్చు,**
**బహుశా అక్కడేదో కొత్తగా బయటపడకపోవచ్చు లేదా**
**నీకేదో సాక్షాత్కారం సంభవించకపోవచ్చు.**
**అక్కడ ఉన్నదల్లా సూర్యకాంతిమయ అంతరాలయంలో**
**ద్వాదశస్తంభాల మధ్య పెద్ద స్ఫటికగోళమూ**
**ఒక ధవళనైశ్చల్యం మనమీద కలిగించే ఒత్తిడీను.**

# కాంతిపుష్పంలో ఒక భ్రమరం

**ఆ**రోవిల్లినుంచి పుదుచ్చేరివెళ్ళాం. అక్కడ అరవిందాశ్రమానికి చెందిన రూపాంతర్ కార్యక్రమానికి సారథిగా ఉన్న విజయిభాయి నా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. దేశంలో పాఠశాలల్లో బోధన అభ్యసన కార్యక్రమం మెరుగుపర్చడానికి శ్రీ అరవిందో సొసైటీ చేపట్టిన ప్రయోగాల గురించి నేనింతకుముందు రాసాను కూడా. అతి తక్కువ ఖర్చుతో పాఠశాలల్లో బోధన ఎలా చేపట్టాలన్న అంశం మీద శ్రీ అరవిందో సొసైటీ ఉత్తరప్రదేశ్‌లో మొదలుపెట్టిన కార్యక్రమం ఇప్పుడు దేశవ్యాప్త ఉద్యమంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా సమగ్ర శిక్ష కింద ఆ ప్రయోగాన్ని కొనసాగిస్తున్నాం. కాబట్టి శ్రీ అరవిందో సొసైటీకి చెందిన కార్యనిర్వాహకులతో కొంతసేపు ఆ ప్రయోగాల గురించి చర్చించాం.

అక్కణ్ణుంచి అరవిందాశ్రమానికి వెళ్ళి శ్రీ అరవిందుల సమాధి చూడాలని బయల్దేరాం. మధ్యలో, ఫ్రెంచి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాండిచ్చేరికి వెళ్ళాను. ఆ సంస్థ ప్రాచీన తమిళ సాహిత్యం మీద అద్భుతమైన పుస్తకాలు వెలువరించింది. చాలాకాలం కిందట అక్కణ్ణుంచి 'కబీర్‌వాణి' పుస్తకం నాకోసం మిత్రులు ఆకెళ్ళ రవిప్రకాశ్ తెప్పించారు. అప్పణ్ణుంచీ ఆ సంస్థని స్వయంగా చూడాలని అనుకుంటూ ఉన్నాను. ఆరోజు అక్కడ, డిజిటల్ తేవారంతో పాటు, Tirumamkai Alvar's Five Shorter Works: Experiments in Literature(2019), The Four Hundred Songs of Love: An Anthology of Poems from Classical Tamil, The Akananuru(2015), Mapping the Chronology of Bhakti (2014), Narrinai (2008) లతో పాటు ఆదిత్య కోసం A Grammar of Old Tamil for Students (2018) కూడా కొన్నాను.

మధ్యాహ్నభోజన విరామం తరువాతనే అరవిందాశ్రమం మళ్ళా తెరుస్తారనడంతో, పాండిచ్చేరి సముద్రతీరానికి వెళ్ళాం. అక్కడ ఆ మధ్యాహ్నవేళ సముద్రం వెండికర్మాగారం లాగా ఉంది. అలలూ, మేఘాలూ, చివరికి ఇసుక కూడా ఉక్కు కరగించి పోతపోస్తున్నట్టుగా కనిపిస్తున్నాయి. అరవిందులూ, శ్రీమాతా కూడా జీవితమంతా

అన్వేషించిందీ, ఆరాధించిందీ ఆ వెలుతురునే. వాళ్ళని పరిపూర్ణమైన సౌరారాధకులని చెప్పవచ్చు. బహుశా అరవిందుల సావిత్రి అంత మంత్రమయంగా రూపొందడం వెనక, ఆ తూర్పుతీరపు ప్రత్యూషాల మహిమ కూడా చాలా వరకూ కారణమనుకుంటాను.

అక్కణ్ణుంచి అరవిందాశ్రమానికి వెళ్ళాం. ఆశ్రమం అంటే అరవిందుల సమాధి, అరవిందుల, శ్రీమాతల సాహిత్యవిక్రయశాల, అంతే. ఆ మధ్యాహ్నవేళ, ఒక చెట్టునీడన అరవిందులు జీవించి ఉన్నప్పటిలానే తన సమాధిలో కూడా గాఢ ధ్యానమగ్నులుగా ఉన్నట్టున్నారు. ఆ సమాధిమీద పొద్దున్నే పెట్టిన పూలరాశులు ఇంకా వాడిపోకుండా ఉన్నాయి. ఆ చెట్టుమీద అప్పుడప్పుడూ వినిపించే పక్షి కూజితమూ, అరవిందాశ్రమంలో వాలంటీర్లుగా పనిచేస్తున్న వాళ్ళ అనవసరమైన హడావిడీ తప్ప అక్కడంతా ప్రగాఢమైన నిశ్శబ్దం. మామూలుగా మనకి గ్రంథాలయాల్లో వినిపించే నిశ్శబ్దంలాంటిదే అక్కడ పరుచుకుని ఉంది.

అరవిందుల యోగానుభవం నాకు మొదట్లో అంతగా అర్థమయ్యేది కాదు, కాని, ఈ మధ్య, నా జీవితానుభవాలు నాలో రేకెత్తిస్తున్న ప్రశ్నలవల్ల, ఆయన రచనలు నన్ను నేను అర్థం చేసుకోడానికి సహాయకారిగా కనిపిస్తున్నాయి. ముఖ్యంగా Integral Yoga అని ఆయన చెప్తున్నదేమిటో కొంత స్థూలంగా అర్థమవుతున్నది. మనిషిలో రెండు లేదా అంతకన్నా ఎక్కువగా ఉన్నట్టు కనిపించే వ్యక్తిత్వాల్ని సమన్వయించుకుని, అద్వైత అస్తిత్వానుభూతిని సాధించుకోవడమెలానో ఆయన రాస్తూ ఉన్నాడు.

అంటే నువ్వు పూర్తి నువ్వుగా మారడమన్నమాట.

దానికి రెండు మార్గాలున్నాయంటున్నాడు ఆయన. ఒకటి, అద్వైతం. అంటే, నీకు తటస్థిస్తున్న ప్రతి ఒక్క అనుభవాన్నీ, నీ అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశాలకు చెందిన అనుభవాలుగా పోల్చుకుంటూ, అవేవీ నువ్వు కాదని, వాటికి, దూరంగా జరగడం. అతీతంగా నిలబడటం. రెండోది సాంఖ్యులు చెప్పినట్టుగా, నిన్ను నువ్వు ప్రకృతినుంచి విడదీసుకోవడం. ఈ అర్థంలో ఆయన చెప్పే యోగం కలిపేది కాదు, విడదీసేది. ఉపనిషత్కారుడు చెప్పినట్టుగా, ఆకులోంచి ఈనెని బయటికి లాగే కౌశల్యం. ప్రకృతినుంచి పురుషుణ్ణి విడుదల చేయడం. కాని, ఈ అంశంలో, ఆయన సాంఖ్యులకన్నా మరింత ఎక్కువ సన్నిహితంగా మాటాడుతున్నాడు. పురుషుడు కేవలం సాక్షిగా ఉండిపోయి, ప్రకృతి తన పని తాను చేసుకు పోతూ ఉంటుందనీ, దాని ఉత్థానపతనాలతో తనకు సంబంధం లేదనీ, తననేదీ అంటదనీ భావించే పద్ధతిని ఆయన నిరసిస్తున్నాడు. పురుషుడు కేవలం సాక్షిగా నిలబడిపోవడం కాదు, తనపట్ల తనకు స్వాధీనత లభించాలంటే, ప్రకృతిని ఏ మేరకు అంగీకరించాలో, ఏ మేరకు అనుమతించాలో కూడా తెలిసి ఉండాలంటాడు.

ఆయన ఇలా రాస్తున్నాడు:

'నువ్వు తప్పకుండా నీ సాక్షిపురుష చైతన్యాన్ని అభివృద్ధి చేసుకుంటూ పోవచ్చు. కానీ, ఆ చైతన్యం కేవలం సాక్షిగానే ఉండిపోతే, నీ నిమ్నప్రకృతిని తనదారిన తాను పనిచేసుకుంటూ పోనిమ్మని అనుకుంటే, నీ పరిమితులనుండి నువ్వెప్పటికీ బయటపడే అవకాశం ఉండదు. చాలామంది దృక్పథం ఇదే: పురుష చైతన్యం తన పరిమితులనుండి బయటపడి ఒక పక్కగా నిలబడి ఉంటుందనీ, మరొకవైపు ప్రకృతి మన జీవితాంతం తన పని తాను చేసుకుంటూ పోతూంటుందనీ. దీన్నే వాళ్ళు ప్రారబ్ధ కర్మ అంటున్నారు. అంటే అవసానదశదాకా ఇట్లానే నడిచి, అంత్యక్షణాల్లో శరీరం రాలిపోయినప్పుడు ప్రకృతి కూడా రాలిపోతుందనీ, పురుష చైతన్యం మాత్రం నిరాకార బ్రహ్మలో లీనమైపోతుందనీ! ఈ సిద్ధాంతం వినడానికి బాగానే ఉన్నా, దీన్ని పూర్తిగా నిశ్చయంగా సత్యమని నమ్మలేం. ముక్తి అనేది మరీ అంత సులభసాధ్యమనీ, సరళసత్యమనీ అనుకోవడం లేదు నేను. ఏది ఎట్లా ఉన్నా, మనం యోగం తాలూకు ప్రయోజనం అని దేన్ని చెప్పుకుంటున్నామో, ఆ పరివర్తనకి మాత్రం ఇక్కడ అవకాశం లేదు.'

'పురుష చైతన్యం కేవలం సాక్షి మాత్రమే కాదు, మన ప్రవర్తనకి ప్రదాత, నిర్ణేత కూడా. ప్రకృతి స్పందనలకీ, చలనాలకీ ఆ పురుష చైతన్యం అనుమతించడానికి నిరాకరిస్తున్నట్లయితే, ఆ చైతన్యం ప్రకృతినుంచి విడివడి ఉన్నప్పటికీ, ముందు కొంతసేపటిదాకా అలవాటువల్లనో, పూర్వప్రవర్తన వల్లనో, ప్రకృతి సంచలనాలు కనిపించవచ్చుగాని, కొంతసేపటితర్వాత ప్రకృతి తన పట్టు పోగొట్టుకుంటుంది. అది నెమ్మదిగా బలహీనపడి, నెమ్మదిగా ఆనవాలు లేకుండా పోతుంది. మనం మన పురుష చైతన్యాన్ని కేవలం సాక్షిగా మాత్రమే కాక, అనుమంత చైతన్యంగా కూడా భావించాలి. మన నిమ్నప్రకృతి మనలో కలిగించగల ఆందోళనపూర్వక స్పందనల్ని నిరాకరిస్తూ, అందుకు బదులుగా, శాంతి, ప్రశాంతి, నైర్మల్యం లాంటి మన దైవీయగుణాల్ని మాత్రమే అనుమతిస్తూండాలి. నిమ్నప్రకృతి స్పందనల్ని నిరాకరించడమంటే అది మన నిమ్నప్రకృతితో ఘర్షణపడటం కాదు. అసలక్కడ సంక్షోభమయ పరిస్థితి ఏమీ ఉండనక్కర్లేదు. ప్రశాంతంగానూ, పట్టువిడవకుండానూ, మన ప్రాకృతిక స్పందనలకి ఎటువంటి మద్దతునూ ఇవ్వకపోవడం అది. మన ప్రకృతి మనలో కలిగించగల విరుద్ధ చలనాలను పూర్తి నిస్సంగత్వంతో నిరాకరిస్తూపోవడం అది.'

(Steps to Freedom and Mastery, 2012, పే. 111-112)

అయితే, ఇలా మన పురుష చైతన్యాన్ని దైవీయప్రకృతితో అనుసంధానించుకుని, నిమ్నప్రకృతిని అదుపులో పెట్టుకోవడం గురించి అరవిందులు చెప్తున్నది ఒక నైతిక ప్రక్రియను యోగపరిభాషలో మాట్లాడటంగా మనకి అనిపిస్తే అందులో ఆశ్చర్యం

లేదు. నీ ప్రకృతి నీలో రేకెత్తిస్తున్న నిమ్నస్పందనల్ని నిరాకరించేది ఎవరు? అనుమతించేది ఎవరు? నేరుగా పురుషచైతన్యం ఆ పని చేయాలి అని మనం అనుకుంటే, అందుకు ఆ పురుషుడికి ఆలంబనగా నిలబడవలసింది ఎవరు? నిరాకరించడానికీ, స్వీకరించడానికీ మధ్య మన చిత్తం దుర్బలం కాకుండా ఉండాలంటే మనం ఏమి చెయ్యాలి?

అరవిందులు ఇంకా ఇలా రాస్తున్నారు:

> 'ప్రకృతిని లేదా స్వభావాన్ని మార్చడం ఏమంత తేలిక కాదు, చాలా కాలం పడుతుంది దానికి. నీ అంతరంగంలో ఒక అనుభవంలేకపోతే, ఒక నిర్మల చైతన్యం మేల్కొనడం కూడా సాధ్యం కాదు. అంతదాకా నీ చైతన్యాన్ని కప్పి ఉంచే వివిధ విషయాలనుంచి విడివడి నీ ఆంతరంగిక చైతన్యం మేల్కొనకపోతే, నీకెంత దృఢ సంకల్పం ఉన్నా కూడా నీ ప్రక ృతి మారదు. ముందు, ఈ బయటి ప్రభావాలన్నీ పక్కకి తొలగిపోతే, అప్పుడు నీ అంతరంగంలో అనుభవాలు మేల్కొంటాయి అంటావు నువ్వు. కానీ అదెలా సాధ్యం? ఈ కోపం, ఈ అసూయ, ఈ కోరిక, ఈ పదార్థాలతోటే మానవుడి ప్రాణమయ శరీరం నిర్మితమై ఉండేది. వీటికన్నా భిన్నమైందేదో వీటి అడుగున మరొక చైతన్యం లేకపోతే, ఇవి మారే అవకాశమే లేదు...'
>
> 'సాధారణ చైతన్యం, సాధారణ స్వభావం దాన్ని కప్పి పుచ్చి ఉంచుతాయి. కాని వీటిని దాటుకుని ఒకసారి ఆ లోపలి చైతన్యం బయటికి రాగలిగితే, అది ఈ సాధారణ చైతన్యాన్ని మార్చక తప్పదు. మనలోని దైవీయప్రక ృతికి భిన్నమైన గుణగణాలన్నింటినీ అది పక్కకు నెట్టేసి మన బాహ్యచైతన్యాన్ని కూడా మార్చేస్తుంది. అందుకనే సాధకులు ఏకాగ్రచిత్తం కలిగిఉండాలని కోరుకునేది. ఏకాగ్రత వల్లనే మనల్ని ఆవరించిన ఈ బాహ్యచైతన్యం నుంచి మనం విడివడగలుగుతాం. ఆ ఏకాగ్రత ఎటువంటిదైనా గానీ, అది మనకు అందించే అనుభవాల వల్ల మాత్రమే మనం మనలోపలి నవ్యచైతన్యం పట్ల మేల్కొన గలుగుతాం, తద్వారా మన స్వభావాన్ని వికసింపచేసుకుని మార్చుకోగలుగుతాం. మన ప్రాణశక్తి మనలో కలిగించే రకరకాల కోరికల్నీ, అక్రమస్పందనల్నీ నిరాకరించడానికి మన సంకల్పాన్ని వినియోగించాలని, తద్వారా మన నిజచైతన్యం ఆవిష్కారమవుతుందని చెప్పవచ్చుగానీ, కేవలం నిరాకరణ వల్ల మాత్రమే మనం విడుదల పొందలేం. మనం ఒకవైపు నిరాకరించగలగాలి, మరొకవైపు మన అంతరంగంలో ఒక నవ్య అనుభవాన్ని సుసాధ్యం చేసుకోవాలి..'
>
> (పే.95-96)

ఈ వాక్యాలు కీలకం. ఇక్కడే నైతికతకీ, యోగానికీ మధ్య సున్నితమైన సరిహద్దు. నైతికత ఒక సూత్రం. కాని అది కూడా నీ ఆంతరంగిక అనుభవాన్ని సుసాధ్యం

చేయకపోతే, అది వట్టి నైష్ఠికతగా మిగిలిపోతుందే తప్ప అంతరంగ చైతన్యాన్ని వికసింపచేయదు. నీ అంతరంగంలో ఒక నవ్యచైతన్యాన్ని గుర్తుపట్టాలంటే నువ్వు ఏకాగ్రచిత్తుడివిగా ఉండక తప్పదు. నీ చిత్తాన్ని ఏకాగ్రం చేసుకోవడం, అదే యోగం. నిన్ను తదేకం చేసే ఆ అంశం దేవుడో, నామమో, రూపమో, సౌందర్యమో లేదా నీ ప్రాపంచిక జీవితంలో నువ్వెనుకున్న ఒక బాధ్యతనో ఏదో ఒకటి, కాని, ఒకే ఒక్కటి, ఆ ఒక్కటి మాత్రమే నిన్ను నీలోకి మేల్కొల్పుతుంది. ఆ ఒక్కటి లేకుండా నువ్వు ఎన్నింటిని ఎంత సమర్థంగా నిర్వహించినా లాభం లేదు. వాటన్నిటివల్లా నువ్వు ప్రాపంచిక జీవితంలో సమర్థుడివిగా ఎంచబడవచ్చుగానీ, నీ అంతరంగ జీవితంలో నిరుపేదగానే మిగిలిపోతావు.

త్యాగయ్య రామనామం పట్ల ఆ విధంగా తదేకచిత్తుడిగా ఉన్నాడు. అది ఆయన్ను స్వరార్ణవంలో ముంచి తేల్చింది. రమణమహర్షి అరుణాచలం పట్ల అలా తదేకచిత్తుడిగా ఉన్నాడు. అది ఆయన నిజస్వభావాన్ని ఆయనకు ఎరుకపరిచింది. మరి అరవిందులు దేనిపట్ల తదేకమనస్కులుగా ఉన్నారు?

కాంతిపట్ల అని చెప్పవలసి ఉంటుంది.

వెలుగు.

ఆయన జీవితమంతా కాంతిపుష్పంలో ఒక భ్రమరంగా మైమరచి ఉన్నారని నాకు అనిపిస్తాంటుంది. కాంతిలో ఒక విశేషం ఉంది. అది ఏకకాలంలో సాకారమూ, నిరాకారమూ కూడా. చీకటిమీద వెలుతురు చేసే యుద్ధమే యుగాలుగా ఇతిహాసాల ప్రధాన ఇతివృత్తం. దాన్ని ఋగ్వేదం ఇంద్ర-వృత్రాసుర యుద్ధంగా చిత్రించింది. వాల్మీకి రామ-రావణ సంగ్రామంగా పునఃచిత్రించాడు. తిరిగి అరవిందులు దాన్ని సావిత్రి-మృత్యు సంవాదంగా దర్శించారు. నీ సంకల్పశక్తి ఎంత బలమైనదేనా కానివ్వు, కాని నీకొక కాంతికృపాలేశమైనా లభించకపోతే, నీలో మేల్కొంటున్న అంతరంగ చైతన్యాన్ని, ఆ ప్రజ్ఞని స్థిరంగా నిలుపుకోవడం సాధ్యం కాదని అరవిందులు గుర్తించారు. రాముడంతటివాడికే, యుద్ధభూమిలో నిలబడ్డప్పుడు ఒక ఆదిత్యహృదయం అవసరమయ్యిందని మనం మర్చిపోలేం.

అరవిందులు 'సావిత్రి' కావ్యం 1916 లో మొదలుపెట్టి 1950 దాకా రాస్తూనే ఉన్నారు. ఒక్కొక్క అధ్యాయాన్ని తిరిగి తిరిగి రాస్తూనే ఉన్నారు. ఆయన 1910 లో పుదుచ్చేరిలో అడుగుపెట్టినప్పణ్ణుంచీ ఆ సూర్యోపాసన కొనసాగుతూనే ఉందనీ, అదే కొన్నాళ్ళకు సావిత్రి మహాకావ్యంగా రూపొందిందనీ అనుకోవచ్చు. వేదకాలపు ఋషులు అగ్నిద్వారా ద్యులోకంతో సంభాషించినట్టుగా, అరవిందులు సూర్యుడిద్వారా తన అంతరంగంలోకి తాను ప్రయాణించగలిగారు. 24000 పంక్తుల సావిత్రి కావ్యమే

కాదు, ఆయన పుదుచ్చేరి వెళ్ళిన తొలిసంవత్సరాల్లో రాసిన Rose of God అనే కవిత కూడా ఈ మాటే చెప్తున్నది. ఆ కవిత చూడండి:

### భగవంతుడి గులాబి

భగవంతుడి గులాబీ, ద్యులోకనీలమణిపైన కుంకుమ మరకా,
దివ్యపారవశ్యపు రోజాపుష్పమా, సప్తమహానందాల,
సప్తఛాయల అగ్నిమాధురీ
మా మానవత్వపు హృదయంలోకి అవతరిస్తున్న ఓ అద్భుతమా,
ఓ అగ్నిహోత్రమా, నామరాహిత్యపు మోహపుష్పమా,
రహస్యనామ కుట్మలమా!

భగవంతుడి గులాబీ, అస్తిత్వ శిఖరాంచల సీమల మహావివేకచూడామణీ,
కాంతిలతాగ్రమా, పరమదర్శనానంద నిర్మలమర్మమా,
మా పార్థివ మానసంలో సదా నివసింపుమా.
ఓ గూఢహిరణ్మయమా, ఓ పుష్పమా, కాలాతీత శిరోభాగపు
ఉదయ తేజమా, అత్యాశ్చర్యకరవేళల్లో అడుగిడుతున్న అతిథి రత్నమా!

భగవంతుడి గులాబీ, అనంతత్త్వపు సుగంధమయసత్త్వమా,
బలవికాసప్రతిబింబమైన తేజోపుంజమా,
నిశిని చీల్చుకుంటూపోయే శక్తిపాతపుష్పపు వజ్ర పరివేషమా,
జేగీయమాన మర్త్యత్వ సంకల్పమా, అద్భుతాల దివ్యప్రణాళికా,
అమృతత్వపు ప్రతీకా, మనిషిలో భగవంతుడు బయటపడే మాన్యఘట్టమా.

భగవంతుడి గులాబీ,
అవతారం ధరించిన దివ్యకాంక్షల కించిదరుణకపిలకాంతీ
జీవితానికి పూచిన గులాబీ, రంగులు మీటుతున్న వీణా,
కిక్కిరిసిన దళసమ్మర్దమా!
మా మర్త్యదేహాన్ని మహిమోపేత గీతంగా మార్చెయ్యి,
ద్యావాపృథ్వులవంతెనవి,
కాలానికి పుట్టిన బిడ్డల్ని అమృతసంతానంగా మార్చెయ్యి.

భగవంతుడి గులాబీ,
అనంతత్త్వపు ముఖారవిందం మీద నునుసిగ్గు పులకరింతా!

ప్రేమపుష్పమా, కృపాతత్త్వపు అగ్నివాంఛా,
సమస్తాస్తిత్వసారాంశపు కెంపువర్ణమా!
అగాధప్రకృతిలో పడి మొరపెడుతున్న
మా హృదయావేదననుండి మేల్కాంచు
మా నేలని అద్భుతలోకంగా,
మా జీవితాన్ని వర శ్రేష్ఠచుంబనంగా తీర్చిదిద్దు.

# ఆయన ఒక సిద్ధుడు, ఒక సాధ్యుడు

**ఆ** రోజు మధ్యాహ్నం పుదుచ్చేరిలో భారతియారు నివసించిన ఇంటిముందు కూచుని ఉండగా, విజయకుమార్ ఫోన్ చేసి ఎక్కడున్నారు అని అడిగితే, 'భారతియారు ఇంటిముందు తలుపులు తెరవడం కోసం ఎదురుచూస్తున్నాను' అంటే 'ఏమి అదృష్టం మీది' అన్నాడు. నిజంగానే అదొక భాగ్యం. భారతియారు పుట్టిన ఊరు ఎట్టయాపురంలో గాని, చెన్నైలో ట్రిప్లికేనులో పార్థసారథి కోవెలలో గాని అడుగుపెట్టినదానికన్నా పుదుచ్చేరిలో ఆ ఇంటిని సందర్శించడం నిజంగానే ఒక భాగ్యం.

ఎందుకంటే, ఒక ప్రవాస దేశభక్తుడిగా 1908 నుంచి 1918 దాకా, పుదుచ్చేరిలో భారతియారు గడిపిన కాలం ఆయన జీవితంలో అత్యంత విలువైన కాలం. ఆయన కవిత్వంలో కెల్లా గొప్ప కావ్యాలు, 'కుయిల్ పాట్టు', 'పాంచాలీ శపథం', 'కన్నన్ పాట్టు' వంటివి అక్కడే రాసాడు. అంతే కాదు, భారతి ఒక దేశభక్తుడిగా పుదుచ్చేరిలో అడుగుపెట్టి, ఒక ఆత్మజ్ఞానిగా బయటికి వచ్చాడని ఆయన జీవితకారులు చెప్తుంటారు. భారతియారు అనే ఒక ఉత్సాహవంతుడైన యువకుణ్ణి, కవిని, దేశభక్తుణ్ణి పుదుచ్చేరి ఒక పండితుడిగా, మహాకవిగా, సిద్ధుడిగా, సర్వోన్నతుడిగా తీర్చిదిద్దింది. అక్కడ ఆయన అరవిందులతో కూచుని వేదాలూ, ఉపనిషత్తులూ, భగవద్గీతా చదివాడు. అక్కడే ఆయనకు ఆత్మ సాక్షాత్కారం సంభవించింది. అక్కడే ఆయన మహాశక్తిని, పరాశక్తిని మరింత ప్రత్యక్షంగా, మరింత సన్నిహితంగా దర్శించాడు.

కంపిస్తున్న పాదాలతో ఆ ఇంట్లో అడుగుపెట్టాను. ఆ ఇంటిని ఇప్పుడొక స్మారక మూజియంగా తీర్చిదిద్దారు. అది రెండు అంతస్తుల ఇల్లు. కిందభాగంలో భారతియారు ఫొటోలు, ఆయన మీద ప్రసిద్ధ వ్యక్తుల ప్రశంసలు, ఆయన సుప్రసిద్ధ వ్యక్తుల గురించి రాసిన కవితలు మొదలైనవి ఉన్నాయి. పై అంతస్తులో భారతియారు రచనలు, ఆయన గ్రంథాలయంలో అప్పుడాయన చదువుకున్న పుస్తకాలు ఉన్నాయి. ఆ రెండు అంతస్తుల్లో ఒక్క చుట్టు తిరిగి వచ్చినా కూడా మనమొక మహాకవిని, ఒక దేశభక్తుణ్ణి, ఒక త్యాగనిరతుణ్ణి, ఒక సిద్ధుణ్ణి, ఒక సాధ్యుణ్ణి గుర్తుచేసుకుంటున్నామని తెలుస్తుంది.

వివేకానందుడిలాగా భారతియారు జీవించింది కూడా ముప్ఫై తొమ్మిదేళ్ళే (1882-1921). వివేకానందులు ఎలాగైతే భారతీయ ఆధ్యాత్మిక స్రోతస్వినిని ఒక మలుపు తిప్పారో, భారతియారు కూడా తమిళ సాహిత్యాన్ని అట్లాంటి ఒక మలుపు తిప్పారు. ఎలాగైతే గురజాడతో వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యం ఒక నూతన శకంలోకి అడుగుపెట్టిందో, భారతియారుతోటి రెండువేల ఏళ్ళ తమిళ సాహిత్యం కూడా కొత్త మలుపు తిరిగింది.

తమిళ సాహిత్యాన్ని అధ్యయనం చేయాలంటే మనకి రెండు దారులు. ఒకటి సంగం కాలం నాటి ఎనిమిది సంకలనాలూ, పది దీర్ఘకవితలూ, అయిదు మహాకావ్యాలూ, తిరుక్కురళ్‌తో సహా పద్ధెనిమిది చిన్న రచనలూ, తిరుమురై పన్నెండు సంపుటాలూ, నాలుగువేల దివ్యపాశురాలూ, అవ్వైయారూ, మాణిక్యవాచకర్, అరుణగిరినాథార్‌ల కృతులూ, కంబరామాయణం వంటివి వరసగా చదవడం. లేదా భారతియారు జీవితకాలం పాటు రాసిన 229 కవితలూ, కుయిల్ పాట్టు అనే దీర్ఘకవితా, 'పాంచాలీ శపథం' అనే కావ్యం చదవడం.

రెండువేల ఏళ్ళ పాటు తమిళ సాహిత్యం ఏ భావోద్వేగాల్ని, ఏ దివ్యావేశాన్ని, ఏ ప్రాదేశిక ప్రేమని, ఏ సాక్షాత్కారాన్ని మాటల్లో పెడుతూ వచ్చిందో అవన్నీ భారతియారు ఒక్కడి కవిత్వంలోనే మనకి అత్యంత ఉద్విగ్నపూరితంగా, అత్యంత శక్తిమంతంగా, అత్యంత మహిమోపేతంగా గోచరిస్తాయి. సంగకాల కవుల్లానే ఆయన కూడా పూర్తి ఐహికకవి. తాను ఎక్కడున్నాడో, ఏ మనుషుల మధ్య, పశుపక్ష్యాదుల మధ్య జీవిస్తున్నాడో ఆ దేశకాలాల్ని అంత ఇష్టంగానూ వేడుకచేసుకున్నాడు. తిరువళ్ళువర్ లానే ఆయన కూడా అత్యంత సరళసుందరమైన కవి. తిరుక్కురళ్‌లో కనిపించే నైతికతా, శీలబలం తిరిగి మనకి అంతే సూటిగా భారతిలోనే కనిపిస్తాయి. నాయనార్లు, ఆళ్వారులు తాము దర్శించిన దైవాన్ని నమ్ముకుని, ఆ దైవాన్ని కీర్తించడం కోసమే జీవించారా అన్నట్లుగా ఎట్లా కవిత్వం చెప్పారో భారతి కూడా తాను దర్శించిన పరాశక్తిని ప్రస్తుతించడంకోసమే దారిద్ర్య నరకాన్ని తట్టుకున్నాడు, ఆమె కోసమే పాటలు కట్టాడు. కంబర్ లాగా ఆయన కూడా తమిళులకొక ఇతిహాససమానమైన కావ్యాన్ని ప్రసాదించాడు. కంబర్ సీత కథ చెప్తే, భారతి పాంచాలి కథ చెప్పాడు.

భారతియారు గురించి ఒక్క మాటలో చెప్పడం కష్టం. ఆయన దాదాపు పన్నెండు భాషల్లో పండితుడు. కత్తిసాము, మల్లయుద్ధం, భరతనాట్యం, కర్ణాటక సంగీతాల్లో ప్రావీణ్యంతో పాటు ఆయన పత్రికలు నడిపాడు, కందుకూరి వీరేశలింగంలాగా సామాజిక సంస్కర్త, తమిళగద్యపితామహుడు. దేశభక్తుల్లో అగ్రగణ్యుడు. దేశం కోసం నాలుగు మాటలు రాసినందుకు ఉద్యోగం పోగొట్టుకున్నాడు, ప్రవాసాన్నీ, కారాగారాన్నీ రెండు చేతులా స్వాగతించాడు. శివకవులు నమశ్శివాయ అంటో ప్రాణాలు వదులుకున్నట్టు

తిలక్ మహరాజ్ అంటో ప్రాణాలు వదలడం కన్నా మించి తనకి కోరుకునేదేమీ లేదని చెప్పుకున్నాడు. అరవిందుల్నీ, గాంధీనీ అభిమానించాడు. వాళ్ళని కలుసుకున్నాడు. వారిద్దరి హృదయాల్లోనూ తన గురించి చెరగని ముద్ర వేసాడు.

పట్టుమని నలభై ఏళ్ళు కూడా జీవించకుండానే ఒక మనిషి పది జీవితకాలాలకు సరిపడా ప్రభావాన్ని తన జాతిమీదా, సమాజం మీదా చూపించాడు. ఈ తెల్లవారు జామున ఆయన గురించి ఇట్లా నాలుగు వాక్యాలు రాసుకోగలగడమే నా భాగ్యమనే భావన నా వంటి తమిళ నిరక్షరాస్యుడికి కూడా కలుగుతున్నదంటేనే ఆ ప్రభావం ఎటువంటిదో అర్థం చేసుకోవచ్చు.

కాని, భారతి తమిళులకెంత ప్రీతిపాత్రుడో, తెలుగువాళ్ళకి కూడా అంతే ప్రేమాస్పదుడు. 'తెలుగువాడిగా పుట్టడమూ, తెలుగు భాషతో పరిచయంకావడం కొద్దిపాటి తపస్సు చేస్తే కలిగే అదృష్టాలు కావు' అని ఒకప్పుడు అప్పయ్యదీక్షితులు అన్నారని మనకి తెలుసు. తిరిగి భారతి కూడా అటువంటి విలువైన మాట, ఒక భాషని చరితార్థం చేయగల మాట ఒకటి అన్నాడు. 'భరతభూమి' అనే కవితలో ఇట్లా రాసాడు:

**చేరదేశపు స్త్రీలు వెంటరాగా**
**సింధునదిలో వెన్నెలరాత్రి**
**పడవప్రయాణం చేస్తూ**
**సుందర తెలుగు గీతం**
**పాడుకుంటూ పరవశిద్దాం.**

ఈ వాక్యం మొదటిసారి విన్నప్పుడు నాకు ఎట్లాంటి పులకింత కలిగిందో, ఇప్పుడు మళ్ళా ఇక్కడ రాస్తున్నప్పుడు కూడా అంతే గర్వం, సంతోషం కలుగుతున్నాయి. మా అమ్మ నాకు తెలుగుపలుకు నేర్పినందుకు నేనెంత సంపన్నుణ్ణో కదా. భారతి వంటి మహాకవి, సరస్వతీ పుత్రుడు, తన అత్యంత సంతోషకర సమయాల్లో తిరుక్కురళ్‌ని కాదు, తిరువెంబావై, తిరుప్పావై, తిరుప్పుహళ్‌లను కాదు, తెలుగుపాటని తలుచుకున్నాడు, తెలుగు మాటని తలుచుకున్నాడు.

అక్కడ, ఆ మ్యూజియంలో అపురూపమైన ఒక చిత్రం నా కంట పడింది. అందులో ఒక పడవలో భారతియారు కేరళకన్యలతో ప్రయాణిస్తున్నాడు. వట్టి ప్రయాణమేనా, ఆయన చేతిలో ఒక వీణ ఉంది. ఆ తంత్రుల్ని ఆయన మీటుతున్నాడు. ఆ సంగీతం ఆ నిశ్శబ్ద చిత్రంలోంచి బయటపడి నన్నాపేసింది. ఎట్లాగేనా సరే ఆ బొమ్మని వెంట తెచ్చేసుకుందామనుకున్నాను. కాని అక్కడ కాపలా కాస్తున్న ఉద్యోగిని నన్నే పరికిస్తూ

నా వెనకనే ఉంది. అక్కడ ఫొటోలు తియ్యడం నిషిద్ధమనే బోర్డు ఉంది. కాని నేను ఉండబట్టలేకపోయాను. ఏమీ వద్దు, ఆ ఒక్క బొమ్మ ఫొటో తీసుకుంటాను, అనుమతించమని వేడుకున్నాను. ముందామె నిరాకరించింది. కాని, ఎక్కడో నా ప్రార్థనకి ఆమె కరిగిపోయింది. 'ఆ ఒక్క ఫొటో మాత్రమే అనుమతిస్తున్నాను, మరొక ఫొటో వైపు నీ కెమేరా తిప్పకూడదు' అంది.

ఉత్తరాదికి రవీంద్రుణ్ణీ, దక్షిణాదికి భారతినీ ప్రతినిధులుగా చెప్పడం పరిపాటి. కాని ఒకసారి గురజాడ గురించి రాస్తూ, రవీంద్రుడు వందేళ్ళకొకసారి పుట్టే కవి, గురజాడ వెయ్యేళ్ళకొకసారి అని అన్నాను. కాని భారతియారు రెండువేల ఏళ్ళకి ఒకసారి పుట్టే కవి.

గురజాడ ఆదర్శవాది, వివేకి. కాని ఆయనలో లేని అమాయికత్వం ఒకటి భారతియారులో మనకి కనిపిస్తుంది. గురజాడ దేశభక్తి ఎల్లల్లేని దేశం గురించిన తపన. భారతి దేశం ఏకకాలంలో నిర్దిష్టం, విశ్వవ్యాప్తం కూడా.

ఆయన బోల్షివిక్ విప్లవం గురించి కవిత కట్టాడు. ఫిజీలో చెరకుతోటల్లో అణగారిపోతున్న శ్రామిక స్త్రీల గురించి పాట కట్టాడు. వాల్ట్ విట్మన్ గురించీ, జపాన్ హైకూల గురించీ వ్యాసాలు రాసాడు. షెల్లీని ఎంతగా ఆరాధించాడంటే, తొలిరోజుల్లో రాసిన కవితల కింద షెల్లీదాసన్ అని సంతకం చేసేవాడు.

గురజాడకి కూడా ఒక దైవం ఉన్నాడుగాని, ఆ దైవాన్ని బాహాటంగా స్తుతించడం మీద ఆయనకు ఆసక్తి లేదు. ఆ దేవుణ్ణి విగ్రహాల్లో కాక, మనుషుల్లో వెతకాలనుకున్నాడాయన. భారతికి దైవం ఉన్నాడు. ఆ దైవాన్ని విగ్రహాల్లో, యోగుల్లో, తాపసుల్లో, స్త్రీలలో, పిల్లల్లో, పిట్టల్లో ప్రతి ఒక్కచోటా చూసాడాయన, పరవశించాడు, పాటలు కట్టాడు. గురజాడ సన్నిధిలో మనమొక ఋషి సన్నిధిలో కూచున్నామన్న భావన కలుగుతుంది. భారతి సన్నిధిలో కల్లాకపటమెరుగని పసిపాపతో మాట్లాడుతున్నామన్న పారవశ్యం కలుగుతుంది.

పసిపాపల్ని ఉద్దేశిస్తూ భారతియారు రాసిన గేయం నాకు నిద్రలో గుర్తొచ్చినా సరే ఒక్క సారి మెలకువ వచ్చేస్తుంది. మనసంతా మెత్తనైపోతుంది. కళ్ళు సజలాలైపోతాయి. చెప్పలేని దిగులు మనసుని ఆవరిస్తుంది. ఇది కదా, ఇలా కదా, మనం పిల్లల్ని కనవలసింది, పిల్లల్ని పెంచవలసింది, పిల్లలతో మాట్లాడవలసింది అనిపిస్తుంది.

**ఆడి నడయాడు బిడ్డా**
**కూడి తిరుగాడు బిడ్డా**
**చిన్నారి పిట్టవలె ఎగురాడు, చెడ్డ**
**పలుకాడకెన్నడును బిడ్డా!**

ఇలా మొదలయ్యే ఈ పాట మళ్ళీ మళ్ళీ వినడంకోసమేనా మరో జన్మ ఎత్తాలనిపిస్తుంది.

భారతియారు కవితలన్నీ అనువదించి మీతో పంచుకోవాలనిపిస్తోంది. ముఖ్యంగా, 'భారతి, అరవై ఆరు' అనే ఆత్మకథనాత్మకమైన దీర్ఘకవిత. అందులో ఆయన తనకి ఆత్మజ్ఞానాన్ని కలిగించిన గురువుల గురించి రాసాడు, ఆయన పుదుచ్చేరిలో ఉండగానే, కుళ్ళస్వామి అనే ఒక యోగి పరిచయమయ్యాడు. పిల్లవాడిలానూ, పిచ్చివాడిలానూ ఉండే ఆ సిద్ధుడి చరణాలు పట్టుకుని భారతియారు తనకి జ్ఞానం ప్రసాదించమని అడిగాడు. ఆ సిద్ధుడు భారతియారుని తప్పించుకోవాలనుకున్నాడుగాని, సాధ్యం కాలేదు. అప్పుడు ఒక ఇంట్లో, పెరటిలో ఒక పాడుపడ్డ గోడని, సూర్యుణ్ణీ, ఆ పెరటిలో ఉన్న బావిలో ప్రతిబింబిస్తున్న సూర్యుణ్ణీ చూపించాడట అతడు. ఆ క్షణమే తనకి సాక్షాత్కారమైందని భారతి రాసుకున్నాడు. మాటల్తో పనిలేకుండానే తన ఆత్మని తనకు ఆ యోగీశ్వరుడు చూపించాడని చెప్పుకున్నాడు. మరొకసారి ఆ సిద్ధుడు మాసిన గుడ్డలు ఒక మూటగా చుట్టుకుని మోసుకుంటూ కనబడ్డాడట. 'ఏమిటి సామీ, ఈ పిల్లవాడి చేష్ట! ఇలా మాసిన గుడ్డలు మూట కట్టుకు తిరుగుతున్నారేమిటి?' అని అడిగితే, 'నేను బయటకు కనబడేలాగా మురికి గుడ్డలు మోసుకు తిరుగుతున్నాను, కాని మనుషులు లోపల మోసుకు తిరుగుతున్నారు' అన్నాడట.

మనోమాలిన్యం లవలేశమేనా లేని మనిషి ఎవరైనా ఉన్నారా అని అడిగితే, బహుశా, అందరికన్నా ముందు భారతియారే తలపుకొస్తాడు. రామకృష్ణ పరమహంస శారదాదేవిలో తల్లిని చూసిన వైనం మనకి తెలుసు. భారతియారు తన భార్య చెల్లమ్మలో పరాశక్తిని చూడటమే కాదు, స్తుతించాడు కూడా. వస్త్రహీనులైన నిర్భాగ్యదేశజనుల్ని చూసి గాంధీజీ అంగవస్త్రానికి మాత్రమే పరిమితమయ్యాడని మనకు తెలుసు. ఒకప్పుడు కొందరు బీదపిల్లలు తినడానికి తిండిలేక వేపపళ్ళు ఏరుకు తినడం చూసాడట భారతి. ఆ రోజునుంచీ తనకి తిండి రుచి తెలియకుండా పోయిందని రాసుకున్నాడాయన.

భారతి ఒక జెన్ సాధువు. ఒక సూఫీ కవి. ఒక బమ్మెరపోతన, ఒక వేమన. తావోచిన్ లాంటి ప్రాచీన చీనాకవుల్లాగా ఆయన కోరుకున్నదంతా కలిపి ఒక చిన్న

కుటీరమూ, ధారాళమైన వెన్నెలా మాత్రమే. ఆయన మొత్తం కవిత్వం ఎలానూ పంచుకోలేను, కనీసం ఈ చిన్ని కవిత చూడండి:

## పట్టెడు నేల

అమ్మా, ఒక కుటీరం కట్టుకోడానికి
పట్టెడునేల ప్రసాదించు, కళకళ్ళాడే
స్తంభాలు, అందమైన పైకప్పు
మంచినీళ్ళ బావి, పక్కన కొబ్బరి చెట్లు,
రెపరెపలాడే కొబ్బరాకులు
పాలుపోసుకునే కొబ్బరి పిందెలు.

అమ్మా, నా ఇంటిముంగిట్లో
పదో పన్నెండో కొబ్బరి చెట్లు,
ముత్యాలగుట్టలాంటి చంద్రకాంతి
మృదుమధురమైన కోకిల పాట
కంపిస్తున్న నా గుండెని
ఊరడించే కమ్మతెమ్మెర.

అమ్మా, నాకొక చక్కని సహచరినివ్వు
నాతో కూచుని సంతోషంగా
పాటలు రాసుకోడానికి, పాడుకోడానికి.
అమ్మా, ఆ మా ప్రేమని, మా ఏకాంతాన్ని
దయతో కాపాడు, కరుణించు

అప్పుడు నేను నా హృదయాన్ని పాటలుగా మార్చి
ప్రపంచానికి పంచిపెడతాను.

# ఆమె నగ, తానందులో పొదిగిన వజ్రం

**మం**చివాళ్ళని తలుచుకునే కొద్దీ మరింత సంతోషంగా ఉంటుందని రాసుకున్నాడు గురజాడ. ఈ వారంరోజులుగానూ భారతియారు నా తలపుల్లో మెదలాడుతూ నా సంతోషాన్ని ద్విగుణం చేస్తూనే ఉన్నాడు.

భారతిని తొలిరోజుల్లో జాతీయవాద కవిగా భావించారు. తరువాతి రోజుల్లో శక్తిమంతుడైన గేయకవిగా భావించారు. ఇప్పుడు తమిళులకి త్యాగయ్య స్థానాన్ని పూరించగల వాగ్గేయకారుడిగా భావిస్తున్నారు. కాని, వీటన్నిటికన్నా కూడా మిన్నగా ఆయన్నొక mystic గా భావించేవాళ్ళు కూడా ఉన్నారు. ఈ దేశంలో అవతరించిన ఒక సిద్ధ కవిపరంపరలో తాను కూడా ఒకడినని ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు.

మామూలుగా భక్తికవులు దేవుణ్ణి ఇష్టదేవతగానో, తారకమంత్రంలోనో దర్శిస్తారు. కాని టాగోర్‌లాగా భారతి దేవుణ్ణి పిపీలికం మొదలుకుని బ్రహ్మాండగోళాలదాకా పరికించాడు. పరాశక్తి ఆయన ఆరాధ్యదేవత అని చెప్పవచ్చుగాని, ఆయన కృష్ణుణ్ణి కూడా అంతే పారవశ్యంతో ప్రస్తుతించాడు. ఆయన భక్తి కవిత్వం కేవలం వర్ణనాత్మకమో లేదా స్తుతిగీతమో కాదు. అందులో ఏ ఒక్క వాక్యాన్ని పట్టిచూసినా, ఆ సర్వేశ్వరుణ్ణి ఆయన స్వయంగా చూసాడనీ, ఆ సర్వేశ్వర స్పర్శ ఆయనకు అనుభవంలోకి వచ్చిందనీ అర్థమవుతుంది. రగులుతున్న మంటని వేలికొసతో తాకినప్పుడు అది కృష్ణుణ్ణి తాకినట్టుగా ఉంటుందని ఒక గీతంలో ఆయన రాసిన మాటలు చదివి నేను నిశ్చేష్టుణ్ణైపోయాను. నిప్పుని తాకినప్పుడు దేవుణ్ణి స్పృశించినట్టుగా ఉంటుందని అంటున్న కవిలో ఒక వైదిక ఋషి ఎంత ఉన్నాడో అభం శుభం తెలియని ఒక పసిబిడ్డ కూడా అంతే ఉన్నాడు. ఆ మాటలు రాసిన కవి నా ఎదట ఉండి ఉంటే నిస్సంకోచంగా ఆయన పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి ఉండేవాణ్ణి.

ఇంతకీ ఆ పాట ఆయన ఎక్కడో కూచుని తీరిగ్గా కూర్చిపెట్టుకున్నది కాదు. ఒకరోజు వీథిలో ఒక భజన బృందం ఎదురైతే, అందులో గాయకుడు ఒక పాట

మర్చిపోయి గుర్తుతెచ్చుకోడానికి అవస్థ పడుతుంటే, అతడికోసం అప్రయత్నంగా, అప్పటికప్పుడు భారతి పాడిన పాట అది. అపురూపమైన ఆ గీతాన్నిట్లా తెలుగు చేయకుండా ఉండలేకపోయాను.

## కన్నడు

**కాకిరెక్కల కృష్ణకాంతుల, నందలాలా**

**నీ**

**కేకిపింఛపు శోభ కాంతును, నందలాలా!**

**చెట్టుచేమల పసరు పచ్చల, నందలాలా**

**నీ**

**పట్టు వస్త్రపు పసిమి మెరుపులు, నందలాలా!**

**వీనుసోకెడి శబ్దమెల్లయు, నందలాలా**

**నీ**

**వేణుగాన మహేంద్ర జాలమె, నందలాలా!**

**వేలికొసతో నిప్పు తాకితె, నందలాలా**

**నీ**

**మేను తాకిన పారవశ్యము, నందలాలా!**

భారతి గురించి తెలుసుకునేకొద్దీ చాలా స్ఫూర్తిమంతంగా ఉంటుంది. మరింత తెలుసుకోవాలనిపిస్తుంది. ఇద్దరు కవులు కలుసుకున్నప్పుడు మూడవ కవిని కించపరుచుకుంటూ మాటాడుకోకుండా ఉండలేని వాళ్ళం మనం. కాని పుదుచ్చేరిలో అరవిందులూ, భారతీ కలుసుకున్నప్పుడు, దాదాపుగా ప్రతి రోజూ ఒకరినొకరు కలుసుకోకుండే ఉండలేని స్నేహం వాళ్ళ మధ్య వర్ధిల్లినప్పుడు, అది రెండు ప్రపంచాల మధ్య స్నేహంగా వర్ధిల్లింది. అరవిందుల ప్రభావం వల్ల భారతి అగ్నిసూక్తాలు తమిళంలోకి అనువదించాడు. భారతి ప్రభావం వల్ల అరవిందుడు తిరువళ్ళువర్‌నీ, నమ్మాళ్వార్‌నీ, ఆండాళ్‌నీ ఇంగ్లీషులోకి అనువదించాడు. భగవద్గీత పైన భారతి ఒక వ్యాఖ్యానం రాసిన

తరువాతనే, భగవద్గీతకి అధ్యాయాలవారీగా వ్యాఖ్యానం రాయాలన్న ఆలోచన అరవిందులకి కలిగింది.

ఒకరి విలువ మరొకరికి సంపూర్ణంగా తెలిసిన సాహిత్య సన్మిత్రులు వాళ్ళు. 'ఒకటో రెండో రూకలు మాత్రమే చేతిలో ఉంటే ఆ దారిద్ర్యం ఎలా ఉంటుందో నాకు తెలుసు, కాని ఆ ఒక్క రూక కూడా చేతిలో లేకపోతే ఎలా ఉంటుందో భారతికి మాత్రమే తెలుసు' అన్నారట అరవిందులు ఒకసారి. నిర్ధనులూ, కోరుకుని మరీ దారిద్ర్యాన్నివరించిన ఆ దేశభక్తులూ ఎంత సుసంపన్నమైన సాహిత్యాన్ని మనకోసం వదిలిపెట్టారో తలుచుకుంటో, మనమెట్లా జీవిస్తున్నామో ఆలోచించుకుంటే సిగ్గుగానూ, చెప్పలేనంత దిగులుగానూ ఉంటుంది మనసుకి.

భారతి గురించి తలుచుకునేటప్పుడు, మాట్లాడేటప్పుడు ఆయన భార్య చెల్లమ్మ గురించి చెప్పుకోకపోతే ఆ ప్రసంగానికి న్యాయం చేసినట్టుకాదు. చెల్లమ్మ లేకపోతే భారతి లేడు. ఆమె భారతి గురించి రాసిన జ్ఞాపకాలు 'భారతియారు చరిత్రం' నేను చదవలేదుగానీ, వేరే రచయితలు ఆ పుస్తకంలోంచి అక్కడక్కడా పేర్కొనే వాక్యాలు, సన్నివేశాలు చదివినప్పుడు, ఆమెది ఎంత మహనీయమూర్తిమత్వమో నాకొక ఆనవాలు దొరికింది.

తిరువళ్ళువరు తిరుక్కురళ్ లో కామవిభాగం కింద రాసిన అత్యున్నత కవిత్వాన్ని పరిచయం చేస్తూ నేనొక మాట చెప్పడం మర్చిపోయాను. అందులో వళ్ళువర్ వర్ణించిన స్త్రీపురుష ప్రేమ అలభ్యసుందరి గురించో లేదా అప్రాప్యమనోహరుడి గురించో రాసిన కవిత్వం కాదు. అది దంపతీ ప్రేమ. భార్యాభర్తలమధ్య నెలకొనవలసిన ఎటువంటి ప్రేమవిద్య గురించి గురజాడ 'కాసులు' కవితలో మాట్లాడాడో అటువంటి ప్రేమ పెద్దబాలశిక్ష తిరుక్కురళ్. ఇద్దరు దంపతుల మధ్య ఎటువంటి ప్రేమ వికసించాలని తిరువళ్ళువర్ ఆకాంక్షించాడో, అటువంటి ఋషి వాక్యానికి, భారతియారు దంపతుల స్నేహం ఒక సజీవ నిరూపణ.

మన దేశంలో అనాదికాలంగా ఆడపిల్లలతో పతివ్రతల కథలు చదివించి, నోములు నోయించే అలవాటు ఉంది. కాని నిజంగా మనం చెయ్యవలసింది, మగపిల్లలకి తమ భార్యని మాత్రమే ప్రేమించవలసిన మనఃస్థితిని అలవర్చడం. తన భార్య కాక మరొక స్త్రీ తలపు రాకపోవడంలో ఉన్నది కేవలం నైతికత కాదు, అపారమైన మనోపరిశుభ్రత. 'ఆమె నా అంతరంగ దేవత..' అని మన భావకవులు ఊహాసుందరిని దృష్టిలో పెట్టుకుని కవిత్వం చెప్పారు. కాని వారు దర్శించిన ఊర్వశికన్నా సుందరతరమైన స్త్రీమూర్తిని భారతియారు తన భార్యలో దర్శించాడు. 'కన్నమ్మా' అని ఆయన రాసిన

గీతాలు మొదట్లో 'చెల్లమ్మా' అనే సంబోధనతోనే రాసాడు. కాని, కన్నమ్మా అనే ఆ సంబోధన వింటున్నప్పుడు, ఆయన తన చెల్లమ్మను తన కన్నమ్మగా, తన తల్లిగా, తన తనయగా కూడా సంబోధిస్తున్నాడని స్ఫురించకుండా ఉండదు. ఒక కవితలో ఆయన 'కన్నమ్మా, నా చిన్నారి బిడ్డా' అని సంబోధించాడు. మరొక కవితలో 'కన్నమ్మా, నా ఇష్టదేవతా, నా ఆశ్రయమా' అన్నాడు. మరొక కవితలో 'కన్నమ్మా, నా కన్నుల పండగా' అన్నాడు. ఈ వాక్యాలు చూడండి:

**స్త్రీజాతికే రాణి, అందాల రాశి**
**నా కంటివెలుగు, నా ప్రియురాలు, నా రతి**
**ఆమె మాటలు పాటలకన్నా మధురం**
**ఆమె పెదాలు అమృతభాండాలు,**
**ఆమె నా కన్నమ్మ.**

ఆమె తనకి దారిచూపడానికి ఆకాశం వెలిగించిన దీపం. ఆమె ఒక బంగారు వీణ. తానొక కంపిస్తున్న అంగుళి. ఆమె ఒక నగ. తాను అందులో పొదిగిన వజ్రం. ఆమె ఒక వాన. తానొక నెమలి. ఎక్కడో ఆయనకి ఒకింత సందేహం. కాని బాగా నమ్మకం. ఆమె పరాశక్తి. కాని ఒక మేలిముసుగుతో తన భార్యగా తన ఇంట్లో ఉంటున్నది. ఆ తెరతీయగరాదా, నువ్వెవరో నాకు తేటతెల్లం చేయరాదా అని పాటపాడకుండా ఉండలేకపోయాడు కూడా.

భారతియారు అన్నింటికన్నా ముందు మనిషి. 'చక్కని వీణను సవరించి బయట పారేస్తారా ఎవరేనా. నన్ను పుట్టించి కూడా నాతో ఎందుకు పాటలు పాడించవు?' అనడిగాడు ఆయన మాతృమూర్తిని ఒక కవితలో. భారతిని కన్నతల్లి ధన్యురాలు. భారతి పసిప్రాయంలో ఉండగానే ఆమె భారతిని వదిలిపెట్టి దివికి ఏగిందన్నమాటే గాని, ఆ తర్వాత నుంచీ ప్రతి ఒక్క స్త్రీవదనంలోనూ ఆమె భారతికి ప్రత్యక్షమవుతూనే ఉంది.

ఈ మాటలు రాస్తున్నప్పుడు నా కళ్ళు సజలాలైపోతున్నాయి. ప్రతి ఒక్క స్త్రీలోనూ తల్లిని చూడమని చెప్పిన మాట ఒక పడికట్టుపదంగా, హాస్యాస్పదంగా, ఆత్మవంచనగా వినిపించే కాలానికి చేరుకున్నాం మనం. కాని ప్రతి ఒక్క వదనంలోనూ తల్లిని చూడటమంటే ఏమిటి? నువ్వు సదా బాలకుడిగా జీవించడమే కదా. అయ్యో, ఇట్లాంటి మాటలు నా హృదయంలోకి సూదిమందు ఎక్కించి మరీ ఎందుకు చెప్పలేదు పెద్దవాళ్ళు నా పసితనాన!

భారతియారు గురించి ఇంకా ఏమేమో చెప్పాలని ఉంది. కాని, ఒక్క మాట చెప్పి విరమిస్తాను.

దేవుణ్ణి దర్శిస్తే టాగోర్ ప్రేమించినట్టు దర్శించాలి. స్త్రీని దర్శిస్తే భారతియారు దర్శించినట్టు దర్శించాలి. 'కుయిల్ పాట్టు' కవితలో ఇలా అంటున్నాడు:

**కవిత్వమనే పండునుంచి పిండిన రసానికి**
**కవిత్వాన్నీ నాటకాన్నీ అదనంగా చేర్చి**
**అమృతంలాంటి తేనెతో రంగరించి**
**ప్రేమసూర్యకాంతిలో ఆరబెట్టి**
**బ్రహ్మ రూపొందించిన ఔషధం స్త్రీ.**

# ఆ పొయ్యి ఇప్పటిదాకా ఆరలేదు

**రా**మలింగ అడిగలారు గురించి నేను చిన్నప్పుడు శ్రీమహాభక్తవిజయములో చదివి ఉంటానుగాని, వివరంగా చదివింది మాత్రం పీటర్ హీస్ సంకలనం చేసిన Indian Religions: The Spiritual Traditions of South Asia (2002) లో మాత్రమే. భారతదేశంలో పందొమ్మిదో శతాబ్దిలో తలెత్తిన మహనీయుల్లో ఆయన కూడా అగ్రస్థానాన తలుచుకోవలసిన వ్యక్తి అని అప్పుడే తెలుసుకున్నాను. రామప్రసాద్ లాగా ఆయన దివ్యావేశంతో కవిత్వం చెప్పినవాడు అని, కేశవచంద్రసేన్ లాగా నూతన ఆధ్యాత్మిక మార్గానికి తోవచూపినవాడు అనీ, శ్రీ నారాయణగురులాగా కవీ, యోగీ, సంస్కర్తా కూడా అనీ గ్రహించాను. కాని ఆయన గురించి బయటి దేశానికీ, ప్రపంచానికీ తెలిసింది చాలా తక్కువ.

తమిళులకి తమ భాష పట్లా, సంస్కృతి పట్లా గొప్ప వీరావేశం ఉందని మనకు తెలుసుగాని, తమ సంస్కృతీ నిర్మాతల గురించి తక్కిన దేశానికి జాగృతి కలిగించడంలో వాళ్ళు బెంగాలీలకన్నా ఎన్నో ఏళ్ళు వెనకబడి ఉన్నారనే చెప్పవలసి ఉంటుంది. రామలింగ స్వామి వంటి అవధూత, కవి, సంస్కర్త, సామాజిక విప్లవకారుడు మహారాష్ట్రలో పుట్టి ఉన్నా కూడా ఈ పాటికి దేశమంతా ఆయన జీవితం గురించి పాఠ్యపుస్తకాల్లో చదువుకుంటూ ఉండిఉండేది.

విల్లుపురం నుంచి మొదటిసారి చిదంబరం వెళ్ళి వస్తున్నప్పుడు వడలూరు దగ్గర రామలింగస్వామికి సంబంధించిన బోర్డు ఒకటి కనిపిస్తే, ఇక్కడెందుకు ఈయన గురించి రాసి ఉందని అడిగితే, ఆయన సత్య ధర్మశాల స్థాపించింది వడలూరులోనే అని నారాయణమూర్తి చెప్పాడు. ఆ మాటవినగానే నా సంతోషానికి మేరలేకపోయింది. తన దృష్టి ఎవరి మీద పడుతుందో, వారు ఎక్కడ ఉన్నాసరే, పిచుక కాలికి దారం కట్టి లాక్కున్నట్టుగా తన దగ్గరకి లాక్కుంటానని షిరిడీ సాయినాథుడు అన్నాడని మనకు తెలుసు. దాదాపుగా ప్రతి యోగీశ్వరుడిదీ అదే మాట అని చెప్పవచ్చు. లేకపోతే,

ఎక్కడి రామలింగస్వామి? ఎక్కడి వడలూరు? నేనెక్కడ? కాని ఆయన నా కరచరణాలు రెండింటికీ తాళ్ళు కట్టి మరీ నన్ను వడలూరు లాక్కున్నాడు.

రామలింగస్వామి గురించి నేనెప్పుడో చదివిన ముద్ర నా మనసుపైన ఉందిగాని, ఆయన జీవితవిశేషాలేవీ నాకు గుర్తులేవు. కాని, ఆ రోజు నారాయణమూర్తి, ఆయన మిత్రులు, రామలింగస్వామి జీవితంలో ముఖ్యస్థలాలైన వడలూరు, మెట్టుకుప్పం, మరుదూరు తీసుకువెళ్ళి, ఆయన సన్నిధివల్ల పునీతమైన ప్రతి ఒక్కస్థలాన్నీ దగ్గరుండి చూపించారు.

రామలింగస్వామి 1823 లో చిదంబరం దగ్గరం మరుదూరు అనే గ్రామంలో జన్మించాడు. ఆయన నెలల బిడ్డగా ఉండగానే తండ్రి మరణించాడు. ఆ తల్లి తన ఆరుగురు పిల్లల్ని వెంటపెట్టుకుని చెన్నై వెళ్ళిపోయింది. కొన్నేళ్ళ దుర్భర దారిద్ర్యంలో గడిపాక, ఆమె పెద్దకొడుకు సభాపతి ప్రవచనాలు చెయ్యడం మొదలుపెట్టి కుటుంబాన్ని ఆదుకోవడం మొదలుపెట్టాడు. తన లాగా కాకుండా తమ్ముణ్ణి ఇంగ్లీషు చదువు చదివించాలి అనుకున్నాడు. కాని రామలింగస్వామికి బడిమీదా, చదువు మీదా దృష్టి లేదు. ఆ అన్న తన తమ్ముణ్ణి దారిలో పెట్టాలని అతణ్ణి కఠినంగా శిక్షించేవాడు. అన్నం పెట్టేవాడు కాదు. కాని, తాను కేవలం పొట్టకూటికోసం ప్రవచనాలు చెప్పేవాడు మాత్రమేననీ, తన తమ్ముడు ఆ ప్రవచనాల సారాంశాన్ని జీవితంగా మార్చుకున్నవాడనీ అతడికి తెలియడానికి ఎంతో కాలం పట్టలేదు. ఒకరోజు ఒక గుళ్ళో ప్రవచనం చెప్పవలసి ఉండి తనకి వీలు కాకపోవడంతో ఆ అన్న తన తమ్ముణ్ణి ఆ ప్రసంగానికి పంపించాడు. ఆ రోజు మొదటిసారిగా రామలింగస్వామి గొంతు విప్పాడు. తిరుజ్ఞాన సంబంధర్ గురించిన ప్రసంగం అది. ఆ శ్రోతలు అటువంటి ప్రసంగం ఎప్పుడూ విని ఉండలేదు. ఆ మర్నాడు వాళ్ళు సభాపతికి కబురు పంపించారు, ఇక మీదట, ప్రవచనాలకి తాను రానక్కర్లేదనీ, తన తమ్ముణ్ణి పంపిస్తే చాలనీ.

రామలింగస్వామి చదువుకున్నదంతా పెరియపురాణమూ, తిరువాచకమూ మాత్రమే. ఆయన స్నేహం చేసింది ముగ్గురు నాయన్మారుల్తో మాత్రమే. ఆయన తీరికసమయ వ్యాపకమంటూ ఉంటే అది అరుణగిరినాథుల 'తిరుప్పుహళ్' మననం చేసుకుంటూ ఉండటమే. ప్రాపంచికసాంగత్యం మీదా, ధనార్జన మీదా, పెళ్ళి, కుటుంబ జీవితాల మీదా ఆయనకు ధ్యాసలేదు. అయినా కూడా అతడి అక్క అతడికి తన కూతురునిచ్చి పెళ్ళి చేసింది. ఆయన మొదటిరాత్రి ఆ నవవధువుని తన పక్కన కూచోబెట్టుకుని పెరియపురాణం చదివి వినిపించడం మొదలుపెట్టాడట.

ముప్పై అయిదేళ్ళ వయసులో ఆయన ఆ నగర జీవితం వదిలిపెట్టి ఎక్కడికేనా ప్రశాంతమైన చోటుకి వెళ్ళి స్థిరపడాలనుకున్నాడు. తాను చిన్నప్పుడు పుట్టిపెరిగిన

ప్రాంతానికి తిరిగివెళ్ళాడు. అక్కడ కరుంగుళి అనే చిన్న ఊరుని ఎంపికచేసుకున్నాడు. అక్కణ్ణుంచి చిదంబరం దేవాలయ గోపురాలు కనిపిస్తుండటమే అందుకు కారణం. అక్కడ పూర్తి తాపస జీవితం జీవించడం మొదలుపెట్టాడు. కట్టుకోడానికి చిన్న అంగవస్త్రం. దాదాపుగా ప్రతి రోజూ ఉపవాసం. నిరంతర ధ్యానం. ఇదే జీవితం. త్వరలోనే ఆయన చుట్టూ అన్వేషులూ, ముముక్షులూ, రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడేవాళ్ళూ పెద్ద సంఖ్యలో చేరడం మొదలుపెట్టారు. వాళ్ళందరికీ ఒక దారిచూపించవలసిన బాధ్యత తన మీద ఉందని ఆయన గ్రహించాడు. 1865 లో 'సమరస సన్మార్గ సత్య సంఘం' అనే ఒక ధర్మాన్ని ప్రారంభించాడు. అది బ్రహ్మ సమాజంలాగా నిరాకార సర్వేశ్వరుణ్ణి ఒక జ్యోతి రూపంలో ఆరాధించే ఒక మార్గం. కులమతాలకీ, మద్యమాంసాలకీ అతీతంగా సరళ జీవనం, సత్యచింతనం లక్ష్యాలుగా కొనసాగే ఒక జీవనవిధానం. తన కోసం వస్తున్న వాళ్ళు సత్యార్థులు మాత్రమే కాదు, అన్నార్తులని కూడా గ్రహించడంతో వాళ్ళందరికోసం ఒక ఉచిత ధర్మశాలని 'సత్య ధర్మశాల' అనే పేరుతో 1867లో ప్రారంభించాడు. అక్కడనుంచి మళ్ళా కురుంగుళి వెళ్ళి అక్కడ 'సత్య జ్ఞానసభ' ప్రారంభించాడు. దేవుణ్ణి ఒక జ్యోతిగా దర్శించే ఒక ఆధ్యాత్మిక స్థలం అది.

ఒక నూతన దివ్యమార్గ ప్రవర్తకుడిగా రామలింగస్వామికి సమకాలిక సమాజం మొత్తం నీరాజనం ఎత్తారనుకుంటే అది పొరపాటే. కులమతాలకి అతీతంగా ఆయన ప్రారంభించిన కొత్త ధర్మమూ, సహపంక్తిభోజనమూ సనాతన సమాజాన్ని ఆగ్రహోదగ్రం చేసాయి. వాళ్ళు ఆయన్ని వేధించడం మొదలుపెట్టారు. ఏ ప్రశాంతత కోరుకుని ఆయన కురుంగుళి వచ్చాడో ఆ ప్రశాంతత ఆయనకు కరువైపోయింది. ఆయనకు భౌతికంగా వాళ్ళ మధ్య జీవించడం దాదాపుగా అసాధ్యమైపోయింది. చివరికి 1874 లో ఒకరోజు ఆయన తన శిష్యులందరినీ సమావేశపరిచాడు. వారితో చివరిగా సంభాషించాడు. 'పెరుపదేశం' గా ప్రసిద్ధి చెందిన తన అంతిమ ప్రవచనం వినిపించాడు. ఆ తరువాత తన గదిలోకి ప్రవేశిస్తూ బయట తాళాలు వేసెయ్యమన్నాడు. ఇక తాను కనబడననీ, ఆ గది తలుపులు తెరవద్దనీ చెప్పాడు. వారం పదిరోజులు గడిచాక ఆ శిష్యులు ఉండబట్టలేక, ఆ గది తలుపు తెరిచి చూస్తే, అక్కడొక దివ్యనిశ్శబ్దం తప్ప మరేమీ కనిపించలేదు. జీవితమంతా సర్వేశ్వరుణ్ణి ఒక జ్యోతిగా ఉపాసించిన ఆ యోగీశ్వరుడు ఆ 'అరుం పెరుం జ్యోతి' లో తాను కూడా ఒక వెలుగై కలిసిపోయాడు.

ఇదంతా ఒక అభూత కల్పన అనుకుంటారేమోనని చరిత్ర కొన్ని సాక్ష్యాలు కూడా వదిలిపెట్టింది. అందులో ఒకటి అప్పట్లో దక్షిణ ఆర్కాటు జిల్లా కలెక్టరుగా పనిచేసిన

జె.ఎచ్.గార్‌స్టిన్ అనే ఒక ఐ.సి.ఎస్ అధికారి 1878 లోనే జిల్లా గెజిటీరు లో ఇదంతా ఒక వృత్తాంతంగా రాసిపెట్టిపోవడం.

రామలింగస్వామి ఒక యోగి, సంస్కర్త, వక్త. కాని అన్నిటికన్నా మించి ఆయన ప్రశస్తమైన కవి. తాను దర్శిస్తున్న వెలుగుని కీర్తిస్తూ, వర్ణిస్తూ ఆయన దాదాపు ఏడువేల గీతాలు రాసాడు. వాటిని 'తిరు అరుట్ప' (శ్రీ జ్యోతిగీతం) అనే పేరిట ఆరు తిరుమురైలుగా సంకలనం చేసారు. ఆ కవిత్వం ఆయన్ని తమిళ సాహిత్యంలో నాయనార్లతో, మాణిక్యవాచకర్‌తో, అరుణగిరినాథులతో సమానస్థాయిలో నిలబెట్టింది.

ఆ రోజు మొదట వడలూరు వెళ్ళాం. మేం బయల్దేరేటప్పటికే ఆలస్యం కావడంతో దారిలో ఎక్కడేనా ముందు భోంచేసి అప్పుడు అక్కడికి వెళ్దామా అన్నాడు నారాయణమూర్తి. కాని నాకు ఆ మహనీయుడు నివసించిన ఆ స్థలంలో ఎంత తొందరగా అడుగుపెడదామా అని ఒకటే ఆత్రుతగా ఉంది. తీరా చేసి మేము ఆ సత్యధర్మశాలకి వెళ్ళేటప్పటికి ఆ మధ్యాహ్నం అక్కడ మా కోసం అన్నం సిద్ధంగా ఉంది. ఆ అన్నం తినడానికి కూచోగానే నాకోసం అక్కడ రామలింగస్వామి అన్నం గరిట పట్టుకుని ఎదురుచూస్తున్నాడా అనిపించింది. నాకు కళ్ళనీళ్ళు ఆగలేదు.

వాళ్ళు మాకు అక్కడి వంటశాల కూడా చూపించారు. నూట యాభై రెండు ఏళ్ళ కిందట అక్కడ మొదటసారి వంటకోసం కట్టెలు వెలిగించిన తరువాత మళ్ళా నిప్పు పుట్టించవలసిన అవసరం లేకపోయిందని చెప్పారు వాళ్ళు. 'మరి గాలివానలూ, తుపానులూ వస్తేనో' అనడిగాను. 'అయినా సరే, ఆ పొయ్యి ఇప్పటిదాకా ఆరలేదు. సునామీ వచ్చినప్పుడు పదివేలమందికి అన్నం పెట్టారిక్కడ' అన్నారు అక్కడి నిర్వాహకులు.

అక్కణ్ణుంచి మెట్టుకుప్పం వెళ్ళాం. అక్కడ కురుంగిళిలో ఆయన ఏర్పాటు చేసిన సత్య జ్ఞానసభలో వెలిగించిన ఆ దీపం ఆరకుండా వెలుగుతూనే ఉంది. అక్కడే కాదు, ఆ తర్వాత చాలాచోట్ల చూసాను. రామలింగ అడిగలారు పేరిట ఎక్కడ ఏ మందిరం ఉన్నా, అక్కడ గాలివానలకు ఎదురీదుతూ ఒక దీపం అట్లా వెలుగుతూనే ఉంది. మెట్టుకుప్పం నుంచి మరుదూరు వెళ్ళాం. చేలమధ్య, మేఘాల మధ్య చోళనాడులో ఆ ప్రాచీన గ్రామం వైపు మేము చేసిన ప్రయాణం నా మదిలో విడిచిన ముద్ర ఎన్నటికీ చెరగదని చెప్పగలను. మరుదూరులో రామలింగస్వామి పుట్టిన ఇల్లు, ఆ గదీ చూసాం. అక్కడ కొన్నిక్షణాలు కూచున్నాం. అక్కడ కూడా అదే జ్యోతి, ఆరని జ్యోతి.

రామలింగ స్వామి రచనలు ఇప్పుడిప్పుడే ఇంగ్లీషులో వెలువడుతున్నాయి. అక్కడ కూడా ఆయన ప్రసంగాలు, ముఖ్యంగా, ఆ చివరి ప్రసంగం ఇంగ్లీషు అనువాదం లభ్యంగా ఉన్నాయి. తిరిగి వచ్చిన తరువాత, మరొకసారి పీటర్ హీస్ సంకలనం తెరిచిచూసాను. 'తిరువరుట్ప' కు వన్మీకనాథన్ అనే ఆయన చేసిన ఇంగ్లీషు అనువాదాలు

ఈ సారి మరింత భక్తి శ్రద్ధలతో చదివాను. అవి కవితలు కావు, వెలుగు ముద్దలు. ఒక అవధూత మనకోసం వెలిగించి పెట్టిన ఆరని దీపాలు. వాటిలోంచి రెండు మూడు కవితలు మీకోసం:

## ప్రభూ, నువ్వు ప్రేమతో

ప్రభూ, ఇవాళ, నువ్వు ప్రేమతో నాకు నా నిజస్థితి
ఎరుకపరుస్తున్నప్పుడు
ఇవాళే తెలుసుకున్నాను నేను,
తొలినుంచీ నా మదిలో నెలకొన్న నువ్వెవరో, నిజంగా, నువ్వెవరో.

నువ్వు ముందే చెప్పావు నాకు
ఈ కులాలూ మతాలూ అనే వీథుల్లో పోగుపడ్డదంతా
వట్టి చెత్త అనీ
నిరర్థకమనీ.

ఇప్పటికి చేరుకున్నాన్నేను సమరస శుద్ధ సన్మార్గానికి,
నిజంగా చదువుకున్నవాళ్ళు దేన్ని దర్శిస్తున్నారో, స్తుతిస్తున్నారో ఆ సత్యానికి.
సత్యజ్ఞాన సభ అంటే ఎలా ఉంటుందో నేనిప్పుడు చూడగలుగుతున్నాను.

ఇప్పుడు నాలో నటరాజు చిదంబర నాట్యం మొదలుపెట్టాడు.
ఆయనొక్కడే సత్యం, నా పతి, నా ప్రాణేశ్వరుడు
సంపూర్ణ అనుగ్రహమూనూ.

నా సంతోషమంటూ ఉంటే అదే, అక్కడే.

## అదొక మహానంద జాగృత స్థితి

అదొక మహానంద జాగృత స్థితి
ఆ ఎరుకలో, ఆ మెలకువలో నేనొక్కణ్ణే.
స్వప్నం లాంటి ఆ సంతోషస్థితిని నేనందుకున్నాను
పరిపూర్ణ సుషుప్తిలాంటి ఆ శుద్ధసత్యాన్ని నేను చేరుకున్నాను.

మెలకువ, కల, నిద్రల్ని దాటిన నాలుగవ స్థితిలో
నేనొక మహానుగ్రహాన్ని చవిచూసి
ఆ నాలుగవ అంతస్తుకూడా దాటి పైకిచేరాను.

అక్కడేముందో అదే నేనుగా మారిపోయాను
పుట్టుకలేని స్థితిని చేరుకున్నాను.
అస్తిగా, నాస్తిగా మారాను, సంపూర్ణసత్యాన్నయ్యాను
సాక్షాత్తూ శివస్వరూపుణ్ణయ్యాను.

సత్యజ్ఞాన సభాపతి సాన్నిధ్యసుఖం చవిచూడటంతో
నా సఖుడా,
ఇదిగో నేనిక్కడ నీతో కలిసి ఉన్నాను.

## తండ్రీ, నా కోరిక ఇదే

తండ్రీ నా కోరిక ఇదే,
నేనొక సమరస శుద్ధ సన్మార్గాన్ని స్థాపించాలి
ఆ దారి మొత్తం దేవుడిలాంటి మనుషుల్తో నిండిపోవాలి.

వాళ్ళతో కలిసి గడపాలి,
అట్లాంటి మంచి మనుషుల సమాజంతో
నేనొక దేవాలయాన్ని పైకెత్తాలి
నిర్మలత్వం వెల్లివిరిసే
ఆ దేవాలయం కలకాలం వర్ధిల్లాలి.

అక్కడ కూడుకున్న ఆ మనుషుల మధ్య
ప్రభూ, నా సర్వాంగాలూ పరవశించేలాగా
ఇదిగో, ఈ నీ దాసానుదాసుడు
నిన్ను కీర్తిస్తూ పాటలు పాడాలి.
మైమరచి నాట్యం చేయాలి.

# నిజమైన సత్యాగ్రాహికి నిలువెత్తు ఉదాహరణ

**మ**రుదూరు నుంచి చిదంబరం పదిహేను కిలోమీటర్ల దూరంలోనే ఉందని తెలిసాక చిదంబరం మీంచే విల్లుపురానికి తిరుగుప్రయాణమయ్యాం. అనుకోకుండానే చిదంబరంలో మరోసారి అడుగుపెడుతున్నాను, ఇంకా చూడవలసినవి ఏమున్నాయా అని ఆలోచిస్తుంటే, నందనార్ గుర్తొచ్చాడు.

భక్త నందనార్.

అరవై ముగ్గురు నాయనార్లలోనూ ప్రజల హృదయాల్ని నందనారు గెల్చుకున్నంతగా మరే భక్తుడూ గెల్చుకోలేదని ప్రేమా నందకుమార్ రాసారు. అందులో అతిశయోక్తి లేదు.

శివభక్తుల కథలన్నిటిలోనూ నందనార్ కథ ఇప్పటికీ అత్యంత ప్రభావశీలంగానూ, స్ఫూర్తిదాయకంగానూ, వివాదాస్పదంగానూ తమిళ ప్రజని స్పందింపచేస్తూనే ఉంది. కథలుగా, పాటలుగా, నాటకాలుగా, నవలలుగా, సినిమాలుగా ఎంత చెప్పుకున్నా, ఆ కథలో ఇంకా ఏదో మిగిలే ఉంది. సామాజిక అంతరంగాన్ని ఇంకా ఏదో ప్రశ్నిస్తూనే ఉంది. నిప్పుల్లో కడుక్కున్నా కూడా ఇంకా ప్రక్షాళితం కాకుండా ఏదో అపరాధం జాతి అంతరంగాన్ని కలచివేస్తూనే ఉంది.

నందనారు పులయరు లేదా పరయరుగా పుట్టాడు. అది అప్పటి సామాజిక వ్యవస్థ ప్రకారం 'అస్పృశ్య' కులం. ఆయన చిన్నప్పణ్ణుంచీ శివభక్తుడు. శివభక్తుల కథలు విని పరవశించేవాడు. కాని అప్పటి సమాజపు కట్టుబాట్ల వల్ల దేవాలయంలో అడుగుపెట్టడానికి అవకాశం లేనివాడు. ఆయనది తంజావూరు దగ్గర ఆదనూరు. పెద్దయ్యాక, ఒకసారి, తిరుపుంగూరులో ఉన్న శివలోకనాథారు గుడికి వెళ్ళి శివదర్శనం చేసుకోవాలనుకున్నాడు. గుడిలో అడుగుపెట్టడానికి కుదరదు. గుడి బయట నుంచే దర్శనం చేసుకుందామనుకుంటే, నంది అడ్డంగా ఉంది. కాని శివదర్శనం కోసం తపిస్తున్న ఆయన హృదయస్పందనం విని ఆ రాతినంది పక్కకి జరిగిందట. అట్లా

తలపక్కకు తిప్పి అతడికి దర్శనానికి జాగా వదిలిపెట్టిన ఆ నందీశ్వరుణ్ణి ఇప్పటికీ తిరుపుంగూరు దేవాలయంలో చూడవచ్చని చెప్తారు.

కాని నందనారు దృష్టి చిదంబరం మీద ఉంది. తిల్లై కనక సభలో ఆ నటరాజ నృత్యం చూడాలని ఆయన మనసు ఒకటే కొట్టుకుపోతూ ఉంది. ఆయన ఒక భూస్వామి దగ్గర పాలేరుగాపనిచేస్తూండేవాడు. బండెడు పని. చిదంబరం పోడానికి చేత చిల్లిగవ్వ లేదు. కాని, ఆ దర్శనాకాంక్ష ఆయన్ని నిలవనివ్వలేదు. ఒకరాత్రి అతడికి నిద్రపట్టలేదు. రేపెట్లాగేనా చిదంబరం పోయి తీరతాను ('నాలై పోవం') అనుకున్నాడు. మర్నాడు చిదంబరంలో అడుగుపెట్టాడుగాని, గుళ్ళో అడుగుపెట్టలేకపోయాడు. అతడు గుళ్ళో అడుగుపెట్టాలంటే ముందు తనని తాను నిప్పుల్తో శుద్ధిపరుచుకోవాలంది సనాతన సమాజం. ఒకప్పుడు సీత ఎదుర్కొన్నట్టే ఇప్పుడు నందనార్ కూడా అగ్నిపరీక్ష ఎదురుకోవలసి వచ్చింది. ఊరు బయట చెరువు దగ్గర గుండం రగిలించారు. అందులో నందనార్‌ని అడుగుపెట్టమన్నారు. అతడి కళ్ళముందు చిదంబర కనకసభాపతి నాట్యం చేస్తూ కనిపిస్తున్నాడు. ఆ పొన్నంబళం దేవాలయంలో ఆ నటరాజమూర్తిని కళ్ళారా చూడాలన్న ఒకే ఒక్క తపనతో నందనార్ ఆ మంటల్లో అడుగుపెట్టాడు.

భారతీయ భక్తి కవి పరంపరలో మరెక్కడా ఇటువంటి హృదయవిదారకమైన సంఘటన మరొకటి కనిపించదు. నందనార్ కవి కాడు. ఆయన పేరుమీద పన్నెండు తిరుమురైల్లోనూ ఒక్క కవితకూడా లేదు. కాని శివదర్శన కాంక్షతో అంతగా నిలువెల్లా దహించుకుపోయిన మరొక కవి, భక్తుడు, భావుకుడు మరొకరెవరూ మనకు కనిపించరు. 'రేపు చిదంబరం వెళ్తాను' అనుకున్న ఆ భక్తుడు చిదంబరం దేవళంలో ఇప్పటికీ అడుగుపెట్టలేకపోయాడు. అందుకని ఆయన 'నాలై పోవారు' (రేపు వెళ్ళేవాడు) గా, 'తిరునాలైపోవారు నాయనారు' గా జన స్మృతిలో నిలిచిపోయాడు.

నందనార్ స్వయంగా అగ్నిలో అడుగుపెట్టలేదనీ, అప్పటి సనాతన సమాజం ఆయన్ని సజీవదహనం చేసిందనీ కొందరంటారు. కానీ నందనారు గురించి మనకు లభిస్తున్న ప్రస్తావనల్లో అన్నిటికన్నా మొదటిదైన సుందరమూర్తి 'తిరుత్తొండ తొగై' లో అసలు అటువంటి ప్రస్తావనే లేదు కాబట్టి, అదంతా తర్వాతి రోజుల్లో ప్రాచుర్యానికి వచ్చిన కట్టుకథ అని కూడా కొందరు వాదిస్తారు. ఏమైనప్పటికీ, ఇప్పుడు మన కాలంలోనే మన కళ్ళ ఎదటనే దళితుల సజీవదహనాలు చూస్తున్న మనకు, ఏడెనిమిది శతాబ్దాల రోజుల్లో, గుళ్ళో అడుగుపెట్టబోయిన ఒక 'అస్పృశ్యుణ్ణి' అప్పటి సమాజం సజీవదహనం చేసిందంటే ఆశ్చర్యమేమీ కలగదు.

ఆ రోజు చిదంబరంలో నందనార్ చెరువు, నందనార్ మంటపం వెతుక్కుంటూ పోయేము. ఆయన జీవితకాలంలోలానే ఇప్పుడు కూడా ఆయన ఊరిబయటే

ఉంటున్నట్టుగా ఆ దేవాలయం ఊరి బయటనే ఉంది. ఆ మందిరాన్ని జాతీయోద్యమ కాలంలో ఒక సంఘసేవకుడు ముందుకొచ్చి నిర్మించాడు. ఆ మందిర నిర్మాణానికి పునాది తవ్వుతున్నప్పుడు, ఆ ప్రాంతంలో మహాత్మా గాంధీ పర్యటనలో ఉన్నారనీ, ఆ మందిరనిర్మాణానికి ఆయనే మొదటి ఇటుక వేసారనీ అక్కడ చెప్పారు.

ఆ మందిరంలో నందనారీశ్వరుడు కొలువై ఉన్నాడు. ఒక దళితుడే అక్కడ పూజారిగా ఉన్నాడు. ఆ మందిరం కూడా ఒక దళితవాడలాగా నిరుపేదగా కనిపిస్తున్నది. చిదంబరానికి వరదలాగా పోటెత్తే భక్తజన సమూహానికి అక్కడ అటువంటి మందిరం ఒకటుందని తెలియకపోవడం కూడా కారణం కావచ్చు.

ఆ మందిరానికి దగ్గరలోనే రోడ్డుకు అటువైపు ఎండిపోయిన, పాడుపడ్డ చెరువు ఒకటి కనిపిస్తూ ఉంది. అక్కడే నందనారు అగ్నిపరీక్షను ఎదుర్కొన్నాడని చెప్పారు అక్కడివాళ్ళు. నేనా చెరువుకేసి కొంతసేపట్లా చూస్తూండిపోయాను.

ఆ అగ్నిపరీక్ష ఎదుర్కొన్నది నందనారు మాత్రమే కాదు. హిందూ మతంలోని అత్యున్నత ఆదర్శాలు, భావాలు, గ్రంథాలు, ఆశయాలు అన్నీ కూడా ఆరోజు నుంచి ఈ రోజుదాకా అగ్నిపరీక్షకు నిలబడకతప్పటం లేదు. 'ఈశావాస్యమిదం సర్వం' అని చెప్పుకున్న జాతి తోటిమనిషి పట్ల అంత అమానుషత్వాన్ని ఎలా చూపించగల్గిందనే ప్రశ్న నన్నెప్పటికీ వదలదు.

హిందూ సమాజాన్ని అట్లా నిగ్గుదీసి అడిగే నిలువెత్తు ప్రశ్నగా మారడంలోనే నందనారు జీవితసాఫల్యం ఉంది. అందుకనే అంబేద్కరు తాను రాసిన The Untouchables (1948) గ్రంథాన్ని రవిదాసు, చోఖామేళులతో సహా నందనారుకి కూడా అంకితమిచ్చాడు. ఆ ముగ్గురిలోనూ ఆయన మొదట నందనారునే స్మరించాడు.

మరొకవైపు మహాత్మాగాంధీకి నిజమైన సత్యాగ్రహికి నిలువెత్తు ఉదాహరణగా నందనారు కనబడ్డాడు. ఆయనిట్లా రాసాడు:

> 'తన ఇష్టాన్ని అందుకోడానికి నందుడు ప్రతి ఒక్క అడ్డుగోడని బద్దలు కొట్టాడు. గుండెలు బాదుకుంటూ కాదు, పొలికేకలు పెడుతూ కాదు. అత్యంత విశుద్ధమైన ఆత్మార్పణతో ఆయన స్వాతంత్ర్యం సాధించుకున్నాడు. తనని వేధిస్తున్నవాళ్ళు, హింసిస్తున్నవాళ్ళు సిగ్గుపడేలా, కేవలం తన ప్రార్థనలతో, తన నిర్మల వ్యక్తిత్వంతో.. తన భక్తితో ఆయన నేరుగా ఈశ్వరుణ్ణే భూమిమీదకు దింపగలిగాడు. తనని బాధిస్తున్నవాళ్ళకి కనువిప్పు కాగలిగాడు.'

# కందార్ అనుభూతి

**ఆ**శ్వయుజ పూర్ణిమ. శరత్పూర్ణిమ. సాయంకాలానికి నా పనులన్నీ పూర్తయిపోయాక, ఆ వెన్నెల రాత్రి ఎక్కడకన్నా వెళదామనిపించగానే తిరువణ్ణామలై మదిలో మెదిలింది. విల్లుపురానికి తిరువణ్ణామలై దగ్గరలోనే ఉన్నప్పటికీ అప్పటిదాకా నాకు తిరువణ్ణామలై వెళ్ళాలనే ఆలోచన కలగలేదు. నేనంతకుముందే అరుణాచలం చూసి ఉన్నందున కొత్త ప్రదేశాలేమన్నా చూడాలని అనుకుంటూ వచ్చాను. కాని ఆ పున్నమి రాత్రి అరుణాచల గిరిప్రదక్షిణ చెయ్యాలనిపించి వెంటనే తిరువణ్ణామలై బయల్దేరాం.

తిరువణ్ణామలై వెళ్ళగానే ముందు నన్ను నేరుగా అరుణాచలేశ్వరుడి సన్నిధికి తీసుకువెళ్ళిపోయారు. 'మనం గిరి ప్రదక్షిణ చేద్దామనుకున్నాం కదా' అన్నాను నారాయణమూర్తితో. 'ఈరోజు పదిహేను లక్షల మంది భక్తులున్నారిక్కడ' అన్నారు అక్కడి వాళ్ళు. 'గిరిప్రదక్షిణ అలా వుంచి, రమణాశ్రమం దాకా కూడా మనం పోలేం. ఇసుక వేస్తే రాలనంత మంది జనం. అడుగు తీసి అడుగు వెయ్యడం కూడా కష్టం' అన్నారు అక్కడ మా కోసం ఎదురు చూస్తున్న సిబ్బంది.

ఆ వెన్నెల రాత్రి అరుణగిరి చుట్టూ తిరగలేకపోయాను గాని, అరుణాచలేశ్వర, అపీత కుచాంబల అద్భుతమైన దర్శనం లభించింది నాకు. మాణిక్యవాచకర్ నుండి రమణమహర్షి దాకా శివకవులంతా ఎవరి అనుగ్రహం కోసం పరితపించారో, ఎవరి వైభవాన్ని నోరారా గానం చేసారో ఆ స్వామి కడగంటి చూపు నా మీద కూడా ప్రసరించింది ఆనాడు అనిపించింది.

దర్శనమయ్యాక బయటికి వచ్చి ఆ దేవాలయ ప్రాంగణంలో నడుస్తుంటే ఎదురుగా అరుణాచలేశ్వర దేవాలయ రాజగోపురం మీద పూర్ణచంద్రుడు గగనదీపంలాగా ప్రకాశిస్తూ ఉన్నాడు. 'అదిగో, ఆ గోపురం మీంచే అరుణగిరినాథార్ దూకబోయింది. అక్కడే ఆయన్ని మురుగన్ కాపాడింది' అన్నారు నాతో ఉన్నవాళ్ళు. అరుణగిరినాథుల సన్నిధి కూడా ఆ దేవాలయ ప్రాంగణంలోనే ఉందిగాని, ఆ భక్తజనసమ్మర్దంలో అక్కడికి పోవడం కూడా అసాధ్యమనే అనిపించింది.

తిరిగి ఆ రాత్రే మళ్ళా విల్లుపురానికి పయనమయ్యాం. పగలంతా కురిసి పడెలు కట్టిన వాననీళ్ళమీద పూర్ణ చంద్రకాంతి వెండి జరీ పరుస్తూ ఉంది. దారిపొడుగునా నా తలపుల్లో అరుణగిరినాథుడే నిండిపోయాడు.

ఆయనది కూడా మన వేమనలాంటి కథ. 15 వ శతాబ్దానికి చెందిన అరుణగిరి నాథుడు తిరువణ్ణామలైలోనే పుట్టాడు. పసిప్రాయంలోనే తండ్రి గతించాడు. తల్లి కూడా అతడి పసిప్రాయంలోనే గతించింది. మిగిలింది అతడి అక్క మాత్రమే. తల్లి చనిపోతూ ఆ పిల్లవాడి బాధ్యత తన కూతురి చేతుల్లో పెట్టి మరీ గతించింది. ఆ అక్క ఆ తమ్ముణ్ణి అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసింది. కాని ఆ పిల్లవాడు యువకుడయ్యాక సుఖలోలుడిగానూ, స్త్రీలోలుడిగానూ తయారయ్యాడు. తల్లిదండ్రులు సమకూర్చిన ఆస్తి మొత్తం తన సుఖాలకీ, స్త్రీవ్యసనానికీ వ్యయపరిచేసాడు. అడ్డూ అదుపూ లేని ఆ వ్యయానికి ఆ అక్క అడ్డుచెప్పలేకపోయింది. చివరికి ఆమెకి కూడా చిల్లిగవ్వ కూడా మిగల్చకుండా అతడు ఉన్నదంతా ఊడ్చేసాడు. కాని, అతని దేహదాహం శమించలేదు. నీళ్ళలాగా ఎంత సంపద పోసినా ధారపోసినా కూడా ఆ శారీరిక కాంక్ష చల్లారలేదు. కాని నిర్ధనుణ్ణి చేరదీసే వేశ్యలెక్కడుంటారు? ఎంత అదుపు చెయ్యాలని చూసినా ఆగని ఆ కామాగ్నిని చల్లార్చడానికి, చివరికి, ఆ సోదరి, ఒకరోజు అతడితో 'తమ్ముడూ, అమ్మకి ఇచ్చిన మాటకోసం నాకున్నదంతా నీకిచ్చేసాను. ఇంక ఇవ్వడానికి నాదగ్గరేమీ మిగల్లేదు. అయినా నీ కోరికలు చల్లారటం లేదు. ఇక నేను చేయగలిగిందొక్కటే, నా దేహాన్ని కూడా నీకప్పగించడం. ఇదిగో, ఈ దేహం నీ కోరికని చల్లార్చగలిగితే అలానే కానివ్వు' అన్నది.

ఆ మాటలు వినగానే ఆ యువకుడి మత్తంతా దిగిపోయింది. అతడికి తానెక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో ఒక్కసారిగా తెలిసి వచ్చింది. అతడికి తన పట్ల తనకి చెప్పలేనంత అసహ్యం కలిగింది. రక్తి మొత్తం ఒక్క క్షణంలో బతుకు పట్ల విరక్తిగా మారిపోయింది. తక్షణమే చచ్చిపోవాలనిపించింది. పరుగు పరుగున అరుణాచల దేవాలయానికి వెళ్ళి అక్కడి రాజగోపురం మీంచి కిందకి దూకేసాడు.

కాని అతడు కిందపడలేదు. మరణించలేదు. అందుకు బదులు ఏవో దివ్యహస్తాలు తనని రెండు చేతుల్తోనూ కాచిపట్టుకున్నట్టుగా గ్రహించాడు. అవి తమిళదేశ ప్రియభగవానుడు మురుగన్ హస్తాలని స్ఫురించిందతడికి. అంతే, ఆ తర్వాత జీవితం మొత్తం మురుగన్ మహిమని స్తుతించడానికే అంకితం చేసేసాడు. నాయనార్లు శివక్షేత్రాల్ని సందర్శించి పాటలు పాడినట్టుగా, తిరుమంగై ఆళ్వారు దివ్యదేశాలు సందర్శించి పాశురాలు కూర్చినట్లుగా అరుణగిరినాథార్ తమిళదేశంలోని మురుగన్ దివ్యక్షేత్రాలన్నీ

సందర్శించి సుబ్రహ్మణ్యస్వామి మీద సంకీర్తనలు ఆలపించాడు. కేవలం పాటలు కూర్చడమే కాక వాటికి రాగతాళాలు కూడా నిర్దేశించుకున్నాడు. అట్లా పదహారువేల పాటలు కట్టాడంటారుగాని, ఇప్పుడు దాదాపు రెండు వేల కీర్తనలదాకా మనకి లభ్యమవు తున్నాయి. 'తిరుప్పుగళ్' (శ్రీవైభవగీతాలు) అని పేరుపొందిన ఆ గీతసముచ్చయం మురుగన్ సాహిత్యంలో తలమానికంగా చెప్పదగ్గది. మధ్యయుగాల తమిళ సాహిత్యంలో మేలిమి కృతిగా పరిగణన పొందుతున్నది. తమిళ భక్తి వాఙ్మయంలో అరవై ముగ్గురు నాయనార్లు, పన్నిద్దరు ఆళ్వార్లు, మాణిక్యవాచకర్‌లతో సమానంగా అరుణగిరినాథులకు స్థానం సముపార్జించిపెట్టినటువంటిది.

తిరుప్పుగళ్ పూర్తిగా ఇంగ్లీషులోకి ఇంకా రావలసి ఉంది. కాని అక్కడక్కడ లభ్యమవుతున్న కొన్ని అనువాదాల్ని బట్టి చూసినా కూడా ఆ సంగీతం, ఆ భావుకత్వం, ఆ హృదయావేగం మనకి సూచనమాత్రంగానైనా స్ఫురించకపోవు. ఉదాహరణకి, శీర్కాళిలో కొలువైన సుబ్రహ్మణ్య స్వామిని స్తుతించే ఈ కవిత చూడండి:

**పున్నమి వెన్నెల, చల్లని కమ్మతెమ్మెర**
**ఈ సాయంకాలం ఒక యవ్వనవతిలాగా ఒంటరిగా ఉంది.**
**నువ్వేమో శంఖాలు రాశులుగాపోసి సముద్రాన్ని**
**మసకచీకటిగా మార్చగలవాడివి.**
**నీ దండాయుధం విషపూరితం**
**నీ పోరాటం అమోఘం.**

**నా ముందు కాలంలో సంగకవులకి**
**అమృతవాక్కు అనుగ్రహించినవాడివి.**
**సీర్కాళిలో నెలకొన్న సుబ్బరాయుడా**
**తండ్రీ, నన్ను కూడా అనుగ్రహించు.**

అరుణగిరినాథుల సాహిత్యంలో తిరుప్పుగళ్ ఎంత సుప్రసిద్ధమో, ఆయన రాసిన 'కందార్ అనుభూతి' అనే చిన్న పద్యసంపుటి కూడా అంతే జగత్ప్రసిద్ధం. కేవలం 51 పద్యాలతో కూడుకున్న ఈ చిన్ని స్తోత్రం తమిళ ఆధ్యాత్మిక సాహిత్యంలో విలువకట్టలేని రత్నంగా విరాజిల్లుతూ ఉంది. రమణ మహర్షి సంభాషణల్లో పదే పదే ప్రస్తావనకి వచ్చే ఈ పద్యసంపుటి ఇంగ్లీషు అనువాదాలు మనకి విస్తారంగా లభ్యమవుతున్నాయి. ఆ పద్యాల్లో ఉన్నది కేవలం వర్ణనలూ, స్తుతులూ మాత్రమే కాదు. గాఢమైన ఆధ్యాత్మిక అనుభవాల పేటిక అది. అసలు ఆ శీర్షికనే చూడండి.

'కందార్ అనుభూతి'!

స్కందానుభూతి. అంటే భగవంతుడు అనుభవంలోకి రావడమన్నమాట. ప్రపంచ సాహిత్యంలో ఇంత భావస్ఫోరకమైన పదబంధం ఇప్పటిదాకా మరొకచోట ఎక్కడా నాకు కనిపించలేదు. కందార్ అనుభూతి నుంచి రెండు, మూడు కవితలు:

**మన ప్రభువు, మన గురువు**

1

**కఠిన శిలని కూడా కరిగించే**
**అనుగ్రహం ఆయనది. అయిదు**
**చేతుల, ఆరుముఖాల స్వామికి**
**అంకితం ఈ మధురవాక్యమణిమాల.**

4

**నేలనా? నీళ్ళా? నిప్పునా?గాలినా?నింగినా?**
**ఇంద్రియజ్ఞానమా?నాలుగు వేదాలా?**
**ఏది సత్యం ?మనసా? దేశమా? లేక నేనా**
**లేదూ, నువ్వు నన్ను కరుణించిన క్షణమా?**

13

**ఆ వేలాయుధుడు మన ప్రభువు, మన గురువు.**
**బయటలేదు, లోపల లేదు, అస్తికాదు, నాస్తికాదు**
**వెలుగు కాదు, చీకటిలో లేదు, ఆయన్ని కేవలం**
**ఆయన చూపించే దయతో మాత్రమే గుర్తుపట్టగలం.**

# వానలు కూడా ఉన్నాయి

**త**మిళదేశంలో నేనప్పటిదాకా సంచరించిన తావుల్లో నాయనార్లూ, ఆళ్వారులూ తిరుగాడిన ప్రాంతాలు చూడగలిగాను కాని, సంగకాల కవులు నడయాడిన తావుల్ని చూడలేకపోయానని అనిపిస్తూ ఉండింది.

సంగకాల కవిత్వం క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నుండి క్రీస్తు శకం మూడవ శతాబ్దం దాకా మధురై కేంద్రంగా వికసించిన సాహిత్యం. ఆ కవులు తమిళదేశమంతటా సంచరిస్తూ కవిత్వం చెప్పేవారు. మధురై కేంద్రంగా ఉండే ఒక సాహిత్య సంగం ఆ కవిత్వంలోంచి మేలిమి కవితల్ని ఎంపికచేసి సంకలనాలుగా వెలువరించేది. అట్లా ఒకటి కాదు, రెండు కాదు, ఎనిమిది కవిత్వ సంకలనాలూ, పది దీర్ఘ కవితలూ తమిళ సాహిత్య సంగం సంపుటీకరించింది. అందులో మొత్తం 2381 కవితలు ఉన్నాయి. అవి 473 కవుల, కవయిత్రుల కవితలు. వాళ్ళల్లో 102 మంది వివరాలు ఇప్పటికీ లభ్యం కావడం లేదు. వారు అనామకంగానే మిగిలిపోయారు. ఆ కవిత్వంలో దాదాపు సగం కవిత్వం 16 మంది కవుల రచననే. వాళ్ళందరిలోనూ కూడా కపిలార్ అనే కవి ముందుంటాడు. మొత్తం సంగం కవిత్వంలో దాదాపు పదవ వంతు కవిత్వం అతడు రాసిందే.

సంగకాల కవులు తిరిగిన దారుల్లో తిరగాలంటే నేను ప్రధానంగా పాండ్యనాడులో సంచరించవలసి ఉంటుందని నాకు తెలుసు. కాని నేను మొదటిసారి తిరుక్కోయిలూరు వెళ్ళినప్పుడు, ఆ రాత్రి పెరుమాళ్ళు కోవెల నుంచి తిరిగి వస్తూండగా, దూరంగా మినుకు మినుకు మంటున్న దీపాలు చూపించి, అక్కడ తెన్ పెన్నై నది మధ్య కపిలార్ గుండు ఉందని నారాయణమూర్తి చెప్పిన మాట నాకు గుర్తొచ్చింది. కాబట్టి, మరొకసారి తిరుక్కోయిలూర్ వెళ్ళాలనీ, ఆ కపిలార్ గుండు చూడాలనీ అనుకున్నాను.

ఒక సాయంకాలం కొంత తీరిక చిక్కగానే తిరుక్కోయిలూర్ బయల్దేరాం. నాకు ఆ రోజు తిరుక్కోయిలూర్‌తో పాటు, ఆ దారిలో తపోవనం అనే ఒక ఆశ్రమాన్నీ,

ఆదితిరువరంగంలోని రంగనాథస్వామి ఆలయాన్నీ కూడా మిత్రులు చూపించారు. ఆ మూడు స్థలాలూ కూడా నా మనసుని ఆకట్టుకున్నాయి.

కపిలార్ గుండు అంటే ఒక పెద్ద బండ. ఆ గండశిల తిరుక్కోయిలూరు ఊరిపొలిమేరల్లో, తెన్ పెన్నై నది మధ్య ఉంది. నదిలో నీళ్ళు పెద్దగా లేకపోడంతో ఆ బండదాకా వెళ్ళడానికి వీలుంది. ఆ గండశిల మీద చిన్న మందిరంలాంటి గుడి ఉంది. అది పురావస్తు శాఖవారి అధీనంలోకి తీసుకున్నట్టుగా తెలిపే ఒక బోర్డు కూడా ఉంది. ఆ బండ పైకి వెళ్ళడానికి మెట్లు కూడా ఉన్నాయి. మేమా బండ ఎక్కి చుట్టూ చూసేటప్పటికి దూరంగా అరుణాచల పర్వత శిఖరం కనిపిస్తూ ఉంది. నీలమూ, నారింజా కలిసిన సాయం సంధ్యలో పెద్ద కారుమబ్బు ఒకటి ఆకాశమంతా ఆక్రమిస్తూ ఉంది. మరొకవైపు దూరంగా అరయని నల్లూరు శివాలయ గోపురం గంభీరంగానూ, కాలాతీతమైన ఒక అస్తిత్వ శోభతోనూ కనిపిస్తూ ఉంది.

నేనా బండమీద కొంతసేపు మౌనంగా నిలబడిపోయేను. ఆ స్థలం ఏదైనా పాశ్చాత్య దేశంలో ఉండిఉంటే, ఈపాటికి ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులంతా అక్కడ గుమికూడుతూ ఉండేవారు. అదే స్థలం చైనాలో ఉండి ఉంటే, కనీసం రెండు రాష్ట్రాలు ఆ స్థలం మాదంటే మాదని న్యాయస్థానాలకి ఎక్కి ఉండేవారు. కాని, తమ సాహిత్య వారసత్వాన్ని చూసుకుని అంతగా గర్వించే తమిళులు కూడా ఆ స్థలానికి ఇవ్వవలసిన ప్రాముఖ్యం ఇవ్వట్లేదనే అనిపించింది.

అది నిజంగా ఎంతో అరుదైన చారిత్రిక స్థలం. అక్కడ దాదాపు రెండువేల ఏళ్ళ కిందట, సంగకాలపు మహాకవి కపిలార్ ప్రాయోపవేశానికి పూనుకున్నాడు. ప్రాచీన తమిళ సంస్కృతిలో అట్లాంటి ప్రాయోపవేశాన్ని 'వడక్కిరుట్టల్' అంటారు. అంటే జీవితంలో గొప్ప ఖేదానికి లోనై, జీవితం పట్ల పూర్తి విరక్తి చెందినవాళ్ళు అట్లా ఏదేనా ఒక స్థలంలో ఉత్తరదిక్కుని చూస్తూ నిద్రాహారాలు పరిత్యజించి ప్రాణం పోయేదాకా ఎదురుచూడటం అన్నమాట. ఒకరకంగా అది జైనుల సల్లేఖనం లాంటిది. రెండు సహస్రాబ్దాల కిందట, కపిలార్ ఆ బండ మీద కూచుని ఉత్తర దిక్కు చూస్తూ అన్నపానాలు వదిలిపెట్టి ప్రాణాలు త్యజించాడు.

ఎందుకని? దాని వెనక ఒక కథ ఉంది.

ఆ కథ వట్టి కథ కాదు. అది చరిత్ర. కపిలార్ పుట్టడం పాండ్యదేశంలోనే పుట్టాడు. కొన్నాళ్ళు మధురై లో పాండ్య రాజు కొలువులో ఉన్నాడు. అక్కడే అతడు వేల్ పారి అనే రాజు గురించి విన్నాడు. పారి, పరంబునాడు అనే, ఒక గిరిదుర్గానికి అధిపతి. తన కాలంలో అంత వదాన్యుడూ, ఉదాత్తుడూ అయిన మరొక రాజుని కపిలార్

చూడలేదు. అనతికాలంలోనే వాళ్ళిద్దరూ ప్రాణమిత్రులుగా మారిపోయారు. కాని వేల్ పారి ప్రసిద్ధి చోళ, చేర, పాండ్య రాజ్యాలు మూడింటికీ అసూయ పుట్టించింది. వారు పారి మీద యుద్ధం ప్రకటించారు. పారి లొంగలేదు. ఆ గిరిదుర్గం కొన్నేళ్ళ పాటు శత్రుసైన్యాల ముట్టడిలో గడిపింది. తినడానికి తిండి కూడా లేకుండా పారి, అతడి అనుచరులూ అల్లల్లాడిపోయేరు. కాని పారి లొంగలేదు. చివరికి, అతడి మనుషుల్ని లోబరుచుకుని, మాయోపాయంతో, ఆ మూడు రాజ్యాలూ పరంబునాడుని వశపర్చుకున్నాయి. పారి మరణించాడు.

తన జీవితకాలంలో తాను చూసిన ఒక ధీరోదాత్తుడు అట్లా మరణించడం కలిగించిన దుఃఖంతో పాటు కపిలార్‌కి మరొక వ్యథ కూడా పట్టుకుంది. పారీ కుమార్తెలు ఇద్దరు, అంగవై, సంగవై. వాళ్ళకి సంరక్షకుడిగా కపిలార్ వాళ్ళకి తగిన వరుడి కోసం ప్రతి రాజకుటుంబం తలుపు తట్టాడు. కానీ, ఆ కన్యల్ని స్వీకరించడానికి ఎవరూ ముందుకు రాలేదు. తన మిత్రుడి ఋణం తాను తీర్చుకోలేకపోతున్నానన్న బాధ కపిలార్‌ను దహించడం మొదలుపెట్టింది. చివరికి అతడు ఆ ఇద్దరు కన్యల్నీ అవ్వయ్యార్‌కి అప్పగించి, భరించలేని శోకంతోనూ, బరువెక్కిన గుండెతోనూ ప్రాణత్యాగానికి పూనుకున్నాడు. ఆ తర్వాత అవ్వయ్యారు ఆ యువతులకి తగిన వరుణ్ణి చూసి పెళ్ళి చేసింది. కాని, అప్పటికే కపిలార్ ఈ లోకం నుంచి నిష్క్రమించాడు.

సంగకాలపు కవిత్వ సంపుటాల్లో ఒకటైన పురనానూరులో 105 నుంచి 124 దాకా కపిలార్ ఈ కథంతా కళ్లకు కట్టేట్టు చెప్పుకొస్తాడు. ఆ మొత్తం ఇరవై కవితలూ చదివేటప్పటికి మనకొక ఇతిహాసం చదివినంత స్ఫూర్తి కలుగుతుంది. ఆ కవితలు మొదలుపెడుతూనే కపిలార్ పారిని దాదాపు దేవతలతో సమానమైన వదాన్యుడిగా పరిచయం చేస్తాడు. బహుశా ఔదార్యంలో పారి కి సాటి రాగలది ఒక్క వర్షం మాత్రమే అని అతడు చెప్పిన వాక్యం సుప్రసిద్ధం. ఆ కవిత ఇలా సాగుతుంది:

> **'పారి' 'పారి' అంటాయి ఆ కంఠాలు ఎలుగెత్తి.**
> **ఆ ఒకే ఒక్కడి అనేక సుగుణాల్ని గానం చేస్తుంటాయి.**
> **కాని, వదాన్యతకి పారి ఒక్కడే ఉదాహరణ కాదు,**
> **అకారణంగా వర్షించే వానలు కూడా ఉన్నాయి.**

'వానలు కూడా ఉన్నాయి' అని చెప్పే ఈ వాక్యం మనల్ని ఎంత వెంటాడుతుందంటే, కపిలార్ మొత్తం కవిత్వాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన నాజిర్ అలీ అనే భావుకుడు తన పుస్తకానికి There is also Rain (అథర్ ప్రెస్, 2015) అని పేరుపెట్టేటంత.

పారి ఔదార్యం గురించి చాలా కథలు ప్రచారంలో ఉన్నాయి. ఒకరోజు అతడు తన రథం మీద అడవిలో ప్రయాణిస్తున్నాడట. ఇంతలో అతడికి దాహం వేసింది. రథాన్ని బాట పక్కన ఆపి, దగ్గరలో ఉన్న సెలయేటిదగ్గరికి వెళ్ళి దోసిళ్ళతో ఆ నీళ్ళు తాగి ఒకింత సేదదీరి తన రథం దగ్గరకి వచ్చాడట. ఇంతలో ఆ బాట పక్కన ఉన్న ఒక అడవిమల్లెతీగ ఆ రథం మీద సోలిపోయి కనిపించిందట. దాని నులితీగలు ఆ రథాన్ని అల్లుకోడానికి ముందుకు వాలుతున్నాయట. ఆ దృశ్యం చూసిన పారి ఆ మల్లెతీగనుంచి తన రథాన్ని పక్కకు తప్పించడానికి ఇష్టపడక, ఆ రథాన్ని ఆ అడవి తీగ కోసం వదిలిపెట్టేసి వచ్చేసాడట.

'ఎదురైనచో తన మదకరీంద్రము డిగ్గి కేలూత యొసగి ఎక్కించుకొనియె' అని పెద్దన్న కృష్ణరాయల్ని కీర్తించాడని మనం ఎంతో సంతోషంగా చెప్పుకుంటాం. తన మిత్రుడి మీద చాంద్ బర్దాయి రాసిన 'పృథ్వీరాజ్ రాసో' ని తలుచుకుంటే చాలు హిందీ సాహిత్యాభిమానులకి ఒడలు పులకిస్తుంది. కాని, ఒక రాజు కోసం ఒక కవి ప్రాణత్యాగం చేసిన ఈ అపూర్వ సంఘటన గురించి తక్కిన భారతదేశానికి ఏమీ తెలియదు.

ఏ కవి అయినా తన జీవితకాలం పాటు ఒక ఆదర్శమానవుణ్ణి వెతుక్కుంటూ ఉంటాడు. వాల్మీకినుంచి రూమీ దాకా ప్రతి కవీ వెతుక్కునేది నిజమైన ఒక మనిషినే. అట్లాంటిది, నిజంగానే పారిలాంటి ఒక సహృదయుడి స్నేహం లభించాక కపిలార్ మహాకవి కాకుండా ఎలా ఉంటాడు?

ఒకప్పుడు మా హీరాలాల్ మాష్టారు హిందీ సాహిత్యం గురించి చెప్తూ, తక్కిన హిందీ సాహిత్యమంతా అదృశ్యమైపోయినా, ఒక్క 'కామాయని' మిగిలితే చాలు, ఆ సాహిత్యాన్ని సర్వోన్నత సాహిత్యాల్లో ఒకటని చెప్పుకోడానికి అన్నారు. ఆ మాట కపిలార్ గురించి కూడా చెప్పుకోవచ్చు. మొత్తం తమిళ సాహిత్యం, తమిళ భక్తి సాహిత్యమంతా కనిపించకుండా పోయినా, కపిలార్ పేరుమీద లభ్యమవుతున్న 235 కవితలు మటుకే మిగిలినా కూడా, ఆ సాహిత్యం ప్రపంచ సాహిత్యాల్లో శ్రేష్ఠ సాహిత్యాల సరసన చేర్చదగ్గదని మనం గుర్తుపట్టగలం.

అతడు సంగం సాహిత్య సంప్రదాయాలు, 'అకం', 'పురం' రెండింటిలోనూ సమానమైన ప్రావీణ్యాన్ని కనపరిచాడు. సంగం సాహిత్యంలో అకం ప్రేమకవిత్వం. అక్కడ నాయికా నాయికలకు పేర్లు ఉండవు. వారి ప్రణయావస్థల చిత్రణ మాత్రమే ఉంటుంది. పురం ప్రధానంగా పౌరజీవిత కవిత్వం. రాజ్యం, యుద్ధం, క్షామం, దానం, దేశం లాంటి సామాజిక అంశాల చుట్టూ తిరిగే కవిత్వం. అక్కడ మనుషులు ముఖ్యంగా

రాజులు వారి వారి ఊళ్ళతోనూ, పేర్లతోనూ కనిపిస్తారు. అకం సంప్రదాయంలో కపిలార్ రాసిన కవితలు కుసుమపేశలాలు. ముఖ్యంగా అతడిది కురింజి పూల పాదు.

కురింజి ప్రణయావస్థను వర్ణిస్తూ అతడు రాసిన 'కురింజిపాట్టు' అతడి రచనలన్నిటిలోనూ సర్వోత్కృష్టమైన రచనగా గుర్తింపు పొందింది. 261 పంక్తుల ఆ దీర్ఘ కవిత చదివితే మనకి సంగం కాలం నాటి శాకుంతలనాటకం చదివినట్టు ఉంటుంది. నీటిరంగుల చిత్రలేఖనాల్లో ప్రాచీన తమిళదేశాన్ని చిత్రించినట్టు ఉంటుంది. ఆ కావ్యాన్ని అతడు తన తమిళ దేశాన్నీ, వనాల్నీ, పూలనీ, పక్షుల్నీ, ప్రణయసంస్కారాన్నీ ఒక రాజుకి పరిచయం చేయడం కోసం రాసాడని చెప్తారు. ఆ కావ్యంలోంచి కొన్ని పంక్తులు :

### అతగాడి కొండదేశంలో

**అతగాడి కొండదేశంలో**
**పండిన మిరియపు గింజలు వెదజల్లిపడి ఉంటాయి.**
**పెద్ద పెద్ద కొండమామిడి చెట్లమీంచి**
**మామిడి పండ్లు ఊటనీళ్ళల్లో రాలిపడుతుంటాయి.**
**బండరాళ్ళమధ్య పారుతున్న ఏటినీళ్ళల్లో**
**మిగలముగ్గిన పనసపళ్ళు రాలి పడి**
**నీళ్ళు కల్లుగా మారిపోతుంటాయి.**

**వాటిని నీళ్ళనుకుని రుచిచూసిన నెమలి**
**మత్తెక్కి ఎట్లా తడబడుతుందంటే**
**అచ్చంగా పల్లెల్లో తిరణాళ్ళల్లో**
**గడమీద నాట్యంచేసే దొమ్మరిసాని గుర్తొస్తుంది. (186-199)**

### మామీద అట్లా ప్రేమ చూపిన ఆ మొనగాడు

**మామీద అట్లా ప్రేమ చూపిన ఆ మొనగాడు**
**సాహసి, వీరుడు, విజేత.**

**మా మనసుల్లో తడబడుతున్న తలపుల్ని**
**చదివినవాడల్లే అతడు**
**మాతో పెళ్ళి గురించి మాట్లాడేడు.**
**పండగలప్పుడు తన ఇంటి తలుపు ఎప్పుడూ**

**తెరిచే ఉంటుందని చెప్పాడు.**
**అతిథుల సంతోషంతో తన ఇల్లు**
**సదా కలకల్లాడుతుందన్నాడు.**
**నేయిగారే ఆ అన్నం తినని వాడు లేదన్నాడు.**

**'సుభగీ, నువ్వు నా ఇంట్లో అన్నం వండి**
**నలుగురికీ వడ్డిస్తావు,**
**చుట్టాలు,స్నేహితులు నలుగురూ**
**సంతోషంతో విందారగించాక**
**మిగిలిందేదో మనిద్దరం కలిసి తింటాం.**
**మన ప్రేమనొక తెప్పగా మార్చుకుని**
**జీవితపు అవతలి ఒడ్డుకి కలిసి పయనిద్దాం'**
**అన్నాడతడు.** (199-208)

కపిలార్ పూలని ప్రేమించాడు. స్నేహితుణ్ణి ప్రేమించాడు. సంతోషం చూసాడు. యుద్ధం చూసాడు. పరాజయం చూసాడు. అవమానం, పరిత్యాగం, నిస్సహాయతల్ని కూడా నిశ్శేషంగా రుచి చూసాడు. ఏ విధంగా చూసినా అతడు పూర్ణమానవుడు, పూర్ణకవి.

అతడి కవిత్వం నుంచి మరి రెండు మూడు ఉదాహరణ లివ్వకుండా ఈ రచన ముగించలేను.

## అకం

### 1

**ఏనుగు గోరాడినట్టుగా ఉంది**
**వానవెలిసాక, ఆ బండరాయి .**
**ఆ రాతిపక్కన అతడు**
**నాతో కూడిగడిపాక**
**నాకెట్లాంటి జ్వరం పట్టుకుందంటే**
**నీలికలువల్లాంటి నా కళ్ళు**
**పాలిపోయి సోలిపోయాయి.**
(కురుంతొగై, 13)

## 2

కంచెలాగా పెరిగిన వెదురుపొదల మధ్య
పనసచెట్టు, మరీ మొదట్లోనే
పనసపండ్లు
అచ్చం ఆమె లానే.
లేత తొడిమలాంటి ఆమె జీవితానికి
వేలాడుతూ ఎంత బరువైన ప్రేమ.
(కురుంతొగై, 18)

## 3

రాళ్ళమీంచి ఉరకలెత్తుతున్న జలపాతం
రాత్రి కురిసిన రహస్యవాన గురించి
నలుగురికీ చాటిచెప్తోంది.
ఈ కోరిక చల్లారిపోవచ్చు
కాని నీపట్ల
ప్రేమ చల్లారిపోడం సాధ్యమేనా?
(కురుంతొగై, 42)

## 4

కొండ మీద గుడ్లగూబ కీచుమన్నా
మా ముంగిట్లో పనసచెట్టుమీద
కోతిపిల్ల కిచకిచలాడినా
ఒకప్పుడు నా గుండె భయంతో కొట్టుకునేది.
అదేమిటో, ఇప్పుడు
అర్థరాత్రి చీకట్లో కూడా
ఆ కొండదారిన
నా గుండె అతడి వెంటపడిపోతోంది
ఎంత పిచ్చిది!
(కురుంతొగై, 153)

5

చూడు సఖీ,

పొంగిపొర్లిన వరదనీటివెంట
సాయంకాలపు వాన సువాసన
అతడుండే కొండమీంచి కొట్టుకొచ్చిన
మానులూ, మొదళ్ళూ.
వాటిని నేనట్లా కావిలించుకుంటే
తెచ్చుకుని పెరట్లో నాటుకుంటే
ఒక్కమాటేనా అనలేదు మా అమ్మ.
ఇప్పుడామె ముందు
దేవతలు కూడా వెలవెలబోతున్నారు
(కురుంతొగై, 361)

## పురం

1

మీ మూడు రాజ్యాలూ ఒక్కటైనా కూడా
పరంబునాడు మీకు లొంగటం అసాధ్యం
మూడు వందల గ్రామాల చల్లని నేల అది
మీరతణ్ణి యాచించారా, ఆ మూడు వందల
గ్రామాలూ మీవే. లేదా, అతణ్ణి గొంతెత్తి
కీర్తించారా, పారీ మీవాడే, పరంబూ మీదే.
(పురనానూరు, 110)

2

ఓ, ఆ కొండ గడ్డు మన్యం, అడుగుపెట్టలేరు
బల్లేల్తోనూ, బాణాల్తోనూ దాన్ని జయించలేరు.
అదే, నీలికలువల్లాంటి కళ్ళతో పాటలు పాడే
ఒక వనిత అడుగుపెట్టిందా, అది పాదాక్రాంతం.

# అది మరెక్కడా దొరికేది కాదు

**తి**రుక్కోయిలూరు నుంచి మేము ఆదితిరువరంగం వెళ్ళాం. అది ప్రాచీన వైష్ణవక్షేత్రం. ఆ దేవాలయం నమూనాగా శ్రీరంగనాథదేవాలయాన్ని నిర్మించారని అక్కడివాళ్ళు మాకు చెప్పారు. శ్రీరంగంలో ఉన్నట్లుగానే అక్కడ కూడా తిరుమంగై ఆళ్వారు నిర్మించిన ధాన్యాగారం ఒకటి ఉంది. తిరుమంగై ఆళ్వారు ఆదితిరువరంగం మీద కూడా ఒక మంగళాశాసనం చెప్పాడు. అక్కడి శ్రీరంగనాథుడు శయనమూర్తి. ఆయన శ్రీరంగంలోని మూర్తికన్నా పెద్ద విగ్రహం. అందుకని ఆయన్ని పెరియ రంగనాథుడు అని పిలుస్తారు. ఆ గర్భాలయంలో ఆది శ్రీరంగనాథుడి ఎదట నిల్చొన్నప్పుడు ఒక కాలాతీత సన్నిధిలో నిల్చొన్న భావన కలిగింది.

ఆ కోవెలలో అడుగుపెట్టగానే ముందు అమ్మవారి సన్నిధికి తీసుకువెళ్ళారు. ఆండాళ్ తల్లి దర్శనానికి. శ్రీరంగం వెళ్ళినప్పుడు ఆమె దర్శనం కాలేదని గుర్తుపెట్టుకుని మరీ ఆదితిరువరంగంలో ఆమె దర్శనమిచ్చిందనిపించింది. ఆ తల్లికి నమస్కరిస్తూండగా, అర్చకుడు సుమధురమైన ఒక గీతం పాడాడు. అది తిరుప్పావై నుంచి అని తెలుస్తూనే ఉందిగాని, ఏ గీతమో పోల్చుకోలేకపోయాను. బయటకి వచ్చిన తరువాత, నారాయణమూర్తిని అడిగితే, అది తిరుప్పావైలోని ఆరవ పాశురం అని చెప్పాడు.

తమిళకవుల్ని వెతుక్కుంటూ నేను చేసిన యాత్ర నిజానికి శ్రీవిల్లిపుత్తూరు దాకా చేపట్టవలసిన యాత్ర. ఆండాళ్‌ని స్మరించకుండా, తిరుప్పావైని తలుచుకోకుండా, తమిళ కవిత్వం గురించిన తలపోతకి అర్థం లేదు. కాని, శ్రీ విల్లిపుత్తూరు వెళ్ళే అవకాశం ఈ సారి యాత్రలో లేదనుకుని ఊరుకున్నాను. అయినా, ఆండాళ్ తల్లి నన్ను విస్మరించలేదు. ఆమె ఆదితిరువరంగానికి పిలిపించుకుని మరీ అక్కడ తన కవిత వినిపించింది.

ఈ కవిత :

**పుళ్ళుం శిలుంబిన కాణ్ పుళ్ళరయ్యన్ కోయిలిల్**
**వెళ్ళై విళిసంగిన్ పేరరవం కేట్టి లైయో?**

**పిళ్ళాయ్ ! యెళుంది రాయ్! పేయ్ ములై నంజుణ్డు**
**కళ్ళచ్చగడం కలక్కళీయ క్కాలోచ్చి**
**వెళ్ళత్తరవిల్ తుఇల మరంద విత్తినై**
**ఉళ్ళత్తుక్కొండు మునివర్ గళుమ్, యోగిగళుమ్**
**మెళ్ళ వెళుందు అరియన్ర పేరరవం**
**ఉళ్ళం పుగుందు కుళిరందేలో రెంబావాయ్**

**(సుప్రభాతమవుతున్నట్టుగా పక్షులు మేల్కొన్న కలకూజితాలు మీ చెవిన పడలేదా? గరుడవాహనుడి కోవెలలో శంఖధ్వని మార్మోగడం మీకు వినబడలేదా? బాలికలారా, మేల్కొనండి, రాక్షసి స్తన్యంలోని విషాన్ని పీల్చేసినవాడు, శకటాసురుణ్ణి ఒక్క కాలితోపుతో నిర్మూలించినవాడు, ఆ ఆదిశేషశాయిని మునులూ, యోగులూ మనసారా కీర్తిస్తున్న ఆ గుణగానం మన మనసునిండా నిండి మనల్ని పరవశింపచేసేట్టుగా, కన్యలారా, రండి, మేల్కొనండి.)**

తిరుప్పావై గురించి, ఆండాళ్ గురించి నేను గతంలో చాలాసార్లే చాలా విషయాలు పంచుకున్నాను. తిరుప్పావై నుంచి నాచ్చియార్ తిరుమొళి దాకా ఆండాళ్ చేసిన ప్రయాణాన్ని వర్ణిస్తూ, 'వెయ్యి ఏనుగుల ఊరేగింపు' అనే కథ కూడా రాసాను. ఆ విషయాలన్నీ మరోసారి ఇక్కడ ముచ్చటించాలని లేదుగాని, రెండు మూడు మాటలు మాత్రం చెప్పాలనుకుంటున్నాను.

మొదటిది, తిరుప్పావైని ఒక ఆధ్యాత్మిక రచనగా, ఉపనిషత్తుల సారంగా చూడటం ఒక పద్ధతి. కాని, అంతకన్నా కూడా అది ప్రాచీన తమిళసాహిత్యపు పాదులో వికసించిన పూర్ణఫలం అని గుర్తుపెట్టుకోవాలి. సంగం కాలం నాటి కవిత్వసంప్రదాయాల్లో వికసించిన సరి కొత్త పువ్వు అది.

అకం, పురం సంప్రదాయాల కవిత్వాన్ని విని, మననం చేసుకునే తమిళ రసజ్ఞ హృదయాల్లో తిరుప్పావై మేల్కొల్పగల మనోహరమైన స్పందనలు బయటి పాఠకుడికి ఊహకి కూడా అందనివి. ఆ కీర్తనల వెనక ప్రాచీన తమిళ దేశపు పావై పాటలు (నోము పాటలు ) ఉన్నాయి, మాణిక్యవాచకర్ తిరువాచకంలో గానం చేసిన 'తిరువెంబావై' ఇరవై పాశురాలూ ఉన్నాయి. అత్యున్నత దశలో కవిత్వం సంగీతంగా మారిపోవాలన్న గాఢమైన ఆకాంక్ష ఉంది. తిరుప్పావైని పోగులుపోగులుగా విడదీసి చదువుకుంటే మొత్తం తమిళ కవిత్వమంతటినీ చదువుకున్నట్టే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

రెండవది, సాధారణంగా ప్రేమ కవిత్వాలు సాయంకాలాల గురించీ, రాత్రులగురించీ, వెన్నెలరాత్రుల గురించీ, మబ్బు పట్టిన ఉదయాల గురించీ మాట్లాడుతుంటుంటాయి. ప్రేమ కవితలు ప్రాయికంగా మేఘసందేశాలు. కాని భగవత్ప్రేమ కవిత్వాలు సుప్రభాత గీతాలు. సుప్రభాత కీర్తనల్లో జీవితం పట్ల కొత్త ఆశ, కొత్త ఉత్సాహం, కొత్త శక్తి స్ఫురిస్తుంటాయి. అటువంటి సుప్రభాత కీర్తనలన్నిటికీ తిరుప్పావై మాతృక అనడంలో అతిశయోక్తిలేదు.

ఇక, సంగం కాలం నుంచీ, కపిలార్, తిరువళ్ళువర్, ఇళంగో అడిగళ్ మొదలైన కవులు ఏ ప్రేమపారవశ్యాన్ని గానం చేసారో, నాయన్మారులు, నమ్మాళ్వారూ, తిరుమంగై ఆళ్వారూ ఏ భగవత్సాన్నిధ్య పారవశ్యాన్ని చవి చూసి ఆ మాధుర్యాన్ని పలకడానికి విఫలప్రయత్నం చేసారో, ఆ ప్రయత్నంలో ఆండాళ్ పూర్తిగా సఫలమయ్యింది. అందుకు ఆమె స్త్రీగా పుట్టడం ఒక కారణం కావచ్చు. తక్కిన కవులకి ఎంత ప్రయత్నించినా సాధ్యం కానిదేదో, ఆమెకి సహజంగానే సిద్ధించి ఉండవచ్చు.

అందుకనే, 'తక్కిన ఆళ్వారుల్ని భగవంతుడు మేల్కొల్పాడు, ఆండాళ్ తానే భగవంతుణ్ణి మేల్కొల్పింది' అని మహాభావుకుడు పెరియ వచన పిళ్ళై రాసిన మాటల్ని మించి మనం ఒక్క మాట కూడా అదనంగా చెప్పలేమనిపిస్తుంది.

## 2

**ఆ** సాయంకాలం తిరుక్కోయిలూరు వెళ్ళేదారిలోనే నాకొకచోట కమ్మతెమ్మెర వీచిన అనుభూతి కలిగింది. ఎందుకని చూస్తే అక్కడొక ఆశ్రమం ఉంది. అది పందొమ్మిది-ఇరవై శతాబ్దాలకు చెందిన స్వామి జ్ఞానానంద గిరి స్థాపించిన తపోవనం అనే ఆశ్రమం. అక్కడ మందిరంలో పూజ జరుగుతూ ఉంది. మేమక్కడ ఉండగానే బయట పెద్ద వాన కురిసింది. చల్లని గాలులు ఆ ఆశ్రమాన్ని మరింత చల్లబరిచాయి. చుట్టూ చింతచెట్లు, మామిడి చెట్లు, నాకు గిరిజన ప్రాంతాల్ని తలపుకు తెచ్చాయి. ఆ ప్రాంగణంలో కొంతసేపు కూచున్నాం.

అక్కడ స్వామి జ్ఞానానందబోధనలు, ఆయన జీవితచరిత్రకు చెందిన పుస్తకాలు కొనుక్కున్నాను. అందులో స్వామి అభిషిక్తానంద అనే ఆయన రాసిన Guru and Disciple (1990) అనే పుస్తకం ఆ రాత్రే ఏకబిగిన చదివేసాను. ఆ రచయిత ఫ్రెంచి దేశీయుడు. మొదట్లో రమణమహర్షి గురించి విని ఆకర్షితుడై తిరువణ్ణామలై వచ్చాడు. కాని, భగవద్రమణుల చివరిరోజుల్లో ఆయన దర్శనం దొరికేదిగాని, సంభాషణకి మాత్రం అవకాశం ఉండేది కాదు. అందుకని, తన ఆధ్యాత్మిక యాత్రలో దారి చూపించగల

గురువుని వెతుక్కుంటూ, తిరుక్కోయిలూరు దగ్గర తపోవనానికి వచ్చాడు. మొదటిసారి 1955లో. ఆ మరుసటి ఏడాది ఆ ఆశ్రమంలో కొన్ని వారాల పాటు ఉండిపోయేడు. అప్పటి తన అనుభవాల్ని 'వన్య' అనే పేరుతో రాసిపెట్టుకున్నాడు. అది పుస్తకరూపంలో 1970 లో వెలువడింది. ఆ ఫ్రెంచి రచన ఇంగ్లీషు అనువాదం ఆ తరువాత ఇరవయ్యేళ్ళకు వెలుగు చూసింది.

అభిషిక్తానంద రచన ప్రాక్పశ్చిమ తాత్త్విక చింతన నేపథ్యంగా ఒక అన్వేషకుడు ఒక గురువుని కలుసుకున్న అనుభవకథనం. ఎంతో నిజాయితీగానూ, ఎటువంటి value judgments కి పాల్పడకుండానూ, ఆ సాధకుడు తన అనుభవాల్ని వివరించిన తీరు నన్ను ముగ్ధుణ్ణి చేసింది. అందులోంచి చాలా వాక్యాలు ఎత్తి రాయదగ్గవి, కాని, ముఖ్యంగా, ఈ వాక్యాల్ని పేర్కొనకుండా ఉండలేకపోతున్నాను:

> 'తాను అక్కణ్ణుంచి పూర్తిగా సెలవుతీసుకుంటున్నప్పుడు 'వన్య' జ్ఞానానందుల దగ్గరికి వెళ్ళాడు. అప్పుడాయన అతడితో అన్నమాటలివి: 'హిందూమతం ఒక కలగూరగంప. అందులో మూఢవిశ్వాసాల నుంచి డబ్బుచేసుకోడం దాకా ప్రతి ఒక్కటీ ఉంది. పక్కవాణ్ణి మోసగించడానికి హిందూమతాన్ని సాధనంగా వాడుకోని వాడు లేడు. కాని మరెక్కడా, ప్రపంచంలో మరెక్కడ వెతికినా నీకు దొరకని ఏదో అమూల్య సంపద, ఒక బ్రహ్మవిద్య, ఒక ఆత్మవిద్య, ఒక మోక్ష విద్య హిందూమతంలోనే దొరుకుతుంది, అది మరెక్కడా దొరికేది కాదు, గుర్తుపెట్టుకో.'

## ఎట్లాంటి పాఠశాల! ఎట్లాంటి శిష్యుడు!

**పో**లింగు ప్రశాంతంగా ముగిసింది. దాంతో రీపోలింగు అవసరం లేకపోయింది. మధ్యలో ఒకరోజు విరామం దొరికింది. ఈలోపు ఈ- ఆఫీసులో ఫైళ్ళూ, ఉత్తరాలూ వరదలాగా వచ్చిపడుతున్నాయి. ఆ ఒక్క తీరికదినం ఆఫీసుపని పూర్తిచేసేసుకుందామను కున్నాను. కాని ఫోను చేసినప్పుడు మాటల మధ్యలో, విజ్జి మరేవైనా ఊళ్ళు చూడాలనుకుంటే అవి కూడా చూసి రండి అంది. ఆ ఉన్న కొద్దిసమయంలోనూ మధురై, రామేశ్వరం వెళ్ళి కౌంటింగురోజు పొద్దున్నకి రావచ్చని కలెక్టరు చెప్పాడు కాని, నాకు పాండ్యనాడు అంత త్వరత్వరగా చూసివచ్చెయ్యాలని అనిపించలేదు. అది మరొకసారికి మరొక పర్యటనకి వదిలిపెట్టుకున్నాను.

మిగిలిన ఆ ఒక్కరోజు లోనూ చూసిరావడానికి నా మదిలో కారైకల్ మెదుల్తూ ఉంది. భారతీయ భక్తి సాహిత్యానికి తల్లిలాంటిది అని చెప్పదగ్గ అమ్మైయ్యారు కారైకల్ లోనే పుట్టి చాలా కాలం అక్కడే జీవించింది. తిరుక్కోయిలూరులో అవ్వైయ్యారుని, ఆది తిరువరంగంలో ఆండాళ్‌నీ తలుచుకున్నాను కాబట్టి, కారైకల్ వెళ్ళి అమ్మైయ్యారుని కూడా తలుచుకుంటే ప్రాచీన తమిళకవయిత్రుల్లో హిమగిరి శిఖరాలు మూడింటినీ సందర్శించినట్టు అవుతుందని అనుకున్నాను.

కారైకల్‌కి వెళ్ళాలంటే కుంభకోణం మీంచే వెళ్ళవలసి ఉంటుందని తెలిసాక, యు.వి.స్వామినాథ అయ్యర్ తలపుకి రాకుండా ఎట్లా ఉంటాడు? పుదుచ్చేరిలో భారతియారును స్మరించుకున్నాను కాబట్టి, కుంభకోణంలో స్వామినాథ అయ్యర్ అడుగుజాడల్ని వెతుక్కుంటే, నా తమిళ సాహిత్య యాత్ర పూర్తిగా ఫలప్రదమవుతుందని అనిపించింది.

యు.వి.స్వామినాథ అయ్యర్ (1855-1942) గురించి గతంలో చాలాసార్లు రాసేను. ఆయన ఆత్మకథ 'నా చరిత్ర' గురించి కూడా విపులంగా రాసాను. స్వామినాథ అయ్యర్ లాంటి విద్వాంసుడు ఒక భాషకు ఒక్కడున్నా చాలు. ఆయన వల్ల తమిళం రాత్రికి రాత్రే ప్రపంచ శ్రేష్ఠ భాషల్లో ఒకటిగా మారిపోయింది. అప్పటిదాకా క్రీ.శ.

నాలుగైదు శతాబ్దాల నుంచీ తమిళం సుసంపన్న సాహిత్యభాషగా విలసిల్లుతూ వస్తున్నదని భావించిన ప్రపంచం స్వామినాథ అయ్యర్ పరిశోధన వల్ల క్రీస్తు పూర్వం రెండు, మూడు శతాబ్దాల నాటికే అత్యున్నత సాహిత్యాన్ని వెలువరించిందని వెల్లడయింది.

సంగకాలం నాటి మహాకావ్యాలు అయిదింటిలోనూ, నాలుగు కావ్యాల్ని ఆయన తాళపత్రాలనుండి అచ్చుయంత్రం మీదకి పట్టుకొచ్చాడు. మొత్తం సంగ కాలకవిత్వం, ఎనిమిది కవిత్వ సంకలనాలూ (ఎట్టుత్తొగై), పది దీర్ఘకవితలూ (పత్తుప్పాట్టు) ఆయన వెలువరించడంతో, ఇప్పుడు పాశ్చాత్య ప్రపంచానికి, ముఖ్యంగా అమెరికాకి, షేక్ స్పియర్ తరువాత అంత పెద్ద సాహిత్యవ్యాసంగం మరొకటి దొరికింది.

స్వామినాథ అయ్యర్ సాహిత్య పరిశోధన ఒక పర్వతారోహణలాంటిది, అంతరిక్ష ప్రయాణం లాంటిది, అగాధ సముద్రాల మీద తెప్పవేసుకుని నూతన తీరాలను అన్వేషిస్తూ సాహసనౌకాయాత్రలాంటిది. కాని, స్వామినాథ అయ్యర్ ఆత్మకథలో నన్ను ఆకట్టుకున్నది, ఆ పరిశోధన, ఆ సాహిత్యవైభవం కన్నా కూడా ముఖ్యంగా, ఆయనకీ, ఆయన గురువు మీనాక్షిసుందరం పిళ్ళైగారికీ మధ్య ఉన్న గురుశిష్య అనుబంధం. ఆ పుస్తకం ఎప్పుడు తెరిచినా నా హృదయం సజలమై పోతుంది. చెప్పలేని దిగులు ఏదో నన్ను మబ్బులాగా కమ్ముకుంటుంది. ఏరీ? ఎక్కడున్నారు అటువంటి గురువులు? అటువంటి శిష్యులు? ఎక్కడున్నాయిప్పుడు అటువంటి గురుకులాలు? తల్లిదండ్రుల్ని కూడా మరపింపచేసే అటువంటి వాత్సల్యాలు?

స్వామినాథ అయ్యర్ని స్వామినాథ అయ్యర్ గా మార్చిన తిరువావడుదురై మఠం కుంభకోణం పక్కనే ఉందనీ, ఆ ఊరు మీంచి కారైక్కాల్ వెళ్ళవచ్చుననీ తెలియరావడంతో నాకు గొప్ప ఉత్సాహం కలిగింది. నేనొక రోజు తిరువావడుదురై మఠాన్ని చూస్తానని ఏనాడూ కలలో కూడా అనుకోలేదు. ఆ మఠం ఎక్కడుందో నారాయణమూర్తికి కూడా తెలీదు. చిత్రమేమంటే, ప్రాచీన తమిళసాహిత్యం గురించి ఎంతో కొంత తెలిసి ఉన్న ఆ తమిళయువకుడు స్వామినాథ అయ్యర్ పేరైతే విన్నాడుగాని, ఆయన ఆత్మకథ చదివి ఉండలేదు.

ఏమైతేనేం, ఎలాగో ఒకలాగా, ఎవరెవరినో సంప్రదిస్తూ, ఆ రోజు మధ్యాహ్నానికి తిరువావడుదురై మఠానికి చేరుకోగలిగాం. ఆ మఠం ముందు ఏదో ఉత్సవానికి వేసిన పందిళ్ళు ఇంకా పచ్చగా ఉన్నాయి. ఆ మఠం ముందు గోడలమీద తంజావూరు శైలి వర్ణచిత్రాలు చిత్రించి ఉన్నాయి. ఆ మఠంలో అడుగుపెట్టగానే నాకు నా పూర్వపు రోజులన్నీ తలపుకొచ్చాయి. నాకు నా స్వజనానికి చెందిన పూర్వకాలపు ఇంటికి తిరిగివెళ్ళినట్టనిపించింది. నేను నా డిగ్రీ మొదటిసంవత్సరం పెద్దాపురంలో చదువుకున్నాను. అక్కడ మహారాణీ వత్సవాయి బుచ్చిసీతయమ్మ పేరుమీద ఒక

సత్రముండేది. నేను ఆ సత్రంలో అన్నం తింటూ, మా నాన్నగారికి తెలిసినవారి ఇంటిపంచన ఆశ్రయం పొందుతూ ఉండేవాణ్ణి. తిరువావడుదురై మఠంలో అడుగుపెట్టగానే, నాకు ఆ పూర్వకాలపు సత్రం గుర్తొచ్చింది. కానీ, నేను చదువుకున్న సత్రం అన్నం మాత్రమే పెట్టింది. తిరువావడుదురై మఠం ఎందరో విద్యార్థులకి అన్నభిక్షా, అక్షరభిక్షా కూడా అనుగ్రహించింది.

తిరువావడుదురై మఠాన్ని ఆధీనం అంటారు. అది వీరశైవ సంప్రదాయానికి చెందిన ఒక ధార్మిక సంస్థ. పాలకుల మఠాలతోనూ, రాజకీయాలతోనూ సంబంధం లేకుండా, అటువంటి ఆధీనాల్ని తమిళదేశం ప్రోత్సహిస్తూ వచ్చింది. ఆ మఠానికి విరివిగా భూరిదానాలూ, మాన్యాలూ అందచేస్తూ వచ్చింది. గత అయిదారువందల ఏళ్ళుగా తమిళనాట విద్య, సంగీతం, సాహిత్యం, ధార్మిక రంగాల్లో ఆధీనాలు చేసిన సేవ అమూల్యం.

మేము నేరుగా మఠంలో అడుగుపెట్టి సరాసరి మఠం సిబ్బందిని కలుసుకునేటప్పటికి, మఠాధిపతి ఆరోజు మఠంలోనే ఉన్నారనీ, ఆయన్ని కూడా దర్శించుకోవచ్చునీ చెప్పారు. కొంతసేపు వేచిఉన్నతరువాత, మఠం సంప్రదాయాల ప్రకారం మేమాయన్ని దర్శించుకున్నాం. వట్టి దర్శనంతో ఆగకుండా అక్కడ కొంతసేపు గోష్ఠి కూడా జరిగింది. ఆ మఠం మానేజరుతో పాటు, మఠాధిపతి ఆంతరంగిక కార్యదర్శి కూడా అక్కడ ఉన్నాడు. మేము మఠాధిపతికి నమస్కరించిన తరువాత, అక్కడే ఆయన సన్నిధిలో కూచున్నాక, 'వీరు ఏ పని మీద ఇక్కడకి వచ్చారు?' అనడిగాడు ఆయన తన సిబ్బందిని. 'వారు స్వామినాథ అయ్యర్ గారి స్వీయచరిత్ర చదివారట. తమిళ సాహిత్యమంటే వారికి చాలా ఆసక్తి ఉందట. స్వామినాథ అయ్యర్ గారు ఈ మఠం పూర్వవిద్యార్థి కాబట్టి ఈ మఠాన్ని చూడాలని వచ్చారుట' అని చెప్పాడు ఆ మానేజరు ఆయనతో తమిళంలో. తిరిగి మళ్ళా ఆ మానేజరు నా వైపు తిరిగి 'తిరువావడుదురై ఆధీనం లేకపోతే స్వామినాథ అయ్యర్ లేరు. స్వామినాథ అయ్యర్ లేకపోతే, తమిళం ఇలా ఉండేదే కాదు' అన్నాడు . నాకొక్కసారి గగుర్పాటు కలిగింది. ఎట్లాంటి పాఠశాల! ఎట్లాంటి శిష్యుడు! ఆయన ఆ మఠంలో చదువుకుని వెళ్ళిన తరువాత దాదాపు నూట యాభై ఏళ్ళ తరువాత కూడా ఎక్కడెక్కడినుంచో సందర్శకులు వచ్చి, ఆ ప్రాంగణంలో కూచుని, ఆయన గురించి మాట్లాడుకుంటున్నారు! 'కులములోన ఒకడు గుణవంతుడుండిన కులము వెలయు వాని గుణము చేత' అన్న మహాకవి వాక్యం ఆ గురుకులంలో ఎంతో సత్యంగా తోచింది.

నాకు మరొకటి కూడా అనిపించింది. నేనిట్లా స్వామినాథ అయ్యర్‌ని తలుచుకుంటూ తిరువావడుదురై వెళ్ళినట్టుగా, ఎవరేనా తమిళ సాహిత్య విద్యార్థి, గిడుగు రామ్మూర్తిని తలుచుకుంటూ పర్వతాల పేట లేదా పర్లాకిమిడి, వేటూరి ప్రభాకర శాస్త్రిని తలుచుకుంటూ పెదకళ్ళేపల్లి లేదా తిరుపతి వచ్చే అవకాశం ఉందా? ఆ మహనీయుల గురించి తక్కిన భారతదేశం తెల్సుకోడానికి మనమెంత సమాచారం అందుబాటులోకి తేగలిగాం? తమిళానికి స్వామినాథ అయ్యర్ కృతజ్ఞుడిగా ఉండటం సరే, తమిళ భాష కూడా అయ్యర్ పట్ల అంత కృతజ్ఞంగానూ ఉందని అర్థమయింది నాకు.

ఆ రోజు తమ మఠానికి వచ్చిన సందర్శకుడు ప్రభుత్వంలో ఉన్నతోద్యోగి అని తెలిసాక, ఆ మానేజరు నెమ్మదిగా మఠం సమస్యలన్నీ చెప్పుకొచ్చాడు. ముఖ్యంగా మఠం భూములు అన్యాక్రాంతం కావడం, కౌలుదారులతో వస్తున్న సమస్యలు, పన్ను వసూలు చేసే యంత్రాంగానికి తాము సరైన జీతాలు ఇవ్వలేకపోవడం మొదలైనవన్నీ చెప్పుకొచ్చాడు. వాటిని నేను ఎప్పుడైనా భూమిశిస్తు శాఖ కమీషనరు దృష్టికో లేదా తమిళనాడు ప్రభుత్వం దృష్టికో తీసుకురావాలని ఆయన అభిలషిస్తున్నాడని అర్థమయింది. కాని, మఠాధిపతి ఆ సంభాషణని ఎక్కువసేపు కొనసాగించదలుచుకోలేదు. ఆయన మా సంభాషణని మళ్ళా స్వామినాథ అయ్యర్ వైపు మళ్ళించాడు. 'అయ్యరు గారి జీవిత చరిత్ర చదువుతున్నప్పుడు నాకు ఆయన కన్నా కూడా ఆయన గురువు మీనాక్షి సుందరం పిళ్ళై, అప్పటి మఠాధిపతి సుబ్రహ్మణ్య దేశికుల పట్ల మరింత ఆరాధన కలిగింది' అని చెప్పాను. 'ఆ రోజుల్లో మఠంలో మొత్తం ప్రాచీన తమిళ సాహిత్యమంతా తాళపత్రాల్లో లభ్యంగా ఉండేదట కదా' అన్నాను. 'అప్పుడే కాదు, ఇప్పుడు కూడా ఇక్కడ ఉన్న తాళపత్రాలు తక్కిన ఏ ఆధీనంలోగాని, తమిళనాడులో మరే గ్రంథాలయంలోగాని కనిపించవు' అన్నాడు మఠాధిపతి కార్యదర్శి. 'మీకు తెలుసునా? తిరువళ్ళువర్ తిరుక్కురళ్ మాత్రమే కాదు, సిద్ధ వైద్యం మీద కూడా ఒక గ్రంథం రాసాడు. ఆ అరుదైన తాళపత్ర ప్రతి ఇప్పుడు ప్రపంచంలో ఒకే ఒక్కటి లభ్యంగా ఉంది. అది మా మఠంలోనే ఉంది' అని కూడా అన్నాడతడు.

మేము కారైక్కాల్ దాకా వెళ్ళవలసి ఉంది కాబట్టి, ఇక సెలవుదీసుకుందామని లేచాం. మఠాధిపతి మాకు ఆశీర్వాద పూర్వకంగా చిన్న సత్కారం చేసారు. శాలువాకప్పి, తాంబూలంతో పాటు మఠం వారు వెలువరించిన రెండు మూడు పుస్తకాలు కూడా చేతుల్లో పెట్టారు. 'వీరిని ప్రసాదం తీసుకుని వెళ్ళమనండి' అన్నారు తన సిబ్బందితో. ప్రసాదం అంటే, ఆ మధ్యాహ్నం అక్కడ అన్నం తినివెళ్ళమంటున్నారని అర్థమయింది మాకు.

మమ్మల్ని ఆ సిబ్బంది భోజనశాలకి తీసుకువెళ్ళారు. ఆ పాతకాలపు భవనంలో, అక్కడ మాకొక పంక్తి ఏర్పాటు చేసి, కావేరి నీళ్లతో మఠం భూముల్లో పండిన ధాన్యంతో వండిపెట్టిన అన్నం అరటాకుల్లో వడ్డించారు. నేను కూడా ఏదో జన్మలో ఆ మఠంలో చదువుకుని ఉండిఉంటాననీ, ఆ ఋణశేషం ఆ రోజు అట్లా తీరిందనీ అనిపించింది నాకు.

ఆ గదికి ఆవల ఎక్కడో, మరొక గదిలో స్వామినాథ అయ్యర్ ఏ కంబ రామాయణమో పాఠం చదువుతుంటే, మీనాక్షి సుందరం పిళ్ళైగారు ప్రతిపదార్థం వివరిస్తూ ఉన్నారని ఒక భ్రాంతి కలిగింది నాకు. నాకు ఆ సమయంలో రాజమండ్రిలో మా అక్క చదువుకున్న సదనం పదే పదే గుర్తొచ్చింది. రాజమండ్రిలో గోదావరి ఒడ్డున ఉన్న ఆంధ్రయువతీ సంస్కృత కళాశాలని సదనం అని పిలుస్తారు. ఆ సదనంలోనే మా మాష్టారు మల్లంపల్లి శరభయ్యగారు ఎన్నో ఏళ్ళు ఆ పిల్లలకి తెలుగూ, సంస్కృతమూ బోధించేవారు. మా నాన్నగారు మా అక్కని చూడటానికి రాజమండ్రి వెళ్ళేటప్పుడు, నా పసితనంలో నన్ను కూడా ఒకటి రెండు సార్లు తీసుకువెళ్ళారు. ఆ పసినాటి జ్ఞాపకాల్లో ఆ సదనం, ఆ ఎత్తైన అరుగులు, ఆ గుండ్రని స్తంభాలు, ఆ మొదటి గదిలో పెద్దపెద్ద బోర్డులమీద రాసిపెట్టిన దాతలపేర్లు, బత్తుల కామాక్షమ్మగారి విగ్రహం, ఆ విగ్రహం కింద ఆమెని స్తుతిస్తూ నాళం కృష్ణారావుగారు రాసిన పద్యం అవన్నీ గుర్తొచ్చాయి.

తిరిగి వచ్చిన తరువాత ఒక్కసారి కాదు, నాలుగైదు సార్లు 'నా చరిత్ర' మళ్ళీ మళ్ళీ పుటలు తిరగేసాను. తిరువావడుదురై ఆధీనాన్ని కళ్ళారా చూసాక, ఆ పుస్తకంలోని ప్రతి పుటలోనూ వర్ణించిన జీవితం మళ్ళా నా కళ్ళముందు ప్రాణం పోసుకుని మరీ కనిపించింది. కొన్ని కొన్ని వాక్యాలు గుండెని మరీ మరీ పట్టుకున్నాయి. ఒకటి రెండు సన్నివేశాలు ఇక్కడ ఎత్తి రాయకుండా ఉండలేకపోతున్నాను:

> '..వీరు చురుకైనవారు! పలు విషయములు తెలిసికొని యున్నారే'అని సుబ్రహ్మణ్య దేశికులు సంతోషముతోడ బలికిరి. నన్ను చూచి 'పిళ్ళైగారి వద్దనే ఉండి చక్కగ చదువుకొనుడు. లేబ్రాయముగ నున్నది. వీరియొద్ద నెంతయో తెలిసికొనవచ్చును. వీరిటకు వచ్చునప్పుడు వెంట రండు. మీకు వలసిన సౌకర్యములు లభించును. వివాహము కూడ చేయింతుము' అని చిరునగవుతో పలికిరి. నేను నవ్వితిని.
>
> 'ఏల నవ్వుచున్నారు? పెండ్లి యన్న ఆనందముగనే ఉండును' అనిరి.
>
> పిళ్ళైగారు అప్పుడు 'వీరికి వివాహమైనది' అని వచించిరి.
>
> 'అటులనా, అదే నవ్వుచున్నారు. ఐన నేమి? తక్కిన కార్యములన్నియు జరగవలదా? సకలవిధముల సౌకర్యములు చేసిపెట్టుదము' అని దేశికులు చెప్పి 'మీకు చదువుటకు వలసిన పుస్తకములిత్తుము' అనిరి.

'శ్రీవారి కృపయున్నచో అన్నియు లభించును' అని మా ఆచార్యులు చెప్పిరి. దేశికులు వెంటనే లేచి తమ పార్శ్వమున ఉన్న ఒక బీరువా తెరపించిరి. దానినిండ పుస్తకములుండినవి. అందుండి పలుపొత్తములెత్తుకుని వచ్చి ఒక్కొక్కదానికి నాలుగేసి ప్రతులు ప్రసాదించిరి. 'వీనిలో ఒక్కొక్కటి మీరు తీసుకొనుడు. తక్కినవానిన్ని తోడి విద్యార్థుల కిండు' అని చెప్పిరి. నేను కడుంగడు ప్రేమతో ఒక్కొక్క పుస్తకము తిప్పి తిప్పి చూచితిని. చేతులనిండుగ ధనమిచ్చినను కూడ నాకంత ఆనందమేర్పడి ఉండదు.'

(పే. 129–130)

'తిరువావడుదుర మఠమున కార్యనిర్వాహకుడుగనుండిన కణ్ణప్పతంబిరాను అనువారు ఒకరోజు వచ్చిరి. ఆ రోజు కణ్ణప్ప నాయనారు పురాణము పాఠము నడిచెను. మధ్యాహ్నముపై ఆరంభించిన అది రాత్రి పంద్రెండు గంటలకు పూర్తియైనది. అటుపిమ్మట తంబిరాను మఠమునందే భుజింపవలెనని మా గురువుగారిని నిర్బంధించి చెప్పిరి. వారట్లే యంగీకరించి యచట ఆహారస్వీకారము చేసిరి. నేనంతలో భోజనము చేయునింటికిపోయి భోజనము చేసి వచ్చితిని.

ఆహారమైన పిదప మా గురువుగారు తంబిరాను వద్ద అనుమతి వడసి, తమ ఇంటికి నేగిరి. నేనును వారితోడ అరిగితిని. అప్పుడు వారు 'మఠమునందు భుజించినందున నేడు నేయి లభించినది' అనిరి. ఆ మాట నా హృదమును నొంచెను. వారు కొన్నాళ్ళుగ నేయి లేకయే భుజించుచుండిరి. నేయి కొనుటకు వారిచేత పైకము లేదు. ఇంగితమెరిగి యెవ్వరేని ఉపకారము చేసిననేగాని తాముగ ఎవ్వరి వద్దనైనను 'ఇది కావలెను, అది కావలెను అని అడిగి పుచ్చుకొను అలవాటు వారికి సాధారణముగ లేదు. ఎడతెగక పాఠములు చెప్పుచుండిన వారు నేయి లేకయే భుజించుట నేనెరిగినవాడనగుట చేత 'నేడు నేయి దొరికినది' అని వారన్నపుడు వారి హృదయమెంతయో బాధపడినదని తెలుసుకుంటిని.

దారిద్ర్య బాధాతీవ్రత నాకు కొత్త కాదు. అందువలన నేర్పడు దుఃఖమును బుద్ధి తెలిసినది మొదలు నేననుభవ పూర్వకముగ తెలిసికొనదొడగితిని. అయినను పిళ్ళెగారి వద్ద దానిని నేనెదురుచూడలేదు.'

(పే. 115–116)

అరవిందులు, భారతి, మీనాక్షి సుందరము పిళ్ళ, స్వామినాథ అయ్యర్ వంటి వారి విశేషాలు వింటున్నప్పుడు చేతిలో చిల్లిగవ్వ లేని జీవితాన్ని అనుభవిస్తూ కూడా,

తోటిమనుషుల కోసం, భాషకోసం, సాహిత్యంకోసం వారు పడ్డ తపన, చేసిన సేవ తెలిసిన కొద్దీ, జీవితం మనకెంతో అవకాశమిచ్చినా కూడా మనమేం చేస్తున్నామన్న ప్రశ్న నన్ను పదే పదే గుచ్చుకుంటూనే ఉంది.

# మరొక అనుభవామృతం

**ను**వ్వు నీళ్ళ కోసం వెతుక్కుంటున్నప్పుడు, గుర్తుపెట్టుకో, నీళ్ళు కూడా నీ కోసం వెతుక్కుంటాయన్నాడు రూమీ. శివకవుల పాదముద్రల్ని వెతుక్కుంటూ నేను తమిళదేశంలో సంచరిస్తుంటే, ఆశ్చర్యం, శివజ్ఞాన యోగుల్లో మొదటివాడూ, శైవసిద్ధాంత ప్రవక్తా తిరుమూలనాయనారు నా కోసం వెతుక్కుంటూ ఉన్నాడు. ఆయన నా తలపుల్లో లేకపోయినా, నేనాయన తలపుల్లో ఉన్నాను. కనకనే తిరువావడుదురలో మేము ప్రవేశించబోతుండగా, ఒక మట్టిదారి మొదట్లో, తిరుమూలనాయనారు గ్రామానికి దారి అని రాసి ఉన్న బోర్డు ఒకటి మా కంటపడింది.

తిరుమూలార్ గురించి నేను ఇరవయ్యేళ్ళ కిందట మొదటిసారి చదివాను. ఆయన జీవితచరిత్ర అప్పట్లో పెరియపురాణంలో చదివినా కూడా, ఆ ఊళ్ళ పేర్లు జ్ఞాపకం ఉండటం కష్టం. లేకపోతే, నేను తిరువావడుదుర వెళ్తున్నాను అంటే, స్వామినాథ అయ్యర్ కన్నా ముందు తిరుమూలార్ నాకు జ్ఞప్తికి వచ్చి ఉండాలి. శైవ సిద్ధాంతానికి విజ్ఞానసర్వస్వం అని చెప్పదగ్గ 'తిరుమంతిరం' (శ్రీమంత్రం) వెలువరించింది తిరువావడుదురలోనే అని నేను మర్చిపోకపోయి ఉండాలి.

భారతదేశంలో సాంప్రదాయిక శైవం కాక, శైవాన్ని ఒక తత్త్వశాస్త్రంగా అభివృద్ధి చేసిన శాఖలు రెండున్నాయి. ఒకటి, ఉత్తరాదిన కాశ్మీరులో వికసించిన శివాద్వైతం. 'శివసూత్రాలు', 'స్పందకారిక' అనే రెండు గ్రంథాల ఆధారంగా, ఉత్పలదేవుడు, అభినవగుప్తుడు దాన్ని ఈశ్వర ప్రత్యభిజ్ఞ దర్శనంగా అభివృద్ధిపరిచారు. అందులో తంత్రం కూడా కలిసి ఉంది కాబట్టి, దాన్ని శివశాక్త తంత్రదర్శనంగా కూడా పేర్కొంటారు. మరొక శివాగమ శాఖ దక్షిణాదిన విలసిల్లింది. దానికి ప్రవక్త తిరుమూలార్. తన దర్శనాన్నీ, తన అనుభవాన్నీ వివరిస్తూ ఆయన రాసిన 'తిరుమంతిరం' దక్షిణాది శైవసిద్ధాంతంగా ప్రసిద్ధి చెందింది. తర్వాత రోజుల్లో కన్నడ వీరశైవం ఆ సిద్ధాంతాన్నే మరింత వృద్ధి పరుచుకుని 'షట్స్థల శాస్త్రం' గా ముందుకు తీసుకొచ్చారు. శైవసిద్ధాంతమే

ముందు వికసించిందనీ, దానిలోని ద్వైత భావనలమీద ఖండనగా కాశ్మీరు శివాద్వైతం వికసించిందనీ కొందరంటారు.

ఏమైనప్పటికీ, శివుడు రుద్రుడిగా వేదకాలం నుంచీ ఉన్నప్పటికీ, పురాణకారులు శివసంబంధంగా ఆరు పురాణాలు రాసినప్పటికీ, శైవాన్ని ఒక తాత్త్విక దర్శనంగా ప్రతిపాదించిన మొదటి రచన తిరుమంతిరం అని చెప్పడంలో మాత్రం రెండవ మాటలేదు.

తిరుమూలార్ కాలం గురించి ఇతమిత్థంగా ఎవరూ ఏమీ చెప్పలేకపోతున్నారు. ఆయన్ని క్రీస్తు శకం అయిదవ శతాబ్దం మొదలుకుని పదకొండవ శతాబ్దం మధ్యకాలంలో వేరు వేరు కాలాల్లో ప్రతిపాదిస్తూ ఉన్నారు. అందుకు ఎవరి సమర్థనకు వాళ్ళకున్నాయి. కాని, మొదటిసారి ఆయన జీవితం గురించిన సమగ్ర చిత్రణ పెరియపురాణంలో మాత్రమే కనవస్తున్నందున, ఆయన 12 వ శతాబ్దానికి పూర్వం వాడని మాత్రం రూఢిగా చెప్పగలం.

పెరియపురాణం చెప్పిన కథని బట్టి సుందరనాథుడు ఉత్తరాదికి చెందిన ఒక పండితుడు. ఆయన ఒకప్పుడు దక్షిణాదిన యాత్రచేస్తూ తిరువావడుదుర దగ్గర్లో సాతనూరు అనే గ్రామం దాకా వచ్చాడు. అక్కడ ఊరి బయట కొన్ని ఆవులు కన్నీరు కారుస్తూ కనబడ్డాయి. ఏమిటని విచారిస్తే, వాటి పసుల కాపరి అక్కడే పాముకరిచి మరణించాడని అర్థమయింది. ఆ పసుల కాపరి కోసం ఆ పశువులు కన్నీరుపెట్టుకుని కనబడ్డాయి. ఆ దృశ్యం చూసి సుందరనాథుడికి వాటిపట్ల అపారమైన దయకలిగింది. అతడికి పరకాయ ప్రవేశ విద్య తెలుసు. దాంతో అతడు ఆ చనిపోయిన పసులకాపరి శరీరంలో ప్రవేశించి తన కళేబరాన్ని అక్కడొక చెట్టుమొదట్లో దాచిపెట్టాడు. అప్పుడు ఆ ఆవుల్ని తోలుకుంటూ సాతనూరులో ప్రవేశించాడు. ఆ పశువులు అతణ్ణి తమ కాపరి ఇంటికి చేర్చాయి.

చనిపోయిన ఆ కాపరి భార్య తన ఇంటికి వచ్చింది తన భర్తనే అనుకుందిగాని, సుందరనాథుడు ఆమె తనని తాకబోతూంటే వారించి, తనకి శివజ్ఞానం కలిగిందనీ, తాను సంసార బంధాల నుంచి బయటపడ్డాననీ ఆమెకు చెప్పాడు. అతడి రూపంలో ఉన్న సుందరనాథుడు తిరిగి మళ్ళా ఊరిబయటకి వచ్చి తన పూర్వకళేబరంలో ప్రవేశించబోతే, ఆ కళేబరం అక్కడ కనిపించలేదు. ఆ పసులకాపరి పేరు మూలన్. అతడు మూలన్ దేహంలోనే కొనసాగవలసి వచ్చింది. అయితే, మామూలు పసుల కాపరిగా కాదు, శివజ్ఞానయోగిగా, కాబట్టి, ఆయన్ని తిరుమూలర్ అని పిలవడం మొదలుపెట్టారు. ఆయన ఆ తర్వాత చాలా కాలం పాటు తిరువావడుదురలోని కౌముదీశ్వర స్వామి దేవాలయంలో ధ్యానం చేసుకుంటూ గడిపేవాడు. ఆ ఆలయ

ప్రాంగణంలోని, ఒక రావిచెట్టు కింద కూచున్నప్పుడు ఒకరోజు అతడు అప్రయత్నంగా, తన ఈశ్వరానుభవాన్ని 'తిరుమంతిరం' అనే పేరు మీద 3000 పద్యాలుగా చెప్పడం మొదలుపెట్టాడు. స్వయంగా పండితుడైనప్పటికీ, ఒక పసులకాపరి దేహంలో నివసిస్తూ ఉన్నాడు కాబట్టి, తన తత్త్వదర్శనాన్ని వివరించడానికి అతడు గ్రామీణ తమిళాన్ని ఎంచుకున్నాడు.

తిరుమంతిరం బహుశా సంస్కృతంలో వచ్చి ఉంటే, తిరుమూలార్ మరింత సుప్రసిద్ధుడై ఉండేవాడనిపిస్తుంది. ఎందుకంటే, తిరుమంతిరం జ్ఞానేశ్వరుడి అనుభవామృతంలాగా ఒక యోగి జీవితానుభవాన్ని వడగట్టి చెప్పిన కవిత్వం. అందుకనే, ఒకవైపు పెరియపురాణం అతణ్ణి నాయనారుగా పేర్కొంటున్నప్పటికీ, మరొక సంప్రదాయం ప్రకారం, తమిళనాడులోని పద్ధెనిమిది మంది సిద్ధుల పరంపరకీ తిరుమూలార్‌ని ఆద్యుడిగా పేర్కొంటారు.

సిద్ధుడు పరిష్కరించిన సత్యం కాబట్టి అతడి ప్రవచనాన్ని 'సిద్ధాంతం' అంటారు. అది వేదాంతం కన్నా భిన్నమైంది. వేదాంతం ప్రధానంగా ఆత్మవిద్య. సిద్ధాంతం ప్రధానంగా మట్టిని బంగారంగా మార్చే రసవిద్య. ఈ లోకాన్నే కైలాసంగా తీర్చిదిద్దుకోవాలనే అష్టాంగయోగం అది. అందుకనే సిద్ధులు భారతదేశపు తొలివైద్యులు, కెమిస్టులు, ఆల్కెమిస్టులు కూడా.

సాధకుల అనుభవాన్ని పొరలు పొరలుగా విడదీసి, వారి మనోలోకప్రయాణాన్ని సవివరంగా చిత్రించిన దర్శనాలుగా బౌద్ధ దర్శనాలకు ఎంతో ప్రశస్తి ఉంది. వాళ్ళు మనిషి మనస్సులో ఉండే లోపలి గదులెన్నింటికో తలుపులు తెరిచారు. కాని తిరుమంతిరం అంతకన్నా కూడా మరింత సమగ్రంగా సాధకుడి మనసును విప్పి పరిచే ప్రయత్నం చేసిన గ్రంథం.

అందులో తొమ్మిది అధ్యాయాలున్నాయి. ప్రతి అధ్యాయాన్నీ తంత్రం అని పిలుస్తారు. మొదటి తంత్రం పుస్తక ప్రణాళిక, సారాంశం. రెండవ తంత్రంలో దేవతలు, పురాణగాథలు, ప్రపంచ ఉత్పత్తి, శివశక్తులు, జీవాత్మ వివరణలున్నాయి. మూడవ తంత్రం మొత్తం యోగశాస్త్రవివరణ. దానికి పతంజలి యోగసూత్రాలు ఆధారమైనప్పటికీ, తిరుమూలార్ స్వీయానుభవాలనుంచి ప్రతిపాదిస్తున్న అంతర్దృష్టి అందులో ప్రధానం. నాలుగవ తంత్రం మంత్ర, యంత్ర వివరణ. అయిదవ తంత్రం విశేష అధ్యాయం. అది శివభక్తి కావ్యం. ఆరవతంత్రం శైవ సిద్ధాంతాన్ని బట్టి చేపట్టవలసిన సాధన వివరణ. ఏడవ తంత్రం శైవ సిద్ధాంతాన్ని మరింత సాంకేతిక పదజాలంతో వివరిస్తుంది. ఎనిమిదవ తంత్రం మొత్తం రచనలో సర్వోత్కృష్టమైన భాగం. శైవసిద్ధాంతంలోని మూల భావనల్నీ, ప్రతిపాదనల్నీ ఎంతో ఉత్తేజకారకంగా వివరించే రచన అది. తొమ్మిదవ తంత్రం

శివయోగి సాధనకి ఫలశ్రుతిలాంటిది. ఒక విధంగా తిరుమంతిరానికి కూడా ఫలశ్రుతిలాంటిది.

ఇటీవలి కాలంలో, ముఖ్యంగా 2010 లో వెలువడిన పది సంపుటాల ఇంగ్లీషు అనువాదం, వ్యాఖ్యానం ఆ రచనకి ప్రపంచవ్యాప్తంగా అభిమానుల్ని, ప్రశంసకుల్నీ సంపాదించిపెట్టింది. భారతీయ దర్శనాల్ని అర్థం చేసుకోవడానికి సంస్కృతం, పాళి, ప్రాకృతాలతో పాటు తమిళం తెలియడం కూడా తప్పనిసరి అని తిరుమంతిరం చాటిచెప్తున్నది.

అట్లాంటి తిరుమూలార్‌ని నేను మర్చిపోయినా ఆయన నన్ను మర్చిపోకుండా తనని గుర్తుచేయడం నాకెంతో ఆశ్చర్యమనిపించింది. మేము ఊరి బయట తిరుమూలార్ గ్రామానికి పోయే దారి చూసాననీ, ఆ ఊరికి వెళ్ళే దారి చెప్పమని మఠం సిబ్బందిని అడిగినప్పుడు, వారు తిరుమూలార్ తపస్సు చేసుకున్న శివాలయం మఠాన్ని ఆనుకునే ఉందని, ఆ దేవాలయం చూసి వెళ్ళమని చెప్పారు. తిరుమూలార్ గ్రామమని మేము చెప్తున్నది సాతనూరు అని చెప్తూ, ఆ ఊరికి వెళ్ళే దారి కూడా చెప్పారు. అప్పటికింకా మధ్యాహ్నమే కావడంతో ఆ దేవాలయం తలుపులు మూసి ఉన్నాయి. కాని మేము తిరుమూలార్ దేవాలయాన్ని, ఆయన తపస్సు చేసుకున్న రావిచెట్టునీ చూసి సాతనూరు బయల్దేరాం.

చుట్టూ పొలాలు, పంటకాలువలు, అరటి, తమలపాకు తోటల మధ్య, సాతనూరు, గోదావరిజిల్లాల గ్రామంలానే కనబడింది. అక్కడ ఊరి బయట, చేల మధ్య, సుందరనాథుడు మూలన్ దేహంలో ప్రవేశించిన చోట చిన్న మందిరమొకటి ఆయన పేరుమీద కట్టారు. అందులో ఆయన విగ్రహం ప్రతిష్టించారు. ఆ మందిరం తలుపులు తెరిచే ఉన్నాయి. ఆ మందిరం ముంగిట్లో మామూలుగా దేవాలయాల్లో నంది ఉండే చోట, ఒక ఆవూ, లేగదూడల ప్రతిమలున్నాయి. ఆ ప్రాంగణంలో గోడమీద తిరుమంతిరం నుంచి పద్యాలు రాసి ఉన్నాయి. మేమా మందిరంలో కొంతసేపు కూచున్నాం.

మేమింకా కారైక్కల్ వెళ్ళవలసి ఉంది కాబట్టి, అక్కణ్ణుంచి లేచి కారులో కూచున్నాక, అప్పుడు ఆ మధ్యాహ్నం మఠాధిపతి నా చేతుల్లో పెట్టిన పుస్తకాలేమై ఉండవచ్చునా చూద్దామని వాటిని తీసి చూసాను. అవి తమిళంలో ఉన్నాయి. వాటిలో కొద్దిగా పెద్దపుస్తకంగా కనిపిస్తున్నదాన్ని చూపించి నారాయణమూర్తిని ఆ పుస్తకం పేరేమిటని అడిగాను.

'తిరుమంతిరం' అన్నాడతడు!

తిరుమంతిరం కూడా అనుభవామృతంలాగా, సూరపురాజు రాధాకృష్ణమూర్తి వంటి భావుకులు అనువదించవలసిన రచన. అయినా నా చాపల్యాన్ని ఆపుకోలేక, రెండు మూడు పద్యాలు మీకోసమిట్లా తెలుగులో అందిస్తున్నాను.

## ప్రభుకృపాదృష్టి అటువంటిది

### 113

ఆయన నేరుగా స్వర్గంనుంచి అవతరించాడు, దేహధారిగా,
కర్మధారిగా, చల్లని కృపాచరణాలు నా శిరసుపై మోపుతూ
నాలో నిశ్చల ప్రతిష్ఠితుడిగా, నా హృదయాన్ని కరిగించేస్తూ
నా కళ్ళల్లో కరుణ నింపుతూ, మాలిన్యాలన్నిటినీ కడిగేస్తూ.

### 115

వాళ్ళు పతి, పశు, పాశమని మూడున్నాయంటారు.
అనాదులు పతి, పశు, పాశం మూడూకూడా.
పశువూ పాశం పతిని చేరలేవుగాని పతివాటిని
స్పృశించాడా, ఇంక పశువులేదు, పాశం లేదు.

### 117

సూర్యకాంతిశిలని దూదిలో చుట్టిపెట్టవచ్చు
ఆ సన్నని పోగుల గూడుని ఆ శిల కరిగించదు.
ఒక్కసారి సూర్యకాంతిదాన్ని సోకిందా అదెట్లా
రగిలిపోతుందని! ప్రభుకృపాదృష్టి అటువంటిది.

### 161

పైన కప్పులేదు, కింద నిలబడటానికి గచ్చులేదు
రెండు కాళ్ళు దన్ను, అడ్డంగా ఒక దూలం
పైన అరకొర గడ్డికప్పు, లోపల గోడమెత్తలేదు
పూర్వం చేసిన జన్మకర్మతో తయారైన ఖాళీపాత్ర.

## 270

ప్రేమా, శివుడూ రెండంటారు తెలియనివాళ్ళు.
ఎవరికీ తెలీదు, ప్రేమ ఒక్కటే శివుడని
ప్రేమా, శివుడూ ఒక్కటేనని ఎవరికి తెలుస్తుందో
వాళ్ళు ప్రేమశివమూర్తిగా మారిపోతారు.

## 288

అహర్నిశలూ తననే తమ గుండెలో ఎవరు
నిలుపుకున్నారో, ప్రేమాతిశయంతో పరవశిస్తారో
వాళ్ళని ఆయన గుర్తుపడతాడు, వాళ్ళకోసం
స్వయంగా దిగివచ్చి తనే వాళ్ళ తలుపు తడతాడు.

## 1482

సన్మార్గి అంటే శక్తి సాకారంగా ప్రత్యక్షమయిందని
గుర్తుపెట్టుకో. ఎక్కడ సన్మార్గి ఉంటే అక్కడ
దేవుడున్నట్టు. సన్మార్గుల సభని చూస్తే శివుణ్ణి
చూసినట్టే, ఇంక నీదే మతమో నాకు అక్కర్లేదు.

## 2209

ఇన్నాళ్ళూ నేనిది తెలియకుండానే గడిపాను
ఇప్పుడిది తెలిసాక, మరేదీ తెలియకున్నాను
ఇప్పుడిదీ సత్యమని తెలుసుకున్నాక
అదే నేనని సంపూర్తిగా తెలుసుకున్నాను.

## 2372

నేనే ఆ పరమసత్యాన్నంటుంది వేదాంతం
నేనా సత్యంగా మారగలనంటుంది సిద్ధాంతం
వేదాంతులు తురీయావస్థలో ఆత్మని కనుగొంటారు
శివయోగులు నిర్మల మాధుర్యంగా మారిపోతారు.

# తమిళ భక్తి కవిత్వానికి తల్లి

**కా**రైక్కాల్ ఒకప్పుడు ఫ్రెంచి కాలనీ. ఇప్పుడు పుదుచ్చేరి రాష్ట్రంలో ఒక భాగం. కాని పుదుచ్చేరికి దూరంగా నాగపట్టణం జిల్లాకి దక్షిణసరిహద్దులో ఉంది. మేమా ఊళ్ళో అడుగుపెట్టేటప్పటికే సాయంకాలమవుతూ ఉంది. ఊరేమంత ప్రత్యేకంగా లేదు. వీథులు దుమ్మురేగుతో ఉన్నాయి. కాని నా దృష్టి ఆ పట్టణం మీద లేదు. ఆ ఊళ్ళో అమ్మైయ్యారు పేరు మీద చూడవలసిన స్థలం ఏమిటో, ఎక్కడుందో, అక్కడికి ఎంత తొందరగా వెళ్తానా అన్నదొకటే నా ఆత్రుత. మేం నలుగురినీ కనుక్కుంటూ అమ్మైయ్యారు కోవెల దగ్గరికి చేరుకున్నాం. ఆ కోవెల ఊరి మధ్యలోనే ఉంది. నిర్మాణం మరీ ఇటీవలికాలం నాటిది. ఆ కోవెలని ఆనుకుని ఒక కోనేరు కూడా ఉంది. ఆ దేవాలయంలో ముందువైపునే అమ్మైయ్యారు మందిరమూ, అందులో ఆమె విగ్రహమూ ఉన్నాయి. మరొక పక్క ఒక మంటపం ఉంది. లోపల శివాలయం ఉంది. బయట మందిరంలో గోడలమీద అమ్మైయ్యారు జీవితకథని వివరిస్తూ వర్ణచిత్రాలు ఉన్నాయి.

అమ్మైయ్యారు కోవెలలో అమ్మైయ్యారు విగ్రహం లక్ష్మీదేవిని తలపిస్తూ నిండుగా ప్రసన్నంగా, మంగళమయంగా కనిపిస్తున్నది. అర్చకుడు ఆమెకి హారతి ఇచ్చి మాకు ఆమె కథ తమిళంలో వివరించాడు. ఆమెకి అలంకారం చేసిన పూలమాలనుంచి ఒక చిన్న దండ తెంపి నా చేతుల్లో పెట్టాడు. చూద్దును కదా, అది సన్నజాజిమాల! ఆ రోజు నా దోసిట్లో గుప్పుమన్న ఆ సౌరభం ఇప్పటికీ నన్ను వదల్లేదు!

ఆమె కవిత్వం ఎక్కడ దొరుకుతుంది అనడిగితే ఆ అర్చకుడు దేవాలయం రిసెప్షను కౌంటరు వైపు చూపించాడు. కాని అక్కడ ఎవరూ కనిపించలేదు. పక్కనొక దుకాణంలో అడిగితే ఊళ్ళో ఏదో బుక్ షాపు పేరు చెప్పారు. మేమా కవిత్వం వెతుక్కుంటూ ఆ ఊరంతా ఒక చుట్టు తిరిగాం. కాని ఆ దుకాణాలవాళ్ళు ఆమె కవిత్వం దేవాలయంలోనే దొరుకుతుందంటే మళ్ళా గుడికి వచ్చాం. అప్పటికి ఆ కౌంటరు దగ్గర ఆమె కవిత్వం దొరికింది. పట్టుమని వందపేజీలు కూడా లేని చిన్న పుస్తకం. అందులో ఆమె జీవితచరిత్రతో పాటు ఆమె కవిత్వం తమిళంలో ఉంది. ఆ పుస్తకాన్ని అట్లా చేతుల్తో

ఆప్యాయంగా తడుముకున్నాను. పదిహేను పదహారు శతాబ్దాల కిందటి ఆ కవిత్వం కోసం ఎంతో దూరం నుంచి ఒక పాఠకుడు ఇట్లా దప్పి పడి వచ్చాడంటేనే ఆ కవిత్వం ఎంత విశిష్టమో తెలుస్తూనే ఉంది కదా.

అమ్మైయ్యారు వంటి కవయిత్రి ప్రాచీన గ్రీసులో పుట్టి ఉంటే ఆమెకి 'శాఫో'ని మించిన ప్రశస్తి లభించి ఉండేది. తమిళదేశంలో కాని, భారతదేశంలోగాని ఆమె మొదటి కవయిత్రి కాదు, మొదటి భక్తి కవయిత్రీ కాదు. కాని ఆమె లేకపోయి ఉంటే, తదనంతర భారతీయ భక్తి సాహిత్యం మనకు తెలిసిన రూపంలో ఉండి ఉండేదే కాదు. కాని ఆమెకి ముందు థేరీగాథలు చెప్పిన బౌద్ధ సన్యాసినులూ, ఆమె తదనంతరం కవిత్వం చెప్పిన ఆండాళ్, మీరా, లల్ల, అక్కమహాదేవి వంటి వారు పరిచయమైనంతగా ఆమె పాఠకలోకానికి పరిచయం కాలేదు. అలాగని ఆమెని తమిళ ప్రపంచం పట్టించుకోలేదా అంటే, ఇదిగో, ఇక్కడ ఆమెకొక గుడి కట్టింది, ఆమె కవిత్వాన్ని గుదిగుచ్చి ఇట్లా ప్రచురిస్తూ పంచిపెడుతూనే ఉన్నది.

కాని ఒకసారి అమ్మైయ్యారు గురించి విన్న తరువాత, ఆమె కవిత్వం చదివిన తరువాత ఏ భావుకుడైనా ఆమెకి జీవితకాల ఆరాధకుడిగా మారకుండా ఉండటం అసాధ్యం. తక్కిన భక్తి కవుల్లాగా ఆమె భగవంతుడి సౌందర్యాన్ని దేవాలయంలోనో, ప్రజలమధ్యనో, నామంలోనో, సుందర రూపంలోనో, భగవంతుడితో ఏర్పరచు కోవాలనుకునే ఒక సఖ్యతలోనో, సుమధురసాన్నిహిత్యంలోనో వెతుక్కోలేదు. ఆమె తన దైవాన్ని శ్మశానాల్లో వెతుక్కుంది. ఆండాళ్‌లాగా, మీరా లాగా తనని తన ఇష్టదైవానికి సఖిగా కాక, ఆ స్మశాననృత్యం చేసే పశుపతి పరివారంలోని ఒక భూతంగా భావించుకుంది.

'కారైక్కాల్ పేయి' (కారైక్కాల్ భూతం) అదీ ఆమె సంతకం! అక్కడ ఆ మందిరంలో ఒక సుందర, మంగళమయ మూర్తిగా కనిపిస్తున్న ఆ తల్లి తనని తానొక దెయ్యంగా, భూతంగా ఎందుకు అభివర్ణించుకుంది?

ఇప్పటికి దాదాపు పదహారువందల ఏళ్ళ కిందటి మాట. కారైక్కాల్‌లో ధనదత్తుడనే ఒక వర్తకుడుండేవాడు. చాలా సంపన్నుడు. అతడికి పునీతవతి అనే ఒకే కూతురుండేది. సౌందర్యవతి. ఆ కూతురంటే అతడికి ప్రాణం. ఆమెని అపురూపంగా చూసుకునేవాడు. ఆమెకి యుక్తవయసు వచ్చాక పరమదత్తుడనే ఒక వర్తకుడికిచ్చి పెళ్ళిచేసాడు. వాళ్ళకి తను ఉన్న ఊళ్ళోనే ఒక మేడ కట్టించి ఇచ్చాడు. తన కూతురు తన కళ్ళముందే ఉండాలన్నది అతడి కోరిక. కొంత కాలం గడిచింది. ఆమె జీవితం సంతోషమయంగా గడుస్తూంది.

ఒకరోజు పరమదత్తుడు తన అంగడిలో ఉండగా అతడికెవరో రెండు మామిడి పండ్లు పంపించారు. అతడు వాటిని ఇంటికి పంపించాడు. తాను మధ్యాహ్నభోజనానికి ఇంటికి వెళ్ళినప్పుడు తన భార్యతో కలిసి వాటిని రుచిచూడాలనుకున్నాడు. పునీతవతి ఆ పండ్లు లోపల పెట్టింది. కొంతసేపటికి ఒక భిక్షువు ఆమె ఇంటిముందు నిలబడి భిక్ష యాచించాడు. అప్పటికింకా వంట పూర్తవలేదు. ఆమె అప్పుడే ఉడికిన కొద్ది అన్నంతో పాటు, ఆ పండ్లలో ఒకటి ఆ భిక్షువుకి భిక్షగా సమర్పించింది.

ఆ మధ్యాహ్నం భర్త ఇంటికి వచ్చాడు. అన్నం తిన్నాక, తాను పొద్దున పంపిన మామిడి పండు ఒకటి తెమ్మన్నాడు. ఆమె ఇంట్లో ఉన్న ఒక్క పండూ అతడికి పెట్టింది. ఆ పండు అతడికి రుచిగా తోచింది. రెండవ పండు కూడా తినాలనిపించి తెమ్మన్నాడు. పునీతవతికి ఏమి చెయ్యాలో పాలుపోలేదు. ఆమె వంటింట్లోకి వెళ్ళి శివుణ్ణి ప్రార్థించింది. ఒక అదృశ్య హస్తం ఆమె చేతుల్లో ఒక మామిడి పండు పెట్టింది. ఆమె ఆశ్చర్యంతో ఆ పండునట్లానే తీసుకుపోయి భర్తకు అందించింది. అతడు ఆ పండు రుచిచూసాడు. కాని అది మామూలుగా లేదు. అంతేకాదు, ఆ పండు రుచికీ, మొదటి పండు రుచికీ పోలికనే లేదనిపించింది.

అతడికి అనుమానం వచ్చింది. నిజం చెప్పమని భార్యని నిలదీసాడు. ఆమె జరిగింది జరిగినట్టు చెప్పింది. అతడు నమ్మలేకపోయాడు. అలా అయితే, శివుణ్ణి మరొక పండు అడిగి తీసుకురా అన్నాడు. ఆమె శివుణ్ణి మరో మారు ప్రార్థించింది. ఆమె చేతుల్లో మరొక పండు వచ్చి నిలిచింది.

పరమదత్తుడు భయపడిపోయాడు.

అప్పటికి తెప్పరిల్లి, ఆ తర్వాత నెమ్మదిగా వ్యాపారం పేరుమీద దూరదేశాలకు వెళ్ళివస్తానని చెప్పి, ఆమెనుంచి పారిపోయాడు. ఆమె తన భర్త తిరిగి వస్తాడని నమ్ముతో ఎదురు చూస్తో తన తండ్రి దగ్గరే కాలం గడుపుతూ ఉంది. కొన్నేళ్ళకు పరమదత్తుడు మధురై దగ్గర నివాసముంటున్నాడనీ, మరొక వివాహం చేసుకున్నాడనీ తెలిసింది. ఇప్పుడేమి చెయ్యవలసి ఉంటుందని తండ్రి పెద్దలతో సంప్రదించాడు. వాళ్ళు పునీతవతి ఉండవలసింది తన భర్త దగ్గరే అని తీర్మానించేరు. ఆమె తాను తన భర్త దగ్గరకు రానున్నట్టుగా కబురు పంపించింది. పరమదత్తుడు కూడా ఆమెని రమ్మని ఆహ్వానించేడు.

కానీ తీరాచేసి ఆమె మధురై పొలిమేరలకు చేరుకునేసరికి, పరమదత్తుడు తానే ఆమెకు ఎదురేగాడు. తన రెండవ భార్యతోనూ, ఆమెకి పుట్టిన కూతురితోనూ పునీతవతి పాదాలమీద పడి నమస్కరించాడు. ఆమె మానవమాత్రురాలు కాదనీ, దైవాంశ సంభూతురాలనీ, ఆమెను తాను అంతకుముందులాగా భార్యగా చూడలేననీ చెప్పాడు.

ఆమెను కొలుచుకుంటూ తన కుటుంబం ఆమె పాదసేవలో తరించిపోయేటట్టుగా అనుగ్రహించమని అడిగాడు.

పునీతవతి నిశ్చేష్టురాలైపోయింది. ఆమె అడుగులు ముందుకు పడలేదు. వెనక్కి తిరిగి వచ్చేసింది. ఇప్పుడు శివుడు తప్ప తనకు మరెవ్వరూ లేరని అర్థమయింది. తన భర్తకి అవసరం లేకపోయాక తన సౌందర్యంతో తనకు పనేముందనుకుంది. తననొక భూతంగానో, దెయ్యంగానో మార్చేయమని శివుణ్ణి కోరుకుంది. దాదాపుగా భూతంలానో, ప్రేతంలానో మారిపోయిన దేహంతో అక్కడే కారైక్కాల్ లో శివుణ్ణి ప్రార్థిస్తూ కొన్నాళ్ళు గడిపింది. కాని ఆమెకి ఆ ఊళ్ళో కూడా తానెందుకు జీవించాలనిపించింది. తాను ఉండవలసింది కైలాసంలో కదా, భూమ్మీద కాదుకదా అనుకుంది. కైలాసయాత్ర మొదలుపెట్టింది. శేక్కిలార్ చెప్పినదాని ప్రకారం ఆమె కైలాసానికి వెళ్ళిందిగాని, ఆమె అక్కడ కూడా ఉండాలనుకోలేదు, తిరువాలంగాడు క్షేత్రంలో, శివుడి ఊర్ధ్వతాండవ నృత్యం చూస్తూ, ఆ పశుపతి పాదాల దగ్గర శాశ్వతంగా ఉండిపోవాలని కోరుకుంది. ఆమె తిరువాలంగాడుకి వెళ్ళినప్పుడు పాదాలమీద నడవాలనుకోలేదు. పాదస్పర్శ ఆ పుణ్యక్షేత్రాన్ని మలినపరుస్తుందని భావించి పాదాలు పైకెత్తి అరచేతులమీద దేహాన్ని నడుపుకుంటూ ఆ క్షేత్రానికి చేరింది. ఆమె భక్తి చూసి శివుడికి ఏమనాలో తోచలేదు. 'అమ్మా' అని మాత్రం అనగలిగాడు. ఆ రోజునుంచీ పునీతవతి అమ్మైయ్యారుగా ప్రసిద్ధికెక్కింది.

శేక్కిలార్ శివభక్తుల చరిత్రల్ని పెరియపురాణంగా రాసినప్పుడు అమ్మైయ్యారునే మొదటినాయనారుగా పేర్కొన్నాడు. సుందర మూర్తి, నంబి ఆండార్ నంబి కూడా ఆమెతోటే తమ శివభక్తవర్ణన మొదలుపెట్టారు. కొద్దిపాటి తేడాలతో వారు ముగ్గురు చెప్పిన కథా ఒక్కటే. ఆ కథలోని పౌరాణికమైన పూతని దులిపి చూస్తే మనకి అర్థమయ్యేది ఒక్కటే. ఆమె ప్రాపంచిక జీవితాన్ని పక్కకు పెట్టి శివుడి ప్రమథగణాలకు చెందిన ఒక భూతంగా తనని తాను చూసుకుందనీ, ఆ అర్హతతోటే శివుణ్ణి కీర్తిస్తూ కవిత్వం చెప్పిందనీ.

ఆమె రాసిన కవిత్వం ఇప్పుడు 143 పద్యాలు మాత్రమే లభ్యంగా ఉన్నాయి. అందులో 'అద్భుత తిరువందాది', 'ఇరట్టై మణిమాలై' అనేవి రెండూ ఆమె కారైక్కాల్ రోజుల్లో రాసినవాటిగానే పరిగణించవచ్చు. 'అద్భుత తిరువందాది' ఒక శతకం. కవి సంతకంతో కలిపి నూటొక్క పద్యాలు. 'అంతాది' లేదా 'అందాది' ఒక తమిళ ప్రక్రియ. తెలుగులో ముక్తపదగ్రస్తం లాంటిది. మొదటి పద్యంలోని చివరి పదం రెండవ పద్యానికి మొదటి పదంగా మారుతుంది. ఛందస్సు తమిళ దేశి ఛందస్సు 'వెన్బా'. ఆ స్తోత్రంలో ఆమె తనని తాను 'కారైక్కాల్ కి చెందిన భూతం'గానే అభివర్ణించుకుంది. ఇరట్టై మణిమాలై ఇరవై పద్యాల మణిమాల.

ఇక మిగిలిన పద్యాలు 'తిరువాలంగాడు మూత్త తిరుపదికం' పేరిట రెండు భాగాలు. మొదటి భాగంలో పదకొండూ, రెండవ భాగంలో పదకొండూ మొత్తం ఇరవైరెండు పద్యాలు. వాటిని ఆమె తిరువాలంగాడు క్షేత్రంలో శివుణ్ణి దర్శించి చెప్పిందని మనం రూఢిగా భావించవచ్చు. వస్తువు, దర్శనం, వర్ణన, ఛందస్సు, సంగీతం వేటిని దృష్టిలో పెట్టుకు చూసినా 'తిరువాలంగాడు తిరుప్పదికం' తమిళ సాహిత్యంలోనే కాదు, ప్రపంచ సాహిత్యంలోనే ముందు వరసలో నిలబడే మహోన్నత కవిత్వం.

ఒక విధంగా చెప్పాలంటే అమ్మైయ్యారు తమిళ భక్తి కవిత్వానికే తల్లిలాంటిది. ముగ్గురు నాయనార్లూ, ఆళ్వార్లూ, మాణిక్యవాచకర్, కంబర్, అరుణగిరినాథార్ మొదలైన తమిళ భక్తి కవులంతా ఆమె పెట్టిన అన్నం ముద్దతో అక్షరాభ్యాసం చేసినవాళ్ళే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

# బీభత్స సౌందర్యంలోని అద్భుతరసం

**ఆ**మె కవిత్వం కోసం రెండు రోజులుగా ఆకలితో ఎదురుచూస్తున్నాం అని రాస్తున్నారు మానస, అమెరికానుంచి, అమ్మైయ్యారు గురించి. ఆశ్చర్యం లేదు. మరొక ఐదారువందల ఏళ్ళ తరువాత కూడా రసజ్ఞుల్నిట్లానే తన కవిత్వం కోసం ఎదురు చూసేలా చేయగలిగే శక్తి అమ్మైయ్యారు మాటల కుంది. కానీ, ఏ చెయ్యను! మూడు రోజులుగా అసెంబ్లీలోనే గడిచిపోతోంది జీవితం, కానీ, నా మనసు మాత్రం కారైక్కాల్‌కీ తిరువాలంగాడుకీ మధ్య తిరుగుతూనే ఉంది.

> **నేనీ ప్రపంచంలో పుట్టి మాటలు నేర్చినప్పటినుంచీ**
> **పట్టలేనంత ప్రేమతో నీ పాదాల దగ్గరే పడి ఉన్నాను**
> **దేవుళ్ళకే దేవుడివి, మణిలాగా మెరుస్తూ**
> **నీ కంఠం మీద నీలిమరక, దేవాధిదేవా**
> **నన్నీ బాధలనుంచి ఎప్పుడు బయటపడేస్తావు?**

అని మొదలుపెడుతుంది 'అద్భుత తిరువందాది' పద్యాలు అమ్మైయ్యారు. ఆ వంద పద్యాల ఆ స్తోత్రమాలని అయిదవ శతాబ్ది గీతాంజలిగా అభివర్ణించవచ్చేమో. దేవుడు ఒక మూర్తిలోనో, ఒక నామంలోనో మాత్రమే లేడనే ఎరుక ఆధునిక భక్తి కవిది. కాని ఒకసారంటూ దేవుణ్ణి నువ్వు చూడగలిగితే, ఆ దివ్యస్ఫురణ పదే పదే ఆ దర్శనం చుట్టూతానే పరిభ్రమిస్తూ ఉంటుందనే ఎరుక ప్రాచీన భక్తి కవిది. మెరుపులో, మేఘంలో, నువ్వింకా నిద్రపోతూండగానే రేకలు విప్పుకున్న తామరపువ్వులో, అర్థరాత్రి నీ ఇంటి తలుపు తట్టిన అతిథిలో, ప్రతి ఒక్క epiphany లో సర్వేశ్వరుణ్ణి చూడటం ఒక విధంగా ఈశావాస్యమిదం సర్వం అనే ఉపనిషద్రహస్యమే అయినప్పటికీ, అటువంటి మెలకువ వెనక ఎంతో కొంత ఆధునికత లేకపోలేదు. కాని, సర్వేశ్వరుణ్ణి నీ పొరుగువాడిగా, నీ ఊరిపొలిమేరల్లో పసులు కాచుకునే పిల్లవాడిగా, అర్థరాత్రి ఏటి ఒడ్డున మురళి ఊదే పాపడిగా చూడటం ప్రాచీన భక్తికి మరింత బాగా తెలుసు.

నిజానికి ప్రాచీన భక్తి కవుల సామాజికతా, ప్రాసంగికతా ఇక్కడే ఉన్నాయని మనం గుర్తుపెట్టుకోవాలి.

అమ్మైయారు ని భారతీయ భక్తి సాహిత్యంలో మొదటి భక్తికవిగా అభివర్ణిస్తున్నప్పుడు ఆమె దర్శనంలోని విశిష్టతని ఇక్కడ చూడాలి మనం. ఆమె ముందు కవిత్వం రాసిన స్త్రీలున్నారు. సంగకాలం నాటి అవ్వయ్యారును మించిన కవయిత్రి ఎవరుంటారు? అమ్మైయ్యారుకి ముందు కూడా శివుడు తమిళ సాహిత్యంలో కనబడకపోడు. కాని ఆ సాహిత్యంలో కనబడే అనేక బౌద్ధ, బ్రాహ్మణ, జైన, తమిళ దేవతానీకంలో ఒకడిగా మాత్రమే కనిపిస్తాడు. మురుగన్ ని సేయోన్ (కుమార–దేవుడు) అని పిలుస్తున్నప్పుడు ఒక తండ్రి–దేవుడు కూడా ఉండాలన్న ఊహగా మాత్రమే స్ఫురిస్తాడు.

కాని అటువంటి శివుణ్ణి, వేదాల్లోనూ, పురాణాల్లోనూ మాత్రమే కనిపించే శివుణ్ణి అమ్మైయ్యారు తమిళ గ్రామాల్లోనూ, అడవుల్లోనూ, వల్లకాడుల్లోనూ దర్శించింది. ఆయన్ని మాత్రమే దర్శించింది. ఆయన్ని మాత్రమే స్తుతించింది. అది కూడా తదనంతర భక్తి కవుల్లాగా, ఏదో ఒకటి ఆశించి కాదు, ఆ శివుడితో ఏదో ఒక బాంధవ్యాన్ని నెరపుకుంటూ కాదు, నిష్కారణంగా, నిర్హేతుకంగా, అద్భుత తిరువందాదిలో మొదటి కవిత చూసారు కదా, అందులో 'నా బాధలనుంచి నన్నెప్పుడు బయటపడేస్తావు' అని అడిగింది కదా, కాని వెంటనే రెండవ పద్యంలో ఇలా అంటున్నది:

**ఆయన మన బాధలు తొలగించకపోయినా**
**మన మీద జాలి చూపించకపోయినా**
**మనమే దారిననడవాలో మనకి చేయి పట్టి చూపించకపోయినా**
**ఎముకల దండ మెళ్ళో వేసుకుని**
**నిప్పులమధ్య నడిచే ఆ దేవుడి పట్ల,**
**అగ్నిశిఖలాంటి ఆ దేవుడి పట్ల**
**నా ప్రేమ ఇసుమంతైనా తగ్గదు.**

అదీ అమ్మైయ్యారు. అంతకు ముందు సంస్కృతంలోగాని, పాళీలోగాని, చతుర్విధ ప్రాకృతాల్లోగాని, తమిళంలోగాని అంతదాకా ఎటువంటి కవీ అటువంటి మాటలు చెప్పి ఉండలేదు. ఈ పద్యం ఒక్కటే చూసినా కూడా ఇందులో ఎన్నో అద్వితీయతలు కనిపిస్తాయి. మొదటిది, ఈ కవితలో కవి 'నేను' అని కాదు, 'మేము' అని అంటున్నది. టాగోర్ గీతవితానమంతా వెతికినా కూడా 'మన' అనే మాట మనకెక్కడా కనబడదు. నిజానికి తమిళంలో 'పేయి' అనే మాట ఏకవచనమూ, బహువచనమూ కూడా.

భూతమూ, భూతగణమూ కూడా. ఆమె చెప్తున్నది ఆమె ఒక్కరి అనుభూతి మాత్రమే కాదు. అది మనందరి అనుభూతి కూడా. ఆమె లాగా అనుభూతి చెందగలిగిన ప్రతి ఒక్కరికీ ఆ దర్శనం సిద్ధిస్తుందనే చెప్తున్నది ఆమె. మరొక విషయం, ఆమె ఎక్కడా తన పేరు చెప్పుకోకపోవడం. తులసీ, మీరా, కబీర్, బసవన్న, తుకారాం లాంటి భక్తికవులు అద్భుతమైన కవిత్వం చెప్పినప్పటికీ, వారి ప్రతి ఒక్క కవితలోనూ వారి సంతకం వదిలిపెట్టి వెళ్ళారు. అమ్మైయ్యారుకి అటువంటి సంతకంతో పనిలేదు. ఆమె తన వ్యక్తిత్వ ప్రత్యేకతనుంచి విడివడి ఒక భూతంగా మారిపోయినప్పుడే ఆమె నిజమైన శివసమాజంలో కలిసిపోయింది. ఆ సమాజమే ఆమె సాయుజ్యం కూడా.

వీటన్నిటినీ మించి అమ్మైయ్యారు దర్శనంలో విశిష్టత ఆమె శివుణ్ణి శ్మశాన నర్తకుడిగా చూడటం.

ఇదేమిటో అర్థం కావాలంటే, భారతీయ చరిత్ర క్రమం గురించి రెండు మాటలు చెప్పుకోవాలి. భారతదేశ చరిత్రని సూక్ష్మంగానూ, నిశితంగానూ పరిశీలించినవారికి ఒక విషయం అర్థమవుతుంది. అదేమంటే, గత అయిదారువేల ఏళ్ళుగా భారతీయ చరిత్ర ఒక సెంట్రీ-పెటల్, సెంట్రీ-ఫ్యూగల్ క్రమంలో నడుస్తూ వస్తున్నదని. కొన్నాళ్ళు అది అంచుల నుంచి కేంద్రానికి నడుస్తుంది. మరొక యుగంలో కేంద్రం నుంచి అంచులవైపు నడుస్తుంది. కొన్నాళ్ళ పాటు దేశమంతా ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష, ఒకే దైవం అని నడుస్తుంది. ఆ వెంటనే దేశమంటే బహుమతాలు, బహుభాషలు, బహు సంస్కృతులు అనే చైతన్యం ఉప్పెనలాగా విరుచుకుపడుతుంది. ఈ క్రమంలో ఒకప్పుడు కేంద్రంలో ఉండే దేవతలో, నాయకులో దేశానికంతటికీ దేవతలుగా, నాయకులుగా నడుస్తారు. నెమ్మదిగా అది ఒక hegemony గా మారుతుంది. అప్పుడు దానిమీద అంచులనుంచి తిరుగుబాటువస్తుంది. అంచుల్లోంచి దేవతలూ, వీరులూ ముందుకొస్తారు. నెమ్మదిగా వాళ్ళు జాతీయదేవతలుగా, జాతీయనాయకులుగా వికసిస్తారు. మళ్ళా అదొక కేంద్రీకృత వ్యవస్థగా మారుతుంది. తిరిగి మళ్ళా అంచులనుంచి ప్రతిఘటన ఎదురవుతుంది.

ఉదాహరణకి వేదకాల వ్యవస్థని తీసుకుంటే, అది మొదట్లో అంచులనుంచి మొదలైన చైతన్యం. సప్తసింధులోయకి చెందిన ఒక సంస్కృతి, ఒక సంస్కారం. అది మలివేదకాలం నాటికి గంగాయమునా మైదానంలో ఒక వ్యవస్థగా బలపడేటప్పటికి, దానిమీద తిరుగుబాటుగా బౌద్ధమూ, జైనమూ అంచులనుంచి ముందుకొచ్చాయి. ముఖ్యంగా బుద్ధుడు స్పష్టంగా అంచులనుంచి కేంద్రానికి జరిగిన శక్తి. మధ్యయుగాల

తుదికాలం నాటికి మొఘల్ సామ్రాజ్యం బలీయమైన కేంద్రీకృత వ్యవస్థగా ఊడలు తన్నుకుని వ్యవస్థితమైపోయినప్పుడు, వలసశక్తులు సముద్రతీరం నుంచి కేంద్రాన్ని చుట్టుముట్టాయి. అప్పుడు మళ్ళా భారతఖండం ఒకే దేశమనీ, ఒకే జాతి అనీ భావిస్తూ జాతీయోద్యమం తలెత్తింది.

భారతీయ చరిత్రలోని ఈ గతితార్కికతను భారతీయ సంస్కృతికి సంబంధించినంత వరకూ 'మార్గ–దేశి' భావనగా వివరించడం పరిపాటి. దేశమంతా ఒకే భాష బలమైన ప్రభావాన్ని చూపిస్తూ, విస్తృత భారతీయ పరికల్పనల్ని ప్రకటిస్తూ ఉండటం 'మార్గ' ధోరణి. అలాకాక, ఎక్కడికక్కడ స్థానికంగా ఉండే ప్రకృతినీ, దేవతల్నీ, వేషభాషల్నీ, ఆచార వ్యవహారాల్నీ పైకెత్తి చూపడం 'దేశి'. చూడటానికి దేశి ఒక సాంస్కృతిక విషయంగా కనిపించినా అది నిజానికి ఒక రాజకీయ ప్రకటన. భారతదేశ చరిత్రలో కేంద్రాన్ని ధిక్కరిస్తూ ప్రాంతాలు తమ రాజకీయ అస్తిత్వాన్ని నిర్ధారించుకునేటప్పుడల్లా తమ దేశి భాషల్నీ, దేశి ఛందస్సుల్నీ, సంగీతాన్నీ, శిల్పాన్నీ ముందుకు తెస్తూనే ఉన్నాయి. అలా తమ దేశిని ఎంత శక్తిమంతంగా వ్యక్తం చేయగలిగితే ఆ ప్రాంతీయ రాజకీయ శక్తులు అంత బలంగానూ, స్థిరంగానూ నిలబడగలిగాయి.

ఈ పరిణామ క్రమంలో దేశి ధోరణులు ప్రబలంగా వికసించినప్పుడల్లా మార్గ ధోరణి వాటి వల్ల ప్రభావితమవుతూ వచ్చింది. మార్గ ప్రభావం బలంగా ఉన్నప్పుడు దేశి శైలి కూడా ఆ ప్రభావం నుంచి ఎంతో కొంత స్వీకరిస్తూ వచ్చింది. అటువంటి మార్గదేశి సమన్వయాన్ని ఎవరు చేసుకోగలిగినా వారు భారతీయ సాహిత్యంలో, చరిత్రలో, తత్త్వచింతనలో కొండగుర్తులుగా నిలబడిపోయారు. భక్తి సాహిత్యానికి సంబంధించినంత వరకూ అమ్మైయ్యారు అటువంటి కొండగుర్తు.

తమిళ సాహిత్యానికీ, తదనంతర కాలంలో దేశభాషల్లో భక్తి సాహిత్యానికీ అమ్మైయ్యారు అందించిన ఉపాదానాన్ని ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి. ఆమె సంస్కృత వాఙ్మయంలోని శివుణ్ణి తమిళశివుడిగా దర్శించింది. అంతకుముందు కూడా తమిళంలో శివుడు ఉన్నాడుగాని, ఆయన ఒక peripheral god గా మాత్రమే ఉన్నాడు. సంగం సాహిత్యంలో మురుగన్, కొట్రవై వంటి స్థానికదేవతలే ప్రధానంగా ఉన్నారు. సంగం యుగం మలిదశలో జైనం తమిళ పాలనాకేంద్రంలో స్థిరపడ్డాక, ఆ కేంద్రాన్ని ధిక్కరించగల ఒక దైవం అమ్మైయ్యారుకి శివుడిలో కనబడ్డాడు. ఆ శివుడు కూడా కేంద్రంలో కాదు, అంచుల్లోనూ, అడవుల్లోనూ, వల్లకాడుల్లోనూ కనబడ్డాడు. ఆ శివుడు పురాణాల్లో వర్ణించిన అష్టవిధ వీరమూర్తి, కాని, ఆ వీరుణ్ణి అమ్మైయ్యారు సంగం సాహిత్య పద్ధతుల్లో దర్శించింది, వర్ణించింది. సంగం కవిత్వంలో వీరుడి కాలికి కడియాలు

పెండేరంలాగా తొడిగేవారు. అమ్మెయ్యారు వర్ణించిన శివుడికి ఒక పాదానికి పెండేరం మరొక పాదానికి నూపురం. ఆయన అర్ధనారీశ్వరమూర్తి, విషాపహరణమూర్తి, లింగోద్భవమూర్తి, గజాసురసంహారమూర్తి. కాని ఆ రూపాలన్నీ అమ్మెయ్యారుకి ఒక స్థానిక తమిళ తలైవర్ చేసిన సాహసకృత్యాల్లాగా కనిపించాయి.

ఆమె దర్శనంలోని మరొక అద్భుతం ఆమె చూసిన శివుడు నర్తనమూర్తి. కాని అతడు మనకి తెలిసిన నటరాజు కాడు. చిదంబరంలో వెలిసి, ప్రపంచ వ్యాప్తంగా శిల్ప రసజ్ఞుల ప్రశంసలు అందుకున్న నటరాజు కాదు అతడు. అసలు మనకు తెలిసిన, మనం చూస్తున్న నటరాజు మరీ ఇటీవలివాడు. వెయ్యేళ్ళకింద అటువంటి మూర్తి లేదు. ఊర్ధ్వజాను భంగిమలో నిల్చున్న నటరాజు అమ్మెయ్యారుకి తెలియదు. ఆమెకి తెలిసిన నటరాజు ఊర్ధ్వతాండవ మూర్తి.

ఆ ఊర్ధ్వతాండవం వెనక ఒక కథ ఉంది. ఒకప్పుడు శివుడికీ, కాళికీ మధ్య నాట్యంలో పోటీ వచ్చింది. కాళి నాట్యం ముందు శివుడు నిలబడలేకపోయాడు. అప్పుడు చివరి అస్త్రంగా, ఆయన ఒక కాలు పైకెత్తి పాదాన్ని ఆకాశంలోకి చాచి ఊర్ధ్వ తాండవం చేసాడు. అమ్మవారు అట్లా ఒక కాలు పైకెత్తలేకపోయింది. అట్లా కాలు పైకెత్తడం మర్యాద కాదని భావించిందామె. దాంతో ఆమె శివుడి ముందు ఓడిపోయింది. అప్పుడు శివుడు కాళిని ఊరు విడిచి వెళ్ళిపొమ్మన్నాడు. అందుకనే తిల్లై కాళి దేవాలయం చిదంబరంలో ఊరి పొలిమేరల్లో కనిపిస్తుంది. తమిళదేశంలో శివుడు కేంద్రస్థానీయ దైవంగా స్థిరపడే క్రమంలో ప్రాచీనకాలపు గ్రామదేవతలని స్థానభ్రంశం చేయడాన్ని ఈ కథలో చూడవచ్చునని కొందరు చరిత్రకారులు చెప్తుంటారు.

కాని, ఆ శివుడి ఊర్ధ్వతాండవం చూడటానికే అమ్మెయ్యారు తిరువాలంగాడు వెళ్ళిందనీ, శివుడు ఆమెని అమ్మా అని పిలిచాడనీ అంటున్నప్పుడు, చరిత్రకారులు చెప్తున్న భాష్యం విశ్వసనీయంగా తోచదు. నాకేమనిపిస్తుందంటే, శివుడు ప్రధాన దైవంగా స్థిరపడి ఒక సమ్మోహనీయ నటమూర్తిగా మారక ముందటి రోజుల్లో, తొలిరూపంలో, ఒక విలయతాండవ మూర్తిగా, ప్రళయతాండవమూర్తిగా కనిపించాడనీ, ఆ బీభత్స నృత్యాన్ని, ఆ తొలిరోజుల్లో అమ్మెయ్యారు చూసిందనిన్నీ. ఆమెకి అది భీకరంగా కాక, సుందరంగా కనిపించింది. ఎంత సుందరమంటే, తాను కూడా ఆ పిశాచగణంలో ఒకతెగా మారిపోయేటంతగా.

అమ్మెయ్యారు కవిత్వమంతా ఆ బీభత్స సౌందర్యంలోని అద్భుతరసమే. అన్ని రకాల సామాజిక ప్రలోభాలనుంచీ, సాంగత్యవాసనలనుంచీ బయటపడ్డ భావుకురాలికి

మాత్రమే ఆ సౌందర్యం సాక్షాత్కరిస్తుంది. ఆ ఊర్ధ్వతాండవమూర్తి లోని ఏ సౌందర్యానికి వివశురాలై ఆమె కైలాసాన్ని కూడా తిరస్కరించి తిరువాలంగాడులో తనువుచాలించిందో నాక్కూడా తెలియాలంటే నేను కూడా తిరువాలంగాడు వెళ్ళకతప్పదని నిశ్చయించుకున్నాను.

అద్భుత తిరువందాది నుంచి, ఇరట్టై మణిమాలై నుంచీ కొన్ని పద్యాలు మీ కోసం.

## అద్భుత తిరువందాది

1

**అన్నీ తెలిసినవాడాయన**
**మనం తెలుసుకునేటట్టు చేసేవాడూ ఆయనే**
**మన తెలివిడి కూడా ఆయనే.**
**మనం తెలుసుకోవలసింది కూడా ఆయనే.**
**ఆయనే చంద్రుడు, సూర్యుడు, నేల, నింగి,**
**తక్కిన పంచభూతాలూను.**

*2*

**ఇదే నా ప్రభువు నాకు ప్రత్యక్షమైన రూపం**
**నా ఆశ్రయం.**
**నువ్వొక మెరుపులాగా సాక్షాత్కరించి,**
**ఇంతలోనే అదృశ్యమైపోయావు**
**అప్పణ్ణుంచీ నా మనసు అక్కడే గిరికీలు కొడుతోంది.**

*3*

**మన స్వామికి మరేమీ పట్టదు**
**భిక్షువులాగా యాచిస్తో**
**నాలుగుచోట్లా తిరుగుతుంటాడు,**
**నడిరాతిరి శ్మశానంలో నాట్యం చేస్తూంటాడు.**
**మనం పోయి ఆయన్ని చూడగలిగితే**
**ఎందుకట్లా చేస్తున్నావని అడగొచ్చు**
**ఇక్కడ కూచుని అడిగితే ఏం లాభం?**

## 4

ఒక పాము నాగాభరణం
మరొకటి పులితోలు చుట్టూ మెరుస్తున్న వడ్డాణం
ఇంకొకటి నీ బంగారు రంగు జటాజూటానికి చుట్టుకున్నావు
తెలుస్తోందా నీకు
ఇవన్నీ చూసి ఈ అమాయకురాలు ఏమైపోతుందో?

## 5

అసలు సత్యమేమిటో తెలియని వాళ్ళు
కేవలం పుస్తకాలు వల్లెవేసుకుంటూ తిరిగేవాళ్ళు
వాళ్ళట్లా తిరుగాడనీ.
ఆ నీలకంఠుడికి పరిమితుల్లేవు.
ఆయన కోసం పరితపిస్తున్నవాళ్ళు
ఏ రూపంలో కోరితే ఆ రూపంలో కనబడతాడాయన.

## 6

ఆయన్నే తలుచుకుంటూ
ఆయన కటాక్షాన్ని కోరుకుంటూ
ఎక్కడున్నాడాయన, ఏమైపోయాడంటూ
వెతుక్కునేవాళ్ళకొక మాట:
ఆయన్ని కనుక్కోవడం చాలా తేలిక
ఆయన, ఇదిగో, ఇక్కడ కూడా ఉన్నాడు -
నాలాంటి వాళ్ళ మనసుల్లో కూడా.

## 7

ఆ ప్రాచీన కాలంలో నువ్వు విషం తాగినప్పుడు
దేవతలు వణికిపోయారు.
కాని అప్పుడు నలుపెక్కింది నీ గొంతు మాత్రమే కాదు
పాములు చుట్టచుట్టుకున్న నీ జటాజూటంలోని
చంద్రవంకలో కూడా
ఒక నీలిమరక.

8

ఆ రోజు నువ్వెలా ఉంటావో చూడకుండానే
నేన్నీకు దాసిగా మారిపోయేను
ఇప్పటికీ నీ పరమపవిత్రరూపమెలా ఉంటుందో
నాకు నిజంగా తెలీదు.
నీ స్వామి ఎట్లా ఉంటాడు అని అడుగుతున్నారు వాళ్ళు.
ఏమని చెప్పాలి వాళ్ళకి?
నిజం చెప్పు, నువ్వెలా ఉంటావు?

9

ఆయన దేహం సుప్రభాతంలాగా ప్రకాశిస్తున్నది
ఆ దేహం మీద వెలిబూది మధ్యాహ్నమార్తాండుడిలాగా మెరుస్తున్నది
జడలు కట్టిన ఆ జటాజూటం సాయంసంధ్యావర్ణాన్ని తలపిస్తున్నది
ఇక, ఆ కంఠం మటుకు కారుచీకటి.

10

శివా, నువ్వు చరణాలు కదిలిస్తే
నరకలోకాలు పక్కకు ఒరిగిపోతాయి
నీ జటాజూటాన్ని విదిలించావా
భువనభవనం కూలిపోతుంది
కంకణాలు కదలాడే నీ చేయి చాపావా
ఎనిమిది దిక్కులూ తల్లకిందవుతాయి
ఈ రంగస్థలం నిన్ను మొయ్యలేదు
కాబట్టి, ఈ వేదిక సరి చూసుకుని మరీ
నీ నాట్యం మొదలుపెట్టు.

11

ఒక్కటడుగుతాను చెప్పు,
ఎక్కడ చూసినా మంటలు పుట్టిస్తావు కాబట్టి
నీ హస్తం ఎరుపెక్కిందా?
లేక నీ ఎర్రటి అరచేయి తాకి నిప్పు ఎర్రగా మారిందా?

పిశాచగణాలతో కాడులో, వల్లకాడులో
ఎట్లాంటి నాట్యం చేస్తున్నావు!
ఒక చేత అగ్నిశిఖ ఒడిసిపట్టుకుని
ఒక పాదానికి వీరపెండేరం ధరించి మరీ!
స్వామీ, చెప్పవయ్యా, చెప్పు.

100

అది కదిలిందా భూమి వణికిపోతుంది
అది కన్ను తెరిచిందా, దిక్కులు దగ్ధమైపోతాయి
అది గర్జించిందా, ప్రపంచం భీతిల్లిపోతుంది
అది కొండతో తలపడుతున్న సింహమా?
లేక వృషభమా?
లేక ఉరుములాగా విరుచుకుపడుతున్న నీ వృషభమా?
బంగారంలాగా మెరిసిపోతున్నావు,
అదేమిటో నాకు వివరంగా చెప్పవూ!

101

ప్రేమతో కరిగిపోతూ
కారైక్కాల్ కి చెందిన భూతం పలికిన
ఈ అందాది వెన్బా పద్యాల్ని
భక్తితో ఎవరు పాడుకుంటారో
పట్టలేనంత ప్రేమతో ఆయన్ని
ఎవరు
ఈ పద్యాలతో కొలుచుకుంటారో
వాళ్ళాయన్ని తప్పకుండా చేరుకుంటారు.

## ఇరట్టై మణిమాల

1

గొప్ప దైన్యం చుట్టుముట్టి
మిమ్మల్ని బాధిస్తున్నప్పుడు

ఏడుస్తూ కూచోకండి
ఆయన్ని ధ్యానించండి, స్తుతించండి
కళ్ళారా వీక్షించండి,
ఆ శిరసుమీద పొంగిపొర్లే గంగ,
తెల్లని, నునులేత నెలవంక,
జిల్లేడు పూల గుత్తి.

15

నువ్వు నాట్యమాడే ఈ శ్మశాన రంగస్థలిమీద కూచుని
ఈ భూతం బోసినోరు తెరిచి
బిగ్గరగా నీ పాటలు పాడుతున్నది
వీరగండపెండేరాలు చరణాలకు బిగించి మరీ
నీ పాదం పైకెత్తి నాట్యం మొదలుపెడతావు
అప్పుడు ఎక్కడెక్కడి భూతాలూ, పిశాచాలూ
నీ చుట్టూ మూగుతుంటాయి
చెప్పు, నువ్వేనా, ఒక్క బాణంతో
ఆ రాక్షసుల మూడు పెద్ద గోడలూ తగలబెట్టేసింది!

20

మీరెంత కలిమిలో జీవించినా
ఒకనాడు మరణించేటప్పటికి
మీ చుట్టపక్కాలు మిమ్మల్ని తగలబెట్టడానికి
కట్టెలు పోగుచేసేలోపలే
ఆలించండి, మీ హృదంతరాళంలోంచీ,
గాలించండి, ఇప్పుడే, ఆ విషపానమూర్తి గురించి.
నేయిపోసి రగులుతున్న మంటల్లో
నాట్యమాడే ఆ మహిమోపేత మూర్తి గురించి.

# నీళ్ళల్లో మంచు కరిగిపోయినట్టు

**కౌం**టింగు రోజు. గట్టి బందోబస్తు మధ్య కౌంటింగు మొదలయ్యింది. కాని గెలిచిన అభ్యర్థికి ఓడిపోయిన అభ్యర్థిమీద విస్పష్టమైన మెజారిటీ రావడంతో కౌంటింగు ప్రక్రియ చాలా ప్రశాంతంగా ముగిసింది. ఓడిపోయిన అభ్యర్థి ఓట్ల లెక్కింపు చివరి రౌండులో ఉండగానే, ఓటమిని అంగీకరించి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ నాక్కూడా నమస్కారం పెట్టి వెళ్ళిపోయాడు. ఇంత ప్రశాంతమైన ఎన్నికకి ఒక పరిశీలకుడు అవసరమా అనిపించింది. నేను అక్కడికి వెళ్ళింది ఎన్నికల పరిశీలనకోసం కాదనీ, నా ఆత్మపరిశీలనకోసమేననీ అర్థమయింది.

ఆ సాయంకాలం కలెక్టరు గెస్టుహవుసుకి వచ్చాడు. 'మీ దగ్గర నేనొక ఆత్మీయతను అనుభవించాను. మీరిక్కడున్నన్నాళ్ళూ నేనొక చెప్పలేని సంతోషాన్ని అనుభవిస్తూ ఉన్నాను. మీరు తమిళనాడు ఎప్పుడు రావాలనుకున్నా, ఇక్కడ మీ తమ్ముడు ఉన్నాడని మర్చిపోకండి' అన్నాడు. సుందరమైన దారు గణపతి ప్రతిమ ఒకటి నా చేతుల్లో పెట్టాడు. నా హృదయం బొంగురుపోయింది.

ఆ రాత్రి కౌంటింగు సామగ్రి మొత్తం గోడౌన్‌కి చేర్చి నా సమక్షంలో తాళం వేసి లక్క సీలు వేసేయడంతో నేను వెళ్ళిన పని పూర్తయిపోయింది. కలెక్టరుదగ్గర, ఆ జిల్లా యంత్రాంగం దగ్గరా ఆ రాత్రే సెలవు తీసుకున్నాను.

మర్నాడు పొద్దున్నే తిరిగి ప్రయాణం. తిరువాలంగాడు ఒక్కటి చూడవలసి ఉన్నదని నాకు నేను చెప్పుకున్నాను. అంతకు ముందు పున్నమి రాత్రి తిరువణ్ణామలై వెళ్ళినప్పుడు ఆ రాత్రి గిరిప్రదక్షిణం చెయ్యలేకపోయాను కాబట్టి, ఒకసారి రమణాశ్రమంలో అడుగుపెట్టి, అరుణాచలాన్ని చూసి తిరువాలంగాడు వెళ్ళాలని నిర్ణయించుకున్నాను.

నారాయణమూర్తి నాతో పాటు తిరువణ్ణామలై దాకా వస్తానన్నాడు. మేం తిరువణ్ణామలై వెళ్ళేటప్పటికి పదిగంటలు కావొస్తూంది. మేము నేరుగా రమణాశ్రమానికి వెళ్ళాం. ఎప్పట్లానే ఆ ఆశ్రమ ప్రాంగణంలో వేదపారాయణమూ, నెమళ్ళ క్రేంకారాలూ వినిపిస్తున్నాయి. రమణ మందిరంలో హారతి ఇస్తూన్నారు. సమయానికే అక్కడ

అడుగుపెట్టాననుకున్నాను. హారతి పూర్తయి ప్రసాదం ఇచ్చారు. అక్కడొక గదిలో రమణుల ఫొటో ప్రదర్శన ఒకటి ఉంది. చాలా అరుదైన ఫొటోలు. నేనప్పటిదాకా ఎక్కడా ఏ పుస్తకాల్లోనూ చూడని ఫొటోలు నేనక్కడ మొదటిసారి చూసాను. అందులో ఒక ఫొటోలో, సుబ్రహ్మణ్యస్వామిని తలపిస్తూ ఒక నెమలి మీద రమణులు, వేలాయుధులుగా, కూచున్నట్టున్న వర్ణచిత్రం కూడా ఉంది. అక్కడ పుస్తక విక్రయ కేంద్రంలో రమణ సాహిత్యం కొంత కొనుక్కున్నాను.

తిరువాలంగాడు అక్కణ్ణుంచి కనీసం మూడు గంటల ప్రయాణం కావడంతో త్వరత్వరగా ఆశ్రమం నుంచి బయటపడి మేం వెళ్ళే దారిలోనే కొంతదూరం అరుణగిరి వెంబడే ప్రయాణించాం. అప్పటికి పట్టపగలు బాగా విచ్చుకుంది. తెల్లని ఆ పగటి కాంతిలో అరుణగిరి గంభీరంగా, ఉజ్జ్వలంగా, స్థిరసుందరంగా దర్శనమిస్తూ ఉంది. నాకు ఆ క్షణాన రమణులు అరుణగిరిపైన రాసిన కవిత్వమంతా గుర్తొచ్చింది.

నేనంతకుముందొకసారి తిరువణ్ణామలై వెళ్ళాను, అరుణాచలాన్ని చూసాను. కాని, ఈసారి పూర్వ మహాకవుల అడుగుజాడలు వెతుక్కుంటూ చేసిన యాత్రలో భాగంగా అరుణాచలాన్ని సందర్శించినప్పుడు, ఆ కొండా, ఆ కొండ చెంత జీవించిన రమణులూ కూడా సరికొత్తగా కనిపించారు.

రమణ మహర్షిని ఒక జ్ఞానిగానూ, అద్వైత వేదాంతానికి ఇరవయ్యవ శతాబ్దపు సజీవ ఉదాహరణగానూ చెప్పడం పరిపాటి. రమణులతో వేలాదిమంది జిజ్ఞాసువులు, ముముక్షువులు చేసిన సంభాషణల్లో ఆయన సాధారణ మానవ భావోద్వేగాలకు అతీతమైన ఎరుకతోనూ, ప్రశాంతితోనూ మాట్లాడుతున్నట్టు కనిపిస్తాడు. అటువంటి విరక్త, వివిక్త సాధువుగానే ఆయన గురించి మనకు తెలుసు. కాని, రమణులు అన్నిటికన్నా ముందు కవి అనీ, నాయన్మార్లూ, మాణిక్యవాచకర్, అరుణగిరి నాథార్‌ల కోవలోనే భక్తికవిత్వ సాధన చేసినవాడనీ మనకి ఎవరూ చెప్పరు. చెప్పినా కూడా దాన్నొక ప్రాసంగిక విషయంగా మాత్రమే ప్రస్తావించి వదిలిపెడతారు.

కాని రమణులు కవి. మామూలు కవి కాదు, సంగకాలం నాటి ప్రేమకవులు ఎంత గాఢ భావతీవ్రతతో అకం కవిత్వం చెప్పారో, సంబంధులు ఎంత ప్రేమ పారవశ్యంతో సుందరతమిళదేశాన్ని దర్శించాడో, సుందరమూర్తి ఎంత స్నేహపిచ్చిలంతో శివుడికి చేరువకావాలని ప్రయత్నించాడో అదంతా కూడా రమణుల కవిత్వంలో కనిపిస్తుంది. ఆయన తమిళం, తెలుగు, మళయాళం, సంస్కృతం నాలుగు భాషల్లోనూ కవిత్వం చెప్పారు. తమిళ దేశి ఛందస్సు వెన్బా కూర్పులో ఆయన సిద్ధ హస్తుడు. వీటితో పాటు తన పాశ్చాత్య శిష్యులు తన కవిత్వానికి చేస్తూ వచ్చిన ఇంగ్లీషు అనువాదాల్ని ఆయన ఎప్పటికప్పుడు సరిచూస్తూ వచ్చారు. ఆ రకంగా ఆయన కవి మాత్రమే కాదు,

బహుభాషాకోవిదుడూ, ప్రాచ్య, పాశ్చాత్య భావుకుల మధ్య రససేతువు నిర్మించినవాడు కూడా.

ఆ కవిత్వమంతటిలోనూ కూడా నా దృష్టిలో 'అక్షర మనమాలై' (1914) సర్వోత్కృష్ట కావ్యం. మనమాలై అంటే వరమాల. ఒక వధువు తన వరుడికోసం ప్రేమగా అల్లి కానుకగా సమర్పించే పూలమాల. అరుణాచల గిరిప్రదక్షిణం చేస్తున్నప్పుడు తమకి పాడుకోవడం కోసం ఏదైనా ఒక గీతాన్ని రాసిమ్మని భక్తులు అడిగినప్పుడు, రమణులు అనుగ్రహించిన కవిత్వం అది. ఒకరోజు గిరిప్రదక్షిణం చేస్తూండగా, అప్రయత్నంగా, హృదయం కరిగి ధారగా ప్రవహించినట్టు, ఆ కవిత్వం ఆయన్నుంచి వెలువడింది.

రమణులు ఏ వేదాంతాన్నైయినా ఎన్నిసార్లయినా ఏ జిజ్ఞాసువు అడిగినా చెప్పడానికి సిద్ధంగా ఉండేవారుగాని, 'అక్షరమనమాల' మీద మాత్రం ఎటువంటి వ్యాఖ్యానానికి, సంవాదానికి సుముఖత చూపించేవారు కారట. 'అదట్లా హృదయంలోంచి నేరుగా ప్రవహించిన కవిత్వం. దానికి మీకు ఏ అర్థం స్ఫురిస్తే ఆ అర్థం చెప్పుకోవచ్చు' అనేవారట. కాని మురుగనార్ అనే శిష్యుడు దానికి వ్యాఖ్యానం రాసినప్పుడు మాత్రం ఆయన దాన్ని చదివి అంగీకారంగా తలపంకించారట.

నాకేమనిపిస్తుందంటే, అక్షర మనమాలని నేరుగా చదివితే మనకి ఎంతో కొంత స్ఫూర్తి కలిగే మాట నిజమే కాని, దాన్ని తత్పూర్వ తమిళ భక్తి సాహిత్యంతో కలిపి చదివితేనే మనకి పరిపూర్ణమైన స్ఫూర్తి కలుగుతుందని.

అప్పుడు మాత్రమే, ఆయన తననొక కుక్కతో పోల్చుకుంటున్నప్పుడు, అంతకు ముందు సుందరమూర్తి నాయనారు ఆ మాట అనుకున్నాడనీ, అరుణాచలేశ్వరుడు తననొక దెయ్యంగా మార్చేసాడని చెప్తున్నప్పుడు, ఆయన తలపుల్లో అమ్మైయ్యారు మెదుల్తున్నదనీ మనకు అర్థమవుతుంది.

'అక్షర మనమాల' తిరుక్కురళ్ లోని ప్రేమాధ్యాయంతో పోల్చదగ్గది, తిరువెంబావైతోనూ, కందార్ అనుభూతితోనూ సమానంగా నిలపదగ్గది. బహుశా తమిళ సాహిత్యంలో అట్లాంటి పూలమాలలు రెండే. ఒకటి, శ్రీరంగనాథుడికి ఆండాళ్ సమర్పించిన పూలమాల, రెండవది, అరుణాచలేశ్వరుడికి రమణులు సమర్పించిన అక్షరమనమాల.

నేనా రోజు కొనుక్కున్న పుస్తకాల్లో రమణుల కవిత్వ సంపుటం కూడా ఉంది. అందులో 'అక్షర మన మాల' మరొక్కసారి చదివాను. ఒక్కసారి కాదు, అనేకపర్యాయాలు చదివాను. చదవగా చదవగా నాకేమనిపించిందంటే, నిజమైన జ్ఞానానికీ, నిజమైన ప్రేమకీ మధ్య తేడా లేదనిపించింది.

మామూలుగా మనం అద్వైతికి భక్తి కవిత్వంతో పని ఉండదనుకుంటాం. కాని, భక్తి కవిత్వానికి అద్వైతానుభవం ప్రాతిపదిక. ప్రేమికుడికి ప్రియురాలితో ఒక అద్వైత స్ఫురణలేకపోతే అతడామె సన్నిధికోసం అంతలా తపించడు. తానూ, ఆమే ఒక్కటైపోవాలన్న హృదయసంస్పందమే గాఢప్రేమకవిత్వంగా మారుతుంది. ఈ రహస్యం సూఫీలకు తెలుసు. అందుకనే వాళ్ళు ఈశ్వరుణ్ని ఉద్దేశించి చెప్పిన కవిత్వం అత్యంత భావోద్రేకత కలిగిన ప్రేమకవిత్వంగా మనకి వినిపిస్తుంది.

ఇంతకీ ప్రేమకీ జ్ఞానానికీ సంబంధం ఏమిటి? తన మనసు ఎక్కడ లగ్నమవుతున్నదో అది మాత్రమే సద్వస్తువనీ, తక్కినదాంతో తనకి పనిలేదనీ తెలియడమే జ్ఞానం. నీ హృదయాన్ని నీ జీవితంలోకెల్లా అమూల్యమైన దానికి దేనికో అర్పించగలగడమే జ్ఞానం. ప్రేమ దానికదే పుట్టవచ్చు. కాని ప్రేమ నిలబడాలంటే జ్ఞానం తప్పనిసరి. ఇంకా చెప్పాలంటే, నిశ్చల ప్రేమ నెమ్మదిగా జ్ఞానంగా మారుతుంది, జ్ఞానం నెమ్మదిగా ప్రేమగా పరిమళిస్తుంది.

'అక్షరమనమాల' చదువుతున్నకొద్దీ నాకు అపరిమితమైన దిగులు కూడా కలుగుతూ వచ్చింది. నా జీవితంలో నాక్కూడా అట్లాంటి అరుణాచలేశ్వరుడొకడు ఎందుకు తటస్థించలేదు? అట్లాంటి ఒక గంభీరమైన, ప్రాణప్రదమైన ఒక సన్నిధి లభిస్తే, అంతకన్నా ఈ జీవితానికి కోరవలసింది ఏముంది? నువ్వు నిజంగా కోరుకోవలసిందంటూ ఉంటే అట్లాంటి హృదయసమర్పణనే. నీ ఆత్మ సమస్తాన్నీ నువ్వట్లా ఒక అపురూపమైన సన్నిధికి సమర్పించుకోగలిగినప్పుడు కదా, తక్కిన ప్రాపంచిక కార్యకలాపమంతా నువ్వు నిజంగా నిష్కామంగా నెరవేర్చుకోగలిగేది.

'అరుణాచల అక్షరమనమాల' 105 పద్యాల మాలిక. అందులోంచి కొన్ని వాక్యాలు మీ కోసం :

## నీ ప్రేమికులకి ప్రేమికుడిగా

*2*

**నువ్వూ నేనూ కూడా అందమూ, సుందరమూ అనే పదాల్లాగా ఒకరినుంచి మరొకరం ఎన్నటికీ విడివడకుండా ఉండాలనుకుంటున్నాను, అరుణాచలా!**

*3*

**నా ఇంట్లో జొరబడి నన్నిట్లా లాక్కొచ్చి నీ హృదయగుహలో ఎందుకిట్లా బంధించి వేసావు అరుణాచలా?**

4

కేవలం నీ సంతోషం కోసమేనా నన్ను నువ్వు గెల్చుకున్నది? తీరాచేసి ఇప్పుడు నన్ను వదిలేస్తే లోకం నిన్నే తప్పు పడుతుంది, అరుణాచలా!

6

నువ్వు మా అమ్మ కన్నా ఎక్కువ దయచూపిస్తున్నావు, తల్లిని మించిన ప్రేమ నీది, అరుణాచలా!

9

నన్నిట్లా ఎత్తుకొచ్చి ఇప్పుడు నన్నెందుకు కౌగిలించుకోవు? ఆ నీ సాహసమేమయ్యింది అరుణాచలా?

10

వేరేవాళ్ళు నన్ను పట్టుకుని లాక్కుపోతుంటే నిద్రపోతున్నావు, నీకిది తగునా, అరుణాచలా?

16

అయస్కాంతం ఇనపముక్కని దగ్గరకి లాక్కుని దాన్ని కూడా అయస్కాంతంగా మార్చినట్టు నన్ను నీ దగ్గరే అట్టేపెట్టేసుకో, అరుణాచలా!

18

నిప్పులాగా రగిలే వజ్రానివి, నాలుగు దిక్కులా ప్రకాశిస్తున్నావు, నాలో ఉన్న కల్మషమంతా దగ్ధం చేసెయ్యి అరుణాచలా!

20

వనితల చూపులనే క్రూరమైన ఉచ్చునుంచి నన్ను కాపాడు, నువ్వు దగ్గరగా తీసుకోవడమొక్కటే నాకు నిజమైన గౌరవం అరుణాచలా!

23

నా చేతుల్లో ఒక మధురఫలం, నీ అనుగ్రహంతో మత్తెక్కి ఆనంద పారవశ్యంతో పిచ్చివాణ్ణి కావాలని ఉంది, అరుణాచలా!

24

నా వలువలు ఊడ్చిపెట్టు, నన్ను నగ్నం చేసెయ్యి, అపుడు నీ ప్రేమ వస్త్రం నా నిండారా కప్పు, నా అరుణాచలా!

31

నా హృదయంలో సేదదీరు, సంతోష సాగరం ఉవ్వెత్తున పొంగనివ్వు, మాటా, మనసూ కూడా మూగపోనివ్వు, అరుణాచలా!

34

నువ్వు దగ్గరగా లాక్కుని నీ ఎదకు హత్తుకోకపోతే నేనిట్లానే చింతాశ్రువుల్తో చితికిపోయేటట్టున్నాను,అరుణాచలా!

35

(కుక్క తన యజమానిని పసిగడుతుంది). కుక్కకన్నా కూడా హీనుణ్ణి, నిన్నెట్లా గుర్తుపట్టి నీ వెంటనే పడి ఉండేది అరుణాచలా?

41

పువ్వు ఇంకా తెరుచుకోలేదని, ఒక తేటిలాగా అట్లానే ఎదురుచూస్తున్నావు, అరుణాచలా!

48

నువ్వొక్కడే నా దేవుడవని నిన్నాశ్రయించానా, తీరాచేసి నా సమస్తం ధ్వంసం చేసేసావు, అరుణాచలా!

60

ప్రేమంటే ఏమిటో తెలియని నాలో ప్రేమ రగిలించి తీరాచేసి ఇప్పుడు నన్ను మోసగించకు అరుణాచలా!

61

పండు మరీ మిగలముగ్గేదాకా ఆగి లాభం లేదు, దాన్ని పండుతున్నప్పుడే రుచిచూడాలి, అరుణాచలా!

66

నన్నొక మాయనుంచి బయటపడేసి ఇప్పుడు నీ మాయలో పడేసుకున్నావు, నీ పిచ్చి నుంచి బయటపడాలంటే నీ అనుగ్రహమొక్కటే మందు, అరుణాచలా!

71

దెయ్యంలాంటి నా ప్రకృతిని వదలగొట్టడానికి నువ్వునన్నొక దెయ్యంలాగా పట్టుకుని ఇప్పుడు నన్నో దెయ్యంలాగా మార్చేసావు, అరుణాచలా!

73

నా మీద మత్తుమందు జల్లి, నా తెలివితేటల్ని అపహరించి నాకు తెలివిడి అనుగ్రహించావు, అరుణాచలా!

80

తుదీమొదలూ తెలియని అజ్ఞానం ఒక ముడిలాగా చిక్కుపడింది, తల్లిలాగా ఈ ముడి నువ్వే విప్పాలి, అరుణాచలా, నా అంతట నేను విప్పుకోలేక పోతున్నాను.

82

దేహమనే ఈ అంతఃపురంలో నునులేత పూలపాన్పు మీద మనిద్దరం ఒక్కటైపోదాం, అరుణాచలా!

90

నన్ను బలాత్కారంగా పట్టుకొచ్చిన నా స్వామివి కాబట్టే ఇదంతా చెప్పగలిగాను, నా మాటలు మనసులో పెట్టుకోక, నన్నేలుకో, అరుణాచలా!

91

రా స్వామీ, ఎక్కడ పగలూ రాత్రీ ఉండవో, ఆ శుద్ధాంతఃపురంలో ఒకరినొకరం తనివి తీరా అనుభవిద్దాం, అరుణాచలా!

92

నన్ను లక్ష్యంగా పెట్టుకున్నావు, నీ అనుగ్రహాన్ని అస్త్రంగా ప్రయోగించావు, నన్ను బతికుండగానే తినేసావు, అరుణాచలా!

101

నువ్వు ప్రేమ రూపుడివి. నీళ్ళల్లో మంచు కరిగిపోయినట్టు నీ ప్రేమలో నన్ను కలిపెయ్యి. నాకీ మేలు చాలు, అరుణాచలా.

103

నీ గురించే తలపోస్తూ నీ అనుగ్రహంలో ఇరుక్కున్నాను. ఒక సాలీడులాగా నన్ను పట్టుకుని నన్ను నిలువెల్లా తినెయ్యి అరుణాచలా!

104

ప్రేమారా నీ పేరు తలుచుకునే నీ ప్రేమికులకి ప్రేమికుడిగా మారే వరాన్ని కానుక చెయ్యి అరుణాచలా.

105

నా లాంటి దిక్కులేని వాళ్ళని నువ్వు కాచిరక్షిస్తే వాళ్ళూ సంతోషంగా ఉంటారు, నువ్వూ కలకాలం వర్ధిల్లుతావు, అరుణాచలా!

# సముజ్జ్వలమైన ఆధ్యాత్మిక జీవితం

**తి**రువణ్ణామలై నుంచి తిరువాలంగాడు బయలుదేరుతూ అరుణగిరినుంచి సెలవు తీసుకునేటప్పుడు చలంగారిని కూడా ఒకసారి స్మరించుకున్నాను. కాని, ప్రసిద్ధ తెలుగు రచయితగానూ, సామాజిక భావవిప్లవకారుడిగానూ కాదు, రమణుల అనుయాయిగానూ, శివభక్తకవి పరంపరలో మరొక మిస్టిక్ కవిగానూ మాత్రమే.

చలంగారిని ఒక భక్తకవిగా తలుచుకోవడం చాలామందికి incongrous గా తోచవచ్చునుగాని, అక్షరాలిస్తున్న సాక్ష్యం మాత్రం అలానే ఉంది. మరొక రెండు శతాబ్దాల తర్వాత, ఆయన్ని కూడా మరొక అరుణగిరినాథార్ లాగా తలుచుకుంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఆయన జీవితకాలంలోనే శ్రీశ్రీ ఆయన్ని 'ఇరవై శతాబ్దపు వేమనయోగి' గా అభివర్ణించాడు. అంతేకాక ఒక చోట స్పష్టంగా రాసాడు కూడా: మనం రాజకీయ స్వాతంత్ర్యం సాధించుకుని ఆర్థిక స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నాం. కాని మానసిక స్వాతంత్ర్యం సాధించినవాళ్ళు ఎలా ఉంటారో తెలుసుకోవాలంటే అరుణాచలంలో చలంగారిని చూడాలి' అని. అరుణాచలంలో ఉన్న చలంగారికి ఉత్తరాలు రాసినప్పుడు శ్రీశ్రీ ఎప్పుడూ 'చలం మహర్షికి అభివాదాలతో' అని రాసేవాడు. చలంగారు ఆయనకి జవాబు రాసినప్పుడల్లా 'ఈశ్వరాశీర్వాదాలతో' అని ముగించేవాడు.

చలంగారి అరుణాచలం వెళ్ళడం, అక్కడ రమణస్థాన్ పేరిట ఒక ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని తన కుటుంబ సభ్యులతోనూ, మిత్రులతోనూ కలిసి ఒక ఆధ్యాత్మిక జీవితం జీవించడం ఆయన సాహిత్యాభిమానులకి చాలా మందికి కొరుకుడుపడలేదు. ఆయన తాను అంతదాకా మాటాడినవాటికీ, పోరాడినవాటికీ విరుద్ధమైన విషయంగా వాళ్ళు దాన్ని భావిస్తారు. కాని, చలంగారి జీవితాన్ని ఆసాంతం పరిశీలించినవారికి, ఆయన సాహిత్యం మొత్తం చదివినవారికీ అందులో ఆశ్చర్యపడవలసిందేమీ కనిపించదు. ఆయన జీవితాన్ని తొలినుంచీ నడిపించిన ఒక అన్వేషణని వివరిస్తూ ఆర్.ఎస్. సుదర్శనం గారు, పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు, వావిలాల సుబ్బారావుగారు, ఇస్మాయిల్ గారు వంటివారు ఎన్నో విలువైన వ్యాసాలు రాసారు. ఆయన జీవితపరిణామాన్ని మరింత

విశ్వసనీయంగా వివరిస్తూ మా అక్క 'సత్యాన్వేషి చలం' అనే పరిశోధనా గ్రంథాన్నే వెలువరించింది.

ఇవన్నీ అందరికీ తెలిసినవిషయాలే. నేను మొదటిసారి తిరువణ్ణామలై వెళ్ళినప్పుడు, చలంగారి సమాధిని వెతుక్కున్నప్పుడు ఈ విషయాలే నా మనసులో మెదిలాయి. కాని, ఈసారి, ప్రాచీన తమిళ భక్తి కవుల అడుగుజాడలు వెతుక్కుంటో చేసిన ప్రయాణంలో చలంగారి పాదముద్రల్ని పోల్చుకున్నప్పుడు ఆయన ఇరవయ్యవశతాబ్దపు భక్తికవిగా మరింత విస్పష్టంగా గోచరించాడు.

ఆయన జీవితం మొదలయ్యిందే ఒక బ్రహ్మసామాజికుడిగా. కాకినాడలో రఘుపతి వెంకట రత్నం నాయుడు శిష్యుడిగా రాసిన బ్రహ్మసమాజం పాటల్తో ఆయన సాహిత్య జీవితం కవిగా మొదలయ్యిందని మనం మర్చిపోకూడదు. కథకుడు చలం, నవలాకారుడు చలం, సామాజిక విశ్లేషకుడు చలం ఆ తర్వాతి మాట. 1915 లో గురజాడ అప్పారావు చివరి ముత్యాలసరాలు వెలువరించిన వెంటనే చలం బ్రహ్మసమాజం పాటలు 1917 లోనే వెలువడ్డాయని మనం గుర్తుపెట్టుకుంటే, ఆయన వేంకట పార్వతీశ్వర కవులకన్నా, కృష్ణశాస్త్రికన్నా కూడా ముందే తెలుగు భావగీతాలు రాసినవాడని గమనిస్తాం. ఆ పాటల్ని ఆయన పూర్వ తెలుగు వాగ్గేయకారుల తోవలో కూర్చినట్టుగా కూడా అర్థమవుతుంది. ఒక పాట చూడండి:

**ఎన్నాళ్ళనీ యెట్టు యెదురు చూచెద స్వామి**
**సుంతైన దయ రాదుగా.**

**పలుపాపి నేనని పడిపడి వేడిన**
**విలపింప వలదను పలుకైన లేదాయె.**

**ప్రాణవల్లభయని పలువరించుటె కాని**
**యెన్నడైనను పోనీ కన్నెత్తి చూచెదవే.**

**పిలుచుటే తడవుగ వారింతు వీవని**
**పలుకుల వలలోనె పడి మోసపోయితి.**

**వేచితి నిరతము ప్రేమ దృష్టిని గోరి**
**వేచి విసుగుటె కాని ఫలమేమి లేదాయె.**

ఆ రోజుల్లో చలంగారి మీద రవీంద్రుడి ప్రభావం ఉన్నా కూడా ఆ గీతాల్లో మనకి భగవంతుణ్ణి స్వయంగా చూసిన అనుభవం కనిపించదు. భగవంతుడు అనే ఒక భావనని ప్రేమిస్తున్న వైనం మాత్రమే కనిపిస్తుంది. నిజమైన ఈశ్వర సందర్శనానుభవం ఎలా ఉంటుందో తెలియడానికి ఆ తర్వాత ముప్పై ఏళ్ళు పట్టింది ఆయనకి.

ఆయన భగవంతుణ్ణి సౌందర్యంలో వెతుక్కున్నాడు. 1917 నుంచి 1937 దాకా ఇరవయ్యేళ్ళు ఆయన సౌందర్యాన్ని స్త్రీలో వెతుక్కున్నాడు, చూసాడు, అనుభవానికి తెచ్చుకున్నాడు. ఒక భక్తుడు భగవంతుణ్ణి ప్రేమించినట్టుగా ఆయన స్త్రీని ప్రేమించాడు. ఆ మహామోహమయ, ఆనందమయ అనుభూతి ఆయన ప్రేమలేఖల్లోనూ, తొలి ఎనిమిది నవలల్లోనూ కనిపిస్తుంది. కాని, 1938 లో దీక్షితులుగారితో కలిసి మొదటిసారి తిరువణ్ణామలై వెళ్ళి రమణమహర్షిని చూసిన తర్వాత ఆయనలో సంఘర్షణ మొదలయ్యింది. అంతదాకా తనకు సౌందర్యనిధానంగానూ, ఆనందప్రదాయినిగానూ ఉన్న స్త్రీ ఒకవైపూ, రమణ మహర్షి మరొక వైపూ ఆయన్ని లాగడం మొదలుపెట్టారు. దాదాపు పది పన్నెండేళ్ళు ఆయన తీవ్రమైన నలుగులాట పడ్డాడు. అదంతా ఆయన దీక్షితులు గారికి రాసిన ఉత్తరాల్లో స్పష్టంగా కనిపిస్తుంది.

రమణమహర్షిని చూసిన తర్వాత, 1938 నుంచి 1950 దాకా చలం జీవితంలో గొప్ప ఆత్మ సంఘర్షణకి లోనయ్యాడు. ముఖ్యంగా ప్రతి సాధకుడికీ సాధనక్రమంలో ఎదురయ్యే కఠిన పరీక్ష ఆయనకి కూడా తటస్థించింది. రమణులు ఆయన్ని ఆకర్షించడం మొదలుపెట్టగానే, లీలగారు కూడా ఆయన జీవితంలో ప్రవేశించారు. నేనా? రమణులా? ఎవరు కావాలి నీకు అని అడిగిందామె సూటిగా. అంతదాకా చలం ఏ తర్కాన్ని ఆశ్రయించాడో ఆ తర్కం మూర్తీభవిస్తే ఆమె లీల. ఆయన జీవితమంతా ఎటువంటి ఆదర్శప్రేమికురాలిని వెతుక్కున్నాడో అటువంటి ఆదర్శమూర్తి లీల అనే ఒక ఆశ కలిగిందాయనకి. చివరికి 1946 ప్రాంతాల్లో చలంగారు రమణమహర్షిని చూడటానికి వెళ్ళినప్పుడు లీలగార్ని కూడా తీసుకువెళ్ళారు. కాని ఆమె అక్కడ ఉండలేకపోయింది. ఎంత తొందరగా అక్కణ్ణుంచి వెళ్ళిపోదామా అని పట్టుబట్టింది. కాని రమణమహర్షి అనుమతిలేకుండా అక్కణ్ణుంచి వెళ్ళడం చలంగారికి ఇష్టం లేదు. ఆయన జీవితంలోని అత్యంత నాటకీయమైన ఘట్టం అది. ఆ వైనమంతా చలంగారి మాటల్లోనే చదవండి:

> '..అందరూ భగవాన్ దగ్గర 'శాంతి', 'శాంతి' అనే వారు. నాకు భరించరాని అశాంతిగా వుండేది. అరుణాచలంలో ఉన్నంతకాలం ఏ ధ్యానమూ నా వేపు వచ్చేది కాదు. ఇంక ఎన్నడూ ఆశ్రమానికి రాకూడదని ఎన్నో శపథాలు చేసుకున్నా తీరా వెళ్ళిన నిమిషం నుంచి తిరిగి ఎప్పుడు భగవాన్ దర్శనానికి వెడదామా అని మనసు పీకేది. నాకేదో పొరుగుతుందనే నా ఆశే కాక, ఏదో నాకే తెలీని ఆకర్షణ నన్ను భగవాన్ దగ్గరికి ఈడ్చుకొచ్చేది.

ఆ మూడేళ్ళు నా ప్రయత్నం లేకుండానే నన్ను ధ్యానం నిలేసి కూచోపెట్టింది. కాని ఆ ధ్యానం అంతకన్న ముందుకి సాగలేదు. ముఖ్యం నా అనారోగ్యం ఆటంకమని తెలుస్తోంది. ఆ అనారోగ్యాన్ని తీసెయ్యగల నాథుడు లేడు. ఆ ధ్యానం వల్ల నా బాధలేవీ పోలేదుగాని, నాకిదివరకు తృప్తినిచ్చే సౌఖ్యాలన్నీ పోయినాయి. దేంటోంచీ ఏ సుఖమూ రాదు. ప్రతిదీ విసుకు. సౌఖ్యాలు తీసేసి బాధలట్లానే వుంచిన ఆ ధ్యానం పైన కోపమెక్కువైంది. పెద్ద దుర్గతిలో పడి జీవచ్ఛవాన్నైనానిపించింది.

అట్లాంటి స్థితిలో లీలగారు వొచ్చారు. ఆమె వొచ్చినప్పటి నించి ఇదివరకున్న జడత్వం పోయి, కొత్త ఆశలూ, ఏదో జీవితం వెలగబోతూందనే ఉత్సాహమూ కలిగాయి. కాని త్వరలో తగాదాలు ప్రారంభమైనాయి. ఆమెతో స్నేహం మూలాన నాలుగేళ్ళు భగవాన్ని దర్శించలేదు. చివరికి ఆమెని బలవంతం చేసి ఆమె పిల్లలతో సహా భగవాన్ దర్శనానికి వొచ్చాం. భగవాన్‌ని చూస్తే వాళ్ళెందుకో వొణికిపోయి, ఆయన ఎదట పడకుండా దాక్కునే వారు. నన్ను మాత్రం భగవాన్ వొకటే పలవరించి, దగ్గరికి వొచ్చి కూచోమని పిలిచి హాస్యాలు కూడా చేశారు. నేను దీక్షితులు గారికి రాసిన ఉత్తరాల పుస్తకం తెప్పించి– నా చేతే చదివించి, విని, చాల ఎంజాయ్ చేసారు. లీలగారు వెళ్ళిపోవాలని తొందరపడుతున్నారు. కాని ఏదో ఒక అభ్యంతరంతో ప్రయాణం రోజునుంచి రోజుకి ఆగిపోతోంది. చివరికి ఓ రోజు నిర్ణయించుకుని భగవాన్‌ని శలవ అడగబోతే, అన్నాళ్ళూ అంత దయగా వున్న భగవాన్ కారణం లేకండానే ఉగ్రులై సరిగా సెలవియ్యలేదు. అందుకని మళ్ళీ రెండురోజులు ఆగి చివరికి భగవాన్ నుంచి సరిగా శలవ తీసుకోకుండానే వెళ్ళాడు చలం, లీలగారి వల్ల తొందరపడి.

వెళ్ళి రైలెక్కింది మొదలు నాలుగేళ్ళు నేను పడ్డ అవస్తలకి అంతులేదు.'

సరిగ్గా అప్పుడే చలం జీవితం మలుపు తిరిగింది. ఆయన మీద ఉద్యోగ జీవితంలో ఒక అభియోగపత్రం మోపారు. ప్రభుత్వం అనుమతిలేకుండా పుస్తకాలు రాస్తున్నాడనీ, ఆదాయం సంపాదించుకుంటున్నాడనీ పై అధికారులు సంజాయిషీ అడిగారు. ఆ సంజాయిషీ ఏదో ఇచ్చి ఉంటే, ఆ కేసు ముగిసేలాగా చూసుకుంటే ఆయనకి పెన్షను దొరుకుతుంది. కాని అట్లా సంజాయిషీ చెప్పుకోడానికి చలం అంతరాత్మ అంగీకరించలేదు. అంటే అంటే దాని పర్యవసానం ఆయన తన వృద్ధాప్యమంతా పెన్షను లేకుండా గడపవలసే ఉంటుంది. అప్పటికి ఆయన కూతుళ్ళలో ఏ ఒక్కరికీ ఇంకా పెళ్ళి కాలేదు. అయినా కూడా అత్యంత నిజాయితీపరుడైన ఆ చలం, నిప్పులాంటి ఆ మనిషి ఆ అసత్య అభియోగం ముందు తలవొంచలేదు. మానసిక స్వాతంత్ర్యమంటే అదీ.

తన ఉద్యోగాన్ని, తనని ప్రేమిస్తున్న స్త్రీని, తానంతదాకా తలపడుతున్న తెలుగు సమాజాన్నీ వదిలిపెట్టి కట్టుబట్టలతో, చేత చిల్లిగవ్వలేకుండా భగవాన్ ని నమ్ముకుని ఆయన తిరువణ్ణామలై కి బయలుదేరిపోయాడు.

ఆయనిట్లా రాస్తున్నాడు:

> 'చివరికి మమ్మల్ని చిన్నప్పటినుంచి పోషించి పెంచిన మా వొయ్యి చచ్చిపోయిన తొందరలోనే అరుణాచలం వెళ్ళాలని నిశ్చయించుకున్నాం. ఆనాడు మాకు మిత్రులు లేరు. ఆదాయం లేదు. ఒక్క భగవాన్ తప్ప ఎవరూ కనిపించలేదు. నాకేమో ఆయనపై ఏ విశ్వాసమూ లేదు, మమ్మల్ని రక్షిస్తారని. డబ్బూ, ఆదాయమూ లేని మేము ఏ విధంగా అరుణాచలంలో వుంటాం? ఏమైనా సరే అక్కడికి పోయే చూద్దామని నిశ్చయించుకున్నాం. పైగా భగవాన్ కి చాల జబ్బుగా వుంది, బతకరంటున్నారు. అయిన మా కంతకన్న శరణ్యం లేదు.
>
> 1950 మొదట్లో వొచ్చి ఓ ఇల్లూ పాకా అద్దెకి తీసుకుని వున్నాం. భగవాన్ అంత జబ్బులోనూ, ఎంతో ఆదరంగా చూశారు మా వంక. మా రాకకే ఎదురు చూస్తున్నట్లు. త్వరలోనే భగవాన్ అస్తమించారు. మేము ఆయన ముందు చావాలని వొస్తే, ఆయనే మా ముందు వెళ్ళిపోయినారు. భక్తులందరూ వెళ్ళిపోయారు. రమణ నగర్ యెడారి అయింది. పగలే దొంగలు ఇళ్ళ తలుపులూ, కిటికీలూ తవ్వి తీసుకుపోతున్నారు. ఆశ్రమం మేమూ మాత్రమే మిగిలాం. కాని నిర్యాణమప్పుడూ, తరువాత భయం పుట్టించే వొంటరితనంలోనూ భగవాన్ మమ్మల్ని ఆదుకుని, అర్థంగాని ధైర్యమిచ్చి రక్షించారు. భగవాన్ వెళ్ళేముందు తాను ఇక్కడే వుంటానన్నారు. ఆ విశ్వాసంతోనే ఇక్కడే వుండిపోయినాం. అదీకాక ఇంకెక్కడికి పోము?
>
> ఏడాది గడిచింది. మా డబ్బూ, ఆరోగ్యమూ సన్నగిల్లాయి. చివరిదశను సమీపిస్తున్నాం. అప్పటికి నాకు దేవుడిలోగాని, కర్మలోగాని, చావు తర్వాత బతుకులోగాని, విశ్వాసం లేదు. ఏదన్నా చేస్తే భగవాన్ ఒక్కరే చెయ్యగలరని విశ్వాసం మాత్రం వుంది. కాని భగవాన్ చేస్తారని ఏ ఆశా లేదు.'

కాని, ఆ తర్వాత చలంగారు అక్కడే దాదాపు మరొక ముప్పై ఏళ్ళు జీవించారు. రేపెలా గడుస్తుందో తెలియని గడ్డుపేదరికంలో అపారమైన ఆత్మసంతోషంతో జీవించారు. నాకు తెలిసి ఆధునిక తెలుగు సాహిత్యంలో ఏ రచయితగాని, కవిగాని అంత సముజ్జ్వలమైన ఆధ్యాత్మిక జీవితం జీవించింది లేదు, అంత సుసంపన్నమైన ఆధ్యాత్మిక సాహిత్యం సృష్టించనూ లేదు.

## 2

పురూరవ చలంగారి నాటకాల్లోనూ, సృజనాత్మక సాహిత్యంలోనూ కూడా అత్యుత్తమ రచనగా గుర్తింపు పొందింది. ఆ నాటకాన్ని ఆయన 1947 లో రాసారు. దాదాపు ఒక ఏడాది తర్వాత 'జీవితాదర్శం' నవల రాసారు. ఆ నవలని చలంగారి సాహిత్యంలో సర్వోత్కృష్టమైన రచనగా రసజ్ఞులు పరిగణిస్తూ వచ్చారు. ఆ రెండు రచనలూ చలంగారి తన జీవితంలో ఒక ప్రధానమైన మలుపు దగ్గర నిలబడ్డప్పుడు రాసినవి. ముఖ్యంగా లీలగారు ఒకవైపూ, మహర్షి మరొకవైపూ నిలబడి, ఆయన్ని రెండు వేపులా లాగుతున్నప్పుడు కలిగిన అత్మసంఘర్షణను నిభాయించుకునే క్రమంలో రాసిన పుస్తకాలవి.

అప్పటిదాకా చలంగారు ప్రేమనీ, ధర్మాన్నీ ఒకదానికొకటి ఎదురెదురుగా పెట్టి చూస్తూ వచ్చారు. ప్రేమ కోసం ధర్మాన్ని పరిత్యజించమని చెప్పడం రొమాంటిసిజం. ధర్మంకోసం ప్రేమని వదిలిపెట్టమని చెప్పడం సంప్రదాయం. కాని చలంగారు తక్కిన భావకవుల్లాగా ఈలోకానికి దూరంగా పోవాలని కలగనే మామూలు రొమాంటిసిస్టు కాదు. ఆయనలో ఒక వీరేశలింగం కూడా ఉన్నాడు. అందుకనే ఆయన నెమ్మదిగా ధర్మానికీ, బాధ్యతకీ మధ్య సున్నితమైన సరిహద్దు ఉందని గుర్తించాడు. ధర్మమంటే సమాజం నీకు నిర్దేశించే బాధ్యత. దాన్ని ధిక్కరించడంలో ఆయనకేమీ సందేహాల్లేవు. కాని బాధ్యత అంటే నీకు నువ్వు నిర్దేశించుకునే ధర్మం. ఏమి చేసీ దాన్ని పక్కన పెట్టడానికి ఆయన అంతరాత్మ సుతరామూ అంగీకరించదు. కాని, ప్రేమ ఎదట, ప్రేమలో, తనని తాను నిలువెల్లా సమర్పించుకోవలసి వచ్చినప్పుడు, బాధ్యత అంటో మరొకటి మిగిలి ఉందని తన అంతరాత్మ తనని హెచ్చరిస్తూ ఉండటమే ఆయనకొక పట్టాన అర్థం కాలేదు. ప్రేమ కన్నా గొప్ప బాధ్యత ఏముంటుంది? కాని ప్రేమ నీలో మేల్కొల్పగల స్వాతంత్ర్యానికి బాధ్యత బంధనం కాదా?

'పురూరవ'లో ఊర్వశి సరిగ్గా ఈ ప్రశ్నలే అడుగుతుంది. అవి ఊర్వశి ఒక మానవిగా లీలగారి రూపంలో చలంగారిని అడిగిన ప్రశ్నలు అని మనకి అర్థమవుతుంది. ఈ సంభాషణ చూడండి:

ఊర్వశి: నేను వొదలను. కాని వొదిలించుకుంటావు గావును.

పురూరవ: నేనా? నిన్నా?

(ఊర్వశి మాట్లాడదు)

మాట్లాడవేం?

ఊర్వశి: నాకంతకన్న తెలీదు.

ప్రియురాల్ని కాదు నువ్వు విశ్వసించవలసింది. నీ ప్రేమను. ప్రియురాల్ని విశ్వసించి, భంగపడి ప్రేమని తిడతారు మానవులు. ప్రియురాలికన్న కాదు, ప్రేమకన్న ముఖ్యమైనది వుండటానికి అర్హతలేదు-ఏ ధర్మానికీ.

ఇదీ చలంగారు ఎదుర్కొన్న ప్రధాన సమస్య. ప్రేమకన్నా మించిన ధర్మం ఉంటుందా? ఇక్కడ ధర్మం అంటే, వ్యక్తి తనకై తాను ఎంచుకునే బాధ్యత అన్న అర్థంలో. ఆ తర్వాత వాళ్ళిద్దరి మధ్యా జరిగిన మరొక సంభాషణ చూడండి:

ఊర్వశి: ..మళ్ళీ చెపుతున్నా, నిన్ను నువ్వు అర్పించుకో.

పురూ: ఎవరికి? నీకే కద!

ఊర్వశి: నాకు కాదు. నాపైని నీ ప్రేమకి.

అర్థం కావటం లేదు నీకు.

మళ్ళీ ఇంకోసారి. ఇదే కడపటిసారేమో. నీకు చెపుతున్నాను. ప్రేమకి నిన్ను, నీ ఐశ్వర్యాన్ని అర్పించడం కాదు, నీ స్వేచ్ఛని, నీ బైట స్వేచ్ఛని కాదు, నీ ఆత్మ స్వేచ్ఛని, నీ కోపాల్ని, ధర్మాల్ని, ఇష్టాల్ని, కర్తవ్యాన్ని అర్పించు.

తన ప్రేమకి, తన బాధ్యతకి మధ్య జరిగిన సంఘర్షణలో పురూరవుడు బాధ్యత పట్లనే మొగ్గు చూపుతాడు. ఊర్వశి అదృశ్యమైపోతుంది. కాని, ఈ నాటకం ఆయన మనసుని సమాధాన పరచలేదని మనకి జీవితాదర్శం నవల చదివితే అర్థమవుతుంది. పరిపూర్ణమైన ప్రేమ ఎదట మరొకటేదీ గుర్తురాకుండా ఉండటం అన్నిటికన్నా పెద్ద బాధ్యత. అది ప్రేమ పట్ల నువ్వు చూపించవలసిన గౌరవం. కాని తన చుట్టూ ఉన్న ప్రపంచం మాట? తాను మాట్లాడుతున్న ఆ ప్రపంచం బయటలేదనీ, అది తనలోనే ఉందనీ, ప్రపంచం నుంచి తనకి ఆమోదాన్ని కోరుకునే ప్రాపంచిక పార్శ్వమనీ ఊర్వశి గొప్ప దయతోనూ, కర్కశంగానూ పురూరవుణ్ణి నగ్నం చేసేసింది. కాని, ఆ ఊర్వశి మాత్రమే సత్యమని ఎలా నమ్మడం? ఆ సంఘర్షణకి అంతంలేదు. ఆ నలుగులాటలో ఆయన విసిగిపోయాడు. ప్రేమా, బాధ్యతా-రెండూ కాదు, అన్నిటికన్నా ముఖ్యం మనశ్శాంతి, ఆంతరంగిక ప్రశాంతి అనే నిశ్చయానికి రావడం జీవితాదర్శం నవలగా వెలువడింది. ఆ నవల ముగింపు పుటలకి వచ్చాక, దేశికాచారితో ఇలా అనిపిస్తున్నాడు:

'జీవితాదర్శం, శాంతి.

ఆ శాంతిని భగ్నం చేసే ఏ సుఖమూ, ఏ గొప్పతనమూ, ఏ శృంగారమూ నా జీవితానికి చాలా విరోధం. అంటే శాంతిని భగ్నం చేసేది సుఖమూ కాదు, గొప్పతనమూ కాదు, శృంగారమూ కాదు.'

ఇక్కడితో చలంగారి సృజనాత్మక సాహిత్యంలో కథలూ, నవలలూ, నాటకాలూ దాదాపుగా రాయడం ముగిసిపోయినట్టే. ఆ తర్వాత రెండేళ్ళకే ఆయన అరుణాచలం వెళ్ళిపోయాడు. కాని, తాను కోరుకున్న శాంతిని, తాను దర్శిస్తున్న శాంతిని నిలుపుకునే క్రమంలో ఆయన్ని మరేదో అడ్డగిస్తూనే ఉందని మాత్రం అర్థమవుతూనే ఉందాయనకి. అదేమిటో పురూరవ నాటకంలో సూచనగా కనిపిస్తుంది. 'ప్రియురాలు ఆదర్శ స్త్రీ కాకూడదా?' అని పురూరవుడు అడిగిన ప్రశ్నకి 'తన ఆత్మవైశాల్యానికి అనుగుణంగా ప్రియురాలు తటస్థిస్తుంది' అంటుంది ఊర్వశి. ఆ ఆలోచన 'జీవితాదర్శం' లో మరికొంత విస్తరిస్తుంది. లక్ష్మణ సింగ్‌తో లాలస ఇలా అంటోంది:

'నేను చాలా విధేయతగల భార్యని కాకపోవచ్చు. ఇంకా స్పష్టంగా మాట్లాడాలంటే, నేను నీకు ఆదర్శమయిన స్త్రీని అనుకుంటున్నావు. కాను, నమ్మవు, సరే, నువ్వు మాత్రం నాకు ఆదర్శమయిన పురుషుడివి కావు. మాట్లాడవేం? కష్టంగా ఉంది. ఔనా? మరి ఎందుకు నిన్ను పెళ్ళి చేసుకుంటున్నాననా? ఆదర్శమయిన పురుషుడు భూమిమీద లేడని నాకు స్పష్టమయింది గనుక. నువ్వే నెక్స్ టు బెస్టు. ఆదర్శమయిన స్త్రీ కూడా లేదు. కాని నేనొకతెను ఉన్నానని నమ్ముతున్నావు..'

ఈ సమస్యని, ఈ కాల్పనిక సాహిత్యపు పాత్రలద్వారా కాకుండా సూటిగా స్పష్టంగా తన ఆత్మకథ 'చలం' లో ఆయనిట్లా చెప్తున్నాడు:

'ఎంతసేపటికి నా దృష్టి ఆ కాలంలో నన్ను తృప్తిపరచగల స్త్రీ కోసమే. లీలగారితో స్నేహం చల్లబడ్డ తర్వాత నాకు తెలిసింది. నా ఆదర్శ స్త్రీ నాకు ప్రత్యక్షం కాకపోవడానికి కారణం నా అనర్హతేనని. నాలో ఉన్నటువంటి inferior self ని నాశనం చేసుకోవాలి. In other words sublimate చేసుకోవాలి. I must rise superior to women. తెలుగుదేశాన్ని వొదిలి వొచ్చేసిన తరవాత స్పష్టమైంది బైట ఎంత వెతికి అది వుత్త అవివేకమని. ఎన్నటికైనా నా అదృష్టం ఫలించి ఈశ్వరుడి దయగలిగి నన్ను పూర్తిగా మన్నించి నన్ను తన వొళ్ళోకి తీసుకున్నదాకా నాకే తృప్తీ, సంతోషమూ, ఈ లోకంలోగాని, ఆ లోకంలో గాని వుండవని, ఈ భూమిలో దొరికేవాటిని కోరి, సాధించి తృప్తిపడే అదృష్ట వంతుల్లో నేను ఒకణ్ణికానని.'

ఆ ఈశ్వరుడు 1951లో సౌరిస్ ద్వారా ఈశ్వరవాణిగా సాక్షాత్కరించాడు ఆయనకి. దాదాపు పదేళ్ళ పాటు అట్లా కొలిచిన తర్వాత ఆ ఈశ్వరుడు చలంగారిలో అంతరాంతరాల్లో దాగి ఉన్న సాంఘిక పార్శ్వాన్ని తుదలంటా వెతికి పట్టుకుని మరీ నాశనం చేసేసాడు. 1962 లో అష్టగ్రహ కూటమి సంభవిస్తోందనీ, ప్రపంచానికి ప్రళయం రాబోతోందనీ ఈశ్వరుడు చెప్పిన మాటలు విని చలంగారు ఆంధ్రదేశంలో ఉన్న తన మిత్రులకందరికీ దయతోనూ, ఆత్మీయతతోనూ హెచ్చరికగా ఉత్తరాలు రాసారు. కానీ ప్రళయం రాలేదు. తనతో మాట్లాడుతున్న ఈశ్వరుడు ఈశ్వరుడేనా అన్న అనుమానం వచ్చింది చలంగారికి.

ఈశ్వరుడు చెప్పినట్టు ప్రళయం వచ్చిందిగాని, బయటి ప్రపంచంలో కాదు, అది తన ఆంతరంగిక ప్రపంచంలో. తాను సమాజాన్ని వదిలి భౌతికంగా వచ్చాడేగాని, ఆ సమాజం తన మనసుని వదల్లేదనీ, సమాజం పట్ల తాను మానసికంగా పడుతున్న బాధ్యత తన అంతరాంతరాల్లో ఇంకా బలంగానే ఉందనీ ఆయనకి అర్థమయింది. దాన్నుంచి తనని బయటపడేయడానికే ఈశ్వరుడు అష్టగ్రహ కూటమిని సాకుగా వాడుకున్నాడని గ్రహించాడు ఆయన. అందుకనే ఆ సంఘటన మొత్తాన్ని ఈశ్వరుడు చలంగారి మీద వేసిన ప్రాక్టికల్ జోక్ అని రాసారు సుదర్శనం గారు.

అప్పటికి ఆయనకి అర్థమయింది. తనలోని ప్రేమ రెండు రకాలుగా వ్యక్తీకరణ కోరుకుంటూ వస్తున్నదని. ఒక పార్శ్వంలో ఆ ప్రేమ ఏమీ కోరదు. ఏమీ చెయ్యాలనుకోదు. దేని గురించీ బాధ్యత పడదు. ఏ బరువూ నెత్తిన వేసుకోదు. మరొక పార్శ్వంలో ఆ ప్రేమ నలుగురికోసం తపిస్తుంది. వారి మంచి చెడ్డల్ని పట్టించుకుంటుంది. వారి రోజువారీ జీవితం సౌకర్యవంతంగా ఉంచడమెట్లా అని అహర్నిశం శ్రమిస్తూనే ఉంటుంది. సాక్షాత్తూ భగవంతుడే తన ఇంట్లో అడుగుపెడితే, అన్నీ వదిలిపెట్టి ఆ భగవంతుడి దగ్గర కూచోడానికి బదులు, ఆ భగవత్పరివారానికి ఏమి వండిపెట్టాలా అని సతమతమయిపోతూ ఉంటుంది.

ఆ మెలకువలోంచి ఆయన 1963 లో రాసిన నవల 'మార్తా'. నా దృష్టిలో అది చలంగారి సాహిత్యమంతటిలోనూ సర్వోత్కృష్టమైన రచన. ప్రపంచ సాహిత్యంలో మొదటివరసలో నిలిచే పదినవలల్లోనూ అది కూడా తప్పకుండా ఉంటుంది. ఒక జీవితకాలపు అంతర్మథనంలోంచి వెలికి తీసిన వెన్నముద్ద ఆ నవల.

మార్తా, మరియ బెతనీకి చెందిన అక్కచెల్లెళ్ళు. లాజరు వాళ్ళ తమ్ముడు. ఒకనాడు ఏసు వాళ్ళ ఊళ్ళో, వాళ్ళ ఇంట్లో, వాళ్ళ హృదయాల్లో అడుగుపెట్టాడు. మరియ ఆ క్షణాన్నే ఈశ్వరప్రేమలో మునిగిపోయింది. ఆమెకి ప్రభువు పాదాల దగ్గర కూచోడం

తప్ప మరేదీ ముఖ్యం కాదు. మార్తా కూడా ప్రభువుకి తన హృదయ సమర్పణ చేసిందిగాని, ఆమె దృష్టి, ప్రభువు తమ ఇంటికి వచ్చినప్పుడు వంట ఏమి వండాలి, పక్క ఎక్కడ సర్దాలి, ఆయన శిష్య బృందానికి ఎక్కడ సౌకర్యాలు ఏర్పాటు చెయ్యాలన్నదాని మీదనే. లాజరు మొదట్లో నాస్తికుడు. ప్రభువిరోధి. కాని ఆతడు మరణించక తప్పలేదు. 'నువ్వే ఉండి ఉంటే నా తమ్ముడు మరణించి ఉండేవాడు' కాదని ఏడ్చింది మార్తా. ప్రభువు చెప్పాడు తానే జన్మా, పునర్జన్మా కూడా అని. అన్నట్టే ఆయన లాజరుని మరణంలోంచి పైకి లేపాడు.

ఆ మూడు పార్శ్వాలూ తనలోనే ఉన్నాయని చలంగారు గ్రహించారు. ఒకప్పుడు ఈశ్వరుడు ఎక్కడున్నాడని ప్రశ్నించిన తాను మరణించి కొత్త ఆధ్యాత్మిక జీవితంలోకి పునర్జన్మించాడు. ఈశ్వరుడు తన జీవితంలోకి అడుగుపెట్టిన తరువాత కూడా తనలో ఇంకా రెండు వ్యక్తిత్వాలు కొనసాగుతున్నాయని ఆయనకి అర్థమయింది. ఒకటి బాధ్యతలేవీ తలకెత్తుకోని పరిపూర్ణ ఆత్మ సమర్పణ. ఊర్వశి పురూరవుణ్ణుంచి కోరుకున్నది అట్లాంటి ప్రేమని. మరొకటి ప్రేమవల్ల మరింత బాధ్యతగా మారడం, ప్రేమ పట్ల మరింత బాధ్యతతో మెలగడం. 'సుశీల' కథలో నారాయణప్పగారి పట్ల సుశీల, 'శశాంక' నాటకంలో తార పట్ల బృహస్పతీ, 'జీవితాదర్శం' నవల్లో లాలస పట్ల దేశికాచారీ చూపించింది అట్లాంటి ప్రేమైక బాధ్యతనే. కానీ, అప్పటిదాకా చలంగారు సృజించిన సాహిత్యంలో అవి విడివిడిగా వ్యక్తమవుతూ వచ్చాయి. ఆ రెండింటి పట్లా, ఆయన ఒక సారి ఒక దాని పట్లా, మరొకసారి మరొకదాని పట్లా మొగ్గు చూపుతూ వచ్చాడు. ఒక జీవితకాల అన్వేషణ తర్వాత ఆయన గెలుచుకున్న మెలకువ మార్తా నవలగా వెలువడింది. ప్రేమా, బాధ్యతా వేరు వేరు కావనీ, బంధనంగా మారని బాధ్యతనే ప్రేమ అంటామనీ ఆయన ఆ నవల రూపంలో సున్నితంగా చిత్రించాడు.

పురూరవ నాటకం చదువుతోంటే మననెవరో తరుముకొస్తున్నట్టే ఉంటుంది. కత్తివాదరలాంటి ఆ తర్కం ముందు మనకి తలదాచుకోడానికి ఏ ఆశ్రయమూ దొరకదు. జీవితాదర్శం చదువుతోంటే కొద్దిగా స్తిమితం చిక్కినట్టే ఉంటుందిగాని ముందు ముందు ఏమికానున్నదో అనే మిస్టరీ మనల్ని వదలదు. కాని మార్తా చదువుతుంటే మన మనసుల్ని అపారమైన ప్రశాంతి ఆవహిస్తుంది. ఎందుకంటే, తత్పూర్వం చలంగారు సృజించిన సాహిత్యం వెనక ఆయన కాలం నాటి తెలుగు సమాజం ఉంది. మార్తా రచన వెనక, రమణమహర్షీ, రవీంద్రుడూ ఉన్నారు. మార్తాలో ఏసుని చిత్రించడానికి చలంగారు రమణమహర్షినే నమూనాగా తీసుకున్నారని మనకి స్పష్టంగా తెలుస్తూనే ఉంటుంది. ఇక ఆ రచన మొత్తం నవలారూపం పొందిన గీతాంజలి అని వేరే చెప్పనక్కర్లేదు.

# 3

గీతాంజలికి చేసిన అనువాదానికి రాసుకున్న ముందుమాట మొదలుపెడుతూనే 'నా కాలేజీ దశనుంచీ నన్ను కలకాలమూ influence చేసిన పుస్తకం గీతాంజలి' అని రాసుకున్నాడు చలంగారు. 'చిత్రమేమిటంటే ఈశ్వరుడు లేని నా ముప్పై ఏళ్ళ జీవితంలో కూడా ఈశ్వరలీలల్ని కీర్తించే గీతాంజలి నా నిత్యపారాయణ గ్రంథంగా ఉండిపోయింది' అని కూడా రాసుకున్నాడు.

అయితే ఆయన గీతాంజలి అనువాదం మాత్రం అరుణాచలం వెళ్ళాకనే మొదలుపెట్టారని అనుకోవచ్చు. ఆ అనువాదం పుస్తక రూపంగా వెలువడింది 1958 లో. ఆ తర్వాత ఆయన ఇంగ్లీషులో వచ్చిన రవీంద్రుడి తక్కిన కవిత్వాన్ని కూడా ఆ తర్వాత ఇరవై ఏళ్ళ పాటు 'వనమాలి ', 'ఫలసేకరణ' , 'కాన్క', 'ఉత్తరణ', 'ఫుజిటివ్' పేరిట సంపుటాలుగా వెలువరిస్తూ ఉన్నాడు. అనువదించడమే కాదు, 'ఆ భావసౌందర్యానికి, మనోహర గానానికి, అనంత మాధుర్యానికి, తాత్త్విక గాంభీర్యానికి ముగ్ధులై వాటినే తిరిగి తిరిగి పారవశ్యంతో తలుచుకుంటో, హృదయ నిశ్శబ్దంలో మ్యూజ్ చేసుకుంటో తన్మయులై భగవాన్ శ్రీ రమణమహర్షి ఎదట మౌనంగా కూర్చుండిపోయేవార'ట.

రవీంద్రుడి కవిత్వాన్ని తెలుగు చేస్తున్నప్పుడు చలం తెలుగు భాష అపూర్వమైన లాలిత్యాన్ని, మాధుర్యాన్ని, సౌందర్యాన్ని సంతరించుకుంది. రవీంద్రుడు తన బెంగాలీ గీతాల్లోని సంగీతాన్ని ఇంగ్లీషులోకి తేవడం కష్టమని గ్రహించినందువల్లనే వాటిని వచన కవితలుగా వెలువరించాడు. కాని ఆ ఇంగ్లీషుని చలంగారు తెలుగు చేస్తున్నప్పుడు నన్నయ, పోతన, పెద్దన వంటి పూర్వమహాకవుల తెలుగుతో సమానమైన తెలుగుని ప్రయోగించాడు. రవీంద్రుడి ఇంగ్లీషు పదప్రయోగాలకి అటువంటి తెలుగు సమానార్థకంగా ఆయనకు ఎట్లా తట్టిందో నిజంగా ఆశ్చర్యం. ఈ వాక్యాలు చూడండి:

> Today the summer has come at my window with its sighs and murmurs; and the bees are plying their minstrelsy at the court of the flowering grove.

చలంగారి తెలుగు చూడండి:

> ఈ రోజున తన నిట్టూర్పులతో గుసగుసలతో
> వేసంగి నా కిటికీ ఎదట నిలిచింది.

పుష్పనికుంజంలో
తమ బృందగానాన్ని వినిపిస్తున్నాయి తేనెటీగలు.

ఇంకా–

Here is thy footstool and there rest thy feet where live the poorest, and lowliest, and lost.

ఎక్కడ దరిద్రాతి దరిద్రులూ,
అధమాధములు, పరిత్యాతి పరిత్యజులు వుంటారో
అక్కడ వుంటాయి నీ పాదాలు
అక్కడే నీ పాదపీఠం.

I keep gazing on the far away gloom of the sky, and my heart wanders wailing with the restless wind.

ఆకాశంలోని దూరపు గుబులు వంక చూస్తో కూచున్నాను
నా హృదయం
శాంతినెరుగని ఈదురుగాలితో కలిసి ఏడుస్తో
ఇటూ అటూ తిరుగుతోంది.

In the fragrant days of sunny April through the forest path he comes, comes, ever comes.

In the rainy gloom of July nights on the thundering chariot of clouds he comes, comes, ever comes.

ఎండలా మెరిసే చైత్ర పరిమళదినాలలో
అరణ్యమార్గాల వెంట అతను వొస్తున్నాడు
వొస్తున్నాడు, నిరంతరం వొస్తూనే వున్నాడు.
ఆషాఢ వర్ష నిశీధచ్ఛాయల్లో గర్జించే
మేఘరథాన్నెక్కి అతను వొస్తున్నాడు, వొస్తున్నాడు,
నిరంతరం వొస్తున్నాడు.

Bring out thy tattered piece of mat and spread it in the court-yard. With the storm has come of a sudden our king of the fearful night.

నీ చింకి చాప తునకకి తీసుకొచ్చి
ముంగిట్లో పరు.
భయంకరమైన రాత్రి అకస్మాత్తుగా
తుఫానులో దిగివొచ్చారు ప్రభువు.

ఇలా గీతాంజలి మొత్తం ఎత్తి రాయవలసి ఉంటుంది.

ఇటువంటి తెలుగు చలంగారి తొలి సాహిత్యంలో కూడా కనబడుతుందనవొచ్చు మీరు. కాని ఆ తెలుగులో ఒక 'కొత్త బరువు, ఒక కొత్త ఆశ'. 'అరేబియాలో రాత్రి వీచే యీదురుగాలి నీ జుట్టు రూపం దాల్చింది', 'పర్వతపు గుహల్లో వీచే సముద్రపు తుఫానుగాలి వలె వూపిరి పీలుస్తో..', లాంటి 'మైదానం' రోజుల ఆ భాషలో వసంతకాల మేఘంలాగా కొంత చిరు కారుమబ్బు కూడా. కాని అరుణాచలం వెళ్ళిన తరువాత చలంగారి తెలుగు ఆకాశానికి మరింత చేరువగా జరిగింది. ఒక కొత్త తేలిక, అపారమైన కాంతి, శరత్కాలమేఘంలాగా అది ధవళాతిధవళం. ఒక్క గీతాంజలిలోనే కాదు, కాన్కలో ఈ వాక్యాలు చూడండి:

> 'మధ్యాన్నపు గాలి, తూనీగ ఉల్లిపొర రెక్కల మల్లే కంపించింది. ఇళ్ళ కప్పులు మగతలో పడ్డ గృహాల పైన గూటిలో పక్షులమల్లె మెదలకండా వున్నాయి. కిసలయ ఏకాంతం నుంచి ఓ కోయిల కనపడకండా పాడుతోంది. గుంపుకూడిన మనుషుల సారంలేని శ్రమపైన దాని నిర్మలస్వరాలు వర్షిస్తున్నాయి. ప్రియుల రహస్య గుసగుసలపైనా తల్లి ముద్దులపైనా, పిల్లల నవ్వుల పైనా గాన రసాన్ని కురిపిస్తున్నాయి.
>
> ప్రతి నిముషం, గులకరాళ్ళని గుండ్రంగా, అందంగా అరగతీసే ఏటిమల్లే మన ఆలోచనలపైన కోయిల స్వరాలు ప్రవహిస్తాయి.'

ఒక్కమాటలో చెప్పాలంటే, ఈ తెలుగు త్యాగయ్య తెలుగు. చలంగారు మార్తా నవలని ఈ తెలుగులో రాసారు. ఈ వాక్యాలు చూడండి:

> 'ప్రభువు సమీపిస్తున్నారంటే, ఆయన నడిచే ప్రతి అడుగూ నాకూ దగ్గిరిగా, నా లోపల సమీపిస్తూన్నదనిపించేది. అదే దృష్టి, ఈవాళ రెండు మైళ్ళు నడిచివుంటారు, ఈ వూళ్ళో బస చేస్తారు అనుకుంటో.
>
> వొస్తున్నారు. వొస్తున్నారు. ప్రతి నిమిషం నాకేసి నడిచి వొస్తున్నారు. నా ఇంటోకి, నా హృదయంలోకి. ప్రతి గాలి వూపుతో, ప్రతి నీడ కదలికతో,

ప్రతి ఉదయం, సాయంత్రం రాత్రి నాకింకా చేరువవుతున్నారు. పువ్వులు వికసించి ఆయన వొచ్చే తోవవేపే చూస్తున్నాయి. పావురాలు, చిలకలు, గోరింకలు అన్నీ ఆయన్ని కలుసుకోడానికి ఆ వేపుకే ఎగురుతున్నాయి. ఆయన వంక తొంగిచూశాననే సంభ్రమంతో మబ్బుల్లో పరిగెడుతున్నాడు చందమామ. వొచ్చేశారు. రేపు పొద్దున్న బెతనీ సమీపానికి వొస్తారు. మధ్యాహ్నానికి మా ఇంటో కూచుని వుంటారు. ఇక్కడే శిబిరం పెట్టుకుని భోజనాలు చేస్తారు. ఊరంతా సిద్ధంగా ఉంది ఆయన్ని ఆదరించి పంపడానికి..'

ఒక్క వర్ణనలోనే కాదు, అసలు ఆ కథ చెప్పిన స్ఫూర్తిలోనే ఒక mystic flavour సురభిళిస్తూంది. ఈ సన్నివేశం చూడండి:

'ఆచార్య, తమకి లోపల మంచం పైన పక్క వేసాము' అన్నాను.

'వీళ్ళకి?' అని అడిగాడు కళ్ళు నాపైన నిలిపి. ఆ చూపులో ఎంతో నింద కనిపించి సిగ్గుపడి నోరెత్తలేకపోయాను. ఆయన అక్కడే కటిక నేలమీద పడుకుని కళ్ళు మూసుకున్నారు. కుక్కలు ఆయన పాదాల మీద తలలుపెట్టి పడుకున్నాయి. శిష్యులు అయాన చుట్టూ నేలమీద నడుములు వాల్చారు. వాళ్ళలో మత్తయ 'స్వామీ, రేపు..?' అనపోతున్నాడు. యేసు కొంచెం కోపంగా 'రేపు, రేపు..ఎప్పుడూ రేపు. రేపు సంగతి రేపు చూసుకుంటుంది. ఈ రాత్రెందుకు రేపటి సంగతి? వింటున్నావా, బైట గాలినీ, వాననీ! ఆ దిబ్బమీద ఆకలితో వొణుకుతో చీకట్లో పడి వుండవలసినవాళ్ళం తిని సుఖంగా నిద్రపోతున్నాం, చాలదూ! రేపు! రేపు!' అన్నారు.

ఈశ్వరుణ్ణి స్తుతిస్తో ఓ పాట పాడుకున్నారు. మేము మాత్రం ఎట్లా మంచాల మీద పడుకోము? వాళ్ళ చుట్టూ పడుకున్నాము. కొత్తగా వుంది నేలమీద. నిద్రపట్టేట్టు లేదు. పడుకోగానే 'రేపు పొద్దున్న వీళ్ళందరికీ ఎట్లా' అనే ఆలోచన వొచ్చింది. ఎంత సిగ్గేసిందో! 'రేపు', 'రేపు' అని అసహ్యంగా అన్న ఏసు కంఠం వింటో నిద్రపోయినాను.'

రేపెట్లా అన్న యోచన లేకుండా బతికాడు ఆయన అరుణాచలంలో. ఆ మనఃస్థితిలోంచే సువార్తల్నీ, గీతనీ, సూఫీ కవిత్వాన్ని కూడా తెలుగు చేసాడు. పూర్తిగా ఈశ్వరార్పితమైన శ్వాసతో ఒక ఆళ్వారులాగా యశోదాగీతాలూ, ఒక నాయనారులాగా భగవాన్ గీతాలూ రాసాడు. పూర్తిగా పండిన హృదయంతో, భాషతో 'సుధ'

వెలువరించాడు. అది తెలుగు రవీంద్రుడు తెలుగువాళ్ళకి కానుక చేసిన గీతాంజలి. ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యంలోనే కాదు, భారతీయ సాహిత్యంలో కూడా అదొక అద్వితీయ కృతి. కాబట్టే, ఇరవయ్యవ శతాబ్దపు శ్రేష్ఠ రచనల్ని అనువదించాలని యునెస్కో సంకల్పించినప్పుడు తెలుగు సాహిత్యం నుంచి ఎంపికైన ఒకే ఒక్క పుస్తకం అది. నా దృష్టిలో గీతాంజలికి నోబెల్ బహుమానం రావడం ఎటువంటిదో, సుధని యునెస్కో ఇంగ్లీషులోకి (Nectar, 1990). అనువదింపచేయడం కూడా అంతే.

సుధ నుంచి రెండు మూడు కవితలు మీకోసం:

## 1

**యామినీ శిరోజ దీప్తజ్వాలా**
**కుసుమాలు**
**తేజోతల్పంపై రాలి**
**అదృశ్యమైనాయి**
**రవి కిరణాంగులీ నఖక్షతాలతో**
**శ్యామలాకాశం కందింది.**
**అరుణాచలేశ్వర వామభాగాన**
**కుంకుమ పూజ జరుగుతోంది.**

**మేలుకో!**

## 20

**చిన్నతనంలో నేనూ తిరిగాను**
**మతమని, యోగమని**
**సయంటిస్టులని, పండితులని**
**కాని ఎటువెళ్ళినా చివరికి**
**తెలుసునన్న వారికి**
**తెలీదని తెలుసుకుని**
**తిరిగివొచ్చాను.**

చెప్పేవారేగాని
చూపగలిగినవారెవరూ లేరు!

## 83

అరుణాచలా
ఘనీభవానంద తరంగా
అంధకార తేజోమూర్తీ
అపాంగ వీక్షణా శమితభవార్తీ
సకలకలుషబంధన మండన శిఖరజ్యోతీ
చంచత్ మృదు ధవళమేఘోత్తరీయా

శివా,
ప్రసీదమయ!

# సెందమిళంలో పాడిన శివానందలహరి

**త**మిళదేశ పర్యటనలో నేను సందర్శించిన చివరి ఊరు తిరువాలంగాడు. విల్లుపురం నుంచి తిరువణ్ణామలై మీదుగా, కంచి, అరక్కోణం, తిరుత్తనిల మీదుగా మూడు గంటల పైన సుదీర్ఘ ప్రయాణం తరువాత దాదాపుగా ఆంధ్రదేశపు సరిహద్దులకి చేరుకున్నాం. అప్పటికి మధ్యాహ్నమైపోయింది. దేవాలయం కట్టేసి అర్చకులు వెళ్ళిపోయేసమయం. కాని నారాయణమూర్తి ఎట్లానో ఎవరిద్వారానో మేమొస్తున్న వార్త చేరవేయడంతో అక్కడ మాకోసమింకా తలుపులు తెరిచి పెట్టారు.

అలంకాడు అంటే మర్రి చెట్ల అడివి. అక్కడొకప్పుడు వటారణ్యం ఉండేదన్నట్టు గుర్తుగా ఇప్పటికీ దేవాలయంలో ఒక మూల పెద్ద మర్రిచెట్టు ఉంది. కాని భక్తులెవరో భక్తి మరీ మీరిపోయి ఆ చెట్టు చుట్టూ దీపాలు పెట్టడంతో నిప్పు రగులుకుని ఆ చెట్టు చాలామేరకు కాలిపోయి నల్లగా కనిపిస్తున్నది. ఆలయ ప్రాంగణం చాలా పెద్దది. చోళ చక్రవర్తులు నిర్మించిన ఆలయం వెయ్యేళ్ళ తరువాత కూడా అంతే గంభీరంగా నిలిచి ఉంది. తమిళ స్థలపురాణాల ప్రకారం శివుడు నాట్యం చేసే సభలు అయిదు. ఆ పంచ సభల్లో తిరువాలంగాడు రత్నసభ. చిదంబరం కనకసభ. మధురై మీనాక్షి ఆలయం రజత సభ. తిరునెల్వేలిలో తామ్రసభ, కుర్తాళం చిత్రసభ. తిరువాలంగాడు ఆలయంలోకి అడుగుపెట్టే ముందే బయటి ప్రాకారం గోడమీద అయిదు సభల దృశ్యాలూ చిత్రించి ఉన్నాయి. ఆ సభల మధ్యలో, తిరువాలంగాడులో శివుడు ఊర్ధ్వతాండవం చేస్తో ఉంటే ఆయన పాదాల దగ్గర అమ్మైయ్యారు కూచున్నట్టుగా కూడా శిల్పం చెక్కి ఉన్నారు. లోపల అడుగుపెట్టినతరువాత మరొక ప్రాకారం మీద అమ్మైయ్యారు చేతులు నేలమీద ఆన్చి శివుడి దగ్గరికి తరలి వస్తున్న దృశ్యం కనిపించింది.

అక్కడి దేవుడు వటారణ్యేశ్వరుడు. లోపల మూలవిరాట్టు మాత్రమే కాక, కుడిపక్కగా ఊర్ధ్వతాండవం చేస్తున్న నటరాజూ, ఆయన పక్కన ఎముకలు మటుకే దేహంగా కనబడుతున్న కారైక్కాలు అమ్మైయ్యారు కూడా పూజలందుకుంటున్నారు. కైలాసాన్ని కూడా వద్దనుకుని, ఆ మర్రిచెట్ల అడవిలో ఒక కాలు పైకెత్తి ఊర్ధ్వతాండవం చేస్తున్న ఆ

శివపాదసన్నిధిని కోరుకున్నందుకు అమ్మైయ్యారు నిజంగా అదృష్టవంతురాలు. ఆమెకి తనకంటూ ఒక చోటు దొరికింది. అక్కడే ఆమె శాశ్వత సుప్రతిష్ఠురాలిగా నిలిచిపోయింది.

తిరువాలంగాడు క్షేత్రాన్ని అప్పర్, సంబంధర్, సుందరమూర్తి, మాణిక్యవాచకర్ నలుగురూ సందర్శించారు. లోపల దేవాలయం గోడలమీద సంబంధర్ తిరువాలంగాడు మీద చెప్పిన తిరుప్పదికంతో పాటు అమ్మైయ్యారు మూత్త తిరుపదికం ఇరవై రెండు పద్యాలూ కూడా రాసిపెట్టారు. దేవాలయంలో స్వామి దర్శనం చేసుకున్నాక అమ్మైయ్యారు దివ్య విభూతిని కూడా అర్చకుడు నా చేతుల్లో పెట్టాడు. మేము అక్కణ్ణుంచి బయటికొచ్చి ఆ దేవాలయ ప్రాంగణమంతా ఒక చుట్టు చుట్టి బయటికి వచ్చాం. ఆ పక్కనే కాళి ఆలయం కూడా ఉందంటే వెళ్ళాం. చిదంబరంలోలానే ఇక్కడ కూడా శివుడికీ, కాళికీ మధ్య నాట్యంలో పోటీ జరిగిందనీ, కాళి ఓడిపోయిందనీ, శివుడు ఆమెని బయటకు పంపేసాడనీ పురాణం. ఆమె భద్రకాళి. ఆకాశాన్ని తాకేటట్టుగా శివుడు పైకి చాపిన పాదాన్ని ఆశ్చర్యద ృక్కుల్తో పరికిస్తున్నట్టుగా ఆమె వదనం కూడా పైకే చూస్తున్నది. ఒక ఉల్కాపాతాన్ని చూస్తున్నట్టుగా ఉన్నాయా కళ్ళు.

శివాలయం వెనగ్గా, కాళీ ఆలయం పక్కగా విస్తారమైన ఒక చెరువు. ఇప్పుడు ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా ఆ గుడీ, ఆ చెరువూ ఏదో యుగాల పూర్వపు వాతావరణంతో, ఏదో చెప్పలేని శూన్యశోభతో, అక్కడక్కడ మనుషులు కనబడుతున్నా కూడా నిర్జనంగా కనిపిస్తూ ఉన్నాయి. దాదాపు పదహారు శతాబ్దాల కింద అమ్మైయ్యారు ఆ ప్రాంతంలో అడుగుపెట్టినప్పుడు ఆ కాడు వల్లకాడుగా కనిపించడంలో ఆశ్చర్యం లేదనిపించింది.

ఈ స్థలంలో ఏ దివ్యత్వాన్ని, ఏ అపార్థివసౌందర్యాన్ని ఆమె నేత్రాలు చూసాయో కదా! కారైక్కాలులో నేను చూసిన అమ్మైయ్యారుకీ, ఇక్కడ తిరువాలంగాడులో అమ్మైయారుకీ పోలిక లేదు. అక్కడ ఆమె విగ్రహంలో ఒక సామాజిక జీవితపు లక్ష్మీకళ. ఒక గృహిణిగా, గృహస్థగా, సామాజిక, కౌటుంబిక ధర్మాలకు ప్రతీకగా కనిపిస్తున్నది. కాని ఇక్కడ ఒక కౌపీనం మొలకు చుట్టుకుని, శుష్కస్తనిగా, ముందుకు పొడుచుకొచ్చిన ఎముకలతో, పళ్ళూడిపోయిన బోసినోటితో ఒక యోగినిగా కనిపిస్తున్నది. ఈ ప్రపంచమనే నరకాన్ని ఈది, ఈది ప్రాణం కొన ఊపిరికి చేరుకున్న వేళ చేతులకి ఆవలిఒడ్డు తగిలినప్పుడు ప్రాణం లేచి వచ్చినట్టుగా ఉందామె మూర్తి. అక్కడున్నంత సేపూ, ఆ రోజంతా, ఆ మర్నాడూ, ఆ తర్వాత చాలా రోజులదాకా, అమ్మైయ్యారు ఆ మూర్తి నా కళ్ళ ముందు కదలాడుతూనే ఉంది.

ఏ సౌందర్యాన్ని, ఏ లోకాతీత మహానందాన్ని, ఏ శివతాండవాన్ని చూసిందామె అక్కడ? సభ్య ప్రపంచానికి దూరంగా, ఆ వల్లకాటిలో, కాలుతున్న శవాల మధ్య,

దెయ్యాల మధ్య, జిల్లేడు,నాగజెముడు, బొమ్మజెముడు కీకారణ్యం మధ్య ఏ లోకోత్తర సంగీతాన్ని విన్నదక్కడ? కేవలం శివానుగ్రహం పొందడమనే ఒకే ఒక్క నేరం వల్ల తన భర్త తనకి భయపడి తననుంచి దూరంగా పారిపోయిన తర్వాత ఆమె ఎటువంటి మానసిక ఆఘాతానికి గురై ఉంటుంది? ఏమి ఆలోచించుకుని ఉంటుంది? ఏ శూన్యాన్ని అనుభవించి ఉంటుంది? ఏమి వెతుక్కుని ఉంటుంది? ఏమి కనుగొని ఉంటుంది?

ఎక్కడి కారైక్కాల్? ఎక్కడి తిరువాలంగాడు? గూగుల్ తెరిచి చూసాను. దాదాపు రెండువందల మైళ్ళు. ఆమె ఆ మొత్తం దూరమంతా అరచేతులమీదనే ప్రయాణించి వచ్చి ఉంటుందా? ఆ రోజుల్లో ఆ ఆడకూతురు ఒంటిగా, ఏ తెగువతో, ఆ త్యాగంతో అంత దూరం ప్రయాణించగలిగి ఉంటుంది? ఇంతకీ తిరువాలంగాడులో ఆమె ఏమి చూసి ఉంటుంది? ఏది ఆమెని అక్కడ ఆపేసి ఉంటుంది?

సంగం సాహిత్యం వర్ణించిన అయిదు ప్రాకృతిక సీమల్లోనూ 'పాలై' ఒకటి. అది ఊషరక్షేత్రాల్నీ, శుష్కసీమల్నీ, ఎడారుల్నీ సూచించే తిణై. 'కురింజి' వసంతానిది, 'ముల్లై' వర్షాకాలనిది, 'నెయిదల్', 'మరుదాలు' హేమంతకాలానివి, కాని పాలై మండుటెండల గ్రీష్మానిది. ఆ ఎండల్లో తక్కిన నాలుగు ప్రాకృతిక సీమల్లోనూ జీవం, జీవితం కనరావు. కాని ఆ నడిగ్రీష్మంలోనే పాలై సీమ మరింత శోభ సంతరించుకుంటుంది. అక్కడుండేవాళ్ళు వేటగాళ్లూ, దొంగలూ, దారిదోపిడీగాళ్లూనూ. 'కొట్రవై', అంటే శ్మశానంలో శవాలమధ్య నర్తిస్తూ మెళ్ళో కపాలమాలధరించే కాళి అక్కడి అధిదేవత. తమిళ భూగోళాన్ని బట్టి తిరువాలంగాడు పాలై సీమకి చెందిన ఊరు. అది మానవసమాజపు అంచుల్లో, సభ్యజీవితపు పొలిమేరల్లో, రాజూ, రాజ్యమూ, ధర్మమూ, శాస్త్రమూ కల్పించే రక్షణవలయానికి ఆవల ఉండే ప్రాంతమది. అక్కడ, 'ఊరవతల నీరింకిన చెరువు పక్క, చెట్టు నీడ, గోనెలతో, కుండలతో ఎటుచూస్తే అటుచీకటి.'

అక్కడ చూసింది అమ్మైయ్యారు జీవితానికి ప్రాణం పోసే జీవితాన్ని. ఊపిరి ఆగిపోయిన ప్రాణులకి ఊపిరిపోసే మహాశ్వాసని. దేవుళ్ళందరికీ దైవత్వాన్ని సమకూర్చే మహాదేవుణ్ణి. అక్కడ ఆమె రెండు తిరుపదికాలు చెప్పింది. మొత్తం ఇరవై రెండు పద్యాలు. ఆ పద్యాలనిండా కాలుతున్న శవాలు, ఊళపెడుతున్న నక్కలు, నాగజెముడు తుప్పలు, కొరివిదెయ్యాలు, భూతప్రేతాలు. ఆ మహాబీభత్సరంగస్థలమ్మీద ఆమె ఒక అందమైన నాట్యాన్ని చూసింది. జగాల్ని మరిపించే మహాసుందరుడైన తన ప్రభువుని చూసింది. తనను తాను మైమరచిపోయింది. ఆ మహానందాన్ని సెందమిళంలో పాట పాడింది.

అది మహాకవి చెప్పినట్టుగా 'పిశాచులతో కూడి నిటలేక్షణుండు గజ్జె కదిలించి ఆడు రంగస్థలం, అవని పాలించు భస్మసింహాసనం.' అటువంటి తిరువాలంగాడు మూత్త తిరుపదికంలో పదే పదే వినవచ్చే క్రియాపదం 'ఆడు'. మరొక క్రియాపదం

'కూడు'. 'ఆట్టన్', 'కూట్టన్' అని శివుణ్ణి ఆమె పదే పదే వర్ణిస్తుంది. ఆమె చూసిన శివుడు స్థాణుమూర్తికాదు. యోగమూర్తికాదు, ధ్యానమూర్తి కాదు. ఆయన ఆడే శివుడు, పాడే శివుడు. ఆయన భూతనాథుడు. బాజాలు, డప్పు, ఢక్క, ఇడుక్కి, దుందుభి సమస్త సంగీత వాద్యాల సమ్మేళనం మధ్య ఆయన ఆడతాడు. ఆ ఆటని చూస్తూ తనని తాను మైమరచిపోవడం కన్నా అమ్మైయ్యారుకి మరే కోరికా లేదు. కాలుతున్న శవాల కమురు కంపు మధ్య, కరుగుతున్న కొవ్వు మధ్య, ఇంకా మాంసం వదిలిపోని పుర్రెలమధ్య, ఊళపెడుతున్న నక్కల మధ్య, గుడ్లగూబల, తీతువుల అరుపుల మధ్య తన నటరాజుని చూస్తూ తనన్ని తాను మైమరిచిపోవడమే చింపిరి జుత్తు అమ్మైయ్యారు సాధించుకున్న శివానందలహరి.

ఒకప్పుడు జైనం రాజమతంగా, రాజాస్థానంలో సుప్రతిష్టంగా ఉన్నప్పుడు, జైనకవులు సామాజిక జీవితమెట్లా నడవాలో నీతిగ్రంథాలు రాస్తున్నప్పుడు, సభ్యజీవితానికి, సామాజిక కౌటుంబిక సూత్రాలకి ఆవల, వల్లకాటిలో నిలబడి అమ్మైయ్యారొక జీవితాన్ని చూసింది. ఆ మృత్యుభూమిలోనే ఆమెకి నిజమైన జీవితం కనబడింది. సగం కాలుతూ పైకి లేస్తున్న శవాల మధ్య ఆమె ఒక నటరాజుని చూసింది. అది మొదలు– తమిళ చరిత్రలో, సంస్కృతితో, సాహిత్యంలో మరొక నవశకం మొదలయ్యింది. ఆమె ఊరవతల చూసిన నటరాజు, ఆ కాటిశివుడు దాదాపు వెయ్యేళ్ళ తరువాత ఊరి శివుడిగా, సభ్యశివుడిగా, చిదంబరం నటరాజమూర్తిగా మారిపోయాడు. ఆమె చూసిన శివుణ్ణి చూడటంకోసమే ఆమె తరువాత అరవై ఇద్దరు నాయనార్లు తపించారు. వేలాది గీతాలు పాడారు. వందలాది దేవాలయాలు నిర్మించారు. సముద్రాల్ని జయించి చోళచక్రవర్తులు తెచ్చిన సంపదతో శివుడికి నీరాజనాలు సమర్పించారు.

అమ్మైయ్యారు ఒక శకకర్త. ఆమెతో భారతీయ సాహిత్యంలో దేశభాషల్లో భక్తి కవిత్వం మొదలయ్యింది. శిష్టవర్గాలకు మాత్రమే పరిమితమైన దేవుణ్ణి భక్తి కవులు ప్రజలమధ్యకి, వీధుల్లోకి, వెలివాడల్లోకి తీసుకుపోగలిగారు. కవులు సంస్కర్తలుగా, యుగకర్తలుగా మారారు. కాని గుర్తుపెట్టుకోవలసింది, ఆ తొలిదర్శనం ఊళ్ళో కాదు, ఊరేగింపులో కాదు, గుళ్ళో కాదు, తోటలో కాదు, ఒక స్మశానంలో సంభవించింది. రోగాన్నీ, వార్థక్యాన్నీ, మృత్యువునీ చూసి సిద్ధార్థుడు బుద్ధుడైనట్టుగా, వల్లకాటిలో తిరుగాడి అమ్మైయ్యారు శివకృపాతిశయాన్ని తాను అనుభవించింది. మనకు అనుభవంలోకి తీసుకొచ్చింది.

నాయనార్ల పరంపర అమ్మైయ్యారుతో మొదలై సుందరమూర్తితో పూర్తయ్యింది. ఆ ప్రభులింగలీల ఎటువంటిదో గాని, నా యాత్ర సుందరమూర్తి పుట్టిన తిరునావలూరుతో మొదలై, అమ్మైయ్యారు తనువు చాలించిన తిరువాలంగాడుతో ముగిసింది.

ఇక తిరుగుప్రయాణానికి రథాలు మళ్ళించవలసిన సమయం ఆసన్నమైంది. అక్కడ పుత్తూరు సరిహద్దుల్లో ఒక దారిపక్క డాబాలో చాలా ఆలస్యంగా మధ్యాహ్నభోజనం ముగించుకున్నాం. బరువెక్కిన హృదయంతో నారాయణమూర్తీ, అతని డ్రైవరూ మా నుంచి సెలవు తీసుకున్నారు. అక్కణ్ణుంచే తమిళసీమకు హృదయపూర్వక నమస్కారం చేసాను. తిరువాలంగాడు దేవాలయంలో నా చేతుల్లో పెట్టిన అమ్మెయ్యారు దివ్యవిభూతి పరిమళం నా మనోదేహాల్ని రెండింటినీ పరిమళ స్నిగ్ధం చేస్తూండగా, ఆ సూక్ష్మ సుగంధలోకాన్ని హృదయంలో నిలుపుకుని ఎట్లానో విడివడి హైదరాబాదు వైపు బండి తిప్పాను.

తిరువాలంగాడు మూత్త తిరుపదికం నుంచి కొన్ని పద్యాలు.

## మొదటి తిరుపదికం నుంచి

### 1

**వేలాడుతున్న స్తనాలు, ఉబ్బిన రక్తనాళాలు**
**బోలుకళ్ళు, బోసిపళ్ళు, ముడుచుకుపోయిన పొట్ట**
**ఎర్రటి జుత్తు, రెండు కోరలు**
**ఎముకలు పొడుచుకొచ్చిన చీలమండలు,**
**చిక్కిశల్యమైన మోకాళ్ళు**
**ఆ ఆడదయ్యం ఈ శ్మశానంలోనే తిరుగాడుతూ**
**కోపంగా ఊళపెడుతున్నది.**
**ఇక్కడే నా ప్రభువు, శీతలదేహధారి**
**ఒకచేత అగ్ని ధరించి నాట్యం చేస్తుంటాడు**
**అతడి జటలు ఎనిమిదిదిక్కులవేపూ**
**ఊగాడే ఊరు తిరువాలంగాడు.**

### 2

**నాగజెముడు గుబురుమధ్యలోంచి కాలుపైకెత్తి**
**ఆమె ఒక కొరకంచు పైకిలాగి, నిప్పునార్పి**
**బొగ్గుమసిచేసి కళ్ళకు కాటుకదిద్దుకుంటూ**
**విరగబడి నవ్వుతున్నది**
**ఏదో ఒక మృగం కదలాడిన జాడ తగిలి**

భయకంపితురాలై స్మశానభూమిపైన
దహనమవుతున్న శవమ్మీద తూలిపడుతున్నది.
మంట తన దేహాన్ని కాలుస్తుంటే కోపం పట్టలేక
దుమ్ముతో చితిని ఆర్పాలని చూస్తున్నది.
ఇదీ, నా ప్రభువు నాట్యం చేసే
నట్టిల్లు, తిరువాలంగాడు.

3

కొమ్మలు చాపుకున్న దిరిసెన చెట్టు కాయలు ఎండి
లోపల గింజలు గలగల్లాడుతుంటే
భయదాంధకారమధ్యంలో రొదపెడుతున్న తీతువులు
గుడ్లగూబల మధ్య ఒక గుడ్లగూబ
ఎగిరి కొమ్మమీద వాలి రెక్కలు టపటపలాడిస్తుంటే
శ్మశానంలో గురివిందతీగలు అల్లుకున్న
నాగజెముడు గుబురునీడన
ఒక చితిమంట రగులుకుంది.
ఇక్కడే నా చల్లటి ప్రభువు
నాట్యం చేసే ఈ ఊరే తిరువాలంగాడు.

4

అంత్యేష్టిలో నైవేద్యం పెట్టిన అన్నం పెరుక్కుపోయి
ఒక గుంటనక్క భక్షిస్తున్నది.
'అరే ఇది ముందే మాకంట పడలేదే' అంటో
దెయ్యాలు చప్పట్లు చరుస్తో కోపంగా
దానివెనక పరుగులు పెడుతున్నవి.
అక్కడ, ఆ దహనవేదిక ఒక రంగస్థలంగా
అతడు తన కాలొకటి ఆకాశాన్ని తాకేటట్టు పైకెత్తాడు
ఊర్ధ్వపాదభంగిమలో ఒక వృత్తం గీస్తున్నాడు
నిటారుగా నిలబడి నా ప్రభువు
నాట్యం చేసే ఈ ఊరే తిరువాలంగాడు.

## 5

పుర్రెలు మాలగా మెళ్ళో బిగించుకుని ఒక పిశాచం
గడ్డకట్టిన కొవ్వుని ముద్దలాగా మింగుతున్నది
తన బిడ్డని నోరారా కాళీ అని పిలుస్తూ
దాని నెత్తిన పడ్డ దుమ్ము దులిపి
పాలిచ్చి పడుకోబెట్టి పోతున్నది
తన తల్లి మళ్ళా వెనుతిరిగిరావట్లేదని
ఏడుస్తూనే ఆ పిల్ల మళ్ళా నిద్రలోకి
జారుకుంటున్న ఆ చోటు
నా ప్రభువు నర్తించే వల్లకాడు తిరువాలంగాడు.

## 9

అక్కడ రెండవ, మూడవ, ఆరవ, ఏడవ, నాల్గవ,
అయిదవ స్వరాలతో పాటు
మొదటిస్వరం కూడా హృద్యంగా ఆలపిస్తున్నారు.
ఢక్క, శంఖం, మద్దెల, బాజాలు, తాళాలు, తప్పెట్లు, వీణ
దుందుభి, ఒక రకం బాజా, ఇంకో రకం బాజా, ఇడుక్కి
అన్ని రకాల సంగీతవాద్యాలూ వాయిస్తున్నారు
సకల సంగీతవాద్యసమ్మేళనం నడుమ
నా ప్రభువు నాట్యం చేసే ఊరు తిరువాలంగాడు.

## 11

పెనుభూతాలు ముఖానికి రంగుపులుముకోకుండానే
ఒకదాన్నొకటి చరుచుకుంటూ, అరుచుకుంటూ,
సంతోషంతో రంకెలేస్తో
వలయంలాగా చుట్టుముడుతున్నాయి
అడివిగువ్వ నాట్యమాడుతోంది,
గుంటనక్క పిల్లంగోవి ఊదుతోంది
తిరువాలంగాడులో నెలకొన్న ప్రభువు మీద
చింపిరి జుత్తు కారైక్కాల్ భూతం
సుందరతమిళంలో పలికిన ఈ పదిగీతాల్నీ
ఎవరు పాడుకుంటారో వాళ్ళు శివానుగ్రహం పొందితీరతారు.

## రెండవ తిరుపదికం నుంచి

### 1

ముషిడి, బూరుగ చెట్లు, సీకాయి, బొమ్మజెముదు, నాగజెముదు
జిల్లేడు తుప్పలు పరుచుకున్న స్మశాన భూమి
చెల్లాచెదురుగా పడి ఉన్న శవాల పేగుల్ని
పీక్కుతింటున్న దెయ్యం
చికిలిస్తున్న కళ్ళతో తోలుబాజాలాగా ఉందామె
అక్కడొక భూతం తప్పెట మోగిస్తో పాటలు పాడుతోంది
మహాసుందరుడు నా ప్రభువు నాట్యం చేస్తున్నాడక్కడ.

### 4

శవం పూర్తిగా తగలబడుతోందో లేదో చూద్దామని ఒక భూతం
దగ్గరికి పోయి తాకిచూస్తోంది, వేలు కాలి చుర్రుమంటే
కోపమొచ్చి అరుస్తో కొరకంచు దూరంగా విసిరేస్తోంది
ఆ శవమ్మీంచి ముందుకు దూకి భయంతో వొణుకుతో
బోలుపొట్ట బాదుకుంటో తను పరుగెడుతోంది
తక్కిన దెయ్యాల్నీ భయపెట్టి పరుగెట్టిస్తోంది
ఒక పిచ్చివాడిలాగా నా ప్రభువు నాట్యం చేస్తున్నాడక్కడ.

### 11

నాట్యమాడే ఒక నాగుపాము నడుముకి చుట్టుకుని
జటలు కట్టిన శిరసుమీద తేమనెలవంకని తగిలించుకుని
దివ్యతాండవంతో పరిభ్రమించే
ప్రభు కృపాతిశయానికి నోచుకున్న
కారైక్కాల్ భూతం
కోరపళ్ళతోనూ, నిప్పులుమిసే నోటితోనూ
పాడిన ఈ పదిగీతాల్నీ ఎవరు పాడుకుంటారో, ఆడుకుంటారో
వాళ్ళ సకలపాపాలూ ధ్వంసమైపోతాయి.

# పర్యటన ప్రాంతం

~




1. తిరువాలంగాడు 2. చెన్నై 3. తిరువణ్ణామలై 4. విల్లుపురం

5. పాండిచ్చేరి 6. వడలూరు 7. చిదంబరం 8. శీర్‌గాళి

9. కారైకల్ 10. తంజావూరు 11. శ్రీరంగం

# సంగంకవిత్వంలో వర్ణించిన
# ఐదు ప్రాకృతిక సీమలు

~




(వికీపీడియా సౌజన్యంతో)